
# సుమతి


అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-01-2026 సంపుటి -3 జనవరి సంచిక-10 రూ 50/-





సుమతి
అంతర్జాల సకుటుంబ మాస పత్రిక



## సుమతి పాఠకులకు
## తెలుగు సాహితీ ప్రియులకు
## నూతన సంవత్సర శుభాకాంక్షలు
## గత 3 సంవత్సరాలుగా

# సుమతి

**(సమగ్ర సకుటుంబ మాసపత్రికను)**

**మీ ప్రేమానురాగాలతో ఆదరాభిమానాలతో ఆదరిస్తున్నందుకు మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటూ**

**- ఎడిటోరియల్ బోర్డ్**

## రచనలకు ఆహ్వానం

యువ రచయితలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కథలు, కవితలు, కార్టూన్లను, సమకాలీన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము. రచనలు తమ సొంతమేనని మరెక్కడా ప్రచురితం కాలేదని హామీ పత్రం తప్పని సరిగా జత చేయాలి.

రచనలన్నీ యునికోడ్ లో టైపు చేసి ఈ క్రింది ఇ మెయిల్ కు పంపగలరు

sumathi.kathalu2023@gmail.com

sumathi.kavitalu2023@gmail.com

## సుమతి పరివారం

# సుమతి

మాసపత్రిక

సంపుటి :3 సంచిక:10

జనవరి 2026



**సంపాదకురాలు**

అవుతు శ్రీవిద్య

**సహ సంపాదకులు**

శ్రీనివాస్ ఈదర

**ముఖచిత్రం**

మోక్ష

**గ్రాఫిక్స్**

జ్ఞానిక

చందా వివరాలు

సంవత్సర చందా రూ 500

ఐదేళ్ళ చందా రూ 2500

ప్రకటనలు , చందాలకు మరియు అభిప్రాయాలు పంపవలసిన చిరునామా

sumathi.salahaalu@gmail.com

ప్రచురణ

సుమతి పబ్లికేషన్స్
(RC NO.:538/2006)

హౌస్ నం :26 -46 -79

వేణుగోపాల నగర్ ,

గుంటూరు ,ఆంధ్రప్రదేశ్

# సంపాదకీయం

"ముందుగా మా శ్రేయోభిలాషులకు , రచయితలకు, పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు!".

గత సంవత్సరం అనుభవాలను పాఠాలుగా తీసుకుని, కొత్త ఉత్సాహంతో, సానుకూల దృక్పథంతో అందరు ముందుకు సాగాలని ఆశిస్తున్నాము. మీ లక్ష్యాలన్నీ నెరవేరాలని మరియు మీ జీవితంలో ప్రతిరోజూ పండుగలా వెల్లివిరియాలని కోరుకుంటున్నాము.

ముఖంగా రచయితలకు ,ఈ కొత్త సంవత్సరంలో మీ సృజనాత్మక ప్రయాణం సాఫీగా సాగి, మీరు ఎన్నో అద్భుతమైన కథలు, కవితలు మరియు వ్యాసాలు రాయాలని ఆశిస్తున్నాము. మీ ఆలోచనలు స్వేచ్ఛగా ప్రవహించి, ప్రతి అక్షరం పాఠకుల హృదయాలను తాకాలని కోరుకుంటున్నాము. మీ కలలన్నీ నిజం కావాలని మరియు మీ రచనలు విస్తృత పాఠకులకు చేరువ కావాలని ఆకాంక్షిస్తున్నాము. ప్రతి పేజీలో కొత్త ప్రపంచాలను సృష్టించే మీ సామర్థ్యాన్ని ఈ సంవత్సరం మరింతగా పెరగాలని ఆశిస్తున్నాము.

మీ

**సుమతి**

## సుమతి – సుభాషితాలు

జేబు నిండుగా ఉన్న నాళ్ళ జేజేలు పలికేరు
వట్టి పోతే ఏ ఒక్కరు వెంట రారు
నాలుగు రోజుల నాటకానికి నగిషీలెందుకు



# ఈ నెల కుసుమాలు...

## అందరి కోసం


05 ముఖచిత్ర కథ
06 ఈ నెల కవిత
07 నడుస్తున్న చరిత్ర
09 అంతర్నేత్రం
30 అవగాహన
32 సెటైర్
35 చూడాల్సిన ప్రదేశం
52 నాలుగో కోతి
58 రేపటి కోసం
61 కరెంటు అఫైర్స్
67 చదవాల్సిన పుస్తకం
69 చూడాల్సిన సినిమా
75 ఒకే ఒక తప్పు
77 జీవన చిత్రాలు
78 ధారావాహిక
81 వ్యక్తి నుంచి వ్యవస్థ
83 యువత మేలుకో
84 భేతాళ భారతం
87 మన కథానాయికలు
12 కార్టూన్ పేజి
92 వార్తల్లో వ్యక్తి
107 కబుర్లు
110 మన పురాణాలు
114 వాల్ పోస్టర్
116 వెబ్ పోస్టర్
129 మెదడుకు మేత
130 చిత్ర కథ–చిత్రకవిత
131 ఆధ్యాత్మికం
132 సైన్స్ కథలు
134 పిల్లల కథ
136 సృజన
137 పిల్లలు పిడుగులు
138 వార ఫలాలు


## సీరియల్స్


25 పంచవటి
38 రక్షకుడు
47 ఓడిన గెలుపు
94 గడప దీపం
117 పడిలేచిన కెరటం


## కథలు


11 ప్రియా చారుశీలే
18 కళింగ
43 నిజం పెళ్ళాం తో పెళ్లి
57 షాపింగ్ సుందరి
64 భయం నీడ
72 పరివర్తన
99 వాట్స్ ప బ్రో
104 దుష్ట శిక్షణ
123 సద్యోగం



## కవితలు


29 అసలైన నేను
30 సప్త స్వరాల గీత
32 ఉల్లిపొర
60 మాటంటే



# ముఖచిత్ర కథ

## సంక్రాంతి కి దానం చేసి చూడండి..



తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. గ్రామీణ జీవన శైలిని ప్రతిబింబించే ఈ పండుగకు రోజులు దగ్గరపడుతున్న కొద్దీ ప్రతి ఇంట్లో ఉత్సాహం పెరుగుతుంది. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, రథాల ఆకారంలో వేసే డిజైన్లు, గంగిరెద్దుల సందడి, హరిదాసుల కీర్తనలు, పిండి వంటల వాసనలు గ్రామాలన్నింటినీ పండుగ వాతావరణంతో నింపుతాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ సంబరాల్లో సంప్రదాయం, ఆధ్యాత్మికత, ఆనందం అన్నీ కలిసి కనిపిస్తాయి. సంక్రాంతి అనగానే పంట పండిన ఆనందం మాత్రమే కాదు, దానం చేయాల్సిన పండుగగా కూడా పెద్దలు భావిస్తారు.

మకర సంక్రాంతి రోజు మన చేతులతో పెరుగు దానం చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయని చెబుతున్నారు. ముఖ్యంగా ఆవు పెరుగు దానం చేయడం చాలా మంచిదని సూచిస్తున్నారు. అది సాధ్యంకాకపోతే గేదె పెరుగు ఇచ్చినా సరిపోతుందని ఆయన అభిప్రాయం. పెరుగు దానం వెనుక పురాణ కథనాలు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు.

పురాణాల ప్రకారం మహాభారత కాలంలో ద్రోణాచార్యుడు తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్న సమయంలో ఆయన భార్య కృపి ఒక మహర్షి సూచన మేరకు సంక్రాంతి రోజున పెరుగు దానం చేసింది. ఆ తర్వాత వారి జీవితంలో ఉన్న ధనసంబంధ సమస్యలు తొలగిపోయాయని మహాభారతంలో పేర్కొనబడినట్లు వివరించారు. అందుకే ప్రస్తుతం కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు సంక్రాంతి రోజున పెరుగు దానం చేయడం వల్ల మేలు జరుగుతుందని చెబుతున్నారు.రెండవది కూష్మాండం అంటే గుమ్మడికాయ దానం. మకర సంక్రాంతి రోజున గుమ్మడికాయను దానం చేయడం శుభకరమని చెప్పారు. సాధారణంగా ఇళ్ల ముందు దిష్టి తీసేందుకు ఉపయోగించే బూడిద గుమ్మడికాయ కాకుండా, సాధారణ గుమ్మడికాయను దేవాలయంలో బ్రాహ్మణుడికి దానం చేయాలని సూచించారు. బ్రాహ్మణులు అందుబాటులో లేకపోతే ఎవరికి అయినా మన చేతులతో దానం చేస్తే శుభఫలితాలు వస్తాయని ఆయన అన్నారు.

ఈ దానం వెనుక కూడా పురాణ ప్రాముఖ్యత ఉందని ఆయన వివరించారు. వరాహ పురాణం ప్రకారం మకర సంక్రాంతి రోజున శ్రీమహావిష్ణువు వరాహ అవతారంలో హిరణ్యాక్షుడు అనే రాక్షసుణ్ని సంహరించి భూమిని రక్షించాడు. భూమి మొత్తాన్ని విష్ణుమూర్తికి సమర్పించిన ఫలితం రావాలంటే గుమ్మడికాయ దానం చేయాలని శాస్త్రాల్లో చెప్పబడింది . భూమిని సూచించే ప్రతీకగా గుమ్మడికాయను భావిస్తాఋ .

మూడవది గోదానం. సంక్రాంతి పండుగ రోజున గోవులను దానం చేయడం ఎంతో పవిత్రమని పెద్దలు చెబుతుంటారు. అయితే ప్రతివారికి నేరుగా గోవును దానం చేయడం సాధ్యంకాకపోవచ్చు. అందుకే తిల గోవు దానం చేయాలని సూచిస్తున్నారు. తిల గోవు అంటే ఒక పళ్లెంలో నువ్వులను గోవు ఆకారంలో ఏర్పాటు చేసి దానం చేయడం. ఈ తిల గోవును మకర సంక్రాంతి రోజున దేవాలయంలో సమర్పించాలి.

ఇలా దానం చేయడం వల్ల పండుగ ఆనందం మరింత పెరుగుతుందని, సమాజంలో పరస్పర సహకారం బలపడుతుందని మన పెద్దలు చెప్పారు.

★★

# ఈ నెల కవిత

## దాహం

నడుస్తున్న చెట్లమీద గుసగుసలాడే ఆకులు
జడుస్తూ తూలుతూ కునుకుతున్న వ్రణాలపై వాలే కాకులు
ఆకారంలాగే వికారంగా వాంతి చేసుకునే వీధులు
నగరం మూపుమీద వాపుమీద పెద్దల విగ్రహాలు
కందువాకింద
కండకావరంకింద
పిట్ట
రెట్ట
ఆ విగ్రహం బ్రతికున్నప్పుడు చుట్టూ ఎన్ని గ్రహాలు
కోడిపుంజు కొట్లాటలు సిమెంటు కాంట్రాక్టులు
ప్లేట్లలో ఫోర్కుల కింద అలగాజనాలు
జైళ్లలో బండరాళ్లు కప్పుకుని అమాయకులు
నీచం జారత్వం పశుత్వం ప్రవహిస్తాయి సైడు కాలువలు
అవి చివరికి ఆక్రమిస్తాయి విగ్రహాలు కాబోయే రక్తనాళాలు
ఇంతెందుకు నడుస్తున్న చెట్లనడుగు
గుసగుసలాడే ఆకుల్నడుగు
పెద్ద పెద్ద హోటళ్లలో గోడలడుగు
క్యూలో ప్రాణం వొదిలిన ఆకల్నడుగు
చెరచబడ్డ వీధుల్నడుగు
ఏం చేశావు బ్రతికుండగా?
ఏం కూశావ్ బహిరంగ సభల్లో?
ఇంత జరిగి ఎట్లా నిద్ర పోగలుగుతున్నావ్
నిర్మల నక్షత్రం కింద
నగరం మూపుమీద వాపు మీద
అసహ్యంగా నిలబడ్డ ఆ విగ్రహాన్నడుగు

నగ్నముని



# నడుస్తున్న చరిత్ర



## "ఇండిగో" గోల

గత నెలలో ఎక్కడ చూసినా "ఇండిగో" గోలే. వేల విమానాలు రద్దు, ఎయిర్పోర్ట్లలో లో ప్రయాణికుల పాట్లు, టీవీల్లో చర్చలు. అసలు ఏం జరిగింది? ఎందుకు ఇన్ని విమానాలు ఆగిపోయాయి?
సామాన్యుడికి అర్థమయ్యే భాషలో సింపుల్‌గా తెలుసుకుందాం.

1. పైలట్లు కూడా మనుషులే కదా!

మనం ఒక కారును వరుసగా 10-12 గంటలు డ్రైవ్ చేస్తే ఏమవుతుంది? అలసిపోతాం, కళ్ళు మూతలు పడతాయి, యాక్సిడెంట్ అయ్యే ప్రమాదం ఉంది. అలాగే, గాలిలో వందల మంది ప్రాణాలతో విమానం నడిపే పైలట్లకు కూడా విశ్రాంతి (Rest) చాలా ముఖ్యం. అలసిపోయిన పైలట్ విమానం నడిపితే అది ప్రయాణికుల ప్రాణాలకే ముప్పు.

2. ప్రభుత్వం తెచ్చిన కొత్త రూల్

ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం (DGCA) ఒక మంచి రూల్ తెచ్చింది. "పైలట్లతో ఎక్కువ గంటలు నిర్విరామంగా పని చేయించకూడదు, వారికి విశ్రాంతి సమయాన్ని పెంచాలి" అని ఆదేశించింది.

3. ఇండిగో చేసిన తప్పు ఈ కొత్త రూల్ పాటించాలంటే ఏం చేయాలి? ఉన్న పైలట్లు రెస్ట్ తీసుకునే సమయంలో విమానాలు నడపడానికి కంపెనీలు "కొత్త పైలట్లను" ఉద్యోగంలోకి తీసుకోవాలి.
దీనికోసం ప్రభుత్వం ఎయిర్లైన్స్ అన్నింటికీ 18 నెలల (ఏడాదిన్నర) సమయం ఇచ్చింది.
ఎయిర్ ఇండియా, విస్తారా వంటి ఇతర కంపెనీలు కొత్త పైలట్లను తీసుకున్నాయి.
కానీ, దేశంలోనే అతిపెద్ద ఎయిర్లైన్ అయిన ఇండిగో (IndiGo) మాత్రం డబ్బులు మిగుల్చుకోవడానికో, నిర్లక్ష్యమో తెలియదు కానీ... సరిపడా కొత్త పైలట్లను తీసుకోలేదు. పైగా కొత్త విమానాలు, కొత్త రూట్లను పెంచుకుంటూ పోయింది.

4. చివరికి ఏమైంది?

కొత్త రూల్ అమలులోకి వచ్చే సమయం ఆసన్నమైంది. ఇండిగో దగ్గర చూస్తే... ఆ రూల్ ప్రకారం డ్యూటీ చేయడానికి సరిపడా "రెస్ట్ తీసుకున్న పైలట్లు" రెడీగా లేరు. పైలట్ లేకపోతే విమానం ఎగరదు కదా!
అందుకే... ఒక్కసారిగా వేలాది విమానాలను క్యాన్సిల్ (రద్దు) చేసేశారు.



# నడుస్తున్న చరిత్ర

5. నష్టపోయింది ఎవరు?

టికెట్ కొనుక్కుని, ఎన్నో అత్యవసర పనుల మీద వెళ్ళాల్సిన సామాన్య ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లలో చిక్కుకుపోయారు. భోజనం లేదు, ఉండటానికి వసతి లేదు, ఎప్పుడు ఫ్లైట్ ఉంటుందో చెప్పే దిక్కు లేదు.

ఒక్క మాటలో చెప్పాలంటే: ప్రయాణికుల భద్రత కోసం పెట్టిన రూల్‌ని పాటించడానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోకుండా, ఇండిగో సంస్థ చేసిన నిర్లక్ష్యం వల్లే ఈ గందరగోళం అంతా జరిగింది. లాభాల కోసం చూసుకుని జనాన్ని ఇబ్బంది పెట్టారు.

ప్రయాణికుల భద్రత కోసం DGCA కొత్త పైలట్ విశ్రాంతి నియమాలు 18 నెలల క్రితమే ప్రకటించింది. ప్రతి ఎయిర్‌లైన్‌కూ కొత్త పైలట్లను నియమించేందుకు సరిపడా సమయం ఉంది.

Air India, Vistara, Akasa, SpiceJet— అన్నీ—అదనపు పైలట్లను నియమించాయి. IndiGo మాత్రం ఉద్దేశపూర్వకంగా చేయలేదు, అదే సమయంలో కొత్త మార్గాలను పెంచుతూ వచ్చింది.

ఫలితం? కొన్ని గంటల్లో 1,000కి పైగా రద్దులు, వేలాది మంది ప్రయాణికులు ఎలాంటి స్పష్టత లేకుండా గంటలతరబడి ఇరుక్కుపోయారు— సపోర్ట్ లేదు, పరిహారం లేదు, వసతి లేదు.

కానీ IndiGo మాత్రం ఇంకా టికెట్లను అమ్ముతూ, సీట్లు, భోజనం, ఆడ్ ఆన్ లు ఇలా అన్నింటికీ డబ్బులు వసూలు చేస్తూనే ఉంది—మాస్ క్యాన్సిలేషన్స్ తప్పవని ముందే తెలుసుకుంటూ. ఇదంతా మధ్యలో డబ్బు తన దగ్గరే ఉంచి, వడ్డీ పొందటానికే.

వారి అంతర్జాతీయ కోడ్-షేర్ ఫ్లైట్లు (Turkish Airlinesతో ఉన్నవి) సజావుగా నడిచాయని చెబుతున్నారు. ఇంటర్నల్ డొమెస్టిక్ ఆపరేషన్స్‌ను మాత్రం ఉద్దేశపూర్వకంగా దెబ్బతీశారు, మోదీ ప్రభుత్వంపై ఆగ్రహం కలిగించడానికి.

ఇంత గందరగోళం సృష్టించడంతో మోదీ ప్రభుత్వం బలవంతంగా ఆ పాలసీని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది—విమానయాన రంగం కుప్పకూలకుండా కాపాడేందుకు. ప్రభుత్వం ప్రయాణికుల ఇబ్బంది తగ్గించడానికి మాత్రమే చేసింది, కానీ తన ఇమేజ్ నష్టపోయింది.

ఇక ఏమవుతుంది?

IndiGoపై మోదీ ప్రభుత్వం భారీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్యాసింజర్ సేఫ్టీ పాలసీ తిరిగి వస్తుంది, కానీ ఈసారి పార్లమెంట్‌లో బిల్లుగా వస్తుంది. ఇది ఇకపై నోటిఫికేషన్ మాత్రమే కాదు—చట్టం అవుతుంది. IndiGo CEO Pieter Elbers గురించి కూడా విచారణకు ఆదేశాలు రావచ్చు; ఆయన డచ్ పౌరుడు కాబట్టి అనుమానాలు ఉన్నాయి.

మోదీ ప్రభుత్వం తాత్కాలికంగా వంగినా, ఇప్పుడు బలమైన దెబ్బ కొట్టే ఛాన్స్ ఉంది. భారత విమానయాన రంగాన్ని అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్‌కు తెరచే అవకాశమూ ఉంది—IndiGo & Air India ఇద్దరి ప్రభావాన్ని తగ్గించడానికి.

కానీ ఇది మోదీ ప్రభుత్వానికి కూడా పాఠమే—18 నెలల పాటు DGCA నోటిఫికేషన్ అమలు గురించి అధికారుల్ని ఫాలోఅప్ చేయకుండా నమ్ముకోవడం తప్పు. ఆ తప్పు చేసిన ప్రభుత్వ అధికారులపైనా చర్యలు అవసరం.

★★★★



# అంతర్నేత్రం



## ఆత్మ నిగ్రహం అవసరం ....

చంచలమైన మనస్సును నిశ్చలంగా చేయడం సాధారణమైన విషయం కాదు. సామాన్యులకే కాదు, అత్యంత శూరుడైన అర్జునికి కూడా మనస్సును నిగ్రహించుకో. వడం సాధ్యం కాలేదు. మనసును నిగ్రహిం చడం వాయువును బంధించడం కన్నా కష్ట మైందని అర్జునుడే స్వయంగా అన్నాడు. భారత యుద్ధం ప్రారంభం కావడానికి ముందు తనకు సారధ్యం వహిస్తున్న శ్రీ కృష్ణునితో అర్జునుడు ఈ మాటలు పలి కాడు, యుద్ధంలో ప్రతిపక్షం మీద దృష్టి సారించి తన తాత భీష్ముడు, గురువు ద్రోణాచార్యుడు, సహాధ్యాయ గురుపు త్రుడు అశ్వత్థామ, అన్నదమ్ములైన కౌరవ సోదరులను చూసి విషాదంలో పడి పోయాడు. వారంతా తన స్వజనం కావ డంతో యుద్ధం చేయడానికి అతనికి మన స్కరించలేదు. దాంతో అతని చేతిలో నుంచి ధనస్సును జార విడుస్తూ "కృష్ణా నాకు విజయం వద్దు... రాజ్య సుఖాలు వద్దు... ఆచార్యుణ్ణి, పితామహుణ్ణి, బంధువులను నేను సంహరించలేను" అంటూ మౌనం వహించి విముఖుడై కూర్చుండిపోయాడు. అతని మనస్సు నిగ్రహాన్ని కోల్పో యింది. 0_ _ _

అందువల్లనే అర్జునికి ఇలాంటి స్థితి ఏర్పడింది.

ఇది గమనించిన శ్రీ కృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధానికి సన్నద్ధం చేయడానికి ఎంతో శ్రమ పడాల్సి వచ్చింది. ఒకటి కాదు రెండు కాదు. ఏకంగా 18 అధ్యాయాలుగా ఉండే భగవద్గీతను బోధించాడు. భౌతికమైనవి, తాత్వికమైనవి అనేకానేక విష -యాలు తాను గురువుగా మారి అర్జునునికి బోధించాడు. దాంతో అర్జునుడు శత్రువు లను సంహరించడానికి అంగీకరించాడు. మనోనిగ్రహం పొందడం చేతనే అర్జునుడు తిరిగి మామూలు స్థితికి వచ్చాడు. తన ధర్మాన్ని తాను నిర్వర్తించాడు.

దీనినే మనం నిత్య జీవిత పోరాటంలో పాఠంగా మలచుకోవాలి. ఆ పాఠం మనల్ని సత్యసంధులుగా, న్యాయవేత్తలుగా, నీతిప రులుగా తీర్చిదిద్దుతుంది. మనో నిగ్రహం అలవడితే సద్గుణ సంపన్నులు అవుతారు. భక్తి, జ్ఞాన, వైరాగ్య భావనలు కలిగి, సమ దృష్టి అలవడుతుంది.

అయితే ఆత్మ నిగ్రహానికి, ఆత్మ స్థైర్యానికి అవినాభావ సంబంధం ఉంది. ఆత్మ స్థైర్యం ఉన్న మనిషికి ఆత్మ నిగ్రహం ఏర్పడుతుంది. ఆత్మ పట్ల నమ్మకం, విశ్వాసం ప్రోది చేసుకున్న వ్యక్తి ఆత్మ స్థైర్యాన్ని సంపూర్ణంగా కైవసం చేసుకోవచ్చు. స్వార్ధరహిత మైన మనసు, ప్రవత్తి, వ్యాపకం వంటివి మనిషి ధీరో దాత్తతకు ఉపకరణాలు. ఏ ప్రలోభా లకూ లొంగని స్వభావం వల్ల మనిషి ఆత్మస్థైర్యాన్ని సంతరించుకుంటాడు. దైవం పట్ల ప్రత్యేక శ్రద్ధ లేకపోయినప్పటికీ తన పట్ల గురి, నమ్మకం ఉన్న వ్యక్తి ఆత్మ స్థైర్య సంభూతుడే అవుతాడు. ఆత్మ స్థైర్యం మనిషి శక్తి సామర్ధ్యాలను ద్విగుణీ కృతం చేస్తుంది. పిరికితనాన్ని పారదోలు తుంది. విద్యార్జనకు, ఆరోగ్య సాధనకు తోడ్పడుతుంది. భిన్నత్వం గల సమా జంలో ఏకతాభావన సాధించేందుకు బలం ఇస్తుంది. ఆధ్యాత్మిక అంశంలో సైతం ముందుకు సాగేందుకు తోడ్పడు తుంది. అందువల్ల జీవితంలో ఉన్నత సోపానాలను అధిరోహించాలనుకునే ప్రతివ్యక్తి ఆత్మస్థైర్యం పెంపొందించు కుంటే ఆత్మనిగ్రహం దానికదే సొంతమవుతుంది.

★★★

# అవి-ఇవి




## వై ఫై లేకుండా టివి ప్రసారాలు

ప్రస్తుతం నడుస్తున్నది సాంకేతిక యుగం. ప్రతి సెకనుకు ఓ కొత్త టెక్నాలజీ (Tech) మన తలుపు కొడుతోంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల విప్లవం నడుస్తోంది. అరచేతిలో వైకుంఠంలాగా.. మొబైల్ ఫోన్‌లోనే ప్రపంచం ఉంటోంది. ఇలాంటి సమయంలో టీవీ కూడా మొబైల్ ఫోన్‌లోకి వచ్చే-స్తే.. ఎంత బాగా ఉంటుందో కదా. ప్రస్తుతం ఇదే పనిలో ఉన్నాయి కొన్ని స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు. అయితే.. మన మొబైల్‌లో టీవీ చూడాలంటే మొబైల్ డేటా అయినా ఉండాలి.. లేదంటే వైఫై కనెక్షన్ అయినా ఉండాలి. ఈ రెండూ లేకుండానే మొబైల్‌లో టీవీ ప్రసారాలు చూడగలిగితే? అది ఇంకా బాగుంటుంది కదా! ఆరోజు కూడా అతి దగ్గర్లోనే రానుంది. అవును మీరు విన్నది అక్షరాల నిజం!

ఈ తరహా మొబైల్‌స్‌ను తీసుకొచ్చేందుకు రెండు మొబైల్ తయారీ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. గతంలో నోకియా పేరుతో ఫోన్లు తయారుచేసే హెచ్‌ఎండీ సంస్థ.. ఫ్రీస్ట్రీమ్ టె-క్నాలజీస్, ఇతరులతో కలిసి డీ2ఎం ఫోన్లు మార్కెట్లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. లావా ఇంటర్నేషనల్ సైతం డీ2ఎం ఫీచర్ ఫోన్‌ను లాంచ్ చేయనున్నట్లు ప్రకటించింది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (WAVES) 2025 ఈవెంట్ సమయంలో ఈ రెండు కంపెనీలు ప్రకటన చేసిన విషయం తెలిసిందే.




## నగ్న చిత్రం

ఈ కెమెరాతో ఫోటో తీస్తే బట్టలు ఉన్నా , ఆ వ్యక్తి బట్టలు లేకుండా కనపడతాడన్న విషయం మీకు తెలుసా..? 25 ఏళ్ల క్రితం ఈ విషయమై ప్రపంచంలో సంచలనం రేగింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన సోనీ కెమెరా 1998లో ఇన్ఫ్రారెడ్ లెన్స్ తో వచ్చింది. కెమెరాలో కొన్ని ఆప్షన్స్ ఒక ఉద్దేశంతో చేస్తే అది వేరే విధంగా మారింది. జనం దాన్ని ఇలా వాడతారని సోని కంపెనీ కూడా ఊహించి ఉండదు..దీంతో 1998లో తయారైన 7 లక్షల నైట్ షాట్ కెమెరాలను ఆగమేఘాల మీద ఉపసంహరించుకుంది. ఆ కెమెరాలలో. ఒక. ఆప్షన్ ను రిమోట్ సిస్టం ద్వారా పని చేయకుండా చేసింది. అప్పటికే ప్రపంచంలో గగ్గోలు పుట్టింది . సోనీ నైట్ షాట్ హ్యాండీకామ్ తో రాత్రి సమయాల్లో అడవుల్లో షూటింగ్ కోసం,,వన్య ప్రాణుల ఫోటోగ్రాఫర్ల కోసం, అ శాస్త్రవేత్తల కోసం ఆ కెమెరా లో ఈ ఫీచర్ను ఏర్పాటు చేశారు. అయితే దీన్ని కొన్నవారు పగటి సమయంలో కూడా నైట్ మోడ్ ఆన్ చేసి ఫోటోలు తీస్తే బట్టలు వేసుకున్న వారు కూడా బట్టలు లేకుండా కనపడ్డారు. దీంతో ఆ కెమెరాలని ఉపసంహరించి , ఆ ఆప్షన్ తీసేసి ఇచ్చారు.

బహుమతి పొందిన శృంగార కథ

శృంగార కథ



# ప్రియా ..చారుశీలే !

**జి.రంగబాబు**

"రాగాలా పల్లకిలో కోకిలమ్మ రాలేదు ఈవేళ ఎందుకమ్మా ఎందుకమ్మా..."అని పాడుకుంటున్నాడు రవిచంద్ర.

రవిచంద్ర చిత్రకారుడు.అతడి పెయింటింగ్స్ కి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వుంది. అద్భుతమైన కళాఖండాలు సృష్టించడంలో అతడికి అతడే సాటి.ఇంటర్నేషనల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ లకు అతడి పెయింటింగ్స్ ఎంపిక కాబడుతుంటాయి. ప్రదర్శనకూ,అమ్మకానికీ కూడా అతడి చిత్రాలు అక్కడ పెట్టబడుతుంటాయి.

అతడి పెయింటింగ్స్ కి మంచి గిరాకీ వుంది కళాభిమానుల్లో.

"రాలేదు ఈవేళ కోయిలమ్మ. స్టూడియోలో రికార్డింగ్ వుంది కదమ్మా..ఉంది గామ్మా.."అంటూ పాడుతూ ప్రవేశించింది కోకిల. ఆమెను చూసి చిరునవ్వుతో స్వాగతించాడు రవిచంద్ర.కోకిల గొప్ప పేరు మోసిన గాయని.ఆమె పాటలు దేశ వ్యాప్తంగా మంచి కీర్తిని సంపాదించుకున్నాయి.

ఆమె గొంతులో పలకని రాగం లేదు.ఆమె పాటలకు ఎన్నో జాతీయ స్థాయి అవార్డులొచ్చాయి.ఆమె కీర్తి అన్ని దిక్కులకూ వ్యాపించిందనడం అతిశయోక్తి కాదు.

రవిచంద్ర,కోకిల భార్యాభర్తలు. వాళ్ళిద్దరి పరిచయం చాలా గమ్మత్తుగా జరిగింది.రవిచంద్ర గీసిన చిత్రాలతో నేషనల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రదర్శన జరుగుతోంది.అక్కడ ప్రదర్శించేది కేవలం అతడి చిత్రాలే.అతడి పెయింటింగ్స్ ని ఇష్టపడేవాళ్ళు,

అతడి అభిమానులు, చిత్రకళాభిలాషులు అందరూ ఆ ఎగ్జిబిషన్ కు వచ్చారు. అక్కడికి వచ్చిన వారందరూ

రవిచంద్ర చిత్రాలను చూసి పరవశించిపోతున్నారు.

తన్మయత్వంతో 'ఆహా..!'అనుకోకుండా ఉండలేకపోతున్నారు.

అసలు కళ అంటేనే అంత. అది చిత్రలేఖనం కావచ్చు,సంగీతం కావచ్చు,నృత్యం,సాహిత్యం,శిల్ప కళ ఏదయినా కావచ్చు.కళల్ని ఇష్టపడేవారికి ఆ వ్యక్తి అభిరుచిని బట్టి అవ్యక్తమైన అనుభూతికి లోను చేస్తుంది.

అదొక ప్రకృతి దృశ్యం.కొండలలో ఎక్కడి నుండి పడుతోందో తెలియనట్లు జలపాత దృశ్యం.జలపాతం క్రింద స్నానమాడుతూ ఓ గిరి పుత్రిక. వింత సౌందర్యంతో,

అద్భుత సోయగంతో మెరిసిపోతూ జలకమాడుతోంది.ఆ దృశ్యం ఎంతో మనోహరంగా వుంది.ఆ గిరిజన

# ప్రియా ..చారుశీలే !

కథ



యువతి అందం,ఆమె ముగ్ధ మోహన రూపం చూసేవారికి మత్తెక్కిస్తోంది.అంత సజీవంగా చిత్రించబడింది ఆ పెయింటింగ్.

“ఎంత బావుందో..!నిజంగా అద్భుతం..!”మనసులో అనుకోబోయి పైకి అనేసిందా యువతి.ఎంతో సేపటినుండి ఆ పెయింటింగ్ నే తదేకంగా చూస్తోందామె.

“అంత బాగుంటే మీ సొంతం చేసుకోవచ్చుగా..!”అన్న మాటలు వినిపిస్తే తిరిగి చూసింది.

“ఎలా?ఇది అమ్మకానికి కాదుగా..!”అందామె.

“ఎవరన్నారు?ఇది ఎగ్జిబిషన్ కమ్ సేల్. నచ్చిన చిత్రాన్ని మనం కొనుక్కుని ఇంటికి తీసుకెళ్లిపోవచ్చు.అందుకే మిమ్మల్ని సొంతం చేసుకోమన్నది..!”ఆమె సందేహం తీర్చాడతను.

“ఎవర్ని అడగాలి?”మళ్ళీ సందేహాన్ని వెలిబుచ్చింది.

“అదిగో అక్కడ వున్నారు నిర్వాహకులు.వాళ్ళ దగ్గరకు వెళ్ళి అడగండి.వివరాలు చెబుతారు..”అన్నాడతను..అతన్ని ఎక్కడో చూసినట్లునిపిస్తోంది కోకిలకు.

ఆమె నిర్వాహకుల వద్దకు వెళ్ళి ఆ చిత్రాన్ని చూపిస్తూ “ఆ పెయింటింగ్ నాకు కావాలి..” అనడిగింది.

“సారీ మేడం..అది ఇంత క్రితమే సేల్ అయిపోయింది..

మరొకటేదయినా..!”

“నో..నాకదే కావాలి..అదే నాకు నచ్చింది..”అంది నిరాశగా వెనుదిరుగుతూ.

“ఆ చిత్రం మీకు అంతగా నచ్చితే మీరే తీసుకోండి.దాన్ని కొనుక్కుంది నేనే..!”

ఇందాక పలకరించిన అతనే.. అక్కడ నిలబడి వున్నాడు.. ఆశ్చర్యంగా చూసిందతణ్ణి.

“మీరు వచ్చిన దగ్గర నుండీ ఈ పెయింటింగ్ ని కళ్లార్పకుండా చూడటం గమనించాను.తరువాత మీరు కొనడానికి ప్రయత్నించడం.. అది అయిపోయిందని చెప్పడం చూసి ఇలా మీకు ఆఫర్ చేస్తున్నాను..”అన్నాడతనే మళ్ళీ.

“ఇంతకూమీరు..!?”సందేహంగా ఆగిపోయింది.ఎక్కడో చూసిన ఫీలింగ్.

“అయామ్ రవిచంద్ర..ఆ చిత్రం దిగువున వున్న సంతకం

# ప్రియా ..చారుశీలే !

కథ

నాదే..!"అన్నాడు చిరునవ్వుతో.

"ఓహ్..!మీరేనా?అయామ్ సారీ!గుర్తు పట్టలేకపోయాను.వెరీ వెరీ సారీ..!"

"అన్ని సారీలు అవసరం లేదు లెండి ప్రముఖ గాయని కోకిల గారూ..!" అన్నాడతను.

"ఓహ్..!నేను మీకు తెలుసా! ఓ గాడ్..!నేనూహించనే లేదు..!"అంది ఆనందంగా.

"మిమ్మల్ని తెలియని వారెవరు?ప్రతి చోట మీ పాటే ప్రతి నోట మీ పాట వినబడాల్సిందే..అంతటి అమృత స్వరం మీది..తెలుగు వారి ఆరాధ్య,అభిమాన,అందాల గాయని మీరు..!"

'అందాల' పదాన్ని నొక్కి పలుకుతూ.

ఆమె సిగ్గు పడింది. అతని కామెంట్ కి, కాంప్లిమెంట్ కి.

"మీరు సిగ్గు పడుతుంటే ఇంకా అందంగా వున్నారు.." అన్నాడామెను తదేకంగా చూస్తూ.

"మీ చిత్రకారులకు ఆడవాళ్ళ అందాలు తప్ప ప్రపంచంలో ఇంకేమీ కనబడవా?"

ఈసారి ధైర్యంగా అతని కామెంట్ కి కౌంటర్ ఇచ్చింది.

" అందాన్ని మెచ్చుకుంటుంటే ఆనందించాలి గానీ ఆర్గ్యుమెంట్ కి దిగుతారెందుకు మీ ఆడవాళ్లు?" అంతే స్వరంతో అన్నాడు అతను కూడా .

" అవును మరి.. ఆడవాళ్లంటేనే గయ్యాళి గంగమ్మలు కదా!" అందామె చిరు కోపంతో.

" అబ్బా! అలా కోపంగా చూడకండీ.. అయినా కోపంలో కూడా మీరు..."

"ఆపండాపండి.. మీ పొగడ్తలు వినలేకపోతున్నాను

మహాప్రభో..!" అంటూ రెండు చేతులతో చెవులు మూసుకుంది. ఇద్దరూ నవ్వేశారు. వాతావరణం తేలికైంది.

. ఇంతలో ఆ చిత్రపటాన్ని ప్యాక్ చేసి తీసుకొచ్చాడు అక్కడి బోయ్. దాన్ని అందుకుని కోకిలకిస్తూ.." ఇది మీరు మెచ్చిన, నాకు నచ్చిన నా పెయింటింగ్. మన పరిచయానికి గుర్తుగా మీకు సమర్పించుకుంటున్న నా కానుక. సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తూ.." అన్నాడు విధేయత నటిస్తూ వంగి..

"ఓహ్..థాంక్యూ వెరీమచ్. చేజారి పోయిందనుకున్న అమృతం తిరిగి నోటికి అందినట్లు నాకిష్టమైన పెయింటింగ్ నా చేతికొచ్చింది. చాలా కృతజ్ఞతలు

రవిచంద్ర గారూ."అంది తెగ ఆనందపడిపోతూ.

"మరి మీకు నచ్చిన పెయింటింగ్ మీకు బహుమతిగా ఇచ్చినందుకు మరి నాకేమిస్తారు?."

"అడగండి..అయినా మీ వంటి గొప్ప ఆర్టిస్టులకివ్వడానికి మా దగ్గరేముంటాయ్.?"అంది గానీ ఏం అడగదల్చుకుంటున్నాడో అర్థం కాక ఒక్క క్షణం మౌనంగా వుండిపోయింది.

"మీరివ్వగలిగేదే..మీ కోకిల కంఠం నుండి జయదేవుని అష్టపది ఒకటి పాడి వినిపిస్తే విని తరించాలని వుంది.అంతే!అదే నా కోరిక.నేను అల్పసంతోషిని లెండి."అన్నాడు చిరునవ్వుతో.

"అల్పసంతోషినంటూ అనల్పమైన,అరుదైన కొరికే కోరారు. జయదేవుని అష్టపదులు.."

"నాకు ఇష్టపదులు..!"అని పూర్తి చేశాడు రవిచంద్ర.

"సరే అయితే మనం రేపు కలుద్దాం.నేను ఫోన్ చేస్తాను.. వుంటాను."అంటూ వెళ్ళిపోయింది కోకిల.ఆమె వెళ్లిన వైపే చూస్తుండిపోయాడు రవిచంద్ర.

అది రవిచంద్ర ఇల్లు.

ఇంటికి వచ్చిన కోకిలను ఆహ్వానించి తను పెయింటింగ్స్ వేసుకునే గదిలో



# ప్రియా ..చారుశీలే !

కథ

కూర్చోబెట్టి "చూస్తూ వుండండి.. నేనిప్పుడే వస్తాను "అంటూ వెళ్ళాడు.

రకరకాల పెయింటింగ్స్ తో.. కలర్స్ తో..చిందర వందరగా వుందా గది. 'ఇవన్నీ ఒకే వరసలో అందంగా సర్దుకుని వుంటే బాగుండేది'అనుకుంది మనసులో.

కోకిల ఆ ఉదయం రవి చంద్రకు ఫోన్ చేసింది. తనీ రోజు ఫ్రీగానే వున్నట్లు.

. "మీకభ్యంతరం లేకపోతే మా ఇంటికే రండి.. నా పెయింటింగ్స్ చూడొచ్చు. మీ పాట నేను వినచ్చు కూడా.." అన్నాడు. రెండు క్షణాలు ఆలోచించి సరేనంది.

ఆమె సరేనన్న దగ్గర నుండి ఆమెను ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఉవ్విళ్ళూరుతున్నాడు.

ఆమె రానే వచ్చింది. ఆమెను చూస్తూనే అవాక్కైపోయాడు.అంత అందంగా వుంది.

గులాబీ రంగు చీరలో సన్నగా,నాజూగ్గా వుండి, వుందా,లేదా అనిపించే సన్నని నడుముతో అందానికి నిర్వచనంలా వుంది. అందమైన వెడల్పాటి కనులపై చక్కగా అమరిన కనుబొమలతో,సంపెంగ నాసికతో,మృదువైన అధరాలతో ఒక చిత్రకారుడు తన కుంచెతో ప్రకృతిని చిత్రించినట్లుగా ముగ్ధమనోహరంగా వుంది.

ఎన్నో అందాలను తన కుంచెతో అలవోకగా గీసిన రవిచంద్ర ఆమె అందాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇంతటి అందం కనిపిస్తే చిత్రకారులకు పండగే. ఎప్పుడెప్పుడు ఆ అందాన్ని తన కుంచెతో బంధించేద్దామా అనిపిస్తుంది. రవిచంద్ర పరిస్థితి కూడా అలాగే వుంది.'ఈమెను తన కుంచెకు మాతృకగా చేసుకుంటే గొప్ప చిత్రం తయారవుతుంది" అనుకున్నాడు మనసులో.

అతని చూపుల నుండి తప్పించుకుని"ఏవండోయ్..ఆర్టిస్టు గారూ! ఏ లోకంలో వున్నారు?" అంటూ అతణ్ణి పలకరించింది. రవిచంద్ర వెంటనే తేరుకుని అలా చూడడం సంస్కారం కాదని చూపులు మరల్చాడు." ఇవన్నీ సర్దిపెట్టి నేను చిత్రాలు గీసుకుంటుంటే నా ప్రక్కనే వుండి నన్ను ప్రోత్సహించే మనిషి కోసం చూస్తున్నాను"అన్నాడు.

. 'అరె! ఇతనికి ఎదుటివారి మనసులోని భావాలు చదవడం కూడా వచ్చా ఏమిటి?' అనుకుంది. 'మీ కోసం కాఫీ తెస్తాను.. వుండండి'. అని లోపలికెళ్ళబోతుంటే "ఆగండాగండి నేను కలిపి ఇస్తాను." అంటూ లోపలికెళ్ళి కాఫీ కలిపి రెండు కప్పులతో వచ్చింది. ఆమె ఇచ్చిన కాఫీ త్రాగుతూ "మీ స్వరంలాగే మీ కాఫీ కూడా అమృతంలాగే ఉంది "అన్నాడు. 'థాంక్స్.' అంది

" ఇంతకీ ఏ పాట పాడమంటారు చెప్పండి..!" పాడేస్తే ఓ పనైపోతుంది అన్నట్లుగా ..

"ప్రియే.. చారుశీలే..! పాట నాకిష్టం! ఆ పాట పాడితే సంతోషిస్తాను". అన్నాడు.

" ఓహ్.. అద్భుతమైన పాట. మంచి శృంగార రస ప్రధాన గీతం. ఆ లెక్కన అష్టపదులన్నీ రాధాకృష్ణుల శృంగార వర్ణనే కదా.!"అంది. ఆమె అక్కడే మఠం వేసుకుని కూర్చుని పాట అందుకుంది.

"వదసి యది కించి దపి దంత రుచి కౌముదీ..హరతి దర తిమిర మతి ఘోరం'

స్ఫురద ధరశీధవే తవ వదన చంద్ర మా రోచయతు లోచన చకోరమ్..

ప్రియే..చారుశీలే..ప్రియే.. చారుశీలే..!"

ఆమె పాడుతున్నంత సేపూ ఆమెనే చూస్తుండిపోయాడు. కళ్ళు మూసుకుని తన్మయత్వంతో పాడుతున్న ఆమె గానం అతనికి అమృతపానంలా అనిపించింది. సంగీతానికి వున్న శక్తే అది. ఆమె పాట పూర్తయ్యింది.



# ప్రియా ..చారుశీలే !

కథ

"అద్భుతం..!ఎంత బాగా పాడారు!నిజంగా మీ కంఠంలో ఏదో మాయ వుంది.కానీ దీనర్థం నాకు తెలియదు.మీకు తెలుసా?"అనడిగాడు.

"తెలుసు..ఈ అష్టపదుల్ని అనువాదం చేశారు చాలా మంది.మంచి వ్యాఖ్యానంతో ఈ అష్టపదుల భావాన్ని తెలుగులో మనకి అందించారు.మీరు చెప్పమంటే చెబుతాను దీనర్థం.. సంక్షిప్తంగా.."అంది.

"అర్థం తెలిస్తే మరింతగా పాటను ఆనందించవచ్చు. చెప్పండి..!"అన్నాడు.

"చల్లని రాత్రిలో తెల్లని వెన్నెలలో కోరిక తీర్చవలసిన ప్రేయసి అలిగి కూర్చుంటే పురుషుడు ఏం చేస్తాడు?బ్రతిమాలుకుంటాడు. బుజ్జగిస్తాడు.కృష్ణుడు కూడా రాధ పట్ల అదే చేస్తున్నాడు.

"ప్రియా!నాతో నవ్వుతూ మాట్లాడు..నీ పెదవులలోని తియ్యని అమృతాన్ని నాకు బిక్షగా ఇవ్వు.కోపం మాని నా తాపం తీర్చు.నా మనసును మన్మధుడు దహిస్తున్నాడు.ఆ వేడి సెగలు భరించలేకున్నాను. కనికరించి కౌగిలింతల వరం ప్రసాదించు.."రాధ బెట్టు చేస్తోంది.

"ప్రేయసీ..నీకు నిజంగా నాపై కోపం వుంటే నన్ను శిక్షించు. నీ వాడి గోళ్ళతో నా శరీరమంతా రక్కెయ్యి.ఎక్కడ చూసినా నఖ క్షతాలే కనిపించాలి. నా శరీరం నీది.నీ ఆనందం కోసమే వుంది.ఏం చేసుకుంటావో, ఎలా దండిస్తావో నీ ఇష్టం.!చివరికి రాధ పాదాన్ని తన నెత్తి మీద పెట్టమన్నాడు కృష్ణుడు. రాధ ఉలిక్కిపడింది.అతనిలో ఎంత ప్రేమ వుందో,ఎంత కోరిక వుందో అర్థమయ్యింది.కరిగిపోయింది రాధ.

ఇంతగా వేడుకున్నాను కదా. ఆమె ఇక కాదంటుందా అని అనుకుని ప్రక్కనే వున్న పొదరింట్లోకి ప్రవేశించాడు కృష్ణుడు.ఆమె తన వెనకే వస్తుందనుకున్నాడు.కానీ రాధ అక్కడినుండి కదల్లేదు."అంటూ ముగించింది కోకిల.

. అలా కొంచెంసేపు మాట్లాడుకున్నారు.ఆ తరువాత కోకిల వెళ్ళిపోయింది.వారి పరిచయం అలా రోజురోజుకీ అభివృద్ధి చెందింది. ఫోన్లలో మాట్లాడుకోవడం,ఆమె కచేరీలకు అతను వెళ్లడం అన్నీ చేసేవారు.ఒకరోజు రవి చంద్ర కోకిలకు ఫోన్ చేశాడు.

"చూడండి మిస్ కోకిలా!మీ పాటల్ని ఎప్పటినుండో ఇష్టపడుతున్నాను.మిమ్మల్ని చూసిన దగ్గర నుండీ మిమ్మల్ని కూడా ఇష్టపడుతున్నాను. ఆరాధిస్తున్నాను,

ప్రేమిస్తున్నాను. నాకోసం మీరు పాట పాడటం నాకెంతో నచ్చింది.మీ పాట విని నన్ను నేనే మరచిపోయాను.

ఇతరుల పట్ల మీరు చూపే గౌరవం, నీ సౌశీల్యం నాకెంతో నచ్చాయి.

మనిద్దరం కళాకారులమే. కళ కోసమే మన జీవితాలు అంకితం కాబడ్డాయి. కళాకారులమైన మనం ఒకరినొకరు ఎంతో గౌరవించుకుంటున్నాం. నా చిత్రాలంటే మీకిష్టం. మీ పాటంటే నాకిష్టం. మరి ఈ రెండు ఇష్టాలు కలిసి ఒకే చోట కాపురం పెడితే అది ఇంకా బాగుంటుంది కదూ!అందుకే నా మనసులో మాట చెప్పడానికే మీకీ ఫోన్. మనిద్దరం వివాహం చేసుకుంటే ఎంతో బాగుంటుందని నా అభిప్రాయం.

. ఒకరి కళను మరొకరు గౌరవించుకుంటూ, ఒకరి కళను మరొకరు ప్రోత్సహిస్తూ మన కళల్ని మరింత విస్తరించుకునే అవకాశం వుంది. అందుకని మనిద్దరం కలిసి మన జీవితాలను పంచుకుందాం.. మన అభిరుచుల్ని కూడా.

నాకోసం మీరూ,మీ కోసం నేను అన్నట్లుగా వుందాం.నా మీద కూడా మీకు ఇష్టం,ప్రేమ వున్నట్లు గ్రహించి ఈ సాహసం చేస్తున్నాను. రాధను కృష్ణుడు కోరుకున్న విధంగా నేను కూడా మిమ్మల్ని కోరుకుంటున్నాను. వివాహం తర్వాత మన

ప్రణయం కూడా రాధాకృష్ణుల ప్రణయ కావ్యం'గీత గోవిందం'లాగా వర్ధిల్లుతుందని ఆశిస్తున్నాను.



# ప్రియా ..చారుశీలే !

కథ

మీ సమాధానం కోసం ఎదురు చూస్తుంటాను..!"

రవిచంద్రను కాదనడానికి కోకిల దగ్గర కారణం ఏమీ కనిపించలేదు. తనకి పాట తర్వాత పెయింటింగ్స్ చూడటం ఇష్టం.అతనికి కూడా అతని వృత్తి తర్వాత పాట అంటే ప్రాణం పెడుతున్నాడు.అటువంటిది

ఇద్దరూ కలిస్తే ఆ జీవితం ఆనందమయమే కదా!నందనవనాన్ని తలపిస్తుంది కదా!ఇద్దరు కళామతల్లి ముద్దు బిడ్డలే.కళ తామిద్దరినీ కలపడం ఎంత బాగుంది.తనకి గొప్ప శ్రోత దొరుకుతాడు.అతనికి మంచి'కళాభిమాని'దొరుకుతుంది. ఇద్దరూ తమ కళల్ని ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతారు.తన మనసులో మాటనే అతనూ చెప్పేసరికి కోకిల మనసు ఆనందంతో నిండిపోయింది.

ఒకరోజు మంచి ముహూర్తంలో కోకిల,రవిచంద్ర పెళ్ళి జరిగిపోయింది ఘనంగా.

అది తొలి రాత్రి..కోకిల కోసం మంచి బహుమతి ఎదురు చూస్తున్నట్లుగా ఆ గదిలో ఒక ఫోటో ఫ్రేమ్ వుంది.దాని పేకింగ్ విప్పి బహిర్గతం చేశాడు. అది కోకిల చిత్రం.తన్మయత్వంతో కళ్ళు మూసుకుని పాట పాడుతున్న దృశ్యం.అద్భుతంగా వుంది. ఆరోజు రవిచంద్ర ఇంట్లో కోకిల పాడుతున్న ఆ దృశ్యం ఎంతో గొప్పగా చిత్రించాడు..తన మనసుతో.. తన హృదయంతో..ఆ పెయింటింగ్ ని చూసి ఎంతో సంబరపడింది కోకిల!నేను పాట పాడుతుంటే ఇంత అందంగా వుంటానా!"అంది."అవును.. మరి నా కోసం ఓ పాట..!" అన్నాడు.

"నాకు తెలుసు..మీరు పాట పాడమంటారు.అది కూడా మీ ఇష్టపదే గా..!"అంది.

"నన్నింతలా అర్థం చేసుకున్నావు కనుకనే నువ్వు నాకు ఇష్టసఖివయ్యావు. మరింకెందుకాలస్యం?"

కోకిల మరలా జయదేవుని అష్టపది అందుకుంది.అది రాధాకృష్ణుల శృంగార కేళీ విలాస మనోహర గీతం.!విభాస రాగము.. ఆదితాళంలో సాగిందా అష్టపది..

"కిసలయ శనతలే కురుకామిని చరణన నళిని వినివేశంతవ పద వల్లవ వైరి పరాభవమిద మనుభవతు సువేశంక్షణమధానా నారాయణం.. అనుగత మనుసర రాధే..అంటూ ప్రారంభమైన గీతం..

"జనయతు రసిక జనేషు మనో రమ రతిరసభావ వినోదం"అంటూ ముగించింది.

" మరి దీనర్థం..మీరెలాగూ అడుగుతారు కాబట్టి చెబుతాను.." అంది.

"వద్దు.. వద్దు..నువ్వు చెప్పద్దు.నేను చెబుతాను." అన్నాడు రవిచంద్ర.

"అదేంటి? మీకు తెలుసా!మరి ఆరోజు తెలియదన్నారు?"అంది కోకిల.

"ఆరోజు నీ నోటి ద్వారా వినాలని అలా అన్నాను.."అసలు విషయం బయట పెట్టాడు.

"అబ్బో..మీరు నేననుకున్నంత అమాయకులు కాదే..!"నేనమాయకున్నని చెప్పానా..!అన్నాడు.

"లేదులెండి..సరే..చెప్పండి..రాధా కృష్ణుల కామ కేళీ విలాసం.."అంది. మొదలు పెట్టాడు రవిచంద్ర.

"మెల్లగా రాధను దగ్గరకు లాక్కున్నాడు కృష్ణుడు. తనివితీరా కౌగిలించుకున్నాడు. ప్రియుని స్పర్శకు రాధకు సిగ్గు ముంచుకొచ్చింది.పెదాలపై చిరునవ్వు విరిసింది.తలవంచుకుని దొంగ చూపుతో సంభోగానికి సిద్ధపరచిన పానుపు కేసి చూసింది.

నెమ్మదిగా రాధను పడక మీదకి ఆహ్వానించాడు కృష్ణుడు. మాటలతోనే మత్తెక్కించాడు. ఆమెను మాటలలోనే పెట్టి పైభాగాన్ని కప్పివున్న వస్త్రాన్ని నేర్పుగా తొలగించాడు. అలాగే మిగతావి కూడా. ఉలిక్కిపడిన రాధ తనని తాను చూసుకుని ఆశ్చర్యపడింది. ఒంటిపై



# ప్రియా ..చారుశీలే !

నూలిపోగు కూడా లేని శరీరాన్ని అలాగే పానుపుపై పాలరాతి శిల్పం వలే సిద్ధంగా వుంచింది. కృష్ణుడు రాధను పూర్తిగా ఆక్రమించుకున్నాడు. గాలి ఆడనంత గాఢంగా ఇద్దరూ కౌగిలించుకున్నారు.తీగల్లా శరీరాలను

పెనవేసుకున్నారు. పెదవులు కలిసాయి రుచులు తెలిసాయి. చెవిలో రహస్యాలు చెప్పుకున్నారు. గారాలు పోయారు.

రాధకు సిగ్గు ఎగిరిపోయింది. 'నేనిప్పుడు పూర్తిగా నీ ఆధీనంలో వున్నాను కృష్ణా..ఎలా చేస్తావో.. ఏం చేసుకుంటావో పూర్తిగా నీ ఇష్టం..' అనేంత స్వేచ్ఛను ఇచ్చింది. రాధను ఎన్ని విధాలా సుఖపెట్టాలా అని కృష్ణుని ఆలోచన. తనకు తెలిసిన విద్యనంతా ప్రదర్శించాడు. అణువణువులోనూ స్పందనలు కలగజేసి రాధను కోరికలకు రాణిలా తయారు చేశాడు.

రాధ మరి ఇంకా ఆగలేదు. 'పురుషాయితం' ఆమెకెంతో ఇష్టం.! ఆమె చేష్టలు అతనికి ఆనందాన్ని కలుగజేస్తున్నాయి. పులకరించిపోయాడు. రాధ కొప్పు వీడిపోయింది. పూలన్నీ జారిపోయాయి. చెక్కిళ్ళు చెమర్చాయి.

పెదవులు మరింత ఎర్రబడ్డాయి.

ఆనందపుటంచులు చూసి, స్వర్గ ద్వారాలు దాటి మరింత లోనికి వెళ్ళిపోయారు. అలా రాత్రంతా మన్మథ సామ్రాజ్యాన్ని యేలుతూనే ఉన్నారు. వారి కామ క్రీడకు, రతి కేళికి ప్రకృతి సైతం ఆనందంతో నాట్యమాడింది.."

"అమ్మ దొంగా అంతా తెలిసే తెలియనట్లు నాటక మాడావా.!" అంటూ రవిచంద్ర చెప్పిన వ్యాఖ్యానానికి వేడెక్కిన కోకిల రవిచంద్ర బాహువుల్లో ఇమిడిపోయింది.

"మనం కూడా రాధాకృష్ణుల ప్రణయ కావ్యంలా మరో కొత్త కావ్యాన్ని సృష్టిద్దాం..! సృష్టిలో మనంత అన్యోన్యమైన జంట లేదు అనుకునే విధంగా మరో క్రొత్త లోకాన్ని ఏర్పాటు చేసుకుందాం.!నీలో నేను, నాలో నువ్వు కలిసిపోతూ మన ప్రణయ సామ్రాజ్యాన్ని యేలుదాం..!" అని ఆమె చెవిలో గుసగుసలాడాడు.

ఆమె మరింత హత్తుకుపోయి రాధాకృష్ణుల కేళిని తలుచుకుని పరవశంలో మునిగిపోయింది.

వారి అనురాగానికి పులకించి ప్రకృతి ఆశీర్వదించినట్లు పాన్పుపైన అలంకరించిన పూలు వారిద్దరిపైనా పూల వర్షం కురిపించాయి.

★★★★★




ఇప్పటి వరకు ఏ యాప్ యూజ్ చేయాలన్నా మన ఫోన్‌లో ఇంటర్నెట్ ఉండాల్సిందే. అయితే.. తాజాగా గూగుల్ 'ఏఐ ఎడ్జ్ గ్యాలరీ' ( Google AI Edge Gallery ) పేరిట ఓ కొత్త AI యాప్‌ను తీసుకొచ్చింది.

ఈ ఏఐ ఎడ్జ్ గ్యాలరీ యాప్ ద్వారా మీ ఫోన్‌లో ఇంటర్నెట్ లేకున్నా ఏఐ మోడల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ఇంటర్నెట్ లేకున్నా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (Artificial Intelligence)తో ఇమేజ్‌లను సృష్టించడం (Image Creation), కోడ్ రాయడం, సమాధానాలు రాబట్టడం వంటివి సులభంగా చేయొచ్చు. ఇందులో మరో ప్రధానమైన విషయం ఏమిటంటే.. యూజర్ ప్రైవసీ (User Privacy)కి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎందుకంటే యూజర్లు అందించే డేటా క్లౌడ్ (Data Cloud) సర్వర్లకు వెళ్లకుండా మొత్తం మొబైల్ ఫోన్లో బ్యాక్‌ఎండ్‌లో రన్ అవుతుంది. ఇది సెక్యూరిటీ రిస్క్‌ను కూడా తగ్గిస్తుంది. అలాగే పనితీరు కూడా చాలా చాలా వేగంగా ఉంటుంది. సర్వర్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా యూజర్లు అడిగే ప్రశ్నలకు వెంటనే రిప్లయ్ ఇచ్చే ఆస్కారం ఏఐ ( AI )కి ఉంటుంది.

చారిత్రక
కథ

బహుమతి పొందిన చారిత్రక కథ



# కళింగ

పాట్నేడి వీర వెంకట సత్యనారాయణ

అది క్రీ.పూ. 193 వ. సంవత్సరం. మహానది, బ్రాహ్మణి, బైతరణీ నదుల మధ్య అలరారే ఉత్కళ పర్వత ప్రాంతం. వైశాఖ మాసంలో ప్రభాకరుడు నడి నెత్తిన ప్రచండ తాండవం చేస్తున్నా లెక్క చేయకుండా, అయన ప్రతిభను మసక బారుస్తున్న హరిత వనం. ఆదివాసి గూడేలకు అనుకుని, ఉన్న సదుపత్ర అరణ్య ప్రాంతంలో, ఆశ్వపు డెక్కల హోరుతో దద్దరిల్లిన సమయం.

“ యువరాజా, ఇక్కడేవో క్రూర మృగాల అడుగుజాడలు, అతి స్పష్టంగా అగుపడుతున్నాయి. ద్వాదశ నూర్ల ధనువుల దూరంలో, ఒక మడుగు కూడా గోచరిస్తోంది. ఇది నిస్సందేహంగా క్రూర మృగాలు సంచరించే ప్రాంతమే. అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఈశాన్య దిక్కు చివరి భాగంలో గాలికి ఊగుతూ కన్పిస్తున్న తాళ వృక్షాల గుంపు ఓ శుభ సంకేతం. అక్కడ మాటు వేద్దాం. ” అంటూ మద్ది వృక్షాల నడుమ, మందగించిన నడకతో పయనించే అశ్వరాజ సమూహం అగ్రభాగాన ఉన్న, కళింగ సింహంతో పలికాడు మహామంత్రి రాజమతియ మహామాత్రులు.

ఓ సైనికుడు బిల్వ వృక్షపు చిటారు కొమ్మ నుండి పరిశీలించి అందించిన సమాచారాన్ని, కళింగ యువరాజు ఖారవేలుడికి మందహాసంతో చేరవేసాడు ఆ మహామంత్రి. ఆ పలుకులు విన్న మరుక్షణం, పరివారం కేసి పరికించి చూసాడు యువరాజు. భావి చక్రవర్తి ఇచ్చే ఆదేశం, తమనెక్కడ ఇరకాటంలో పడేస్తుందో అన్న భయం, అప్పటికే అలిసిపోయి ఉన్న పరివారం ముఖాల్లో స్పష్టంగా దోబూచులాడుతూ ఉంటే, వెంటనే ఓ నిర్ణయానికి వచ్చేసాడు యువరాజు ఖారవేలుడు.

“ మహామంత్రీ, మీరంతా ఇక్కడే విశ్రమించండి. మా నేస్తం కపిల పాత్రుడు, మేము అక్కడకు వెళ్లి మాటు వేస్తాం” అంటూ తన నిర్ణయాన్ని అక్కడికక్కడే ప్రకటించేసాడు.

“అప్రమత్తంగా ఉండండి యువరాజా! మీకు చెప్పనవసరం లేక పోయినా మా ధర్మం మేం నెరవేర్చి చెబుతున్నాం. అన్యదా భావించకండి ” అన్న మహామంత్రి పలుకులకు తలపంకించి, లిప్త కాలం తన నేస్తాన్ని పరికించాడు. సమన్వయంతో కూడిన ఆ సైగనే తన చెలికాని ఆనగా స్వీకరించి, దక్షిణ పాదంతో తన గుర్రం డొక్కల్లో నెమ్మదిగా పొడిచాడు కపిల పాత్రుడు. అయినా, కదలేదది.

“ పది ఘడియలుగా పదే పదే దౌడు తీయించాం. దప్పికతో అలమటించిన వీటిని ముందుకు పొమ్మనడం పాడికాదు . తొలుత ఆ కనపడే మడుగులో నీరు తాగిద్దాం” అంటూ తన గుర్రపు కళ్ళాన్ని చేతబట్టి మడుగుకేసి

# కళింగ

## కథ

అడుగు లేసాడు ఖారవేలుడు. చేసిన పనికి చిన్నబోతూ, చిన్ననాటి నేస్తాన్ని అనుసరించాడు కపిలుడు. పట్టుమని పదినూర్ల ధనువుల దూరమైనా సాగలేదు వారి గమనం. నిరంతరం కర్ణభేరిని తాకుతున్న ప్రకంపనలతో, అప్రమత్తంగా ఆగిపోయాడు యువరాజు.

"కపిలా , ఈ గుబురు వృక్షాల వెనుక, దీనంగా రోదిస్తున్న ఆ మూలుగు వినబడడం లేదా నీకు? జాగ్రత్తగా విను. క్రూర మృగాలను మాత్రమే వేటాడడం మన ధర్మమని గుర్తు పెట్టుకో చాలు " అంటూ వేగంగా పొదల మధ్యకి బరిసెతో వెళ్ళిన యువరాజు , ఊహ కందని రీతిలో అంతే వేగంగా, ఇవతలకి వచ్చి పడ్డాడు. గోడకు బలంగా కొట్టిన బంతిలా, తిరిగి రెట్టింపు వేగంతో పల్టీ కొట్టి లేచాడు. ఈ సంఘటనతో అతని చేతిలోని బరిసె ఎక్కడికో ఎగిరిపోయింది.

ఆరున్నర అడుగుల పొడవుతో, లేత పసుపుకీ ముదర పసుపుకీ మధ్యస్థంగా, కారు నలుపు చారలతో, కాటు నలుపు వలయాల తోకను చుట్టబెట్టి భీకరంగా గర్జిస్తూ, గొర్రెపిల్లను నోట గరచి వాయువేగంతో దూసుకొస్తుందో వ్యాఘ్రం. జరుగుతున్న ఘోరాన్ని ఆపలేక, అర క్షణంలో అంతిమ శ్వాస విడిచి పెట్టే దీన వదనంతో, ఆక్రోసించే సంతాల్ జాతికి చెందిన ఆటవికుణ్ని చూస్తూ చలించిపోయాడు యువరాజు. అర రెప్ప పాటులో, అందుబాటులోని చెట్టుకొమ్మ నొకటి విరిచాడు. మూడు తరాల కళింగ ప్రభువులను తీర్చి దిద్దిన 'కాకల్లా గురుదేవుల' పర్యవేక్షణలో, నేర్చిన దండ ప్రయోగ విద్య జ్ఞప్తికి వచ్చింది అతనికి. కొమ్మ పట్టుకొని కదం తొక్కితే , పదునైన ఆయుధం పట్టుకుని వచ్చిన వారెవరైనా పరాజయం పాలు కావల్సిందే. కానీ ఇక్కడ ఉన్నది కొండ గుహలా నోరు తెరచి, కొండను సైతం పదునైన పంజాతో గుండపిండి చేసే, పొగరుబోతు పులి. మెదడు ఇచ్చే సంకేతాల కోసం, సంకోచిస్తూ ఎదురు చూడలేదు అతని దక్షిణ హస్తం. రెప్ప పాటు వ్యవధి గాలిలో నాట్యం చేస్తూ, యమ బంటు బరిశెలా తనలో ఒదిగిన కొమ్మ మొనను, అమిత వేగంతో పులి ఎడమ కంట్లోకి, కసుక్కన దింపేసిం ది.

దిక్కులు పిక్కటిల్లేలా, గుండెలవిసే గాండ్రింపుతో కూలబడిందా వ్యాఘ్రం. ఆ అద్భుత ఘడియల్ని వృధా పోనివ్వ లేదు యువరాజు. పదునైన ఖడ్గంగా మారిన తన దక్షిణ హస్తాన్ని పులి మెడపై పలు మార్లు మెరుపు వేగంతో సంధించాడు. వృధా పోలేదు కాకల్లా గురుదేవుల కఠోర శిక్షణ. ఆయుధాలు లేకుండా, కరచరణాలతో ఆత్మ రక్షణ చేసుకుంటూ, అవతలి వ్యక్తిని అవలీలగా పడగొట్టే అతి పురాతనమైన, బౌద్ధ భిక్షువులు ఆత్మ రక్షణ కోసం వాడిన మర్మ విద్య అది. ఆచరించేది జైన మయినా, బౌద్ధం లోని సుగుణాలనూ ఒదిలిపెట్టలేదతను. నూరు గొడ్లను తిన్న రాబందు అన్నట్టు.. ఊహించని పోరాటంలో ఊపిరి వదిలేసి, శిరసు వాల్చేసింది వ్యాఘ్రం.

"దండాలయ్య , దండాలు. నా గొర్రి కూనను రచ్చించినారు. మీరెవరో, మీమేలు కాటికెల్లే దాకా మరవను" అంటూ మొక్కుతున్న ఆటవికుణ్ని చిరునవ్వుతో సాగనంపాడు ఖారవేలుడు. ఈ ఉదంతం సృష్టించిన శబ్దంతో, అర పావుఘడియలో సైనిక పటాలంతో అక్కడ వాలిపోయాడు మహామంత్రి.

★★★

క్రీ.పూ. 261 వ సంవత్సరంలో, తన పాలనలో ఎనిమిదో ఏట అనంత పద్మనాభుడితో జరిగిన భీకర కళింగ యుద్ధంలోని విజయం తర్వాత , మౌర్య చక్రవర్తి అశోకుడు, బౌద్ధ మతం స్వీకరించి శాంతి కాముకుడుగా మారినా, అంతకు ముందు కళింగులను ఓడించి ఊరుకోలేదు. వేయి నూర్ల ప్రాణాలను హరించి కూడా, సంతృప్తి పడలేదు. ఎనెన్నో జైన దేవాలయాలను, విగ్రహాలను ధ్వంసం చేసాడు. మరి కొన్నింటిని రాజ గృహకు [పాటలీ పుత్రం] తరలించాడు. వాటిలో కళింగ ప్రభువులకు అత్యంత ప్రీతిపాత్రమైన కళింగ జిన [జైన దేవుని విగ్రహం] ఒకటి. ఆ ఉదంతం తమ సంస్కృతికి మాయని మచ్చగా మిగిలిపోయిందని భావించేవారు

# కళింగ

కథ

కళింగ ప్రజలు. ఆ సమయంలోనే మగధకు అనుకూలంగా కళింగకు తూర్పున ఉన్న తోసాలిని కళింగకు రాజధానిగా అశోకుడు మార్చడమన్నది మరో కథ.

తమ ప్రభువు అనంతపద్మనాభుడు అశోకునికి అంత సులువుగా లొంగిపోలేదని, తదనంతరం కళింగ నధిష్టించిన ప్రభువులందరికీ తెలుసు. ఈ అవమాన భారం నిరంతరం వారి మదిలో మెదులుతూ ఉన్నా, ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నా, మగధ చక్రవర్తుల శౌర్యం ముందు తలవంచక తప్పలేదు ఇంతవరకూ. ఇవన్నీ నిత్యం ఆ జాతి మదిలో అగ్నిహోత్రంలా రగులుతూనే ఉంటాయి. ఈ సెగ దావానలం పాకినట్టు, వారసులందరికీ అంటుకుంటూనే ఉంటుంది ఆజ్యం పోసినప్పుడల్లా.

" జయము ప్రభూ, మహామంత్రి తమరి కోసం వేంచేశారు" అంటూ ప్రతీహరి సందేశం తెచ్చాడు.

" తక్షణమే ప్రవేశపెట్టు" అంటూ అనుజ్ఞ ఇచ్చాడు మహామేఘ వాహన సేతక చక్రవర్తి.

" చక్రవర్తులకు జయము" అంటూ చక్రవర్తి అనుజ్ఞతో ఆసనంలో కూర్చున్నాడు మహామంత్రి. చక్రవర్తి గత కొన్ని రోజులుగా దేనికో మధనపడుతున్నట్టు గ్రహించాడు మహామంత్రి రాజమతియ మహామాత్రులు.



" చక్రవర్తులు మన్నించాలి. నాకో సందేహం ఉన్నది. తీర్చుకోమంటారా ప్రభూ?"

"నిస్సందేహంగా.. తమరి మార్గదర్శకత్వంలో ఈ కళింగమున్నది" మందహాసం చిలికించాడు మహారాజు

"గత పక్షంలో సదుపత్ర అరణ్యంలో యువరాజుల పరాక్రమం చూచిన మన సైన్యం అంతా పులకరించి పోయింది మహారాజా. మిమ్మల్ని మించిన వీరులుగా మన యువరాజులు అవతరించారానడంలో మాకు ఎలాంటి సందేహమూ లేదు. వారు స్వయంగా సంగీత, నృత్య, గానాలలో అగ్రగణ్యులు. ధర్మనిరతులు. యువరాణి లకుమి దేవి, యువరాజు ఖారవేలుల వారి జాతకం చూచి, మీకు త్వరలో పౌత్రుడు ఉదయిస్తాడని, మన ఆస్థాన జ్యోతిష్యులు ఆశీర్వదించడం..అన్నీ శుభ సూచకములే .. "

ఇంతలో యువరాజులు తమ దర్శనం కోసం ఎదురుచూస్తున్నారన్న వార్త విన్న వెంటనే, ఆ సంభాషణ తాత్కాలికంగా అక్కడితో ఆగిపోయింది. తరవాత యువరాజు ఖారవేలుడితో సమావేశం అయ్యారిద్దరూ. రాజకీయ విషయాలతో బాటు,

# కళింగ

కథ

ప్రజల గుండెల్లో ఆసీనులైన యువరాజుకు సింహాసనం అప్పగించాలనే తన ఇచ్ఛను బహిరంగపరిచాడు చక్రవర్తి. అందరి సమ్మతితో అందుకు ముహూర్తం కూడా అప్పటికప్పుడు పెట్టించడం జరగడంతో రాజధానిలో సంబరాలు అంబరాన్నంటాయి.

★★★

పుష్కర కాలం ముగుస్తూ ఉంది ఖారవేలుని పాలన. ఆ రోజు విజయ దశమి. రాజధానిలో ఆ రోజు జరిగే ఉత్సవాలకు కళింగలోని ప్రాంతాధిపతులందరికీ ఆహ్వానాలు వెళ్ళాయి. కళింగ ప్రభువు స్వయంగా జైనుడైనా, ఆ తారతమ్యం లేకుండా అంగరంగ వైభవంగా మతసామరస్యంతో జైన, బౌద్ధ, హిందూ ఉత్సవాలన్నీ రాజధానిలోని వాడవాడలా జరిగాయి. అటువంటి శుభ సందర్భంలో జరిగిన దురంతం రాజధానిని మొత్తం కుదిపేసింది. నిండు పేరోలగంలో ఆసీనులైన ఖారవేల చక్రవర్తిపై జరిగిన దాడి కళింగం మొత్తాన్ని కుదిపేసింది. ఈ వార్త దావానలంలా రాజ్యాలకు పాకింది.

ఆ దాడి జరిపింది తరతరాల నుండి చక్రవర్తి కుటుంబానికి విధేయులైన విష్ణుగోపుల వారి కుటుంబంలోని వ్యక్తి, భద్రసేనుడు కావడం విశేషం. పైగా అతను చక్రవర్తుల వారికి సహాధ్యాయి కావడం ఇంకో విశేషం అయితే, అతను విసిరిన గరళం పూసిన చురికకు అడ్డు వచ్చి రక్షక భటుడు మరణించడం మరో విశేషం. దానితో అప్పటికప్పుడు విచారణకు రంగం సిద్ధం అయింది.

“ భద్రసేనా! మీ కుటుంబం తరతరాలుగా దేశభక్తులు. భద్రసేనుడనే నామానికి చేటు తెచ్చి, కళింగ భద్రతకు ముప్పు తెచ్చావు. రాజద్రోహానికి సరైన శిక్ష మరణ దండనే. బహిరంగంగా జరిగిన ఈ దాడికి ఇక సాక్షులు సాక్ష్యాలు ఇక అనవసరం.. అయినా అడుగుతున్నాం. చివరిగా నువ్వు చెప్పుకోవాల్సింది ఏదైనా ఉన్నదా?” ప్రశ్నించాడు ఖారవేల చక్రవర్తి.

“ క్షమించండి మహారాజా! మీరు చెప్పింది నిజమే. మా కుటుంబం తరతరాలుగా మిమ్మల్నే సేవిస్తూ ఉంది. అయినా మాకు దక్కినదేముంది. అంతంత మాత్రంగా ఉన్న మా బ్రతుకులకు అర్థం ఏముంది?

“ ద్రోహీ, ఇక అపు. ఇలాంటి అధముణ్ని కారాగారంలో వేసినా, ఆ గది నేరస్తులను ఉంచడానికి కూడా అర్హత కోల్పోతుంది. తక్షణమే వీడిని ఉరితీయండి” మహామంత్రి నిప్పులు కురిపిస్తూ అన్నాడు.

భద్రసేనుడిని పెడరెక్కలు విరిచి పట్టుకొని లాక్కొని బహిరంగంగా ఉరి తీయడానికి రంగం సిద్ధం చేస్తుండగా.. భద్రసేనుడి తండ్రి విష్ణుగోపుడు చక్రవర్తి కాళ్ళపై పడ్డాడు.

“ క్షమించండి ప్రభూ, తరతరాలుగా మా కుటుంబం మీ మేఘ వాహన వంశానికి విశ్వాస పాత్రులమన్న సంగతి ఈ సమస్త ప్రజానీకానికీ తెలిసిందే. అయినా, చేసింది క్షమించరాని రాజ ద్రోహమని నాకు తెలుసు. ఈ తప్పుకు శిక్షను తగ్గించమని కోరడానికి సాహసం చేయలేక పోతున్నాను” అంటూ విష్ణుగోపుడు స్పృహ కోల్పోయాడు. విష్ణుగోపుని సతి విలపిస్తూ, ఆయనపై నీళ్ళు చల్లింది.

సభామందిరం మూగబోయింది. చక్రవర్తి తీర్పు ఏం చెబుతారా అని సభికులలో ఆసక్తి నెలకొంది. కించిత్తు సందిగ్ధంగా మహామంత్రి వైపు చూసాడు ఖారవేలుడు.

“ మహారాజా, దేశబహిష్కరణ మరణంతో సమానం. విష్ణుగోపుని విధేయతను దృష్టిలో పెట్టుకొని, జైన తీర్థంకరుల దయను దృష్టిలో ఉంచుకొని, శిక్షాస్మృతి సూచించినట్లు, ఉరికి సమానమైన బహిష్కరణను అమలు పరచవచ్చు .” అన్నాడు మహామంత్రి రాజమతియ మహామాత్రులు.

చక్రవర్తి ఆమోదం తెలపడంతో, భద్రసేనుని బంధించి అడివిలో క్రూర మృగములు సంచరించే చోట విడిచి వచ్చేసారు భటులు. భటులు కనుమరుగైన వెంటనే

# కళింగ

కథ



అక్కడ ప్రత్యక్షం అయ్యారు మగధ వేగులు.

★★★

పండు వెన్నెల పిల్లగాలితో దోబూచులాడుతూ సరసాలడుతోంది. “ కార్తీకం” దీనికి ప్రత్యేకమయితే రాజగృహాలో ఇది మరీమరీ ప్రత్యేకం. ప్రకృతి ఆహ్లాదంగా ఉన్నా, మౌర్యుని మనసు మనసులో లేదు.

“భారతదేశంలో ఒకప్పుడు ఉత్తరాన హిమాలయాలు, నేపాల్ ప్రాంతం వరకూ, దక్షణాన నర్మదానది వరకూ ఉన్న తన ఏలుబడిని దక్షిణ భారతం చివరకు, తూర్పున బంగాళాఖాతం వరకూ, పశ్చిమాన సింధునది, బలూచిస్తాన్ వరకూ విస్తరించిన మగధను, కనుసన్నలతో శాసించిన అశోక చక్రవర్తికి వారసుడా తను. దిన దినం మసకబారుతున్న తమ ప్రభను పునరుజ్జీవనం చేసుకొనే శక్తి, ఇక తనకు లేదా” అనుకున్న శుంగ రాజ వంశస్తుడు, మౌర్య చక్రవర్తి బహసతిమితుని మదిలోని అందోళన రోజురోజుకూ రెట్టింపు అవుతూ ఉంటే.. ఒకనాడు ..

“ ప్రభూ, మన వేగులిద్దరు సత్వరం మిమ్మల్ని కలవాలని తపిస్తున్నారు” అంటూ సమాచారం చేరవేసాడు ప్రతీహారి.

చక్రవర్తి ఆజ్ఞతో, కళింగ నుండి వచ్చిన వేగులు, అక్కడ సేకరించిన సమస్త సమాచారాన్ని పూసగుచ్చినట్టు వివరించి, బంధింపబడిన భద్రసేనుణ్ణి ముందుకు తోసారు. మరుక్షణం మహా మంత్రులను రప్పించి మంత్రాంగం జరిపాడు చక్రవర్తి. సామంతులందరూ దిక్కరించి స్వతంత్రులౌతున్న ఈ తరుణంలో, శక్తివంతమైన కళింగ రూపంలో, అంది వచ్చిన ఈ అవకాశాన్ని కాలరాసే మూర్ఖులు కారు వారు. భద్రసేనుని పలు రకాలు ప్రశ్నించి, అక్కడి పరిస్తితులను క్షుణ్ణంగా ఒడిసిపట్టారు. మరికొద్ది నెలలలో, తాము జరపబోయే కార్యాచరణకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇక్కడున్న బలహీనతలను సమీక్షించి, తిరిగి అదే భద్రసేనుని కళింగపై ప్రయోగించి ఫలితం రాబట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.



# కళింగ

కథ

★★★

కార్తీకం పోయి మార్గశిరం తిరిగింది. దహనము హితమయ్యి, రాత్రులు దీర్ఘదశలుగా మారుతున్న ఆ తరుణంలో, చలిపులికి గజగజా వణికి పోతూ ఉంది కళింగమంతా. అటువంటి సమయంలో, కళింగలో ప్రధాన సైనికాధికారులు, మంత్రులతో ఏర్పాటైంది సమావేశం. ఓ పక్కన ఖారవేల చక్రవర్తి, మరోపక్క మహామాత్యులు ఆసీనులైతే, సమావేశాన్ని ఉద్దేశించి చక్రవర్తి చివరిగా మాట్లాడుతూ..

“ మేము సింహాసనం అధిష్ఠించి, ఇప్పటివరకూ చేసిన దండయాత్రలలో పాండ్య, చోళుల వంటి రాజులెందరో లొంగి పోయారు. తమిళ రాజుల సమాఖ్య విచ్ఛిన్నం అయింది. శాతవాహనుల సరిహద్దుల వరకూ మన జైత్ర యాత్ర కొనసాగింది. మన ప్రతాపానికి యవన రాజు డెమెట్రియస్ పలాయనం చిత్తగించాడు. అలాగే తుఫానుల వల్ల దెబ్బ తిన్న మన రాజధానిని భారీ సొత్తుతో పునర్నిర్మించాం. పురాతన చేది రాజుల ప్రతిష్ఠ పెంచాం. కళింగ నగరంలో ఖిబిరా రిషి సరస్సు, మహా విజయ అనే రాజభవన నిర్మాణం జరిగింది. వాస్తుశిల్పులకు పాఠశాలలేర్పరిచాం. సంగీత, నృత్య గానాలను ప్రోత్సహించాం. ప్రజలకు సమస్త సౌకర్యాలు కల్పించాం. ఇంత జరిగినా ..

“ఇన్నేళ్ళయినా, జరిగిన ‘ ఆ’ అవమానాన్ని ఎన్నడూ మర్చిపోలేం. మన ప్రధాన శత్రువు మగధకు బుద్ధి చెప్పి, మన సంస్కృతికి మూల విరాట్టయిన, మనకత్యంత ప్రీతిపాత్రమైన “ కళింగ జిన” [జైన దేవుని విగ్రహం] ను తీసుకొచ్చి కళింగలో ప్రతిష్ఠించే ఆ సమయం ఆసన్నం అయింది. ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయని మీరు చెబుతున్న పల్కులు మాకు ఎనలేని సంతోషాన్ని కల్గిస్తున్నాయి. రాబోయే రెండు మాసాలు మనకు అత్యంత కీలకం. కొద్ది నెలల్లో మనం బయలు దేరబోతున్నాం” అంటూ చక్రవర్తి ఆ సమావేశానికి ముక్తాయింపు నిచ్చాడు.

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెలికి తీసి, వాటిని మగధకు చేరవేయడానికి మగధ వేగులు తక్షణమే బయలుదేరితే, వారిలో ముఖ్యుడు మారువేషంలో ఉన్న భద్రసేనుడు.

సమావేశంలో “కొద్ది నెలల్లో” అని చెప్పినా, ఆ మర్నాడే లక్ష కాల్బలంతో, వేలాది రథ గజ తురగ బలాలతో మగధలోని రాజ గృహ దిశగా, కళింగ బలగం పయనం కొనసాగింది.

అది క్రీ.పూ. 180 వ సం. సుమారు 72 యోజనాల దూరం ప్రయాణించి కళింగ నుండి పయనించిన ఖారవేలుని బలగం ఉత్తర భారతంలోని మౌర్యుల రాజదాని రాజధాని రాజగృహ [ గిరి వ్రజ ] సమీపంలో అడుగు పెట్టింది. ఈ నగరం ప్రకృతిసిద్ధమైన పర్వతాలతో చుట్టబడి ఉండడంతో అవి రక్షణకవచంలా ఉండేవి. [ ఆ తర్వాత రాజధానిని పాటలీ పుత్రానికి మార్చారు ]

గిరివ్రజానికి పొలిమేరలో ఖారవేలుడు ఏర్పాటు చేసిన గుడారాలలో సందడి నెలకొని ఉంది. సైన్యం అంతా సైన్యాధిపతుల, దళాధిపతుల పర్యవేక్షణలో విభజింపబడి ఉంది. సమన్వయ కర్తగా మహామత్యులు రాజ మతియల వారు తలమునకలై ఉన్నారు. లక్షమంది పదాతి సైన్యంతో, పాతిక వేల ఆశ్వదళంతో, ఏడొందల ఏనుగులతో విడిది చేసిన ఆ ప్రదేశం, ఓ మహా సాగరాన్ని తలపిస్తూ ఉంది. ఆ చిక్కటి నిశిలో, సైనికుల శిబిరాలన్నీ ఎరండ తైల కాంతితో ఓ జానపదాన్ని తలపిస్తున్నాయి. శంఖాలు, కొమ్ము బూరలు, బెరడ మద్దెలూ మ్రోగుతూ శత్రువులకు భీతి గొల్పుతున్నాయి. ఆ గుడారాల మధ్య సుశిక్షితులైన, సైనికులు కాపాలా కాస్తున్న గుడారమొకటి ఎర్రటిపట్టు వస్త్రాల కప్పుతో, స్వర్ణ వర్ణంతో వజ్రకిరీటంలా శోభిస్తున్న కళింగ చిహ్నం కరి పతాకంతో, రెపరెప లాడుతూ ఉంది.

ఆ గుడారం లోపలి గోడలు సువాసనా ద్రవ్యాలతో పూసిన వస్త్రాలతో, దేవతా చిత్రాలతో

# కళింగ

కథ

అలంకరించ బడి ఉన్నాయి. దీప స్తంభాలలో, సుగంధ ద్రవ్యాలతో నిండిన నువ్వుల నూనె నిండి ఉంది. వాటికి సమీపంలో కళింగాధిపతి స్వర్ణకిరీటధారి ఖారవేల చక్రవర్తి , అయన చెంత రాజమతియ మహామత్యులు మంత్రాంగంలో మునిగి ఉన్నారు. ఎదురుగా తూర్య వాద్య సంగీతం మంద్రస్థాయిలో వినిపిస్తుంటే, అనుగుణంగా గాయకులు తీర్థంకరుల గుణాలను కీర్తించే శాస్త్రీయ గానం ఆలపిస్తున్నారు.

మగధ ఇది వరకున్నట్టు కాకుండా, బాగా బలహీన పడిందని, దానికి తోడు సామంతులు స్వతంత్రులైనారన్న వేగుల నిరంతర సమాచారం, ఎంతో ఉపశమనం కల్గిస్తూ ఉంది ఖారవేలునికి.

★★★

మూడు ఘడియల క్రితం అందిన వేగుల సమహచరంతో ఉలిక్కి పడ్డాడు మౌర్య చక్రవర్తి. గిరి శేఖరం మీదనుండి దూరదర్శి స్తంభం మీద నుండి మహాసైన్యాన్ని గాంచిన మౌర్య చక్రవర్తి బహసతిమితుడి గుండె బేజారయ్యింది. తనకు మూడురోజుల క్రితం పలువురు వేగులు మరీ ముఖ్యంగా భద్రసేనుడు అందించిన వర్తమానం వేరు, ఇప్పుడు ఎదురుగా చూస్తున్న వాస్తవం వేరు. తమ పరిస్తితి గతంలోలా లేదు, అత్యంత బలహీనంగా ఉంది. ఎక్కువ మంది సామంతులు ఎదురుతిరిగి స్వతంత్రం ప్రకటించు కున్నారు. ఉన్న అతి కొద్ది మందినీ కబురుపెట్టినా, వారు రావడానికి చాలా సమయం పడుతుంది. సైనికుల జీత భత్యాలు ఇవ్వడమే కష్టంగా మారిన ఈ తరుణంలో ఈ విపత్తు ఏమిటి? అప్పటివరకూ మగధను తప్పుదోవ పట్టించిన భద్రసేనుడు, తిరిగి ఖారవేలుని చేరుకోవడంతో ఖంగు తిన్నాడు చక్రవర్తి బహసతిమితుడు. కళ్ళముందు మగధ గత వైభవం కుప్పకూలే పరిస్థతి కనబడుతుంటే, తలపట్టుకున్నాడు మగధ చక్రవర్తి. ఇక సంధియే శరణ్యమనే నిశ్చయానికి ఒచ్చేసాడు. గత్యంతరం లేని పరిస్తితుల్లో, ఆ నిర్ణయాన్నే సమర్ధించారు మంత్రులు. ఈలోగా కొందరు సైనికాధికారులు వైరి పక్షం చేరడంతో, అంతంత మాత్రంగా ఉన్న ప్రతిఘటన కొద్ది ఘడియాల్లో ముగిసింది. ఇక గత్యంతరం లేక మగధ చక్రవర్తి రహస్య బిలం ద్వారా పలాయనం చిత్తగించాడు.

మగధను చాకచక్యంగా ఎరవేసి పట్టుకోవడంలో విజయం సాధించాడు కళింగ చక్రవర్తి. భద్రసేనుడనే వేగుతో మరికొందరి నమ్మకస్తుల సహకారంతో అప్పటివరకూ ఆడిన నాటకం రక్తికట్టింది. దానికి ప్రతిఫలంగా కళింగుల ఆరాధ్య దైవం జైన దేవుడి విగ్రహం తిరిగి మగధకు చేరింది. కొన్ని దశాబ్దాల కళింగుల నరకయాతనకు తెర పడింది. అది భద్రసేనుని ప్రాంతీయాధిపతిని చేసింది.

“ప్రజలారా, తరతరాలుగా మనం అనుభవించిన నరకానికి ముగింపు పలికాం. మన జైన దేవుని ప్రతిమను తిరిగి తీసుకొచ్చి మన ప్రతిష్టను ప్రతిష్టించాం. మన సంస్కృతికి ఆలవాలమైన మన విజయాలను, రాబోయే తరతరాలకు తెల్పడానికి గోరాధ గిరిని [ ఇప్పటి ఉదయగిరి, ఖండగిరులు ] తవ్వించి ఆ గుహలలో జైన మఠాలను స్థాపిస్తాం. అవి శిల్పకళలకు కాణాచిగా నిలుస్తాయి. ఇక్కడే మన సమస్త చరితనూ తెలిపే “హాథిగుమ్ఫా” శాసనాన్ని అర్ధమాగధ ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో రూపొందిస్తాం ...” ఖారవేలుని పల్కులకు సమస్త కళింగ ప్రజానీకం పులకరించింది. మలయ మారుతం పలకరించింది. మహానది తీయని జలధారలతో జైన దేవుణ్ణి అభిషేకించింది. కళింగం సేదదీరింది.

★★★★సమాప్తం ★★★



# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి

కామెడి సీరియల్



అలేఖ్య

“ ఒరేయ్ నాతో రా, వాళ్ళతో పాటు మనము ముందుకు వెళ్దాం ..” అంటూ తాతారావుని పిలిచారు వర్లు గారు

“ వాళ్ళ తోపాటు వెళ్తాము సరే , మన చేతకూడా సంత కాలు చేయిస్తే ..” అంటూ అనుమానం లేవదీశాడు తాత రావు .

“ అలగంటవా ..అలా అయితే ఓ పని చేద్దాం ..అంతగా సంతకం చెయ్యాల్సి వస్తే , తిక్కిరి బిక్కిరి గా ఎదో ఒకటి కోడి గెలికి నట్టు గెలుకు” అన్నారు వర్లు గారు

” సరే పద పోతే ఇద్దరివి పోతై ..” అని గొణుక్కుంటూ తాతారావు వర్లు గారి వెనకాలే నడుచుకుంటూ వెళ్లి క్యూ లో వెళ్లి నిలుచున్నారు .

ఒక్కక్కరుగా చిన్నగా కదులుతున్నారు ..ఇంకో ఇద్దరు కదిలితే వర్లు గారి వంతు వస్తుంది .



# పంచవటి ఓ పదిళ్ళ లోగిలి

**జరిగిన కథ**

ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉండి ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . కోబ్రా పేరుతో కోసి నది పరివాహక ప్రాంతంలో కట్టిన ఇళ్ళను కులగాడతారు మాహనగర్ మునిసిపాలిటి వాళ్ళు .పేదవాళ్ళు శంకరం దగ్గరకొస్తారు కేసు వాదించమని . సి .ఎం స్వామిజి గురించి ఆరా తీస్తాడు .స్వామిజి సిటిలో పెద్ద సభకు ప్లాన్ చేస్తాడు .స్వామిజి హోమం జరిగే ప్రదేశం లోకి దొంగ చాటుగా ప్రవేశిస్తారు వర్లు ,తాతారావు లు .శంకరం కుడా వెనక నుంచి ప్రవేశిస్తాడు .

**ఇక చదవండి**

ఈలోపు పెద్దగా అలారం మోగటం తో ..స్వామీజీ గబగబా లేచి నలుగురు శిష్యులు వెంట రాగ అక్కడనుంచి లోపలి కి వెళ్ళిపోయారు . ఆ హఠాత్ పరిణామానికి అక్కడ పెద్ద కలకలం బయలు దేరింది .ఎక్కడివాళ్లు అక్కడే నిలబడి పోయారు ఏమి జరుగుతుందో అర్ధం కాక .

ఆ మందిరానికి ఉన్న తలుపులన్నీ మూసేసారు స్వామీజీ శిష్యులు .

" భక్తులందరూ ఎక్కడి వాళ్ళు అక్కడే కూర్చోవాలి . అనుకోకుండా ఒక చిన్న అవాంతరం వచ్చింది .మీలో ఒకతను స్వామిజి మీద దాడి చెయ్యాలని వచ్చాడు . అతనెవరో బయటకు వస్తే సరే సరి లేకపోతే మేమే అతన్ని గుర్తించి పట్టుకుంటాము "అంటూ మైకులో అనౌన్సు చేస్తున్నారు

ఆ గొంతు స్వామిజి ప్రియ శిష్యుడు శరత్ ది .

ఆ మాటలు విన్న అక్కడి భక్తులందరూ ఒకరి మొఖాలు ఒఖరు చూసుకుంటూ , దొంగ ఎవరి ఉంటారు అని చర్చించు కోసాగారు .

"కొంపదీసి తను లోపలి రావటం తెలిసిపోయిందా "అని శంకరానికి అనుమానం వచ్చింది . వాళ్ళు తనని పట్టుకునే లోపే అక్కడనుంచి ఎదో ఒకలా బయటపడాలి అని ఆలోచనలో పడ్డాడు .

ఈ లోపు ఒక భక్తుడు ఫిట్స్ వచ్చి కింద పది గిల గిలా కొట్టు కోవటం మొదలు పెట్టాడు .

అతని పరిస్థితి చూసి జాలివేసిన కొంతమంది ,అతన్ని బయటకు తీసుకెళ్ళాలి తలుపులు తెరవండి అని భక్తులు అరవటం మొదలు పెట్టారు .

ఆ అరిచే భక్తుల మీద స్వామీజీ శిష్యులు

# పంచవటి ఓ పదిళ్ళ లోగిలి

మండి పడుతుడుతూ
అరుస్తున్నారు .
స్వామీజీ శిష్యుల అరుపులు
భక్తుల ఆక్రందనల తో
అక్కడ అసలు ఏమి
జరుగుతుందో కుడా
తెలియట్లేదు ఎవ్వరికి .

ఇదే అదను అని శంకరం
, తలుపులకు అడ్డంగా
ఉన్న స్వామీజీ శిష్యులను
తోసేసి తలుపులు తీసుకుని
బయటపడ్డాడు .శంకరం
వెనకాలే మిగిలిన భక్తులు
కుడా బయటకు పరిగెత్తారు
.
అంతా క్షణాల్లో
జరిగిపోవటం తో స్వామీజీ
శిష్యులు ఏమి చెయ్యలేక
చూస్తూ ఉంది పోయారు .

ఇదే సందని వర్మ గారు
,తాతారావు అక్కడ
టేబుల్ మీద ఇంతకు
క్రితం భక్తులు సంతకాలు
చేసిన కాగితలన్నిటిని
చేత పట్టుకుని బయటకు
పరిగెడుతున్న గుంపులో
కల్సిపోయారు

పది నిమిషాల్లో ఆ
మందిరం లో స్వామీజీ
శిష్యులు తప్ప ఎవ్వరు
కనపడలేదు .ఫిట్స్ వచ్చిన
అతను కుడా అక్కడ లేదు .

అదంతా చూస్తే ఎవరో
ముందుగానే అనుకుని
ఆడిన నాటకం
లా అనిపించింది
అక్కడున్నవాల్లకి

★★★

“ఒరేయ్ మొత్తానికి మన
పట్ల దేవుడున్నాడు కాబట్టి
బయట పడ్డాము లేకపోతే
ఇవాళ వాళ్ళ చేతుల్లో చిక్కి
ప్రాణాలు పోగొట్టుకునే
వాళ్ళం “ ఆయాస పడ్తుతూ
అన్నాడు తాతారావు

“వాళ్ళ మొఖం వాళ్ళేమి
చేస్తారు కాని ...వాళ్ళకు
కాగితాలు మిస్ అయ్యాయి
అని తెలిసేలోపే మనం
త్వరగా ఇంటికి చేరుకోవాలి
“ అంటూ వర్మ గారు
అటుగా వస్తున్న ఓ ఆటో ని
ఆపి లోపలి దుకినంత పని
చేసారు .వెనకే తాతారావు
కూడా లోపలి దూకాడు

వాళ్ళ వాలకం చూసి అటో
తను ఆశ్చర్య పోయాడు
“ఎక్కడికి వెళ్ళాలి సార్ “
అంటూ అడిగాడు

“పంచవటి కాలానికి
..” అంటూ అరిచినంత
పనిచేసాడు తాతారావు

“ లేదు లేదు పెద్దమ్మ తల్లి
గుడికి పోనీ అన్నారు వర్మ
గారు ..”

“ఇప్పుడు అక్కడికేందుకు
రా ..” అంటూ



# పంచవటి ఓ పదిళ్ళ లోగిలి

అయోమయంగా చూసారు తాతారావు

" కాసేపు నువ్వు నోరుముసుకో ..బాబు నువ్వు పెద్దమ్మ తల్లి గుడికి పోనీ " అంటూ అటో అతన్ని తొందర పెట్టాడు వర్లు గారు

ఓ పదినిమిషాల తరువాత అటో పెద్దమ్మ తల్లి గుడి ముందు ఆగింది .

అటో అతనికి డబ్బులు ఇచ్చేసి వర్లు గారు వాడి వాడిగా అడుగులు వేసుకుంటూ గుడి లోపలి అడుగు పెట్టారు .

ఏమి అర్ధం కాని తాతారావు చేసేది ఏమి లేకా వర్లు గారి ని  అనుసరించాడు .

(ఇంకా ఉంది )

## ఎడమ చేతితో చేసే పనులు, పెట్టిన వస్తువులు గుర్తుండవా?

'ఎడమ చేత్తో పెట్టిన వస్తువులు గుర్తుండవు' అని మనం తరచూ వింటుంటాం. ఇది నిజమా? లేక అపోహనా? కుడి చేయిని ప్రధాన చేయిగా చూడటం చాలాకాలంగా ఉంది. తినడం, రాయడం, శుభకార్యాలు చేయడం... ఇవన్నీ ఎక్కువగా కుడి చేత్తోనే చేస్తుంటాం. అందుకే కుడి చేత్తో చేసే పనులు గొప్పవి, ఎడమ చేత్తో చేసే పనులు తక్కువ అన్న భావన పాతుకుపోయింది. ఈ నేపథ్యంలోనే ఎడమ చేత్తో పెట్టిన వస్తువులు మర్చిపోతామనే నమ్మకం కూడా ఏర్పడింది. మనలో కుడి చేతివాటం వారు ఎక్కువగా ఉంటారు. పదే పదే కుడి చేత్తో చేసే పనులు మైండ్‌లో రిజిస్టర్ అయిపోతాయి. రోజూ చేసే ఒక పనిపట్ల అంటే తాళాలు ఒకచోట పెట్టడం వంటివి చేసినప్పుడు... ఆ చేతికి, ఆ పనికి మధ్య మెదడులో బంధం ఏర్పడి, లాంగ్ టర్మ్ మెమరీ ఏర్పడుతుంది. కానీ, ఆ పనిని అనుకోకుండా ఎడమ చేత్తో చేసినప్పుడు... ఆ పనికి, ఆ చేతికి మధ్య మెదడులో బంధం ఉండదు. దాంతో, ఆ పని వెంటనే గుర్తుకు రాదు. దాన్ని గుర్తు పెట్టుకునేందుకు శ్రమను తీసుకోవాల్సి వస్తుంది. పెట్టిన వస్తువు తిరిగి వెతికినప్పుడు, దానిని గుర్తుకు తెచ్చుకునేందుకు మనం తీసుకునే సమయాన్నే... ఆ వస్తువుని 'మర్చిపోయిన సమయం'గా చెప్పవచ్చు. సహజంగా మనకు ఏ చేయి అలవాటు ఉంటుందో...ఆ చేతినే ఎక్కువగా వాడతాం. దాన్నే డామినెంట్ హ్యాండ్ అంటారు. కుడి చేతివాటం ఉన్నవాళ్లు కుడి చేత్తోనే.. ఎడమ చేతి వాటం ఉన్నవాళ్లు ఎడమ చేత్తోనే పనులు చేస్తుంటారు. అది సహజంగా జరుగుతుంది. ఏదైనా సందర్భంలో రోజూ కుడి చేతితో చేసే పనిని ఎడమ చేత్తో, ఎడమ చేతితో చేసే పనిని కుడి చేత్తో చేస్తే... తిరిగి ఆ పనిని గుర్తు తెచ్చుకోవడానికి సమయం పడుతుంది. కుడి చేతి వాటం ఉన్న వాళ్లు ఎడమ చేత్తో వస్తువు పెట్టినప్పుడు...తర్వాత దాన్ని వెతికితే 'ఏమయ్యిందో గుర్తు రావడం లేదు' అనే భావన కలుగుతుంది. దీనికి కారణం చేతివాటం కాదు. దృష్టి లోపం

# "అసలైన నేను "



ఈ శ్రీనివాస రెడ్డి

అందరు అనుకునే అనామకుడిని
నేను కాదు
అందరికి అందంగా కనపడాలి అనుకునే
దురాశాపరుడుని నేను కాదు
నేను నేనుగా మిగలాలి అనుకునే
నేనే అసలైనా నేను

నాలో నేను ఒక్కడ్నే ఉన్నాననుకున్నా కాని
నేను కాని నేనూలు అనేకులుగా
దెయ్యాల్లా నా దేహాన్ని ఆవహించి
అనుక్షణం నన్ను నాకు కాకుండా చేస్తున్నారు


అవసరానికో అనేకుడు పుట్టుకొస్తూ
గుడ్డేల్ని గునపాలతో ఛిద్రం చేస్తూ
నన్ను ముక్కలు ముక్కలు చేస్తున్నారు
నాకు నేనే అపరిచితుడిలా అగుపిస్తున్నాను

పగిలిన ముక్కల్ని అతికించుకుంటూ
తెగిన బంధాలను గట్టిగా ముడి వేసుకుంటూ
చెరిపేసిన ఆనవాళ్ళను గుర్తు చేసుకుంటూ
నాలోని ఖాళీతనాన్ని మళ్ళీ పురించుకుంటున్నా

పదే పదే పగిలి పోకుండా జాగ్రత్త పడతున్నా
కోరికలు అవసరాలు తగ్గించుకుంటున్నా
నన్నునేను విడిపోకుండా చూసుకుంటున్నా
ఇక ఎప్పటికి నాలో నేనే నిండి ఉంటా!

# " సప్తస్వరాల సత్యగీత "

**బహుమతి పొందిన కవిత**



డా.ఎం .ప్రణతి

"రక్త చంద్రుని కింద, మధుర రాగము గగనమును చీల్చెను,"
శిల వేదముల గుండెలో, రహస్య విత్తనము వేళ్లూనెను.
దేవాలయ గోపురాలు గాలి తాకిడిలో నిద్రలేచెను,
వీణా స్వరములో విరహం కన్నీరు జల జలమంటెను.

రాజకుమారుడు రామవర్మ, రథముపై మేఘముల వలె
దూసుకెళ్ళెను,
ష్ణవేణి తీరముపై తన హృదయం బంధములు విప్పుకొనెను.
ఒక తారక కన్నులలో స్వప్నాల దీపములు వెలిగెను,
కానీ ఆ వెలుగు వెంటనే యుద్ధం నీడలలో మునిగెను.

స్నేహం అనుకున్న వారు, ఖడ్గమును ఎత్తి ముందుకు నడిచెరు,
ప్రేమించిన హృదయం, ప్రతీకారముతో నిండిపోయెను.
రక్తరంగు నేలపై కత్తుల గానం వినిపించెను,
కన్నీరు, చెమట, రక్తం —— ఒకే పాత్రలో కలిసెను.

అయితే, చీకటి గుహలో ఒక ముని ఎదురు నిలిచెను,
తన కళ్ళలో యుగాల జ్ఞానం, మాటలో దివ్య సత్యములు వెలిగెను.
"ఏడు స్వరాలే నీ ప్రాణదీపము రక్షించును,"
"అవి వినినవాడె శాంతి సత్యమునకు పుత్రుడవును." అని హితము
పలికెను.
రామవర్మ సప్తస్వరాల యాత్ర మొదలెట్టెను,
ఆద్య స్వరం – ధైర్యం,
ద్వితీయం – క్షమ,
తృతీయం – ప్రేమ,
చతుర్థం – కరుణ,
పంచమం – నమ్మకం,
షష్ఠం – సత్యం,
సప్తమం – శాంతి.
ప్రతీ స్వరము సేకరించగా శత్రువులు స్నేహమయ్యెరు,
వంచనలో దాగిన గాయములు మానెను.
చివరి స్వరమునకు లోకము తలవంచెను,
ద్వేషపు గోడలు కూలి, హృదయాలు మళ్లీ కలిసెను.
మార్మికం:
సప్తరాగాల సామరస్యమే శాశ్వత గానం,
ప్రేమ, క్షమలు దానికి సహగానం.
ద్వేషం మానవుని విరిచెను,
కానీ రాగములోని ఐక్యతే మళ్లీ కలిపెను.

# అవగాహన

## నిమ్మరసం, తేనె కలిపిన నీళ్లు దగ్గు మందుగా పనిచేస్తాయి ....



డా.. మణికంఠ రెడ్డి

పాఠకులు తమ సందేహాలు ,ప్రశ్నలును
sumathi.doctorsalahalu@gmail.com కు పంపవచ్చు.

చాలామందికి శీతాకాలంలో దగ్గు రావడం సహజమే. దగ్గు వచ్చినప్పుడు వెంటనే మందులు వాడకుండా.. దానంతటదే తగ్గేందుకు కొద్దిగా సమయం ఇవ్వాలి, నీళ్లు తాగుతూ ఉండాలి.

ఖరీదైన దగ్గు మందులు ఇచ్చే ఉపశమనాన్నే తేనె,నిమ్మరసం కలిపిన నీటిని సేవించడం లాంటి చిట్కా వైద్యం కూడా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దగ్గు రాగానే చాలామంది దగ్గు టానిక్‌ల వైపు పరుగులు తీస్తారు. కానీ అవి నిజంగా పనిచేస్తాయా లేదంటే నిమ్మరసం తేనెలాంటి గృహ వైద్యం మంచిదా?

జలుబు లేదా ఫ్లూ వల్ల దగ్గు వస్తుంటుంది. దగ్గు మందులు వైరస్‌లకు పనిచేయవు. కానీ, ఇవి గొంతుకు ఉపశమనం కలిగించి, దగ్గుకు కారణమయ్యే గరగరను తగ్గిస్తాయి.

పొడి దగ్గు అయితే బాల్సమ్ సిరప్, గ్లిసరల్ వంటి స్వీట్ సిరప్‌లు గొంతును తేమగా ఉంచి ఉపశమనాన్ని అందిస్తాయి.

దీనికి పెద్ద ఖరీదైన బ్రాండ్ల మందులను తీసుకోవాల్సిన అవసరం లేదని, ధర తక్కువ ఉండే సాధారణ మందులు కూడా అంతే సమర్థవంతంగా పనిచేసి, ఇబ్బందిని తగ్గిస్తాయని చెప్పారు.

అయితే, కాఫ్ సిరప్ లేబుల్‌పై గమనించాల్సిన అంశం చక్కెర. స్వీట్ సిరప్‌లలో ఇది అధిక మొత్తంలో ఉండే అవకాశం ఉంది.

ఒకవేళ చక్కెర ఆందోళనకరంగా అనిపిస్తే.. చక్కెర కలపని దగ్గు మందులు కూడా ఉంటాయి. ఇవి ఉత్తమమైన ఎంపిక.

దగ్గు మందులలో కొన్ని నిర్దిష్టమైన ''చురుకైన పదార్థాలు'' ఉన్నట్టుగా దగ్గు మందుల కంపెనీలు తరచూ తమ ప్రకటనలలో చెబుతుంటాయి.

ఈ పదార్థాలలో డెక్స్ట్రోమెథోర్ఫన్ ఉంటుంది. ఇది దగ్గును తగ్గిస్తుందని చెబుతుంటారు. కానీ, దీని ప్రభావం చాలా తక్కువ.

అయితే, ఈ మందు మోతాదును సరైన మొత్తంలో తీసుకోవాల్సి ఉంటుంది ,ఎందుకంటే, డెక్స్ట్రోమెథోర్ఫన్ వంటి పదార్థాలు మోతాదుకు మించి తీసుకుంటే, అవి వ్యసనంగా మారతాయి.

ఛాతీలో కఫం ఉంటే... ఛాతీ గట్టిగా, నిండుగా, బిగుతుగా అనిపిస్తుంది.బ్రాంకైటిస్ వంటి ఇతర ఇన్‌ఫెక్షన్ల కారణంగా తరచూ ఇది వస్తుంటుంది. దీనివల్ల, శ్వాసనాళాల్లో వాపు లేదా ముక్కు, సైనస్‌లలో ఎక్కువ చీమిడి ఏర్పడుతుంది.

మందుల షాపుకు వెళ్లి దగ్గు సిరప్‌లు కొనడం సాధారణంగా మారిపోయింది. డైఫెన్‌హైడ్రామైన్

వంటి సెడెటివ్ యాంటిహిస్టమైన్స్ రాత్రిపూట నిద్రపోయేందుకు సహకరిస్తాయి. కానీ, దగ్గును ఆపవు.

థైమ్ లేదా స్కివ్ల్ వంటి మొక్కల నుంచి తీసేవి దగ్గుకు కాస్త సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఆధారాలు ఉన్నాయి.

అయితే, దగ్గు వచ్చిన తర్వాత కొంతకాలం వేచిచూసి, ఆ సమయంలో తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి . పొడి దగ్గుకు ఇంట్లోనే వేడినీటిలో తేనె, నిమ్మరసాన్ని కలిపి తీసుకుంటే, మందుల దుకాణాల్లో కొనే మందుల తరహా ఉపశమనాన్ని అందిస్తుంది.

దగ్గు, జలుబుతో బాధపడే ఏడాది కంటే ఎక్కువ వయసున్న పిల్లలకు తేనె, నిమ్మరసాన్ని కలిపి నీటిని తాగించడం వల్ల కాస్త ఉపశమనం కలుగుతుంది. మన శరీరం నుంచి కఫాన్ని బయటకు పంపేందుకు దగ్గు రావడం అవసరం.

''తెమడ బయటికి వచ్చేంత వరకు దగ్గుతూనే ఉంటా. నా దగ్గును లోపలే ఉంచుకోను. ఒకవేళ మీరు కూడా అలానే చేస్తే, టిష్యూను వాడండి. ఒకవేళ దాన్ని మింగినా, ఎలాంటి హాని కలిగించదు. కడుపులో వేగంగా కరిగిపోతుంది.

ఒకవేళ దగ్గినప్పుడు వచ్చే కఫం గోధుమ ముదురు రంగులో ఉంటే, చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే, దానిలో రక్తం ఉండే అవకాశం ఎక్కువగా ఉంది.

కొన్ని వారాల తర్వాత దగ్గు దానికదే పోతుంది. యాంటీబయోటిక్స్ అవసరం లేదు. కానీ, మూడు వారాలకు మించి దగ్గు ఉంటే, కచ్చితంగా డాక్టర్‌కు చూపించుకోవాలి.

★★★



సాధారణ ప్రచురణకు ఎన్నికైన
**కవిత**

## ఉల్లి పోర

ఉల్లి పంట వేసిన అన్నదాత కంట నీరు
ఉల్లి వంటకు కోసిన అన్నపూర్ణ కంట నీరు
ఉల్లి ఖరీదు చూసిన దానయ్య కంట నీరు
ఉల్లిబజ్జీ తింటున్న బుజ్జిగాడి కంట నీరు

ఉల్లి చేసే మేలు తల్లి చేయదంటారు
కానీ అది తినేవారికేగాని పండించేవారికి
కాదుట
ఉల్లి పండించేవారికి వారికి ఎప్పుడూ హానే
జరుగుతోందట !
పంటకు గిట్టుబాటు ధరంటూ రానే రాదట

ఉల్లి లేకపోతే ఇల్లంతా లొల్లి లొల్లి
పిల్లలయితే తిండి వద్దంటూ అల్లీబిల్లి
లిల్లీ కుటుంబానికి చెందిందట ఉల్లి
ఆనియన్ అంటే అందరికీ (ఆ )మోదమే

సభా వేదిక అంతా ఉల్లిపాయలతో
అలంకరించారు
సభాసదులంతా ఉల్లి బస్తాలపై
ఆసీనులయ్యారు
''ఉల్లిపొర ''కవిత రాసి బహుమతి పొందిన
నా కంట నీరు
ఎందుకంటే ....................................

ఉల్లిపాయ మీద కవితల పోటీ పెట్టింది ఉల్లి
వ్యాపారిట
రైతుకు మనకీ మధ్యన ఆయన దళారిట
ఆయనకి వచ్చిన లాభంలో నుంచే నా
పారితోషికంట
అది లాభాల పంట కాదు, రైతన్న స్వేదం
ఖరీదు కదూ !

–పెనుమాక నాగేశ్వర రావు

# జాతకాలు–పెళ్ళిళ్ళు



-ఈ. సాయి అలేఖ్య

ఈ మధ్య కాలంలో పెళ్లిళ్లు జరగడం ఆలస్యమౌతున్నాయి. 30 పైబడితే కాని పెళ్ళికి ఒప్పుకోవట్లేదు యువత .ప్రతి కులంలో, ప్రతి ప్రాంతంలో, నగరం, పట్టణం, పల్లె తేడా లేకుండా గతంలో కంటే ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. దానికి అనేక కారణాలుంటున్నాయి. వాటిలో ఒక కారణం – జాతకాలు కుదరకపోవడం!

గతంలో జాతకాల పట్టింపు కొన్ని కులాలలో మాత్రమే, అదీ కొన్ని కుటుంబాలలో మాత్రమే వుండేది. పుట్టిన తేదీ వివరాలు నోట్ చేసి పెట్టుకోవడం కూడా కొన్ని కుటుంబాలలోనే వుండేది. ఏదైనా అస్వస్థత వచ్చినప్పుడో, ఉపద్రవం కలిగినప్పుడో జాతకాన్ని ఎక్కణ్ణుంచో బయటకు లాగి దుమ్ము దులిపి, ఎవరికైనా పండితుడికి చూపించేవారు. పెళ్లి విషయంలో జాతకాల గురించి కొన్ని కుటుంబాలకే పట్టింపు వుండేది. అది కూడా మేనరికాలు చేసుకున్నప్పుడు జాతకాలు చూసేవారు కాదు. కాని ఇప్పుడు దాదాపు అన్ని కులాల్లో జాతకాలు చూసే పెళ్ళిళ్ళు చేస్తున్నారు .

పోనీ జాతాకాలు చూసి పెళ్లిచేసుకున్నవాళ్ళు సవ్యంగా కాపురాలు చేస్తున్నారా అంటే అదీలేదు . ఎందుకలా? అంటే విధిలిఖితం అంటారు. కాపురం చెడిపోయిన తర్వాత వెళ్లి జ్యోతిష్కుణ్ని అడిగితే 'అవతలివాళ్లు తప్పు జాతకం యిచ్చారు.' అంటూ చెప్తారు. ఇచ్చినది తప్పో, ఏది రైటో ఎలా తెలుస్తుంది? బర్త్ సర్టిఫికెట్టు చూపించమని అడిగినా దానిలో తారీకు వుంటుంది తప్ప సమయం వుండదు కదా! తప్పు జాతకం యిస్తే వాళ్లకీ రిస్కే కదా అనే ఆలోచనతో కరక్టుదే యిచ్చి వుంటారు అనుకుని తృప్తి పడాలి. ఇలా అనేక తప్పుల తో కూడిన జాతకాల పొంతనకు ఎంత ప్రాధాన్యత యివ్వాలి? అనే ప్రశ్న వస్తుంది.

ప్రేమించి పెళ్లి చేసుకున్నవాళ్ళు ఎంతోమంది ఈ జాతకాలకు అతీతంగా సుఖంగా కాపురం చేసుకుంటున్నారు . అదేమంటే వాళ్లకు తెలియకుండా వాళ్ళ జాతకాలు కలిసాయంటారు .

మనుష్యులను దేవగణం, రాక్షసగణం, మానుష్యగణంగా విభజించి, గణకూటమి కూడా చూడాలంటారు. ఒకే మనిషి భిన్నభిన్న సమయాల్లో దేవుడిగా, రాక్షసుడిగా, మనిషిగా ప్రవర్తించడం చూస్తాం. పుట్టిన సమయం బట్టి, సర్వదా ఒకే స్వభావంతో వుండతరమా? భర్త రాక్షసుడిగా ప్రవర్తిస్తే, దేవగణానికి చెందిన భార్య కూడా రాక్షసిగా రూపెత్తవచ్చు. వర్ణకూటమి అని మరొకటి కూడా వుంది. గ్రహాలకు కూడా కులాలు అంటకట్టి (బుధ, చంద్రులు వైశ్యులు, రాహు కేతువులు మ్లేచ్ఛులు.. యిలా) వధూవరులిద్దరూ ఒకే వర్ణము (కులం)నకు చెందిన వారయితే మంచిది అన్నారు. తర్కానికి అందని యిలాటివన్నీ నమ్మడానికి బుద్ధి అంగీకరించదు. అలా అని తోసి పారేయడానికి ధైర్యం చాలదు. అందువలన 'ఎందుకైనా మంచిది' అంటూ జాతకాలు కూడా సంప్రదిస్తున్నారు చాలా మంది.

కొంతమంది జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్లకుండానే నక్షత్రాల బట్టే

# సెటైర్

సంబంధాలు ఎగరగొట్టేస్తున్నారు తల్లులు. పంచాంగం దగ్గర పెట్టుకుని, మీ పిల్లో, పిల్లాడో నక్షత్రం ఏమిటని అడిగి, మాకు కుదరదండీ అత్యంత రూడ్గా చెప్పి ఫోన్ పెట్టేస్తున్నారు. 'అలా కాదండీ, పూర్తి జాతకాలు చూపించుకుందాం' అని ప్రతిపాదించబోతే, 'అక్కర్లేదండీ, మాకన్నీ తెలుసు' అని కసురుకుంటున్నారు. వీళ్లకు జాతకచక్రాలూ, స్థానాలూ, గ్రహాల శుభాశుభాలూ తెలుసనుకోవడానికి లేదు. టీవీలో జ్యోతిష కార్యక్రమాలు, యూట్యూబు వీడియోలు చూసి పోగేసిన అరకొర సమాచారం తోనే, వీళ్లు పిల్లల జీవితభాగస్వాముల ఎంపికను శాసిస్తున్నారు.

ఈ మహ్య జ్యోతీష్కులు కుడా అనీ అనలైన్ లో నడిపెస్తున్నారు .. మీరు శ్రమ పడి రావక్కర్లేదు. వాట్సాప్ లో వివరాలు పంపండి అనడం, అరగంట తర్వాత 'డిడ్ నాట్ మ్యాచ్. సెండ్ మై ఫీజ్ త్రూ ఫోన్పే' అని మెసేజ్ పంపేయడం జరుగుతోంది. అరగంటలోనే చెప్పేశాడే! మనది సరిగ్గా చూశాడా? రెండు జాతకాలు స్టడీ చేయడానికి ఎంత టైము వెచ్చించాడు? అనే సందేహం తప్పక వస్తుంది. ఏదో ఒకటి చెప్పి, జ్యోతిష్కుడు సంబంధాలు చెడగొడుతున్నారనే మాట మాత్రం సర్వత్రా వినబడుతోంది. పలికే అపశకునాలన్నీ పలికి, 'చెప్పాల్సింది చెప్పాను, అవతల మీ యిష్టం అంటే ఎవడైనా ముందుకు వెళతాడా?

అసలు ముందుగా మేట్రిమోనియల్ సైట్స్ను అనాలి. వాళ్లు వివరాలన్నీ తీసుకుని, ఏదైనా సంబంధానికి మనం యింట్రస్టు ఎక్స్ప్రెస్ చేయగానే, 'ఇన్ని పాయింట్లు కుదిరాయి' అంటూ చెప్పేస్తున్నాయి. కులాల వారీగా, శాఖల వారీగా విడగొట్టి, వారి వారి కులాల్లో చేసుకుంటేనే సుఖంగా వుంటారని టీవీ యాడ్స్ ద్వారా ప్రమోట్ చేయడమే అన్యాయం. మొత్తమన్నీ లభ్యం చేయి. స్వకులంలోనే చూడాలో, పరకులంలో కూడా వెతకాలో కస్టమర్కు ఛాయిస్ వదిలేయి. ఎందుకంటే కులం ఒక్కటే కొలబద్ద కాదు. స్టేటస్, కుటుంబ నేపథ్యం, అభిరుచులు.. యిలా పదుల కొద్దీ కన్సిడరేషన్స్ వుంటాయి. కులపరంగా విడగొట్టడమే కాకుండా, జాతకాలు నప్పవంటూ భయపెట్టడం కూడా దుర్మార్గం కదా! జ్యోతిష్యాల్లో కూడా ఒక్కో ప్రాంతం వాళ్లు ఒక్కో రీతి అనుసరిస్తారు. జాతకచక్రం గీయడానికి కూడా వేర్వేరు సాఫ్ట్వేర్లు అనేకం ఉన్నాయి. వాటి మధ్య వేరియేషన్స్ వున్నాయి. ఒకే చక్రాన్ని వేర్వేరు జ్యోతిష్కులకు చూపించినప్పుడు వేరేవేరేలా చెప్తారు. అలాటప్పుడు యీ మాట్రిమోనియల్ సైట్ వాడు ఏదో చెప్పి అనుమానబీజాలు నాటడమెందుకు?

ఇలా అన్నీ సమస్యల గురించే చెప్తున్నావు. పరిష్కారం ఏమిటి? అని అడిగితే నా దగ్గరా యితమిత్థమైన జవాబు లేదు. ఎందుకంటే జ్యోతిష్యంపై నమ్మకమనేది వ్యక్తిగతం. మనమీద మనకి నమ్మకం లేనప్పుడే జాతకాలు , జ్యోతీష్యం అంటూ తిరుగుతాము .మానసికంగా మనం బలవంతులైనప్పుడు ,ఎటు వంటి ప్రతికూల పరిసితి నియన్ ఎదుర్కోగలిగి నిలబడితే , అసలు జాతకాల జోలికే వెళ్లకపోవటం మంచిది .

★★★★

# కేదార్ నాథ్

## యాత్ర





కేదార్‌నాథ్ ఆలయం పవిత్రమైన శైవక్షేత్రం.గర్వాల్ కొండల పైభాగంలో ఉంది. ప్రతికూల వాతావరణం కారణంగా అక్షయతృతీయ నుండి దీపావళి వరకు భక్తుల సందర్శనార్థం ఈ గుడిని తెరచి ఉంచుతారు. ఇక్కడ పూజలు నిర్వహించడానికి అధికారమున్న కుటుంబం అంటూ ఏదీ లేదు. గుడిలో ప్రతిష్ఠితమయిన లింగం యొక్క కాలం ఇదమిద్ధంగా ఇంతవరకు నిర్ణయించబడలేదు. . 12 జ్యోతిర్లింగాలలో ఇది ఒకటి. ఉత్తరాఖండ్ లోని చార్‌ధామ్‌లలో ఇది ఒకటి. గంగోత్రి, యమునోత్రి, బద్రీనాథ్, కేదార్‌నాథ్ లను ఛోట చార్ ఉత్తరాఖండ్ ధామ్‌లుగా వ్యవహరిస్తారు.

కేదార్ నాథ్ ఆలయం ముందరి భాగంలో కుంతీదేవి, పంచ పాండవులు, శ్రీకృష్ణుని మూర్తులు వరుసగా కుడ్య శిలలుగా దర్శనమిస్తాయి.

గర్భగుడిలో కేదారీశ్వరుడు స్వయంభువుడుగా దర్శనం ఇస్తాడు ఆలయం గర్భగుడిలో అందరూ ఊహించినట్టు శివలింగం ఉండదు.

కేవలం ఒక ఎద్దు వెనుకభాగంలా మాత్రమే కనిపిస్తుంది. దాన్నే భక్తులందరూ ఎంతో నిష్ఠతో పూజిస్తారు. దీని వెనక ఓ కథ ఉంది. కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తర్వాత పాండవులు ఎంతో పశ్చాతాపంలో ఉంటారట.

యుద్ధంలో ఎందరినో హత్య చేశాం కాబట్టి ఆ పాతకం తమకు అంటుకుంటుందని, దాన్నుంచి పాపవిమోచనం కోసం శివుడిని దర్శించుకోవాలనుకుంటారు. ద్రౌపదితో కలిసి అయిదుగురు హిమాలయాలకు బయల్దేరతారు.

ఎన్నో రోజులు కష్టించి గాలించినా శివదర్శనం కాదు. చివరికి కేదార్ నాథ్ ఉండే చోటుకు వస్తారు. అయితే పాండవులకు దర్శనం ఇవ్వడానికి శివుడికి మనసొప్పదు. దీంతో శివుడు ఓ ఎద్దులా మారిపోతాడు. తనను గుర్తు పట్టకుండా మరిన్ని ఎద్దులను సృష్టిస్తాడు.

శివుడిని వెతుక్కుంటూ వచ్చిన పాండవులకు ఆవులు, ఎద్దులు కనిపిస్తాయి. ఇంత మంచులో ఆవులు, ఎద్దులు ఎందుకు ఉన్నాయన్న అనుమానం ధర్మరాజుకు వచ్చి భీముడితో కాలు పైకెత్తమని చెబుతాడు. మరో వైపు నుంచి పాండవులంతా ఆవులను ముందుకు ఉరికిస్తారు.

ఒక్కో ఆవు/ఎద్దు భీముడి కాలు కింది నుంచి బయటకు వెళ్తాయి. చివరి వంతు ఎద్దు రూపంలో ఉన్న శివుడిది. అయితే పాండవులు పాపం చేశారు కాబట్టి వారికి దర్శనం ఇవ్వడానికి శివుడికి మనసొప్పదు.

తప్పనిసరి పరిస్థితుల్లో పాండవులకు కనిపించొద్దన్న ఉద్దేశ్యంతో, భీముడి కాళ్ల





# యాత్ర

కింది నుంచి వెళ్లలేదు కాబట్టి .. హఠాత్తుగా మంచులోకి దూసుకుపోతాడు. పాండవులు గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించగా.. ఎద్దు వెనక భాగం మాత్రం అందుతుంది.

అలా ధర్మరాజు చేతికి అంటిన మిగిలిన భాగమే ఇప్పుడు కేదార్ నాథ్ లో కనిపిస్తుంది. మంచులో కూరుకుపోయిన తల భాగం హిమాలయాల అవతలి వైపు అంటే ఖాట్మాండులో ప్రత్యక్షమవుతుంది.

అందుకే కేదార్ నాథ్ లో దర్శనం తర్వాత నేపాల్ వెళ్లి ఖాట్మాండు పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుకుంటే అద్భుతమని మనకే

కేదార్‌నాథ్‌లో మూపురం పైకి లేవడం, తుంగనాథ్‌లో చేతులు కనిపించడం, రుద్రనాథ్‌లో ముఖం కనిపించడం , మధ్యమహేశ్వర్‌లో నాభి (నాభి) మరియు కడుపు పైకి రావడం మరియు కల్పేశ్వర్‌లో వెంట్రుకలు కనిపించడం . ఐదు వేర్వేరు రూపాల్లో ఈ అభివ్యక్తికి సంతోషించిన పాండవులు, శివుడిని పూజించడానికి ప్రతి ప్రదేశంలో దేవాలయాలను నిర్మించారు. ఈ ఐదు మందిరాలను సమిష్టిగా పంచ కేదార్ అని పిలుస్తారు.

గుడి చేరటానికి రోడ్డు మార్గం లేదు. గౌరికుండ్ నుండి గుర్రాలు, డోలీలు, కాలినడకన మాత్రం గుడిని చేరవచ్చు. ఈ గుడిని ఆదిశంకరులు నిర్మించినట్లు విశ్వసిస్తున్నారు. కేదార్‌నాథుడి వెనుక భాగంలో ఆదిశంకరుల సమాధి ఉంది. కేదార్‌నాథ్ ఆదిశంకరులచే స్థాపించబడిన శివాలయం. జ్యోతిర్లింగాలలో ఇది ఒకటి. హిమాలయాల్లోని చార్‌ధామ్ పుణ్యక్షేత్రాలలో ఇది ఒకటి. ఆదిశంకరులు ఈక్కడ ఈశ్వర సాన్నిధ్యం చెందటం ఇక్కడి





# యాత్ర





ప్రత్యేకత.

అసలు కేదార్‌నాథ్ ఆలయాన్ని ఎవరు, ఎప్పుడు నిర్మించారో ఖచ్చితంగా తెలియదు. “కేదార్‌నాథ్” అనే పేరుకు “క్షేత్ర ప్రభువు” అని అర్థం: ఇది సంస్కృత పదాలైన కేదార (“క్షేత్రం”) మరియు నాథ (“ప్రభువు”) నుండి ఉద్భవించింది. “ విముక్తి పంట” ఇక్కడ పెరుగుతుంది కాబట్టి దీనిని అలా పిలుస్తారని కాశీ కేదార మహాత్మ్య వచనం పేర్కొంది





క్రైం సీరియల్



# రక్షకుడు



డా.సి.ఎస్.జి .కృష్ణమాచార్యులు

. మొదటి సారి అక్షయ్ ప్రోగ్రాం ని, ఆ ప్రోగ్రాం చూస్తూ వూగిపోతూ నాట్యం చేసే విద్యార్థులను చూసి నప్పుడు నీహారిక, ఇదేం వేలం వెర్రిరా అని అశ్చర్యపోయింది. అయితే ఆమె వ్యతిరేకత ఎంతో కాలం నిలవలేదు.

ఒక రోజు, లైబ్రరీలో చదువుకుంటుండగా, అక్షయ్ ఆమె ఎదుట నిల్చి, " నీహారిక గారూ" అని పిలిచాడు. నీహారిక అశ్చర్యంతో " రండి కూర్చోండి" అని తన ప్రక్క సీట్ చూపించింది.

అతడు నిర్మొగమాటంగా," నిన్ను ప్రేమిస్తున్నాను. నీ సాంప్రదాయక వేష ధారణ, నీ చిరునవ్వు నన్ను నిద్రపోనీయడం లేదు. ఆలోచించుకుని చెప్పు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఈ హటాత్పరిణామానికి నీహారిక బెదిరిపోయింది. ఆమె ఈ విషయాన్ని స్నేహితులతో పంచుకుంది. కల్యాణి , ఇందిరా సూటిగా తమ వ్యతిరేక అభిప్రాయాలను వెళ్ళడించారు.

" అమ్మాయి దొరికితే, కాటేజిలకు పరిగెత్తే నీచుడు వాడు. సారీ! నీ లాటి సున్నిత స్వభావం వున్న వాళ్ళు అతనికి దూరంగా వుండడమే మేలు."

మైత్రేయి తగు జాగ్రత్తలు చెబుతూ ఇలా అంది.

"అతను మన యూనివర్సిటీ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్. త్వరలో అమెరికా వెడతానని చెబుతున్నాడు. ఇంకా పెళ్ళి కాలేదు. వెంటబడ్డ, అమ్మాయిలతో తిరుగుతాడు. అయితే అతని మీద ఎలాంటి ఫిర్యాదులు లేవు. చపల బుద్ధి వున్న వాడిని కట్టుకుంటే, కష్టాలు తప్పవు. అది గుర్తుంచుకుని ముందడుగు వెయ్యి." వారి సలహాలను గౌరవించి నీహారిక అతను కలిసినప్పుడు, "నాకు ప్రేమా పెళ్ళి గిట్టవు. నా పీహెచ్.డీ నాకు

# క్రైం సీరియల్

**జరిగిన కథ:**
నీహారిక , మాధవ్ ను తన స్నేహితురాళ్ళకు పరిచయం చేస్తుంది .మాధవ్ తన గురువు గారి మాట కాదనలేక నిహారిక మెడలో తాళి కడతాడు . కాని నీహారికకకు ఆ పెళ్లి ఇష్టం ఉండదు,అక్షయ్ ని ప్రేమిస్తుంది .నీహారిక ఆస్తికి మాధవ్ రక్షుడిగా నియమిస్తాడు అతని మాస్టారు .నిహారిక తాను ప్రేమించిన అక్షయ్ స్వార్ధపరుడని తెలిసి అతన్ని వదిలేస్తుంది . నిహారిక మాధవ్ ణి పెళ్లి చేసుకోటానికి ఒప్పుకుంటుంది.

**ఇక చదవండి**

ముఖ్యం" అని నిక్కచ్చిగా చెప్పింది. అయినా అతను ఆమెను వదల లేదు. ఆమెకు చిన్న చిన్న కానుకలను పంపిస్తూ, ప్రేమ సందేశాలను పంపుతూండే వాడు . కనిపించినప్పుడు," తపస్సు చేస్తున్నాను. ఏదో ఒక రోజు దేవత కరుణించకపోదు" అని దీనంగా చెప్పేవాడు.

ఒక రోజు, నీహారిక అతని ప్రేమలో పడిపోయే సంఘటన ఒకటి జరిగింది. నీహారిక హాస్టలు నుంచి బయటికి వస్తూండగా, అతడు ఆమె కవితను పాడుతూ, గిటారుపై వాయిస్తూ ఆమె ముందు మోకరిల్లాడు. దగ్గరున్న సంచీలోంచి, ఒక పూలగుత్తి తీసి, "నన్ను కరుణించు దేవీ" అని ప్రాధేయ పడ్డాడు.

ఈ దృశ్యాన్ని చూసి, అక్కడ గుమికూడిన విద్యార్థులు చప్పట్లతో " యస్ అను సిస్టర్" అని ప్రోత్సహించారు. ఆ క్షణంలో నీహారికకు యేం చెయ్యాలో తెలియ లేదు. యస్ అని గొణిగింది.

అక్షయ్ ఆమె సందిగ్ధతను అర్ధం చేసుకున్నాడు. అది పోగొట్టడానికి ఆమె కవితను గానం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. తత్ఫలితంగా, ప్రస్తుతం నీహారికకు చిక్కు తెచ్చిపెట్టిన ఈ వీడియో, యూట్యూబులో ప్రత్యక్షమైంది.

@@@@

సాయంత్రం అయిదు గంటలకు నీహారిక ముస్తాబైంది.
"నేనొక కవయిత్రిని, ఓ పిల్ల కవయిత్రి ఆశ నెరవేర్చే విదుషీమణిని. ఆహా విధి యెంత విచిత్రమైనది" అని అనుకుంటూ నీహారిక, శర్వాణి యింటికి బయలు దేరుతుండగా మాధవ్ వచ్చాడు. ఉదయం ఎనిమిది నుంచి ఇంత వరకు యూనివర్సిటీలో పని చేసిన అలసట, అతని ముఖంలో కనబడుతోంది. అతడు, ఒక పుస్తకం నీహారికకు యిస్తూ ఇలా అన్నాడు.
"ఇది జయ వ్రాసిన కవితల పుస్తకం. ఇది చూసి, రెండు గీతాలు తయారు చెయ్యి. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ లో నా స్నేహితుడు, రంగనాథ్ వున్నాడు. ఈ మధ్యనే జాయినయ్యాడు . సంగీతం, గానం అతను చూసుకుంటాడు. అతని ఫోన్ నంబర్, ఇమెయిల్ ఐడీ నీకు వాట్సాప్ చేసాను. ఇద్దరూ కలిసి ఆ పని పూర్తి చెయ్యండి. "
ఆమె థాంక్స్ అని అనబోయేంతలో అతను తన గదిలోకి వెళ్ళిపోయాడు. నీహారిక సోఫాలో చతికిలబడి పుస్తకం తెరిచి కొన్ని కవితలను చదివింది. పరవాలేదు. భావావేశం వుంది. భాష మెరుగైతే కవితలు అందంగా వ్రాయ గలుగుతుందని అనుకుంది. రెండు కవితలను ఎంపిక చేసింది. ఒకటి యువతను చైతన్యవంతం చేసేది.

యువతా, ఓ భారత నేతా !
నాడు స్వేచ్ఛకోసం, ప్రగతి కోసం
చదువుసంధ్యలు పణము పెట్టి !
ప్రాణ హానిని లెక్క చేయక
పోరు బాట, నడిచిన
యువతా! ఓ ధీర యువతా!
నేడు మందు త్రాగుతూ,
గంజాకూగుతూ ! బూతు వాగుతూ,
నీతి తప్పుతూ !
పెరుగు వైనము ఏమిటో, తిరుగు
పైత్యము ఎందుకో
నాటి శౌర్యమెచట దాగెను? ప్రగతి
లక్ష్యము ఏమి అయెను?
మేలుకో! నాయకా! మేలు చేయగా
కదలిరా!
అది ఇలా సాగింది.



# క్రైం సీరియల్

మరొక్కటి వసంత కాల వర్ణన చేసేది. మాధవ్ ఎప్పుడు గదిలోంచి బయటికి వచ్చి కిచెన్ లోకి వెళ్ళాడో ఆమె గమనించలేదు. అతడు ఒక టీ కప్పు టీ పాయ్ మీద పెట్టి, “ టీ తీసుకో! బిస్కట్లు వున్నాయి కావాలా?” అని అడిగాడు.

అతని మాటలకు ఆమె వులిక్కి పడి, “ థాంక్స్. వద్దు” అని టీ కప్పు తీసుకుంది. అతను అక్కడ కూర్చోకుండా మళ్ళీ గదిలోపలికి వెళ్ళిపోయాడు.

ఆమె టీ త్రాగుతూ, “ నేనే టీ పెట్టి వుంటే బాగుండేది. వేరే పనేమీ లేదుగదా! ఉదయం లేచేటప్పటికి పని మనిషి, వంట మనిషి వుంటారు. పనేమీ వుండదు.మధ్యాహ్నం వచ్చేటప్పటికి భోజనం బల్ల మీద సిద్ధంగా వుంటుంది. సాయంత్రం ఒక్కటే సమస్య. నడవడం ఒక మంచి ఆలోచన. అ గదిలో మహానుభావుడు ఏం చేస్తున్నాడో? ఏం చేస్తాడో రోజూ?” అని అనుకుంది.

అంతలో మాధవ్ వచ్చి,” కొద్ది దూరంలో పార్కు వుంది. వస్తే చూపిస్తాను. అక్కడ నడవడానికి మంచి బాట వుంది. పిల్లల ఆట పాటలతో సందడిగా వుంటుంది.” నీహారిక “వెడదాం” అని లేచింది. ఇద్దరూ పార్కుకు వెళ్ళడానికి నడక సాగించారు.

దారిలో నీహారిక మాధవ్ నడిగింది,”కవితల సంగతి సుధాకర్ చెప్పాడా?”

“ లేదు. వేరే వారు చెప్పారు. సుధాకర్ ఈ రోజు సెలవు పెట్టాడు.”
అతని మాటలు ఆమెకు ఆశ్చర్యం కలిగించాయి. ఎవరు ఇతనికి ఇన్ ఫార్మర్? నేనెక్కడున్నా ఇతనికి తెలిసి పోతుందా? పరీక్షించి చూడాలని అనుకుంది.

@@@@

మేనత్త దగ్గర వున్నప్పుడు ఆలస్యంగా లేవడం, హడావుడిగా కాలేజికి పరిగెత్తడం,నీహారికకు అలవాటుగా మారింది. ఆ అలవాటు వల్ల, ఆమె ఎనిమిదిన్నర గంటలకు నిద్రలేచి చూస్తే, వంట మనిషి అల్పాహారం బల్ల మీద పెట్టి వెళ్ళిపోయింది. మాధవ్ కూడా వెళ్ళిపోయాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. మాధవ్ చెప్పిన ప్రకారం, మళ్ళీ పదకొండు గంటలకు హాడావుడి వుంటుంది. వంట మనిషి వచ్చి భోజనం తయారు చేస్తుంది. అప్పుడే పనిమనిషి వస్తుంది. నీహారిక ఇంతవరకు వాళ్ళను చూడలేదు. రేపు తెల్ల వారగానే లేచి వాళ్ళను చూడాలి, ఎంతైనా ఇల్లాలిని కదా, అని అనుకుంది. మళ్ళీ ఈ ఆలోచన వింతగా వుందని నవ్వుకుంది.
ఆమె యూనివర్సిటీ ప్రధాన గేటు దగ్గర వుండగా, రంగనాథ్ నుంచి ఫోన్ వచ్చింది.

“ నీహారికా, నేను రంగనాథ్”
“ఆ నిన్న మాధవ్ చెప్పారు. కవితలు మీకు వాట్సాప్ చేసాను. ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను”
“ కవితలు చూసాను. ఇప్పుడు రాగలరా?

“ఒకే. మెయిన్ గేట్ దగ్గర వున్నాను. రెండే రెండు నిమిషాల్లో అక్కడ వుంటాను”
పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డిపార్టుమెంటు ప్రధాన ద్వారానికి కుడి వైపు సందు చివరలో వుంది. అందులో కోర్సులు చేస్తున్న విద్యార్థులు ఎదురుగా వున్న పచ్చికలో రిహార్సల్సు, సాధన చేస్తూంటారు. ఆ శాఖ ప్రత్యేకత అదే. అక్కడ తప్ప ఇంకెక్కడా విద్యార్థులు బయట కనిపించరు. నీహారిక వారిని చూస్తూ లోపలికి వెళ్ళి రంగనాథ్ ని కలిసింది.

“ రా! నీహారికా, నేనూ మాధవ్ చిన్నతనం నుంచి స్నేహితులం. నేను మొదట ఉత్కళ్ యూనివర్సిటీలో చేరాను. ఇక్కడ ఉద్యోగాలు ప్రకటించగానే మాధవ్ చెప్పాడు. వచ్చేసాను. మీ పెండ్లికి రాలేకపోయాను. ఎంత సేపూ చదువు, గురువుగారు అంటూ మీ నాన్న జపం తప్ప. ఇంకోటి తెలియదు వాడికి. అందుకే ఆయన, వాడిని నీకప్పగించాడు.”
నీహారికకు యేమనాలో తెలియలేదు. జరిగిన దానికి భిన్నంగా ఇతను తననే రక్షకురాలిగా భావించడం ఆమెకు గమ్మత్తు అనిపించి,



# క్రైం సీరియల్

మందహాసం చేసింది .
" చూడమ్మాయి, భార్యలకు భర్త స్నేహాలు నచ్చవు. అందుకే నేనో వుపాయం చేసాను. నన్ను అన్నా అని పిలు. నేను నిను చెల్లీ అంటాను. అప్పుడు, నేను నీకోసమని నీ యింటికి వచ్చి వాణ్ణి కూడా పలకరిస్తాను. సరేనా!"
నీహారికకు అతను నచ్చాడు. అమాయకమైన అతని ముఖం చూస్తూంటే సోదర భావం కలిగింది,
" అలాగే అన్నయ్యా! నువ్వు నా కోసం నా ఇంటికి రావాలి. నా చేతి భోజనం తిని వెళ్ళాలి. ఇంతకీ వదిన ఎక్కడుంది ?"
" నువ్వు కాస్త శ్రద్ధ తీసుకుని వదినను పట్టుకో. ఎక్కడ ఎక్కడ ఎక్కడ ఉందో తారకా! నాలో ఉక్కిరి బిక్కిరి ఊహలు రేపే గోపికా!". రాగ యుక్తంగా అభినయంతో అతడు ఆ మాటలు పలికిన తీరు ఆమెకు నవ్వు తెప్పించింది.
"ఈ రోజు నుంచి అదే అని మీద వుంటాను. ఇంతకీ నేను పంపిన కవితలు చూసావా?"
"నేనొక బాణీ అనుకున్నాను. నువ్వు పాడే ప్రయత్నం చెయ్యి . అవసరమనుకున్న చోట, సాహిత్యం మార్చుదాం."
"నేనా! వేరే యెవరినైనా చూడక పోయావా? "
"నువ్వు బాగా పాడుతావని మాధవ్ చెప్పాడు. ప్రయత్నించి చూడు"
నీహారిక ఆ మాటకు అప్రతిభురాలైంది. గతం ఆమె కళ్ళ ముందు కదలాడింది. చిన్నతనంలో అమ్మ ప్రోత్సాహంతో సంగీతం నేర్చుకుంది. అమ్మ వెళ్ళిపోయాక, జీవితంలో వసంతం, సంగీతం, అన్నీ పోయాయి. దుఖంతో గొంతు పూడుకు పోయింది. ఇప్పుడు గొంతెత్తి పాడగలదా?. మాధవ్ విసిరిన సవాలు ఇది. ఓడిపోకూడదు.
ఆమెను చైతన్యపరుస్తూ రంగనాథ్ యిలా అన్నాడు.
"చిన్న పిల్ల వ్రాసిన పాట కాబట్టి, ఆంగ్ల, తెలుగు పాటల సమ్మేళనంగా బాణీ కడతాను. నువ్వు పాడుతూ, ఆ హుషారులో కొన్ని ఆంగ్ల పదాలు చేర్చు" అని సిద్ధంగా వున్న ఒక బాణీని వినిపించాడు.
"నేను గొంతెత్తి పాడి చాలా కాలమైంది. నువ్వు కోపం తెచ్చుకోకూడదు." అంది నీహారిక.
"అలాగే! ఎన్ని ప్రయత్నాలైనా, ఎంత టైమైనా పర్వాలేదు. ఈ రోజు నాకు క్లాసులు లేవు" అని రంగనాథ్ ప్రోత్సాహకరంగా తలూపాడు.
నీహారిక గొంతు సవరించుకుని తల్లిని తలచుకుంది. ఆమె ముందు ఒక బాలికగా పాడిన పాటలు గుర్తుకు తెచ్చుకుంది. అమ్మ కళ్ళల్లో కనిపించే ప్రశంస, రంగనాథ్ కళ్ళల్లో చూడాలనుకుంది.
తల్లికి వందనాలు సమర్పించి పాడటం మొదలు పెట్టింది.
ఘనీభవించిన మంచుగడ్డ కరిగి నీటి ప్రవాహం జాలు వారినట్లు ఆమె గొంతునుంచి సుస్వరాలు తరంగాలై ప్రవహించాయి. అడ్డు నిలిచిన సాహిత్యపు శిలలను తొలగిస్తూ, సాధు పదాల అల్లికతో పాటను లలితము, రాగ యుక్తము చేసింది.
భోజన విరామ సమయానికి ఒక పాట సిద్ధమైంది. పూర్తి వాయిద్య సహకారంతో రికార్డింగ్ చెయ్యడం మిగిలింది. రెండు, మూడు రోజులు, పరిశీలన చేసిన తర్వాత, రికార్డింగ్ చేద్దామని అనుకున్నారు.
సంతోషంతో గాలిలో తేలిపోతూ, నీహారిక భోజనానికి యిల్లు చేరింది. మాధవ్ ఇంట్లో వుంటే బాగుండుననుకున్న ఆమెకు నిరాశ యెదురైంది. ఆమెకు ఒంటరిగా తినబుద్ధి కాలేదు. కానీ వేరే గత్యంతరం లేదు. మాధవ్ పై చిరుకోపంతో, "నాకు ఒంటరిగా అన్నం తినే అలవాటు లేదు" అని మెసేజ్ పంపి, భోజనానికి వుపక్రమించింది.
రెండే రెండు నిమిషాల తర్వాత," సారీ"అని జవాబు, ఆ తర్వాత ఒక నిమిషం తర్వాత చప్పట్లు ఎమోజితో "కంగ్రాచ్యులేషన్స్ పొయెట్ సింగర్" అన్నసందేశం వచ్చాయి. ఆమెకు సంతోషంతో కడుపు నిండింది. మనం సాధించినది స్వల్పమైనా, అది కలిగించే ఆనందాన్ని ఆస్వాదించి, అభినందించే వ్యక్తి లేకపోతే, అది ఎడారిలో కురిసిన వాన, యిసుకలో ఇంకి పోయినట్లు, మన మనసులోనే అణిగి పోతుంది. ఆమె హుషారుగా భోజనం ముగించి యూనివర్సిటీకి వెళ్ళింది.

# క్రైం సీరియల్

అక్కడ అమెకు రిసెర్చ్ పని మీద దృష్టి నిలపడం కష్ట సాధ్యంగా తోచింది. ఎందుకో ఆమెకు మాధవ్ పదే పదే గుర్తుకు వచ్చాడు. ఇందిరకు అతడంటే అమిత ప్రేమ. "చూడ చక్కని మనిషి, మంచీ మర్యాద వున్న వాడు. వృత్తికి వన్నె తెస్తున్నాడు. ఇంతకన్నా ఒక ఆడపిల్ల వరించడానికి యేం కావాలి? అని అంటుంది.

నిజమే అంతకన్నా కోరేదేముంది? నాకు అక్షయ్ పరిచయం కాకపోతే, మాధవ్ నచ్చే వాడా?

అతను నాతో పోటీగా అమ్మా, నాన్నలకు దగ్గరయ్యాడు. వాళ్ళతో తను గడిపే సమయాన్ని, దోచుకుని, నాలో అతని పట్ల కోపాన్ని,అసూయని రగిలించాడు. కానీ ఇప్పుడు ఆ విద్వేష భావం మెల్లగా మాయమవుతోంది. ఎవరి కోసం అతనితో వైరభావాన్ని పెంచుకుందో వారే లేరు. ఇంక పోటీకి, జయాపజయాలకు తావెక్కడుంది?

నాకు నాన్న లేరు. అతనికి తండ్రిలాంటి వ్యక్తి, ప్రియతమ గురువులేరు. నిజానికి అతనికి కలిగిన కష్టం ఎక్కువ. దానికి తోడు ఆస్థి వ్యవహారాలు. తన నిజాయితీకి సాక్ష్యం వుండాలనో, లేక మనసులో భారం దించుకోవాలనో అన్ని విషయాలు మైత్రేయితో పంచుకుంటున్నాడట. నేను అతని భార్యనైతే, నాతో పంచుకుని, నా ఒడిలోతల బెట్టి సేద తీరే వాడు. నేను అ అవకాశం అతనికి యివ్వలేదు.

పూర్ ఫెలో! మాధవ్ దైన్యాన్ని గుర్తించిన ఆమె మనసు ఆర్ద్రమైంది. ఆమె ఇలా ఆలోచిస్తున్న తరుణంలో కల్యాణి , ఇందిర వచ్చి ఆశ్చర్య పరిచారు.

"వాహ్! నీహా! నువ్వు పాడగలవా? కాలేజి పిక్నిక్ లో, టూరులో సరదాగా పాడమని, ఎంత అడుక్కున్నా, నాకు రాదని తప్పించుకున్నావు. నువ్వు సింగర్ వని మాధవ్ చెబితే నమ్మలేదు తెలుసా!" అంటూ కల్యాణి సంతోషం వెలిబుచ్చింది.

"ఇది కచ్చితంగా మాధవ్ మాజిక్. వెదురు వేణువైంది. పదం, పాటగా మార్చిన ఘనత నీహాదైతే, పాటకు స్వరం జోడించేందుకు ప్రోత్సాహమిచ్చింది మాధవ్. అవునా నీహా?" ఇందిర తనదైన పద్ధతిలో నీహాను పొగుడుతూ, మాధవ్ కి ఆ ఘనత కట్ట బెట్టింది.


నీహా మనసు ఆనంద సాగరమైంది. " మీకెవరు చెప్పారు? ఇంకా రికార్డింగ్ కాలేదు" అంది.

" ఇంకెవరు? మాధవ్. మైత్రీకి చెబితే, తను మాకు చెప్పింది. నువ్వు చిన్నపుడు సంగీతం నేర్చుకున్నావని కూడా చెప్పింది" అని కల్యాణి బదులిచ్చింది.

ఆ తర్వాత, స్నేహితులు ముగ్గురూ, మైత్రేయికి ఫోన్ చేసి, సరదా కబుర్లలో మునిగిపోయారు.

(ఇంకా ఉంది )

కథ



# నిజ పెళ్ళాంతో పెళ్లికి



**సింహ ప్రసాద్**

ఆంజనేయులు చాకలి ఇస్త్రీచేసిన ఫ్యాంటు, షర్టుధరించి టక్ చేసుకున్నాడు. అద్దంలో తనని తాను చూసుకుని 'వెరీస్మార్ట్' అని తన భుజాలే చరుచుకుని పొంగిపోయాడు.

'' ఏమోయ్, త్వరగా తెములు. ఎంత మనం పెళ్లికివెళుతున్నా ముహూర్తం టైంకన్నా ముందే వెళితేబాగుంటుంది. అవతల జరుగుతున్నదినా ఫ్రెండ్ కూతురిపెళ్లి. ఆలస్యంగా వెళితే భోజనం చేయడానికే వచ్చామని అపార్థం చేసుకునే పమాదంర్ ఉంది''

'' నాకు తెలుసులెండి. మీ మిత్రుడింట్లో పెళ్లి గనుకే పత్ర్యేకంగా తయారవుతున్నాను. వెనక ఊరికే నసపెట్టకండి_ _ _'' పట్టు చీర మడతలు సరిచేసుకుంటూ జవాబిచ్చిందిలతాంగి.

ఉస్సురంటూ నిట్టూ ర్చి వాచీని, గదినీ మార్చి మార్చి చూడసాగాడు. ఎట్టకేలకు లతాంగిఊడిపడింది. '' ఎలా ఉన్నాను?''

" బంగారు బొమ్మలా ఉన్నావు'' అలవాటు పకారంర్ మెచ్చుకున్నాడు. ఏమాతంర్రతేడాగా మాట్లాడినా సొంత మొగుడు గనుక మీద పడి రక్కేయడం ఖాయం!

మెడలో చందహారంర్ , లాకెట్ హారం, నెక్లెస్ ధరించి, '' కొంచెం హెవీగా అనిపిస్తున్నాయా!'' అడిగింది. అతిగానేఅనిపించినా ఆ మాట బయటికిచెప్పే ధైర్యం లేక, వెర్రిగా నవ్వి, ''నీ అందానికితగ్గట్టు ఆ మాతంర్రఆడంబరంగా ఉండాల్సిందేనే'' అనేశాడు ఆంజనేయులు.

ఆమెముఖం వికసించింది. '' మీకూ అందాలూ ఫ్యాషన్లూ బాగానేతెలుస్తున్నాయే! '' నవ్వింది.

'' నీకు కంపెనీ ఇవ్వడంకోసం తెలుగు టీవీ సీరియల్స్ తెగ చూస్తున్నాగా . నగల గురించి, చీరల గురించి, బ్లౌజుల కొత్తడిజైన్లగురించి నా జీకేబాగా పెరిగిందే!''ఫోజు కొట్టాడు.

'' సంతోషించాం కానీ పదండి_ _ _. ''

ముందు వెళ్లి బైక్ స్టార్ట్ చేయబోతేకసిరినట్టు చూసింది.

'' పెళ్లికిమీ డొక్కు బండిమీద వెళ్లటమా , డ్యామ్ ఇన్సల్ట్ .

# నిజ పెళ్ళాంతో పెళ్లికి

కథ

క్యాబ్ బుక్ చేయండి'' హుకుం జారీచేసింది. 'జీ హుజూర్' అనేశాడు. ఫంక్షన్ హాల్ ముందు కారు దిగారు ఆంజనేయులు దంపతులు. పెళ్లి మంటపం రంగురంగుల విద్యుత్ దీపాల కాంతిలో మెరిసిపోతోంది.
ఆ వెలుగులో అతన్ని చూసిఉలిక్కిపడిందిలతాంగి.
'' నా పక్కన మీరు మరీముసలి వాళ్లా కనిపిస్తున్నారండి. కనీసం తెల్లజుట్టుకిఇంత నల్లరంగు పూసు కోవాలన్న ఇంగితం కూడా మీకు లేకపోయిందిఖర్మ !''
వెర్రిగా నవ్వాడు. '' అంతా చూస్తున్నారు, పద పద___.''
'' చూడనీయండి. నేను చెప్పిందినిజమా కాదా!''
'' 100% కరెక్ట్ గాని లోపలికిపద.. .''
'' నాకో డౌటు. నాకన్నా మీరు మూడేళ్లేపెద్దని ప్రూఫ్ గా మీ టెన్త్ సర్టిఫికెట్ చూపించారు. అదైనా నిజమేనా దొంగదా!''
'' నిజమేనేబాబూ! ''
'' సర్టిఫికెట్ నిజమైనా డేట్ అఫ్ బర్త్ కచ్చితంగా అబద్దందేఅయి ఉంటుంది. అందుకేనా కన్నా పది ఏళ్ళు పెద్దగా కనిపిస్తున్నారు!''
''నీ ఇష్టం వచ్చినట్లు అనుకో గాని ఇప్పుడిక్కడ టీవీ చర్చ పెట్టకు'' గడ్డం పట్టుకుపోయి మానేసి దండం పెట్టాడు.
''హు '' అంది.
పెళ్లి మంటపం ముందు దర్జాగా కారు దిగాం.
'' అబ్బో , దగ్గర దగ్గర రెండు పర్లాంగులున్నా దారి పొడవునా లైటింగ్ బాగానేఅరేంజ్ చేశారే___.!'' అడుగులేస్తూ అన్నాడు ఆంజనేయులు.
1
''మీలాగా కాదు. నాలుగు చేతులతో సంపాదిస్తున్నాడుగా ! ''
నోరు చేత్తోనొక్కుకున్నాడు ఆంజనేయులు.
'' ఎగురుడు కాస్తతగ్గించి స్టైల్ గా హుందాగా నడవండి. మీరు ఆఫీసరు. మీ ఫ్రెండేమో బిజినెస్మేన్. మీ హోదాకితగ్గట్టు నడుచుకోండి, ముందేచెప్తున్నా___.!''
'' ఇంటికాడ క్లాసు తీసుకున్నావు కదే!''
'' మీ మతిమరుపు తెలుసు గనుక గుర్తు చేస్తున్నా. ఛ ఛ మట్టిరోడ్డండి. ప్యాంటు అంచులు దుమ్ము కొట్టుకుపోతున్నాయి. పైకెత్తి పట్టుకోండి___'' ఆర్డర్ వేసింది.
'' టక్ చేసుకుని___ ప్యాంటు పైకి ఎత్తుకొని నడవడం___. బాగోదేమోనే!'' నసిగాడు.
అతడిఇబ్బందిపట్టించుకోలేదామె.
''బాగానేఉంటుంది. ఉతికేవాళ్ళకితెలుస్తుందిఆ బాధ ఏంటో!'' మరి నోరు విప్పలేక ప్యాంటు పైకెత్తి పట్టుకుని జాగ్రత్తగా నడవసాగాడు. కొందరు వింతగా చూశారు.
కళ్ళు ఎగరేశారు ఇంకొందరు. అమ్మాయిల చూపులు చురుక్కుమనేసరికికాలికిదెబ్బ తగిలినట్లు కుంటడం మొదలు పెట్టాడు.
మంటపం పట్టుచీరలతో, సెంటు వాసనలతో, బంగారు నగల ధగధగలతో వెలిగిపోతోంది.
తన ట్రేడ్‌రే మార్క్ నవ్వు వదిలి పరిచయస్తుల్ని హ్యాపీగా పలకరించాడు. వాళ్లతో కబుర్లు చెబుతూ నవ్వుతూంటే లతాంగిపిలిచింది.
'' మరీఆ విరగబాటు నవ్వేంటి. మీరు ఆఫీసరు. హుందాగా ఉండండి___!''
తలాడించి, ఆమెని అనుసరిస్తూ వెళ్లి ముందు వరుసలో కూర్చున్నారు.
పెళ్లి తతంగం మొదలైంది. స్టేజి మీద ఉన్న మిత్రుడికికనిపించేలా కాస్తముందుకెళ్లి చెయ్యి ఊపాడు.
అతడు ఆనందంగా బదులిచ్చాడు.
'' నేను వచ్చినందుకు ఎంత హ్యాపీగా ఫీల్ అవుతున్నాడో చూడు. ఎంతైనా ఫ్రెండ్ ఫ్రెండే!'' '' చాల్లెద్దరూ . ఏదోగొప్పదికనుక్కున్నట్టు మాట్లాడతారేంటి!'' ఆ విసురుకిఆంజనేయులు నోటికి తాళం పడింది. 'ఇక ఎప్పుడూ ఆమెముందు వూరికేనోరు తెరవకూడదు' అని అప్పటికప్పుడు ఒట్టు పెట్టుకున్నాడు.
ఆమెఅసహనంగా కదులుతూ అటూ ఇటూ చూసింది. '' ముహూర్తానికిచాలా టైం ఉందికానీ ముందెళ్లి భోంచేద్దాం పదండి___'' లేచింది.
'' ముహూర్తం అవ్వకుండా___. ఎవరైనా చూస్తే బాగోదేమోనే.....!''
'' నాకు బాగానేఉంటుందికానీ,

# నిజ పెళ్ళాంతో పెళ్లికి

కథ

రండి''
ఇద్దరూ డైనింగ్
ఏరియాలోకివెళ్లారు. ఎన్నో రకాల
స్టాల్స్ లో మరెన్నో రకాల కూరలు,
బిర్యానీలు, పండ్లు, స్వీట్లు,
దోశ ఇడ్లీలు, సమోసా చాట్ లు
నోరూరిస్తున్నాయి !
'' ఎన్ని రకాలు అరేంజ్
చేశారో చూడండి. మీ ఫ్రెండ్
చేతులతోనేకాదు కాళ్లతోనూ
సంపాదిస్తున్నాడన్నమాట. మీరూ
ఉన్నారు ఎందుకు. ఆఫీసర్ అన్న
మాటేగాని సొంత కారు కూడా
లేదు!'' ఈసడించింది.
పళ్లికిలిస్తూ సైలెంట్ గా నవ్వాడు
ఆంజనేయులు.
చెరో ప్లేటు తీసుకున్నారు.
ప్లేటు నిండా అన్ని రకాలూ
వడ్డించుకున్నారు. తినబోతుంటే
అరిచిందామె. '' ఆగండాగండి.
ఆ ప్లేటు అక్కడ పెట్టి, అర్జెంటుగా
చొక్కా విప్పేయండి'' ''
ఇదిఫంక్షనే. మనిల్లు కాదు.....''
ఏడుపు ముఖం పెట్టాడు.
'' గనుకేవిప్పమంటున్నాను.
కూరలు, సాంబారు మీ షర్టునిండా
పోసుకుంటారు. ఆ మరకల్ని మళ్లీ
మళ్లీ వేసినా వాషింగ్ మిషనూ
వదిలించలేదు. అలా మిడిగుడ్లు
వేసుకుని చూస్తారేం, తీసేయండి
తీసేయండి...!''
2
తన్నుకొస్తున్న ఏడుపుని
దిగమింగుకుని మెల్లగా
షర్టుతీసిఒక పక్కన కుర్చీ మీద
పెట్టిప్లేట్ అందుకున్నాడు.
అందరూ తన వంక చూస్తూ
ఉండటంతో ఒక మూలకు
వెళ్ళిపోయి స్తంభం వెనక నిలబడి
తినసాగాడు.
రెండు ముద్దలు నోట్లో
కుక్కుకున్నాడోలేదో పిడుగులా
వచ్చి పడిందిలతాంగి. '' నక్కినక్కి
తింటున్నారేంటి. దొరికిందేసందని
స్వీట్ మీద స్వీట్ లాగిస్తున్నారా.
అదేం కుదరదు. మీరు షుగర్
పేషెంట్ అని మర్చిపోకండి....!''
'' ఎప్పుడోఒకసారితింటేపర్వాలేదని
డాక్టరు చెప్పేడు కదే...!''
'' డాక్టర్కేం ఎన్ని అయినా చెప్తాడు.
మీకు ఏమైనా వస్తేపడేదినేనా ,
అతగాడా!''
ప్లేట్లోని మూడు రకాల స్వీట్లు
తీసి చెత్తడబ్బా కోసం చూస్తుంటే,
'' బంగారం లాంటిస్వీట్లు
పడేస్తానంటారేంటి....'' అంటూ
హ్యాండ్ బ్యాగ్ లోంచి ఒక కవర్
తీసిఅందులో వేయించుకుని, ''
దీన్ని మీ జేబులో పెట్టండి'' అంది.
అలాగేచేశాడు. '' అదిగో ఆ పక్కన
డ్రైఫ్రూట్స్ లడ్డూ లు ఉన్నాయి. ఈ
పక్కన కొత్తరకం కోవా ఉంది. దాని
పక్కనేపూతరేకులు ఉన్నాయి. చాలా
బాగున్నాయిట. ఒకసారిఅలా వెళ్లి
ఒక్కోటీ రెండేసిచొప్పున ప్లేట్లో
పెట్టుకు రండి.....''
'' ఎవరైనా
చూస్తేఏమనుకుంటారోనే!''
'' స్వీట్స్ పిచ్చివాడు అనుకుంటారు.
అనుకోనీండి, మీదేం పోతుంది!
వెళ్ళండివెళ్ళండి....'' అతడు
వెళ్లి తేగా అవన్నీ మరో సంచిలో
వేయించుకుని అతడిప్యాంటు
రెండోజేబులో కుక్కింది. ఎత్తుగా
ఉన్న జేబుల్ని చూసుకుని
ఇబ్బందిగా కదులుతూ పరమ
ఇబ్బందిపడుతూ చుట్టూ
చూసాడు. ఎవరూ తనని
గమనించడం లేదు. హమ్మయ్య
అనుకుని సాంబార్ కోసం
వెళ్లబోతుంటేఆపింది. '' నో
సాంబార్ నో రసం. బనీను
చండాలం చేసేస్తారు.
చిన్నపిల్లడికన్నా అధ్వాన్నంగా
తింటారు. కూరలతో
సరిపెట్టుకోండి... పోనీ పెరుగు
వేసుకోండి''
"షర్టుతీసేసాను కదే!"
"అందుకేఆ కన్సెషన్.
లేకపోతేప్యాంటు కూడా తీయాలి !''
"హమ్మో వద్దులే!''
ఎలాగో భోజనం ముగించాడు.
ఒక కుర్చీ మీద వేసిన షర్ట్ కోసం
వెదికాడు. అది ఎంగిలి చేతులు
తుడిచిన గుడ్డగా రూపాంతరం
చెందిఉంది!
కెవ్వుమన్నాడు. ''ష్ ఏడుపు ఆపు .
ఇక్కడ వేసినప్పుడేఅనుకున్నాను,
ఇలాంటిదేదోజరిగే ప్రమాదంర్
ఉందని. అలాగేజరిగిందిచూడు
. దరిద్రుడు ఏ రేవుకి వెళ్లినా
పిత్తపరిగెలే దొరుకుతాయిట!'' ''
ఇప్పుడు ఎలాగే!''
'' బనీనుతోనేవచ్చేయండి, దాన్ని నా
హ్యాండ్ బ్యాగ్ లో దాస్తాను''
'' సిగ్గుతో చావాలి. కొంచెం
తెలివిగా ఆలోచించవే...''
చూపులతో బతిమాలాడుర్ .



# నిజ పెళ్ళాంతో పెళ్లికి

కథ

'' అయితేతొడిగేసుకోండి. కొత్తరకం డిజైన్ అనుకుంటారు___.''
ఏడుపు తన్నుకొస్తుంటే ముక్కు మాతంర్ఱచీదుతూ తొడుక్కున్నాడు.
'' టక్ చేయండి, కొంత కవర్ అయిపోతుంది''
అలాగేచేశాడు. '' నలుగురికళ్ళల్లో పడకుండా త్వరగా గిఫ్ట్ ఇచ్చేసివెళ్ళిపోదాం పద''
స్టేజి మీద లైన్ చాలా పెద్దగా ఉంది. దిగులుగా చూశాడు.
ఆమెఅతడిచేతిలోని చిన్న గిఫ్ట్ వంక చూసినుదురు చిట్లించింది. '' అందరిచేతుల్లోనూ ఎంత పెద్దగిఫ్ట్ లు ఉన్నాయో చూడండి. ప్యాకింగ్ పెద్దగా చేయించమని మీకు ప్రత్యేకంగా చెప్పానా లేదా!''
" చెప్పావు గాని___ గిఫ్ట్ చిన్నదికదా అని___. !'' నీళ్లు నమిలాడు.

3

'' అయితేపెద్దప్యాక్ చేయకూడదా! ? మీ తెలివి తెల్లారినట్లేఉంది. మీకు ఆఫీసర్ ఉద్యోగం ఇచ్చిన వెధవ ఎవడండీ!''
'' ఇప్పుడు ఆ భారతం ఎందుకులే, అంతా వింటున్నారు.....''
ఆమెచెవిలో గొణిగాడు. '' సరేలెండిసంబడం. అదిగో మీ ఫ్రెండ్ అక్కడ ఉన్నాడు. అతన్ని పిలుస్తూ పక్క నుంచి దూసుకెల్లండి. మీ వెనక నేను వచ్చేస్తాను. లేకపోతేఈ క్యూ ఇవ్వాల్టికితెమిలేట్టు లేదు___. ''
అటు ఇటు చూసిపక్క నుంచి వెళ్ళి మధ్యలో దూరబోయాడు కానీ ముందు వాళ్ళు ఆపేశారు. '' చదువుకున్నవాడిలా ఉన్నావు, ఇదేం పని ? ఫాలో క్యూ'' అనేసరికిబిక్క చచ్చి వెనక్కి రాక తప్పలేదు. '' మీ మొహమాటం తగలెయ్య. ఎవడోఏదోఅంటేమీకేంటండి. మీరు పెళ్లికూతురు తండ్రిఫ్రెండు. కాస్తదబాయించొద్దూ ''
అంటూ ఆంజనేయుల్ని దబాయించిందిలతాంగి.
తప్పు చేసిన వాడిలా తలొంచుకున్నాడు.
మెల్లగా లైను కదిలింది. గిఫ్ట్ ఇచ్చి నవ్వుతూ ఫోటో దిగారు. '' ఫోటో సరిగ్గా వచ్చిందా. మేం చాలా దగ్గరి వాళ్ళం'' ఫోటోగ్రాఫర్ ని అడిగింది.
అతడు మరో ఫోటో తీసితమ్సప్ గుర్తు చూపించదమేగాక సైగ కూడా చేశాడు. ఆ పక్కనేఉన్న మిత్రుడు వచ్చి వారిని కూతురికిఅల్లుడికిపరిచయం చేశాడు. '' మీతో ఒక ఫోటో అన్నయ్యగారు......'' అంటూ మరోటితీయించింది.
'' వాళ్లు నిజంగా తీస్తున్నారో లేదో. ఆఖరికిఆల్బమ్ కి ఎక్కుతాయో లేదో. ఊరికేఅడిగామని అనిపించుకోవడం ఎందుకే''
'' అయితేఒక పని చేయండి. పెళ్లిలో తీసిన మన ఫోటోలు మెయిల్ చేయమని మెయిల్ పెట్టండి , చెక్ చేయొచ్చు ! ''
మరేమీ అనలేక తన మార్కు వెర్రినవ్వు నవ్వాడు ఆంజనేయులు.
నాలుగు అడుగులు వేసిన తర్వాత కెవ్వుమని అరిచింది. '' మళ్లీ ఏమైందే''
'' రిటర్న్ గిఫ్ట్ తీసుకోలేదు. మీరు పరుగున వెళ్లి పటండిర్ఱ ''
'' పోనీ లెద్దూ !''
''అదేం మాట. గిఫ్ట్ ఇచ్చినప్పుడు రిటర్న్ గిఫ్ట్ తీసుకునేహక్కు, తీసుకోవలసిన బాధ్యత మనకుంది. వెళ్ళండి!'' ఉరిమింది.
'' ఆడవాళ్ళకే ఇస్తున్నారే.....''
'' మిమ్మల్ని ఎవరూ పెద్దమగాడు అనుకోరు కానీ, వెళ్ళండివెళ్ళండి'' తరిమింది.
ఏడుస్తూ వెళ్లి ఫ్రెండ్ తో రికమండేషన్ చేయించి, రిటర్న్ గిఫ్ట్ తో ఛాంపియన్ లా వచ్చాడు ఆంజనేయులు.
'' ఎన్నాళ్ళకిఒక పని సక్రమంగా చేశారు!''
'' ఏం చేయటమోనే. జన్మలో నిజ పెళ్లాంతో ఛస్తేపెళ్లికిరాకూడదని పిస్తోంది!'' విరక్తిగా అన్నాడు. '' మరిగర్ల్ ఫ్రెండ్ తోనో లేక ట్రోఫీవైఫ్ తోనో వస్తారా! నిలువునా చీల్చి ఉప్పూ కారం దట్టించి చంపేస్తాను, ఖబడ్దార్!'' రంకెవేసింది.
సరిగ్గా అప్పుడు అరుంధతీ నక్షత్రదర్శనానికివధూవరులను అటుగా తీసుకొచ్చాడు పురోహితుడు. ఆమెమాటలు పెళ్ళికొడుకు విన్నాడు. అతని కళ్ళకు ఆకాశంలో కాదు, నేల మీదేకోటిచుక్కలు కనిపించాయి!

★★★★★★



సీరియల్

# ఓడిన గెలుపు





వాడపల్లి పూర్ణ కామేశ్వరి

అదీ కాక పొలాన్ని కూడా ఎవ్వరమూ చూసుకోలేక పోతున్నాము. కౌలు ఏటేటా ధాన్యం తగ్గించి ఇవ్వడమే జరుగుతోంది. ఖర్చులూ, పండిన పంటా సరి పోయిందంట్టూ సరిపెట్టేస్తున్నారు. ఆ ఆరు సెంట్లూ అమ్మితే వచ్చే రొక్కం మూడొంతులు వాడికి ఇస్తాను, ఒక వంతు నేను తీసుకుంటాను. ఇన్నాళ్ళూ నేను అనుభవించిన దానికి గానూ ఈ రకంగా ముట్ట జెప్పడమవుతుంది. ఇద్దరికీ న్యాయమే జరుగుతుంది. ఏమంటావమ్మా" అన్నీ ముందుగానే నిర్ణయించుకున్నట్టుగా చెప్పాడు.

"పెద్దవాడు చెప్పిన ఏర్పాటు బాగానే అనిపించింది. సరే, అనే ముందు గోవర్ధన్ ని ఒక మాట అడగాలనుకుంది. కానీ వాడు ఎన్నడూ తన మాట కాదనలేదన్న ధైర్యంతో సరేనని చెప్పేసింది. ప్రతీ నెలా ఇద్దరికీ ఎలాంటి లావాదేవీలూ లేకుండా ఒక్కసారిగా పంచేసుకుంటే ఎవరి కాపురాలు వాళ్ళు చూసుకుంటారు. ఒకరి విషయంలో ఒకరు జోక్యం చేసుకునే పరిస్థితి వుండదు" అనుకుంది.

"గోవర్ధన్, నువ్వేమంటావు రా? నీకు ఈ ఏర్పాటులో ఎలాంటి ఆక్షేపణా లేదు కదా?" ఉండదని తెలిసినా మాటవరసకి రాఘవ ఎదుటే అడిగింది సుశీలమ్మ.

"అదేంటమ్మా అలా అంటావు. నీకు ఏది మంచి అనిపిస్తే అలాగే చెయ్యి. నాకూ నా కుటుంబానికి నీ నీడన ఎప్పుడూ మంచే జరుగుతుంది. నీకేది సబబనిపిస్తే అదే చెయ్యమ్మా" అన్నాడు గోవర్ధన్.

"సరే ఐతే, ఇద్దరి పేరిటా బహుమతి దస్తావేజులు సిద్ధం చెయ్యండి. ఎవరివి వాళ్ళ చేతిలో పెట్టి నేను కృష్ణా రామా అని నిమ్మళంగా కన్ను మూస్తాను" మనసులోని బరువంతా ఒక్కసారి దిగినట్టుగా వుంది సుశీలమ్మకు.

# సీరియల్

**జరిగిన కథ:**
హరిత బ్రిగేడియర్ జనరల్ మనస్విని దగ్గర పి ఏ గా పనిచేస్తూ ఉంటుంది.హిమ మనస్విని ఇంట్లో అన్ని పనులు చుసుకోటానికి హిమ చేరుతుంది .మనస్విని తల్లి డా అమృత మరణిస్తుంది . పలకరించటానికి హరిత వెళుతుంది .

**ఇక చదవండి**

గోవర్ధన్ జీవితమూ గాడిలో పడుతోంది. వాడూ ఓ ఇల్లూ వాకిలి అమర్చుకుంటే ఎలాంటి బెంగా వుండదు. భగవంతుడి దయవల్ల వాడికి మంచి పెళ్ళాం దొరికింది. అన్ని విధాలా పిల్లలు అభివృద్ధిలోకి రావడం కంటే తల్లిగా నేను కోరుకునేదేముంటుంది, సంతృప్తిగా అనుకుంది. వాడి చిన్నతనంలోనే పోయారు గానీ, వాళ్ళ నాన్నగారే వుంటే, వాడూ ఆనాడే ఇజినీరు అయ్యేవాడు. ప్రారంభంమే పెద్ద ఉద్యోగంతో మొదలు పెట్టేవాడు.

నా చిన్న కొడుకుని పెద్ద ఇంజినీరుని చేస్తానని అనుకునే వారు ఎప్పుడూ ఆయన. ఆ రోజుల్లో వచ్చిన విష జ్వరాలు ఇంటికో మనిషిని పొట్టన పెట్టుకున్నాయి. వారూ దానికి బలైపోయారు. ఆజానుబాహులు, పెద్దపులిలా వుండేవారు. జ్వరంతో బాధ పడి అస్తిపంజరంలా అయిపోయారు. ఆయన్ని చూడలేక పోయాను. ఎన్ని మందులు వేయించినా తగ్గలేదు. ఎన్ని దేవుళ్ళకి మొక్కినా, నాకు వైధవ్యమూ, ఒంటరితనమూ తప్పిచలేదు.

ఏడుస్తూ కూర్చోవడానికి నా జీవితమేమీ వడ్డించిన విస్తరి కాదు. ఆయన చేతుల మీదుగా పెద్దదాని పెళ్ళి మాత్రం చేశారు. మిగిలి ముగ్గురునీ ఓ కొలిక్కి తీసుకురావాలి. ఏటేటా కౌలు ఇచ్చే పొలం మీద ధాన్యం ఇంట్లో వాడగా మిగిలినవి అమ్మి ఇల్లు గడుపుకుని వచ్చేదాన్ని. అప్పట్లో మీద పడ్డ కొత్త బాధ్యతల్ని చూసుకోవడంలో చిన్నాడి చదువు మీద ఎక్కువగా శ్రద్ధ పెట్టలేదు. అమ్మా అమ్మా అంటూ నా చుట్టూనే తిరిగేవాడు. ఏదో కాలక్షేపం చదువు పూర్తెయ్యిందే కానీ, వాళ్ళ నాన్నగారనుకున్నట్టు నేను చదివించలేక పోయాను. పెద్దవాడి చదువంతా హాస్టల్లో ఆయ్యింది. ఎప్పుడూ హాస్టల్లో గడిపినందుకో ఎంటో వాడు ఇంటిగురించి పెద్దగా పట్టించుకునే వాడు కాదు. వాడి ధోరణిలో వాడుండడమే గానీ మరేదీ పట్టించుకునే అలవాటు అసలు అవ్వలేదు. గోవర్ధన్ ఇంటి పట్టున వుండడంతో అమ్మ పడిన ఇబ్బందులన్నింటినీ ప్రత్యక్షంగా చూసాడు గనుక వాడికి అన్నీ తెలిసి నడచుకుంటాడు. అమ్మ మీద ఎనలేని గౌరవము. చెప్పలేనంత ప్రేమ.

"బిందూ, వెళ్ళొస్తాను. ఈ రోజు క్లయింట్ ఆఫీస్ వరకు వెళ్లి రావాలి. లేట్ అవుతుంది. అమ్మకు ఈ నెలకు సరిపడ మందులు తెచ్చి ఇవ్వ మని మెడికల్ షాపుకి ఫోను చేసి చెప్పెసాను. ఇచ్చి వెళతాడు. వెళుతూ వెళుతూ నేను పేమెంట్ చేసేసి వెళతాను. మందులు వచ్చాకా వీలు చూసుకుని ఎప్పటికి మల్లేనే నువ్వు అమ్మ వేసుకోవడానికి వీలుగా రోజు వారీ బాక్సుల్లో వేసెయ్యి" హడావిడి గా షూస్ వేసుకుంటూ చెప్పాడు. అత్తయ్యగారి మందులు పొద్దున్న, మధ్యాహ్నం, సాయంకాలం చప్పున విభజించేసి. ఏ పూట వేసుకోవలసినవి ఆ పూట వేసుకునేట్టు, వారం-వారం తేదీలుగా మార్కు చేసిన పెద్ద డబ్బాల్లో సద్దుతుంది హిమ. ఏ రోజుకారోజు విభజించేసి వేసుకోవడానికి వీలుగా చిన్న చిన్న భాగాలుగా చేసిన ఆ పెద్ద బాక్స్ లో పెట్టడంతో, తీసి వేసుకుందుకు సౌకర్యంగా వుంటుంది సుశలమ్మ. "అలాగే అండీ. ఎక్కడికో మీటింగంటూ లంచ్ పట్టుకెళ్ళట్లేదు. టైముకు ఎక్కడో అక్కడ తినండి. భోజనం మానెయ్యకండి. సరేనా" చంటి పిల్లాడికి చెప్పినట్టు చెప్పింది



# సీరియల్

హిమ.

వీధి గుమ్మం వరకూ వెళ్ళి, "బిందూ, బిందూ" అంటూ పరుగున వెనక్కి వచ్చాడు. "ఏంటండీ, ఏదైనా మర్చిపోయారా?"

వంటింట్లోంచి చీర చెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చిన బిందూ అతడని బెడ్రూమ్ లోకి వెళ్ళాడని ఆమె అటే వెళ్ళింది. గదిలోకి వస్తున్న ఆమెను గుమ్మం పక్కనే నిలబడి వేచి ఉన్న గోవర్ధన్ ఒక్కసారిగా లాగాడు. ఆమె చేయి పట్టుకుని పక్కకు లాగి, అమాంతంగా ఆమెను వాటేసుకుని, చెక్కిళ్ళపై తన పెదవులతో ముద్దుల ముద్రలు వేసి, "బిందూ, లవ్ యు రా. ఏ జన్మ పుణ్యమో నువ్వు నాదానివైయ్యావు. మళ్ళీ జన్మలోనూ నిన్నే నా భాగస్వామిగా పొందాలి. చెప్పాలనిపించి వచ్చాను" మనసారా చూసుకుని కళ్ళ నిండా బిందు ప్రతిబింబాన్ని నింపుకుని వెళ్ళాడు.

బిందూ కళ్ళల్లోనూ మనసులోనూ ఆ క్షణాలు ఒక కలలా ఉండి పోయాయి. ఆమె చేస్తున్న ప్రతీ పనిలోనూ ఆమెకు గోవర్ధనే కనిపించాడు. ప్రతి శబ్దంలోనూ అతని మాటనే వినిపించాయి.

★★★

"ఆఫీసులో తీసుకున్న స్వల్పకాలీన లోను చేసిన పుణ్యమో, అంతకు మించిన బిందు మనసు పుణ్యమో గానీ అమ్మ ప్రాణాలు కాపాడుకో గలిగాము. ఇప్పుడు అమ్మ ఆరోగ్యం పూర్తిగా కుదుట పడింది. ఆఫీసు అప్పు తీరుస్తూ, కొంత డబ్బు పక్కన పెట్టి దాస్తూ హిమకు మళ్ళీ నగలు అమర్చాలి. ఎన్నడూ నోరు తెరిచి ఏదీ అడగని బిందూకు ఆమెకెంతో ఇష్టమైన కెంపుల నెక్లెస్ బహుమతి గా ఇవ్వాలి" ఎన్నెన్నో కలలు కంటున్నాడు గోవర్ధన్.

మరో ఆరు నెలల్లో అనుకున్న మొత్తం సమకూరుతుంది. సరిగ్గా అప్పుడే తన పుట్టిన రోజు పండుగ వస్తుంది. ఆరోజు ఆమెకు కెంపుల నెక్లెసుతో సర్ప్రైజు బహుమతి ఇవ్వాలి. కెంపుల కంటే మెరిసే ఆమె చెక్కిళ్ళ ఎరుపులు చూడాలి. బిడియంతో ఆమె ముడుచుకుపోతుంటే ఆమె కళ్ళల్లోకి నేను చూస్తుంటే, ఆమె నా గుండెల్లో దాచేస్తున్న ఆమె మోమును చూడాలి. ఆ ముసిముసి నవ్వుల పెదవులను నా పెదవులతో బంధించేయాలి.
నాలో కరిగిపోతున్న నా హిమబిందు ప్రేమలో నేను కరిగిపోవాలి. ఎన్నెన్నో కలలు కంటూ హుషారుగా పని చేస్తున్నాడు గోవర్ధన్.

ఆఫీసు పని ముగించుకుని, క్లయింట్ మీటింగుకి కావలసిన కాగితాలన్నీ తీసుకుని, ఫైల్ పట్టుకుని బయలుదేరాడు గోవర్ధన్. స్విగ్గీలో ఆర్డరు చేసుకున్న భోజనం తింటూ బిందూ చేతి వంటనే తలచుకున్నాడు. అమ్మ నేర్పిన వంటలన్నీ ఇట్టే నేర్చేసుకుని, అమ్మ లాగానే చేస్తున్న బిందూను అమ్మే పొగడడం గోవర్ధన్ కు ఆశ్చర్యాన్నే కలిగించేది.

"అమ్మాయ్, నువ్వు అన్నీ ఇంత రుచిగా చేస్తే రేపు నా వంటలకు కూడా బాగా లేదంటూ వంకలు పెడతాడు నా కొడుకు" హిమబిందుతో మురిపెంగా అమ్మ అంటుంటే, గోవర్ధన్ కు మహదానందంగా వుండేది.

అమ్మా బిందూ మురిపెంగా మాట్లాడుకునే మాటలను పదేపదే తలచుకుంటూ రెండు గంటల సమావేశానికి బయలుదేరాడు గోవర్ధన్.

తన బండికి ఎదురుగా వేగంగా పయనిస్తున్న కారు డోర్ సరిగ్గా లాక్ అవ్వలేదు. వెనుక సీట్ లో ఇద్దరు పిల్లలు కనిపించారు. కాస్త పరికించి చూడగా, వారిద్దరూ నవ్వుతూ ఆడుకుంటున్నారు. రమారమి కారుణ్య, కుందనల వయసు పిల్లలే అనిపించింది.

వెనుక డోర్ సేఫ్టీ లాక్ పడలేదు. తన బండికీ, కారుకీ ఇంచు మించు పది అడుగుల దూరం వుంది. ఐతే, వారికి చెప్పాలంటే ఆ పదడుగుల దూరమూ దాటాలి. మధ్యలో వస్తున్న వాహనాలను దాటుకుంటూ వెళ్ళాలి. ప్రయత్నం

## సీరియల్

మొదలు పెట్టాడు. వేగం పెంచాడు. కారు కుడి వైపున రోడ్ డివైడర్ ఉంది. అంచేత ఆ పక్కకు వెళ్ళడము కుదరదు. ఎడమ వైపున ముందుకు వెళ్లే అవకాశం అతి స్వల్పగా వుంది. వాహనాల రద్దీ. కారుకూ తనకూ అదే ఎడదను పాటిస్తూ కొద్ది కొద్దిగా ముందుకు వెళుతూ కారును చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. తన బండికి రెండు వైపులా వాహనాలు ప్రవాహం కొనసాగుతున్నందువల్ల వాళ్ళను దాటేసి ముందుకు వెళ్లే దారి ఎంత మాత్రమూ కలుగ లేదు. ఇంతలో సిగ్నల్ వచ్చి బళ్ళు అన్నీ ఆగాయి. తన బండి సిగ్నల్ కు చాలా దూరంలోనే వుంది.

బండి వదిలి ముందరికి వెళ్లి వారికి చెప్పేటంత వ్యవధి లేదు. ఆలోచన తెగే లోపు పచ్చ సిగ్నల్ పడడంతో వాహనాల వేగం పుంజుకుంది. ఇక ఇలా నిరీక్షించి లాభం లేదు అనుకుని ఎడమవైపునే మెల్లిగా కొంచం ముందుకు వెళ్లే ప్రయత్నం చేసాడు. ఆ కారు కూడా అదే వేగంతో ముందుకు వెళుతోంది. ఎంత ప్రయత్నించినా అంతే దూరం ఉంటోంది.

అంతలోనే కుడి వైపు వున్న ఒక కారు యూ టర్న్ తీసుకోవడం తో గోవర్ధన్ ముందుకు వెళ్ళడానికి వీలుపడింది. కట్ చేసి ఒక నాలుగు అడుగులు ముందుకు వెళ్ళి ఆ కారు వెనక వరకు రాగలిగాడు. వాహనాలు మరింత వేగం పుంజుకున్నాయి. అయినా ముందుకు వెళ్లి ఆ కారుని వెనుకనుంచి దబ దబా కొట్టగా, ముందు సీట్లోని విండో గ్లాస్ తెరుచుకుంది.

“బ్యాక్ డోర్ లాక్ అవ్వలేదు. పిల్లలు ఆడుతున్నారు, ప్రమాదం” అన్నాడు. వారికి అర్థమయ్యీ అవ్వగానే దాన్ని అటెండ్ అయ్యారు.

“హమ్మయ్య” అనుకున్నాడు గోవర్ధన్.

ఎడమ చేతి వైపు కట్ చేస్తుండగా ఎదురుగా సిగ్నల్ నుంచి ఒక కారు అతి వేగంగా దూసుకుపోయింది. గోవర్ధన్ బండిని పక్కాగా బలంగా గుద్దింది. గోవర్ధన్ శరీరమంతా ఒక్క ఉదుటున ముందుకు తగులుకుని, తన యాక్టివా హాండిల్ ఛాతీకి బలంగా తగిలి పక్కకు పడ్డాడు. ఆ వేగం వల్ల బండితో సహా నాలుగు అడుగులకు పైగా ఈడ్చబడి పడిపోయాడు. సిగ్నల్స్ జోన్ అవ్వడం తో ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా వున్నారు. గాయపడ్డ గోవర్ధన్ ను పక్కనే ఉన్న ఆసుపత్రికి వెంటనే తీసుకు వెళ్లారు. వేగంగా నిర్లక్ష్యంగా నడిపి గుద్దిన కారు డ్రైవర్ ని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

కొన ఊపిరితో వచ్చిన గోవర్ధను కు క్యాజువాల్టీ లో వెంటనే ప్రాథమిక చికిత్స ప్రారంభించారు. ఆక్సిజన్ పెట్టారు, పల్స్ తగ్గిపోతుండగా ఎమర్జెన్సీకి తరలించారు.

రక్తస్రావం అధికంగా జరిగినందు వల్ల రక్తము అవసరమవుతుందని వెంటనే రక్తం కోసం పరీక్షకు తీశారు. పల్స్ మరింత తగ్గ సాగింది. ఇంక చేసేది లేక ఎలక్ట్రికల్ షాక్ల ద్వారా గుండెను పునరుద్ధరించ ప్రయత్నించారు. ఫలితం లేక పోతోంది. కళ్ళుతేలేస్తూ ఒక పక్కగా ఒరిగ పోతున్నాడు గోవర్ధన్. మరింత ప్రయత్నించారు.

★★★

“గోవర్ధన్ గారి ఇల్లాండీ. నేను వారి ఆఫీసులో పనిచేస్తున్న హెచ్. ఆర్ స్టాఫ్” అని చెప్పాడు. హిమ. “అవునండి. మీరూ? వా... రు.. బ్రాంచ్ నుండి మీటింగుకి వెళ్లాలని చెప్పారు” అనుమానంగా అంది

“అవును అమ్మా”

“నా పేరు సాత్విక్. టీవీసి కంపెనీ లో హెచ్ ఆర్ మేనేజర్ గా ఉన్నాను. మీరు నాతో రావాలి. కంపెనీ కారు తీసుకుని వచ్చాను”





# సీరియల్

మృదువుగా అన్నాడు ఆ వ్యక్తి.

"నేనా, ఎందుకూ?"

"మరేమి లేదమ్మా. బ్రాంచి నుంచి క్లయింట్ ఆఫీస్ కు వెళుతుండగా సర్ కు చిన్న రోడ్ ప్రమాదం జరిగింది. కంగారు పడకండి. నెమ్మదిగా రండి" అర్థిస్తూ అన్నాడు సాత్విక్.

"ప్రమాదామా" ఒక్క సారి కేకగా అంది హిమ. పాదాల క్రింద నేలంతా అమాంతం తోడేస్తున్నట్టుగా అనిపించింది హిమకు. నిలువెల్లా ఒణికిపోతూ, "ఇప్పుడెలా వున్నారూ" అంది.

"అమ్మా. మీరూ కంగారు పడకండి. పెద్దమ్మగారు మరింత కంగారు పడతారు. భయపడకుండా ధైర్యంగా నాతో రండి. జరిగినది చిన్న ప్రమాదమే. వారు బాగానే వున్నారు" స్వరాన్ని కాస్త చిన్నగా చేసి అన్నాడు. "అత్తయ్యా, రండి మనము వీరితో వెళ్ళాలి" విషయం గ్రహించిన హిమ తమాయించుకుని అంది.

పిల్లలిద్దరినీ సిద్ధం చేస్తూ ఆమె ముఖంలో కంగారు కనపరచకుండా వుండడానికి శత విధాల ప్రయత్నించింది. పది నిముషాల్లో అందరూ తయారైపోయి బయలు దేరారు. ఎన్నెన్నో ఆలోచనలతో మనసంతా అల్లకల్లోలంగా వుంది. వెయ్యి అణు బాంబులు పేలినంతగా గుండెల్లో దడపుడుతోంది. ఐనా, పైకి మాత్రం ప్రశాంతంగా నే కనిపించింది. కారులో అంతా నిశ్శబ్దం. భరించలే ఆ నిశబ్దాన్ని ఛేదిస్తూ "మరేమి పరవాలేదు కదా బాబూ" గద్గద స్వరంతో అన్నది సుశీలమ్మ. "మీరు బెంగ పడకండి అమ్మ. అంతా బాగుంటుంది" అన్నాడు సాత్విక్. ఆ సమాధానంతో మనసు సమాధాన పడకపోయినా, అప్పటి చేయగలిగింది లేక ఊరుకుంది. అంతా అగమ్య గోచరంగా అనిపిస్తున్నా కారు తీసుకెళుతున్న చోటికి వెళుతున్నారు. బాగుంటుందన్న ఆతడి మాటలే సుశీలమ్మకు కొంత సాంత్వన కలిగించాయి. ఎంత నచ్చ చెప్పుకున్నా హిమ మనసులో చాలా అలజడిగానే వుంది. ఆశ సన్నగిల్లడం మొదలెట్టింది. బేలా చూపులతో, పెల్లుబుకుతున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ, ఉప్పొంగుతున్న దుఃఖాన్ని అత్తగారికీ పిల్లలకీ కనపడనివ్వకుండా వుండే ప్రయత్నం చేస్తోంది హిమ. మెడికేర్ ఆసుపత్రికి చేసిన ఆ అరగంట ప్రయాణమూ వెయ్యి యుగాలు గడిచినట్టనిపించింది. కారు ఆగే వరకూ ఎక్కడికి వచ్చి చేరామో కూడా అవగతమవ్వలేదు వారిద్దరికీ. మెడికేర్ ఆసుపత్రి పోర్టికో ముందు ఆగింది కారు. అప్పటికే ఆఫీస్ సిబ్బంది కాబోలు ముగ్గురు నలుగురు అక్కడ ఉన్నారు. తమతో పాటే వచ్చిన సాత్విక్ ఆతృతగా వారి వద్దకు వెళ్ళి ఏమీ అడగలేదు సరికదా, పక్కనే ఉన్న హాల్ వద్ద కుర్చీల్లో హిమ సుశీలమ్మలను కూర్చోపెట్టాడు. వారికి కాస్త మనసు కుదుట పడడానికి అన్నట్టుగా పిల్లలను తనతో తీసుకెళ్ళే ప్రయత్నం చేసాడు.

(ఇంకా ఉంది )





నాలుగో కోతి



# సోమరిగా మారుతున్న నాలుగో కోతి !

ఇప్పుడు ఎటు చూసినా ఏఐ గురించినే చర్చలు జరుగుతూ ఉన్నాయి.
ఏఐతో ఎలాంటి మార్పులు వస్తాయి, ఎవరి ఉద్యోగాలు పోతాయి, ఎవరికి ఉద్యోగాలొస్తాయి.. అనే చర్చలు సహజంగా మారిపోయాయి.
ఈ విషయాలపై ఎవరికి తోచిన విశ్లేషణలు వారు చేస్తూ ఉన్నారు!
ఎవరికి అర్థమైంది వారు చెబుతూ ఉన్నారు. మరి ఆ సంగతలా ఉంటే.. సామాజికంగా కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం ఉంటుందనేది ఇంకో కాదనలేని వాస్తవం! గత కొన్ని దశాబ్దాల్లో వచ్చిన రకరకాల మార్పులు మనుషుల మానసిక స్థితిపై ప్రభావంతో మొదలుపెడితే, మెదడుకు పదను పెంచడమో, తగ్గించడమో చేయడం వరకూ వచ్చాయి!
ఇలాంటి పరిణామాల మధ్యన కృత్రిమ మేధ ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందోనే విషయం ఆసక్తిదాయకంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఏఐ వల్ల కొందరు సోమరులుగా మారే అవకాశం ఉందని కొందరు ప్రముఖులు హెచ్చరిస్తూ ఉన్నారు! సోమరులుగా అంటే.. శారీరకంగా కాకపోవచ్చు. మానసికంగా, మెదడుకు పని చెప్పాల్సిన అవసరం లేకుండా కొందరు తయారు కావొచ్చు.
ఈ మధ్యనే లింక్టిన్ లో ఒక పోస్టు వైరల్ అయ్యింది. తనకు జాబ్ కన్ఫర్మ్ కావడంతో.. సదరు సంస్థకు ఒక కుర్రాడు పెట్టిన మెయిల్ అది. అందులో కంటెంట్ చాలా బాగుంది. అయితే.. అతడు చేసిన పొరపాటు ఏమిటంటే.. దాన్ని చాట్ జీపీటీ నుంచి కాపీ చేసి, మెయిల్ బాడీలో పేస్ట్ చేసేటప్పుడు.. చాట్ జీపీటీ రెస్పాన్స్ ను యాజిటీజ్ గా దించేశాడు.

తనకు జాబ్ ను కన్ఫర్మ్ చేసిన కంపెనీకి మెయిల్ పంపాలని, అదెలా ఉండాలో ఆ కుర్రాడు ముందుగా జీపీటీకి చెప్పాడు. దానికి స్పందనగా.. జీపీటీ.. మెయిల్ టెక్ట్స్ ఇచ్చింది. ఆ టెక్ట్స్ కు పై వైపున.. ఆ సందర్భం గురించి కూడా చాట్ జీపీటీ ప్రస్తావించింది. ఆ కుర్రాడు మొత్తం ప్రాంప్ట్ నంతా కాపీ చేసి, మెయిల్ లో పేస్ట్ చేసి సెండ్ చేశాడు! దాన్ని అతడెలా లిఖించాడో అర్థం చేసుకోవడానికి జాబ్ ఇచ్చిన కంపెనీకి పెద్ద సమయం పట్టలేదు! అతడి టాలెంట్ ను చూసి ముచ్చటేసి, నువ్వు మాకు అక్కర్లేదని కూడా ఆ సంస్థ అతడికి తిరిగి సమాధానం ఇచ్చింది!





# నాలుగో కోతి

అంటే ఇక్కడ అతడు చాట్ జీపీటీ నుంచి టెక్స్ట్ తీసుకుని పంపినందుకు కాదు బాధ. దాన్ని యాజిటీజ్ గా, కనీసం కొనమొదలు కూడా చూసుకోకుండా.. పంపాడు!
దీంతో అసలు కథ బయటపడింది. మరి ఉద్యోగం సంపాదించుకున్న తర్వాత కూడా ఇలాంటి ఎత్తుగడలు వేసి మొదటికే మోసం తెచ్చుకున్న సోమరితనం అది. అలాంటి సోమరి తనాన్ని ఏఐ మనుషుల్లో పెంచవచ్చు!
పెద్ద పెద్ద మెయిల్స్ రాయడం కూడా ఇప్పుడు సులభం అయిపోయింది. గ్రామర్ నేర్చుకోనక్కర్లేదు, గొప్ప వొక్యాబులరీ అక్కర్లేదు. చాట్ జీపీటీని అడిగితే చాలు.. ఇట్టే ఇచ్చేస్తుంది!
దీంతో.. రైటింగ్ స్కిల్స్ అనేవి మనుషుల్లో ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది!
అన్నీ చాట్ జీపీటీనో మరో ఏఐ టూలో ఇచ్చేస్తే.. సొంతంగా ఆలోచించాల్సిన అవసరం కానీ, రాయడానికి సమయం కేటాయించాల్సిన అవసరం కానీ ఎవరికీ ఉండదు! దీని వల్ల ఆలోచించాల్సిన అవసరం తగ్గిపోయి సోమరితనం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.
గతంలో ఏదైనా తెలుసుకోవాలంటే పుస్తకాలు చదవాల్సి వచ్చేది. ఎన్నో పుస్తకాలు చదివితే కానీ.. అవసరమైన సమాచారం లభించేది కాదు ఏ సబ్జెక్ట్ విషయంలో అయినా. ఆ తర్వాత గూగుల్ వచ్చింది. దేని గురించి సెర్చ్ చేసినా.. అందుకు సంబంధించిన సమాచార లింకులను గూగుల్ ఇస్తూ వచ్చింది. కనీసం వాటిని అయినా ఇన్నాళ్లూ చదివారు. అయితే ఇప్పుడు అలా లింక్ లను ఓపెన్ చేయాల్సిన అవసరం, కొద్దో గొప్పో సమాచారాన్ని చదవాల్సిన అవసరం కూడా లేదు! జస్ట్ ఏఐ టూల్స్ ను అడిగితే చాలు.. అవి డైరెక్టుగా ఆన్సర్ ను ఇస్తూ ఉన్నాయి.
దీని వల్ల అదనంగా చదవడం, అదనంగా శోధించడం, ఒక విషయాన్ని తెలుసుకునే ప్రయత్నంలో మరో విషయాన్ని కొనుగొనడం అనేవి కూడా తగ్గిపోతాయి. ఎప్పుడైతే ఇలాంటివి తగ్గిపోతాయో.. రీసెర్చ్, కొత్త విషయాలను అర్థం చేసుకోవడం, ఆలోచించడం, కొత్తగా ప్రయత్నించడం అనే అవసరాలన్నీ తీరిపోతాయి. ఇవి తీరిపోవడం అంటే మరేమిటో కాదు.. మానసికంగా ఒకరకమైన సోమరితనం అలవాటు కావడమే! ఏఐఈతో ఉన్న ప్రమాదాల్లో కెల్లా ఇది చాలా ప్రమాదకరమైనది. ఉద్యోగాలు పోవడం వంటివి ఎలా ఉన్నా.. అసలు ఆలోచనల అవసరమే తీరిపోతే అది కదా.. తీవ్రమైన ప్రమాదం!



హాస్య కథ

బహుమతి పొందిన హాస్య కథ



# షాపింగ్-సుందరి

యం. రమేష్ కుమార్

వెలుతురికి అతుక్కున్న పురుగుల్లా జనాలంతా టివి సీరియళ్ళకి అతుక్కున్న సమయం. అందుకే వీధిలో అలికిడి లేదు. ఆఫీస్ నుంచి లేటుగా వస్తున్న వామన్రావ్ నిర్మానుష్యంగా వున్న వీధిలో నడుచుకుంటూ ఇంటికి చేరుకున్నాడు.

ఇంట్లోకి వెళ్ళగానే సుందరి కూడా సీరియల్ చూస్తూ కనిపించింది. కొత్తగా పెళ్ళైన వాడు కాబట్టి భార్య ఏంచేస్తున్నా అందంగా.. ఆనందంగానే అనిపించింది.

రిఫ్రెష్ అయ్యి తను కూడా కాసేపు టివి చూశాక "డాళింగ్.. ఏం వండావ్ ఈరోజు? ఆకలేస్తోంది" అన్నాడు.

"ఏవండీ.. ఏమీ అనుకోకండి గానీ ఈరోజు కాస్త బద్ధకంగా వుండి ఏమీ వండలేదండీ.. స్విగ్గీలో ఆర్డర్ చేసేద్దామండీ.." అంది సుందరి.

వామన్రావ్ కి కొంచెం చికాగ్గా అనిపించింది గానీ కొత్త పెళ్ళాన్ని ఏమీ అనలేక "సరేలే.." అన్నాడు. వెంటనే సుందరి సెల్ తీసుకుని టకటకా ఆర్డర్ చేసేసింది. ఆ స్పీడు చూసి వామన్రావ్ కి ఆశ్చర్యమేసింది.

ఆన్ లైన్ లో ఏదైనా ఆర్డర్ చెయ్యాలంటే తనే కాస్త తడుముకుంటాడు.. అలాంటిది ఎంత ఫాస్ట్ గా చేసేసింది!' అనుకున్నాడు.

అది కేవలం మొదలు అని వామన్రావ్ కి తర్వాత గానీ తెలిసిరాలేదు. సుందరి ఆన్ లైన్ షాపింగ్ పిచ్చి యొక్క విశ్వరూపం అతడికి కొన్నిరోజులకి పూర్తిగా అర్థమయ్యింది. ఇంటికి కావలసిన ఉప్పు, పప్పు తో పాటు ఏది కొనాలన్నా సుందరి ఆన్ లైన్ లోనే ఆర్డర్ చెయ్యసాగింది. కొన్ని కొన్ని వస్తువులు అవసరం లేకపోయినా చవగ్గా వస్తున్నాయనో.. ఆఫర్లు వున్నాయనో ఆన్ లైన షాపింగ్ చెయ్యసాగింది. పెళ్లి చూపుల్లో అత్తగారు సావిత్రమ్మ "మా అమ్మాయికి ఆన్ లైన్ వస్తువులంటే కాస్త మోజెక్కువ బాబూ.. అన్నీ ఆన్ లైన్ లోనే చవగ్గా వస్తాయని చెప్తుంది" అనడం వామన్రావ్ కి గుర్తొచ్చింది. అప్పుడు ఆ మాటని తాను పెద్ద సీరియస్ గా తీసుకోలేదు గానీ ఆవిడ అలా ఎందుకు చెప్పిందో ఇప్పుడర్థమౌతోంది అనుకున్నాడు.

ఇలా ప్రతీది ఆన్ లైన్ లో కొనడం అంత మంచి అలవాటు కాదనీ, అలా చేస్తే కొన్ని అవసరం లేని వస్తువులు కూడా కొనేస్తుంటామనీ, అందువల్ల అప్పుడప్పుడు బైటికెళ్ళి మనక్కావలసిన వస్తువులు షాపుల్లో కొనుక్కుందామనీ సుందరికి నచ్చజెప్పాలని చూశాడు వామన్రావ్. ఒకరోజు ఈ విషయంలోనే ఆమె మీద

# షాపింగ్ సుందరి

కథ

కోపగించుకుని అరిచాడు. అంతే! అరగంట పాటు ఆపకుండా ఏడిచింది సుందరి. 'ఏదో కోపంలో అన్నానే బాబూ.. ఊరుకో..' అంటూ వామన్రావే తిరిగి బ్రతిమాలుకోవలసి వచ్చింది. చివరకు 'సరే.. నీకు నచ్చినట్టు ఆన్ లైన్ లోనే కొనుక్కో.. ఇంక నిన్నేమనన్లే..' అంటూ ఆమెతో రాజీకి వచ్చేశాడు.

★ ★

ఆరోజు రాత్రి భోజనాల దగ్గర సుందరి చేసిన కొబ్బరికాయ పచ్చడి చూసి వామన్రావ్ ఎంతో ముచ్చట పడ్డాడు. అతడు ముచ్చట పడింది ఆ పచ్చడి రుచి చూసి కాదు..! అదెలాగూ గొప్పగా వుండదని తెలుసు గానీ ఆ పచ్చడి పెట్టిన గిన్నె చూసి అతడు చాలా సరదా పడ్డాడు. ఒక కొబ్బరికాయను సరిగ్గా మధ్యకు పగలగొట్టి, అంచులు కాస్త నునుపుగా చేసి, పీచు మొత్తం తీసేసి అందంగా చెయ్యబడిన సహజమైన గిన్నె అది!

"అబ్బ! నాకు చాలా ఆనందంగా వుంది సుందరీ.. నువ్వు ఇంత ఓపిగ్గా ఇలాంటి ఆర్ట్ పీస్ తయారు చెయ్యడం అనేది నేను నమ్మలేకపోతున్నాను" సంబరంగా అన్నాడు.

"నమ్మమని మీకెవరు చెప్పారు? ఇది ఆన్ లైన్ లో కొన్నాను. జస్ట్ నాలుగొందలే! బావుందని ఆర్డర్ చేశాను" చెప్పింది.

"ఏంటీ.. ఈ కొబ్బరి చిప్పకు నాలుగొందలిచ్చావా? ఇరవై రూపాయలకు ఓ కొబ్బరికాయ కొని నేనే ఈ రకంగా రెండు చిప్పలు తయారుచేసేవాణ్ణి కదా" బాధగా మూలిగాడు వామన్రావ్.

"సర్లెండి.. మీరలాగే అంటారు.. ప్రతిదాన్నీ డబ్బుతో లెక్కెయ్యడం బాగా అలవాటు మీకు!" చికాగ్గా అంది సుందరి.

రాత్రి పక్క మీదకు చేరాడు గానీ వామన్రావ్ కు నిద్ర పట్టలేదు. సుందరి లోపల ఇంకా ఏదో చక్కబెట్టుకుంటోంది. అంతకంతకీ ముదిరిపోతున్న భార్య ఆన్ లైన్ పిచ్చిని ఎలా తగ్గించాలా అని వామన్రావ్ తీవ్రంగా ఆలోచిస్తూ వుండగా అతడికి హఠాత్తుగా తన బెస్ట్ ఫ్రెండ్ శ్యాం సుందర్ గుర్తొచ్చాడు. ఎలాంటి సమస్యకైనా అతడు అద్భుతమైన సలహాలిచ్చే విషయం కూడా అర్జెంటుగా గుర్తుకొచ్చింది. ట్రాన్స్ ఫర్ మీద వాడు వైజాగ్ వెళ్ళిపోయిన తర్వాత కలవడమే కుదర్లేదు అనుకుని వెంటనే శ్యాం సుందర్ కి ఫోన్ చేశాడు. కుశలప్రశ్నలయ్యాక తన సమస్య చెప్పాడు. శ్యాం సుందర్ నవ్వి "మన క్లాస్ మేట్ కె.వి. శశాంక నారాయణ గుర్తున్నాడు కదా.. వాడు ఈ విషయంలో అద్భుతమైన పరిశోధన చేసి కొన్ని కోచింగ్ క్లాస్ లు కూడా కండక్ట్ చేశాడు. ఇప్పుడు వాడి కోచింగ్ వీడియోలు యూట్యూబ్ లో కూడా అందరికీ అందుబాటులో వున్నాయ్. అవి గనక మీ మిసెస్ కి చూపించి పాటించేటట్టు చేశావంటే చాలు. ఇంక జన్మలో ఆవిడ ఆన్ లైన్ షాపింగ్ జోలికి పోదు" కాన్ఫిడెంట్ గా చెప్పాడు.

"ఆశ్చర్యంగా వుందే.. మనవాడు ఇలాంటి విషయంలో పరిశోధన చేశాడా? వాడి పెళ్ళికి పిలిచాడు గానీ నాకు వెళ్ళడం కుదర్లేదు" అన్నాడు వామన్రావ్.

"ఏం పెళ్ళిలే? అది పెటాకులైంది"

"ఎందుకని?" వామన్రావ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏవుందీ.. వాళ్ళావిడకు విపరీతమైన ఆన్ లైన్ షాపింగ్ పిచ్చి వుందట. దాంతో ఇల్లు గుల్లవ్వడం చూసి తట్టుకోలేక విడాకులు ఇచ్చేశాడట!" తాపీగా చెప్పాడు శ్యాం సుందర్.

"అదేంటి మరి? ఆన్ లైన్ షాపింగ్ పిచ్చి ఎలా వదుల్చుకోవాలో వీడియోలు చేశాడన్నావ్?" తలమునకలయ్యేంత ఆశ్చర్యంతో అడిగాడు వామన్రావ్.

# షాపింగ్ సుందరి

కథ

"అదేమరి.. వాళ్ళావిడ వల్ల వచ్చిన ఫ్రస్టేషన్ లోనే ఆ అంశం మీద పరిశోధన చేసి వీడియోలు తయారుచేశాడు"

"అలాగా.." అయోమయంగా అన్నాడు వామన్రావ్.

"అలాగే గానీ నీకా వీడియోల లింక్ పంపిస్తాను. అవి మీ ఆవిడ చూసేలా చెయ్యి చాలు.. పనయిపోతుంది"

"అలాగలాగే.." ఉత్సాహంగా అన్నాడు వామన్రావ్.

★ ★

వారం తర్వాత శ్యాం సుందర్ ఏదో పని మీద విజయవాడ వచ్చాడు. తన మిత్రుణ్ణి కలిసి సర్ ప్రైజ్ చేద్దామనుకుని చెప్పకుండా వామన్రావ్ ఇంటికి వచ్చాడు. ఆరోజు ఆదివారం కావడంతో వామన్రావ్ ఇంట్లోనే వున్నాడు. గెడ్డం పెరిగి జుత్తు సరిగ్గా దువ్వుకోకుండా అదోమాదిరిగా వున్న వామన్రావ్ ని చూసి శ్యాం సుందర్ ఆశ్చర్యపోయాడు.

"ఇదేంట్రా ఇలా వున్నావేమిటి?" చొరవగా కుర్చీలో కూర్చుంటూ అడిగాడు శ్యాం సుందర్.

"నా సంగతి సరే గానీ నువ్వెప్పుడు విజయవాడ వచ్చావ్? ఇంకా నేనే నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను" అన్నాడు వామన్రావ్.

"నిన్నే వచ్చాను. పని పూర్తయింది. ఈరోజు వెళ్ళిపోవాలి. వెళ్లేముందు నిన్ను కలిసి సర్ ప్రైజ్ చేద్దామని ఫోన్ చెయ్యలేదు. అది సరే.. మీ మిసెస్ కనిపించడం లేదు. ఇంట్లో లేరా?"

"వాళ్ళమ్మ గారి వూళ్ళో ఏదో చిన్న ఫంక్షన్ వుందంటే వెళ్ళిందిలే"

"సరే.. ఇంతకీ నేను చెప్పినట్టు మన కె.వి. శశాంక నారాయణ వీడియోలు ఆవిడకి చూపించావా? ఏమైనా మార్పొచ్చిందా బ్రదర్?" ఆసక్తిగా అడిగాడు

"మార్పొచ్చింది బ్రదర్.. కానీ మనం అనుకున్న మార్పు కాదు. ఇంతకీ ఆవిడ కె.వి. శశాంక నారాయణ వీడియోలు బదులు ఎస్. వి. బదరీనారాయణ వీడియోలు చూసింది. అందువల్ల గొప్ప తిరకాసు జరిగిపోయింది" శూన్యంలోకి చూస్తూ చెప్పాడు వామన్రావ్.

"నాకంతా అయోమయంగా వుంది. అసలేం జరిగింది?" బుర్ర గోక్కుంటూ అడిగాడు శ్యాం సుందర్.

"ఇలారా.. నీకు వివరంగా చెప్తాను" అంటూ శ్యాం సుందర్ ని చిల్డ్రన్ బెడ్ రూమ్ లోకి తీసుకెళ్ళాడు వామన్రావ్. ఆ రూమ్ నిండా రకరకాల సబ్బులు, పేస్టులు, నూనె ప్యాకెట్ లు, కొన్ని నిత్యావసర సరుకులు.. ఇంకా ఏవేవో అడ్డదిడ్డంగా పడున్నాయ్.

"అర్రె.. చెప్పనే లేదు. నువ్వు కిరాణా బిజినెస్ ఎప్పట్నుంచి స్టార్ట్ చేశావ్?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యాం సుందర్.

పటపటపటపట మని సౌండ్ వచ్చింది.

"ఎలకలు చేరినట్టున్నాయ్.. సౌండ్ వస్తోంది.. జాగ్రత్తగా చూసుకోవాలి నువ్వు" చెప్పాడు

శ్యాం సుందర్.

"నీ మొహం.. ఎలకలు కాదు. నేనే పళ్ళు కొరికాను" మండిపడుతూ అన్నాడు వామన్రావ్.

"అరె.. అదేంటి బ్రదర్.. ఎందుకంత కోపం? కిరాణా బిజినెస్ లో నష్టం వచ్చిందా?"

"కిరాణా బిజినెస్ లేదు.. నా బొందా లేదు. ఇవన్నీ మా ఆవిడ ఆన్ లైన్ లో తెప్పించింది. ఈ బెడ్ రూమ్ ఖాళీ గాబట్టి ఇందులో పడేసింది" కోపంగా చెప్పాడు వామన్రావ్.

"నాకంతా పజిల్లా వుంది బ్రదర్.. అసలేమైంది? సరిగ్గా చెప్పు?" అడిగాడు శ్యాం సుందర్.

# షాపింగ్ సుందరి

కథ

ఇద్దరూ వచ్చి మళ్ళీ హాల్లో కూర్చున్నారు. “ఏమైందో కూల్ గా చెప్పు బ్రదర్” మళ్ళీ అడిగాడు శ్యాం సుందర్.

“ఏముందీ.. నువ్వు పంపిన వీడియోల లింక్ ని ఆవిడకి పెట్టి ఎలాగైనా ఆ వీడియోలు చూడమని మరీ మరీ చెప్పి ఆఫీసుకి వెళ్లాను. సాయంత్రం వచ్చేసరికి ఆ వీడియోల మీద అభిప్రాయం చెప్పాలని కూడా గట్టిగా చెప్పాను. తీరా ఆవిడ ఆ లింక్ ని ఓపెన్ చేస్తే మన శశాంక నారాయణ వీడియో క్రింద బదరీ నారాయణ అనేవాడు పెట్టిన వీడియో కనిపించిందట. దీనికంటే అది ఆవిడకి చాలా ఆసక్తిగా అనిపించిందట. ఇంతకీ

ఆ వీడియో ఏంటంటే ‘ఆన్ లైన్ లో వస్తువులు చవగ్గా కొని విపరీతంగా పొదుపు చేయడం ఎలా?’ అని! ఇంకేముంది? మనం చూడమన్న వీడియో వదిలేసి ఆ బదరీనారాయణ వీడియోని ఆరోజంతా డజను సార్లు చూసిందట. అందులో ఆన్ లైన్ వస్తువులకు ఎప్పుడు ఎలాంటి డిస్కౌంట్ లు వుంటాయి? డిస్కౌంట్ లను గుర్తించే విధానం, పెద్ద డిస్కౌంట్ లు వున్నప్పుడు ఎక్కువ మొత్తంలో కొని వాటిని భద్రపరుచుకోవడం..

ముఖ్యంగా ఎక్కువకాలం నిల్వ వుండే సబ్బులు, పేస్టులు, వంటనూనెలు, బట్టల లిక్విడ్ లు మొదలైన ఇరవై ఆరు రకాల వస్తువులను వాటి డిస్కౌంట్ ల సమయంలో గుర్తించి ఎక్కువమొత్తంలో కొని వీలైతే సంవత్సరానికి సరిపడా నిల్వ చేసుకోవడం.. ఈ రకంగా భయంకరంగా ఆదా చేయడం.. ఇలాంటివన్నీ

ఆ వీడియోలో వివరించారట! మా ఆవిడకి ఆ వీడియో పిచ్చపిచ్చగా నచ్చేసింది. నేను ఎంత వద్దన్నా వినకుండా అందులో చెప్పినట్టు ఫాలో అవడం మొదలుపెట్టింది. దాని ఫలితమే ఇది! ఇంతకుముందే నయం.. కనీసం ఏవో పనికొచ్చే వస్తువులే కొనేది. ఇప్పుడు మొత్తం డిస్కౌంట్ లో వచ్చే వస్తువులన్నీ కొని పడేస్తోంది. నా పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా అయిపోయింది. ఏమైనా అంటే తను చేస్తోన్న పొదుపు నాకర్థం కావడం లేదని గోల చేస్తోంది. ఎవరైనా చుట్టాలు వస్తే జరుగుతున్న తంతు గమనించి నన్ను చూసి నవ్వుకుంటున్నారు. మా సుందరికేమో ఎంత చెప్పినా అర్థం కావడం లేదు. ఒక సంవత్సర కాలం ఇలా చేసి ఆ సంవత్సరం మొత్తం మీద అన్ని వస్తువుల మీద కలిపి ఎంత పొదుపు చేసిందో లెక్కలు తయారుచేసి తనే ఒక యూ ట్యూబ్ వీడియో చేసి ఆరకంగా పాపులర్ అయిపోతుందట. ఈలోపు నేను పాపర్ అయిపోయేట్టున్నాను..’ దు:ఖంగా చెప్పాడు వామన్రావ్.

“అరె.. ఎంత తిరకాసు జరిగిపోయింది? ఇంకా నేను చెప్పిన ఐడియా ఫలించి ఆ వీడియోలు చూసి మీ ఆవిడ ఆన్ లైన్ పిచ్చి తగ్గించుకుందేమో.. ఆ సందర్భంలో నువ్వు నాకు పార్టీ ఇస్తావేమో అని ఏదేదో ఊహించుకున్నాను” నిరాశగా అన్నాడు శ్యాం సుందర్.

“అవును.. నువ్వు ఆ దిక్కుమాలిన లింక్ పంపకపోతే అసలిదంతా జరిగేదే కాదు.. నీకు పార్టీ ఇవ్వాల్సిందే..” అంటూ వామన్రావ్ పక్కనున్న చీపురుకట్ట పుచ్చుకోవడంతో “నేనొస్తాన్రా.. నీ మూడ్ బాగులేనట్టుంది. మరోసారి కలుద్దాం” అంటూ శరవేగంగా బైటకు జంప్ చేసి వెళ్ళిపోయాడు శ్యాం సుందర్.

★★సమాప్తం★★★

# రేపటి కోసం-మేలుకొలుపు

## నమ్మకాలు- నిజాలు

## పిల్లలకు వివరంగా చెప్పండి!

'అమ్మా,వర్షం ఎందుకు కురుస్తున్నదే?'అని పిల్లవాడు అడుగుతాడు.

చదువురాని తల్లయితే 'బాబూ దేవుడు కురిపిస్తున్నాడురా'అంటుంది.

విద్యావతి అయిన తల్లి అయితే 'నీరు ఆవిరిగా మారి మేఘాలుగా జేరి చల్లబడ్డప్పుడు వర్షం కురుస్తుంది'అని శాస్త్రీయంగా విశదపరుస్తుంది.

'అమ్మా అన్నయ్యెందుకు చనిపోయాడే'అని అడుగుతాడు

పిల్లవాడు.తల్లి మూఢురాలయితే 'బాబూ భూమి మీద నూకలు చెల్లిపోయినవిరా! దేవుడు తీసుకొనిపోయినాడు'అంటుంది,

విజ్ఞానవతి అయిన తల్లి 'నాయనా,మీ అన్నయ్య వద్దన్న కొద్దీ రోడ్డు మీద అమ్మే మిఠాయి తిని కలరా తెచ్చుకున్నాడు.కలరా క్రిములు రక్తాన్నంతా పాడు చేసినందు వలన చనిపోయినాడు'అని బోధపరుస్తుంది.

ఒకటవది మూఢనమ్మకం ;రెండవది శాస్త్రీయం.

ఒకటి ఆధిదైవికం;రెండవది భౌతికం.

ఒకటి అలౌకికమైన శక్తుల గూర్చిన నమ్మకాలపై ఆధారపడితే,రెండవది ప్రకృతి పరిణామాల గూర్చిన విజ్ఞానంపై ఆధారపడుతుంది.

తత్వశాస్త్రంలోనూ ఇదే వరస.

ఈ ప్రపంచం,చరాచర రాసులు, విశ్వం–వీటిని గూర్చి తెలుసుకోవాలని మానవులు వేల సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు.ఈ జిజ్ఞాస ఫలితమే తత్వశాస్త్రము.
విజ్ఞానవతి అయిన తల్లిలాగా భౌతిక శాస్త్రజ్ఞులు ఈ ప్రపంచాన్ని గూర్చి,విశ్వాన్ని గూర్చి,వీటి పరిణామాన్ని గూర్చి,అందుకు సంబంధించిన సూత్రాలను గూర్చి తెలుసుకొని వివరించ ప్రయత్నించారు.మూఢురాలైన తల్లిలాగ ఆధ్యాత్మికవాదులు ఈ ప్రపంచమంతా బ్రహ్మసృష్టి అనో,అసలు దీనిని గూర్చి తెలుసుకోలేమనో లేక అంతా మాయయనో చెపుతున్నారు.

ప్రపంచాన్ని గూర్చిన రెండు దృక్పథాలు

మానవుడు ఎక్కడి నుండి వచ్చాడు! ఎట్లా వచ్చాడు ? ఎక్కడికి పోతాడు ? అనే జిజ్ఞాస కలగటం సహజం.

ఇంకా కొంచెం లోతుగా ఆలోచించేవారు ఈ ప్రపంచమేమిటి?

ఈ రెండు సిద్ధాంతాలకు – భౌతికవాదం,ఆధ్యాత్మిక వాదాలకు వేర్వేరు వర్గ ప్రయోజనాలున్నాయి.

భౌతికవాదం ఈ ప్రపంచం వాస్తవమయినదంటుంది.ఈ ప్రపంచాన్ని గూర్చి వివరించి దీనిని మార్చాలంటుంది.మానవుని జీవితం సుఖప్రదం,విజ్ఞానమయం చేయాలంటుంది."తత్వవేత్తలు ఈ ప్రపంచాన్ని వివిధ మార్గాలలో వివరించడం మాత్రమే చేశారు.

# రేపటి కోసం-మేలుకొలుపు

దానిని మార్చడమే కర్తవ్యం"అని మార్క్స్ మహనీయుడు కర్తవ్య ప్రబోధం గావించారు. శ్రామికవర్గం రాజ్యాధికారాన్ని వశపర్చుకుంటుంది.ఈ రాజ్యాధికార బలంతో సామాజిక ఉత్పత్తి సాధనాలను బూర్జువా వర్గం చేతుల నుండి స్వాధీనపరుచుకొని పబ్లిక్ ఆస్తిగా మార్చుతుంది... మానవులు చివరకు తమ స్వంత సామాజిక ఉత్పత్తి విధానానికి అధినాధులు కావటం ద్వారా అదే సమయంలో ప్రకృతికి అధినాధులుగానూ,తమపై తామే అధినాధులు గాను తయారవుతారు.

"ఈ ప్రపంచ విముక్తి కర్తవ్యాన్ని నిర్వహించడమే ఆధునిక శ్రామిక వర్గం యొక్క చారిత్రక కర్తవ్యం"అని ఎంగెల్స్ ప్రబోధించారు.

ఆధ్యాత్మికవాదం ఈ ప్రపంచం మాయ అంటుంది. అందుచే పరలోక గతులనాశించమంటుంది. అందుకు గాను ఈ లోకంలో కోర్కెలు,సుఖాలు విసర్జించి,సర్వసంగ పరిత్యాగం గావించి పరలోకానికి సిద్ధం కమ్మంటుంది. భౌతికవాదం మానవుని ఆధిక్యతలు,పెంపొందిస్తుంది. ప్రకృతిపై మానవుల అధిక్యతను,పెత్తనాన్ని చేకూర్చుకుంది.ఆధ్యాత్మికవాదం కర్మ సిద్ధాంతం ద్వారా బ్రహ్మ రాత పేరుతో నిష్క్రియా పర్వతాన్ని,మానవుడు ప్రకృతికి దాసుడుగా వుండటాన్ని కొనసాగిస్తుంది,పెంపొందిస్తుంది. సూర్యచంద్రాదులేమిటి?ఎట్లా,ఎక్కడ నుండి,ఎప్పుడు వచ్చాయి. వాటి గమ్యమేమిటి? అని కూడా ప్రశ్నించుతారు.

ఇదే తాత్విక ఆలోచన.దీనిని క్రమపద్ధతిలో వివరించేది తత్వశాస్త్రం.

శిశు జననానికి కారణం ఏమిటి అని అడిగితే స్త్రీ పురుష బీజముల సంయోగం వలన గర్భోత్పత్తి జరిగి,నవమాసాలు పరిణామం చెంది శిశువు జన్మిస్తుందని జీవశాస్త్రజ్ఞుడు చెపుతాడు.దేవుని కృపవల్ల జన్మించాడంటాడు మత గురువు. కొంగతెచ్చి పడవేసిందని చిన్నప్పటి నుంచి పిల్లలకు కథలలో చెప్పడం కూడా వుంది.

సకల చరాచర ప్రపంచాన్ని గూర్చి వివరించడంలో కూడా ఇవే పద్ధతులు అనుసరించబడుతూ వున్నవి. భౌతికమైన పదార్థం.దానిలోనే అవినాభావంగా వున్న చలనం వల్ల వికృతి పొంది,ఈ చరాచర ప్రపంచంగా ఏర్పడుతోందని విజ్ఞాన శాస్త్రవేత్త చెబుతాడు.ఇదంతా దైవసృష్టి అని వేదాంతి చెపుతాడు.

ఒకే ప్రశ్నకు రెండు జవాబులు; ఒకదానికొకటి పూర్తిగా వ్యతిరేకమైన జవాబులు.

ఒకటి భౌతికవాదం ;రెండవది ఆధ్యాత్మికవాదం.

భౌతికమైన,యదార్థమైన చలన సహితమైన పదార్థం మూలం అని ఒకటంటే,దేవుడు అంటుంది రెండవది. భౌతికవాదంలో మత భేదాలు లేకపోలేదు.నాస్తికవాదం,ఆది భౌతికవాదం,యాంత్రిక భౌతికవాదం లాంటివి అపరిపక్వ భౌతికవాద సిద్ధాంతాలు కాగా మార్క్స్,ఎంగెల్స్ లు ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాదం శాస్త్రీయమైన సిద్ధాంతం.

ఆధ్యాత్మికవాదంలో మత భేదాలు కోకొల్లలు.మన దేశంలో ప్రధానంగా వ్యాప్తిలోనున్నవి ద్వైతం,విశిష్టాద్వైతం, ప్రతిభావంతమైన తర్కశాస్త్రంతో కూడిన శంకరుని అద్వైతం. పాశ్చాత్య దేశాలలో అవిరళ ప్రచారంలో ఉన్నవి భావవాదం, అజ్ఞేయవాదం.గతితార్కిక భౌతికవాదం ఆధునికశాస్త్ర పరిశోధనలపై,ఆచరణపై ఆధారపడి వుంటే ఆధ్యాత్మికవాదం వాదనా బలంపై,విశ్వాసంపై ఆధారపడి వుంది.

★★★



బహుమతి పొందిన కవిత

# మాటంటే

మాటలు కోటలు దాటనివ్వకు..
మాటువేసి నిన్నే మట్టుబెట్టగలవు
మాటంటే మంత్రంలా వెలగాలి
మాట్లాడితే మల్లెలు కురిసినట్లుండాలి..
మనసు విప్పి మాట్లాడితే
మది మయూరంలా నాట్యం చేయాలి..!
మాటే కదా నీలోని మనిషిని తెలిపేది
మాటే కదా నీ మర్యాద నిలిపేది
మాటకు చిరునవ్వు తోడైతే
మాట వేద మంత్రంలా వినబడదా ...!
మాటల్ని అదే పనిగా ఖర్చు చేయకు
మాటలను కూడా పొదుపుగా వాడమన్నాడో కవి
అతిగా మాట్లాడడం దేశద్రోహం కన్నా పెద్ద నేరంట
మంచికి ,మర్యాదకు మాటే కదా చిరునామా
మనసుకు ,మనసుకు వారధి మాట
అని ఎవరైనా అంటే కాదనగలమా?
మాటిస్తే ప్రాణం పోయినా సరే తప్పనట్లు ఉండాలి.
మాట మీద నిలబడ్డం అంటే
నీ వ్యక్తిత్వాన్ని నువ్వు నిలబెట్టుకున్నట్లు ..
మంచి మాటే కదా జనాన్ని జాగృతం చేసేది..

మంచి మాటే కదా వేదవాక్కై నిలిచేది..!

**జి. కావ్య**

## మీ పిల్లల అల్లరి మాటలు మాకు పంపండి -ప్రచురిస్తాము

చిన్నతనంలో అందరం అల్లరి చేసిన వాళ్ళమే .తెలిసి తెలియని వయసులో అర్థం పర్థం లేని ఎన్నో అల్లరి పనులు చేస్తూ ఉంటాము, వాటిని ఒకసారి గుర్తుచేసుకుంటే మనకే నవ్వు వస్తు ఉంటుంది . అలాగే మన ఇంట్లో చిన్నపిల్లలు కూడా తెలిసి తెలియని మాటలు మాట్లాడుతూ అందరిని నవ్విస్తూ ఉంటారు .ఇటువంటి సంఘటనలు మీ ఇంట్లో జరిగితే, అవి ఇంకా మీకు గుర్తుండి ఉంటె , కాగితం మీద రాసి మాకు పంపండి ప్రచురిస్తాము. అందరం కలసి హాయిగా నవ్వుకుందాము . మీ పిల్లల ఫోటోలు పంపటం మాత్రం మరిచిపోవద్దు .ఉత్తమైన వాటికి బహుమతి కుడా ఉంటుంది .

పంపాల్సిన మెయిల్ అడ్రస్ :sumathibalapatrika@gmail.com

# కరెంట్ అఫైర్స్




యుద్ధం అంటే ఇప్పుడు తుపాకులతో, ట్యాంకులతో చేసేది కాదు. శత్రు దేశపు మౌలిక వసతులను, రవాణా వ్యవస్థను ఎక్కడికక్కడ స్తంభించిపోయేలా చేసి, ఆ దేశాన్ని మానసికంగా దెబ్బతీయడమే ఆధునిక 'హైబ్రిడ్ వార్‌ఫేర్' (Hybrid Warfare). సరిగ్గా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన సమయంలో మన విమానయాన రంగంలో, ముఖ్యంగా 'ఇండిగో' (IndiGo) మరియు 'ఎయిర్ ఇండియా' సర్వీసుల్లో ఏర్పడిన అవాంతరాలు ఈ కోవకే చెందుతాయా?

కేవలం వాతావరణం, పొగమంచు అని సరిపెట్టుకోవడానికి వీల్లేని అనేక సాంకేతిక సందేహాలు (Technical Anomalies) ఇప్పుడు బయటపడుతున్నాయి. దీని వెనుక పాశ్చాత్య దేశాల సాఫ్ట్‌వేర్ సంస్థల ప్రమేయం ఉందా? ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ (డచ్ జాతీయుడు) నాయకత్వంపై ఎందుకు అనుమానాలు వస్తున్నాయి? దీనిపై పూర్తి సాంకేతిక విశ్లేషణ.

### ది బ్రెయిన్ ఆఫ్ ది ఎయిర్‌లైన్: 'రోస్టరింగ్ సాఫ్ట్‌వేర్'

ఒక విమానయాన సంస్థకు గుండె వంటిది దాని "క్రూ రోస్టరింగ్ సిస్టమ్" (Crew Rostering System). ఇది అత్యంత క్లిష్టమైన ఆల్గారిథమ్స్ (Complex Algorithms)తో పనిచేస్తుంది. ప్రపంచంలోని చాలా ఎయిర్‌లైన్స్, ఇండిగోతో సహా, అమెరికా లేదా ఐరోపాకు చెందిన "జీపెస్సెన్" (Jeppesen – Boeing owned) లేదా "సేబర్" (Sabre) వంటి సాఫ్ట్‌వేర్‌లను వాడుతాయి.

### టెక్నికల్ కుట్ర ఎలా జరిగి ఉండవచ్చు?:

ఈ సాఫ్ట్‌వేర్‌లు 'లీనియర్ ప్రోగ్రామింగ్' (Linear Programming) ఆధారంగా పనిచేస్తాయి. ఇందులో "బఫర్ టైమ్" (Buffer Time) అనే ఒక పారామీటర్ ఉంటుంది. అంటే ఒక ఫ్లైట్ దిగిన తర్వాత పైలట్ మరో ఫ్లైట్ ఎక్కడానికి

# కరెంట్ అఫైర్స్

మధ్య ఉండే సమయం.
అనుమానం: సరిగ్గా పుతిన్ వచ్చే సమయంలో, ఈ సాఫ్ట్‌వేర్ బ్యాక్-ఎండ్ (Back-end)లో ఒక చిన్న 'కోడ్' మార్పు జరిగిందా? ఉదాహరణకు, బఫర్ టైమ్‌ను ఆప్టిమైజేషన్ పేరుతో తగ్గించడం వల్ల, ఒక్క ఫ్లైట్ 10 నిమిషాలు లేట్ అయినా, ఆ ప్రభావం (Cascading Effect) వందల ఫ్లైట్లపై పడేలా "అల్గారిథమిక్ ట్వీకింగ్" (Algorithmic Tweaking) జరిగిందా? ఒక్కసారి సాఫ్ట్‌వేర్ "ఇన్‌ఫీజిబుల్ సొల్యూషన్" (Infeasible Solution) స్టేజ్‌కి వెళ్తే, దాన్ని మనుషులు (Manual Intervention) సరిచేయడం అసాధ్యం. ఇండిగోలో జరిగింది ఇదే. సిస్టమ్ మొత్తం లాక్ అయిపోయింది. ఇది యాదృచ్ఛికంగా జరిగేది కాదు.

ACARS మరియు డేటా లింక్ వైఫల్యం (Data Link Severance)
విమానం గాల్లో ఉండగా లేదా నేల మీద ఉండగా పైలట్‌లకు, గ్రౌండ్ కంట్రోల్‌కు మధ్య కమ్యూనికేషన్ కోసం ACARS (Aircraft Communications Addressing and Reporting System) అనే డిజిటల్ వ్యవస్థను వాడుతారు. విమానంలో బరువు (Load Sheet), రూట్ మ్యాప్ అన్నీ దీని ద్వారానే అప్‌లోడ్ అవుతాయి.

శాటిలైట్ శాబోటేజ్: ఈ ACARS డేటా లింక్స్ అమెరికాకు చెందిన ARINC లేదా యూరప్‌కు చెందిన SITA నెట్‌వర్క్‌ల ద్వారా నడుస్తాయి.

ఏం జరిగింది?: ఢిల్లీ, ముంబైలలో చాలా విమానాలకు "లోడ్ షీట్" అప్‌లోడ్ కావడంలో తీవ్ర జాప్యం జరిగింది. డిజిటల్‌గా అందాల్సిన సమాచారం అందకపోతే, పైలట్లు దాన్ని మాన్యువల్‌గా (చేతితో) లెక్కించాలి. దీనికి 30-40 నిమిషాలు పడుతుంది.
ఈ 30 నిమిషాల ఆలస్యం వల్ల విమానం తన "స్లాట్" (Slot) కోల్పోతుంది. స్లాట్ పోతే మళ్ళీ గంటల తరబడి వెయిటింగ్. ఈ డేటా లింక్ సర్వర్లు పాశ్చాత్య దేశాల చేతిలో ఉండటం వల్ల, వారు కావాలని "ప్యాకెట్ లాస్" (Data Packet Loss) లేదా "లేటెన్సీ" (Latency)ని సృష్టించి మన వ్యవస్థను నెమ్మదింపజేశారా?

క్యాట్-3 (CAT-III) పైలట్ల "మాయ": డేటాబేస్ మ్యానిపులేషన్?
పొగమంచులో విమానాన్ని దించడానికి CAT-III B సర్టిఫికేషన్ ఉన్న పైలట్లు కావాలి. ఇండిగో వద్ద వీరు సరిపడా ఉన్నారు. కానీ, పొగమంచు ఉన్న సమయంలో కాక్‌పిట్‌లో కూర్చున్నది నాన్-క్యాట్ పైలట్లు (Non-CAT pilots). ఇది ఎలా సాధ్యం?
రోస్టరింగ్ ట్యాగింగ్ ఎర్రర్: ప్రతి పైలట్ పేరు పక్కన డేటాబేస్‌లో ఒక "ట్యాగ్" (Tag) ఉంటుంది (ఉదా: CAPT_DEL_CAT3_YES).
ఒకవేళ డేటాబేస్‌లో ఒక "బగ్" (Bug) ద్వారా లేదా సైబర్ దాడి ద్వారా ఈ ట్యాగ్స్‌లో గందరగోళం సృష్టిస్తే? సిస్టమ్ CAT-3 పైలట్‌ని నాన్-క్యాట్ ఫ్లైట్‌కి, నాన్-క్యాట్ పైలట్‌ని cat -3 ఫ్లైట్‌కి కేటాయిస్తుంది.
చివరి నిమిషంలో విమానం గాల్లోకి లేచే ముందు గానీ పైలట్‌కి తెలియదు, తాను వెళ్లే విమానాశ్రయంలో దిగలేనని. అప్పుడు విమానం దారి మళ్ళించక (Diversion) తప్పదు. వందల విమానాలు ఇలా దారి మళ్లడానికి కారణం ఇదే. ఇది కచ్చితంగా "డేటాబేస్ ట్యాంపరింగ్" (Database Tampering) అని నిపుణులు అనుమానిస్తున్నారు.

FDTL అనే బ్రహ్మాస్త్రం: చట్టాన్ని వాడుకుని దాడి
భారత ఏవియేషన్ చట్టాల ప్రకారం FDTL (Flight Duty Time Limitations) చాలా కఠినం. పాశ్చాత్య శక్తులకు తెలుసు, ఒక్కసారి భారత వ్యవస్థలో చిన్న ఆలస్యం సృష్టిస్తే, ఈ చట్టమే

# కరెంట్ అఫైర్స్

మిగతా పని చేస్తుందని.

ఆపరేషన్
మొదట పొగమంచు పేరుతో లేదా ఫేక్ బాంబు బెదిరింపుతో విమానాన్ని 2 గంటలు ఆపండి. ఆ 2 గంటల ఆలస్యంతో పైలట్ డ్యూటీ టైమ్ (ఉదాహరణకు 10 గంటలు) దాటిపోతుంది. నిబంధనల ప్రకారం ఆ పైలట్ కాక్‌పిట్ వదిలి వెళ్ళిపోవాలి. కొత్త పైలట్ రావడానికి ట్రాఫిక్ వల్ల మరో 3 గంటలు పడుతుంది. ఈలోపు ఆ కొత్త పైలట్ డ్యూటీ టైమ్ కూడా మొదలైపోతుంది. ఇదొక విషవలయం (Vicious Cycle). ఇండిగో సీఈఓకి ఈ ప్రమాదం గురించి తెలిసినా, "వ్యూహాత్మక మౌనం" (Strategic Silence) పాటించడం వెనుక ఆంతర్యం ఏమిటి? ముందుగానే విమానాలను రద్దు చేయకుండా (Proactive Cancellation), ప్రయాణికులందరినీ ఎయిర్‌పోర్టుకు రప్పించి, అక్కడ గందరగోళం సృష్టించడం ద్వారా అంతర్జాతీయ మీడియాలో "భారత్‌లో అరాచకం" అని హెడ్‌లైన్స్ వచ్చేలా చూడటమే దీని లక్ష్యం. visit megaminds website for more

జియో-పొలిటికల్ కోణం: GPS స్పూఫింగ్ (GPS Spoofing)
గత కొన్ని నెలలుగా మధ్యప్రాచ్యంలో జరుగుతున్నట్లుగానే, ఢిల్లీ గగనతలంపై కూడా "GPS స్పూఫింగ్" జరిగిందా అనే కోణాన్ని ఇంటెలిజెన్స్ వర్గాలు పరిశీలిస్తున్నాయి. విమానాల నావిగేషన్ సిస్టమ్‌ను తప్పుదోవ పట్టించేలా సిగ్నల్స్ పంపడం ద్వారా, భద్రతా కారణాల దృష్ట్యా పైలట్లు విమానాల మధ్య దూరాన్ని (Separation) పెంచాల్సి వస్తుంది. దీనివల్ల ఎయిర్‌పోర్ట్ సామర్థ్యం (Runway Capacity) సగానికి పడిపోతుంది. గంటకు 60 విమానాలు దిగాల్సిన చోట, కేవలం 30 మాత్రమే దిగుతాయి. పుతిన్ విమానం ల్యాండింగ్ సమయంలో భద్రత పేరుతో ఈ రకమైన "ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్" (Electronic Warfare) ప్రయోగించారా?

కావాల్సింది 'ఆత్మనిర్భర్' ఏవియేషన్
ఇండిగో, ఎయిర్ ఇండియా సమస్యలు కేవలం నిర్వహణా లోపాలు కావు. ఇవి "సిస్టమిక్ సాబోటేజ్" (Systemic Sabotage). ఒక దేశం (రష్యా)తో మనం స్నేహం చేస్తున్నప్పుడు, దాన్ని సహించలేని మరో కూటమి (నాటో/అమెరికా), మన రవాణా వ్యవస్థలోని 'సాఫ్ట్‌వేర్' అనే లొసుగును వాడుకుని చేసిన దాడి ఇది. మన విమానాలు మనవే. కానీ వాటిని నడిపించే 'బ్రెయిన్' (సాఫ్ట్‌వేర్), వాటిని ట్రాక్ చేసే 'రాడార్లు', వాటి కమ్యూనికేషన్ 'సర్వర్లు' అన్నీ విదేశీయుల చేతుల్లో ఉన్నాయి.

ఇండిగో సీఈఓ ఒక నాటో దేశానికి (నెదర్లాండ్స్) చెందిన వ్యక్తి కావడం, సంక్షోభ సమయంలో ఆయన నిర్ణయాలు భారత ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండటం యాదృచ్ఛికం కాకపోవచ్చు. పుతిన్ వెళ్ళిపోవచ్చు. కానీ ఈ ఘటన భారత ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. మన "డిజిటల్ సార్వభౌమాధికారం" (Digital Sovereignty) మన చేతుల్లో లేకపోతే, భవిష్యత్తులో యుద్ధ సమయాల్లో మన విమానాలు నేలకే పరిమితం అయ్యే ప్రమాదం ఉంది. తక్షణమే 'నేషనల్ ఏవియేషన్ సెక్యూరిటీ గ్రిడ్' ఏర్పాటు చేసి, కీలకమైన సాఫ్ట్‌వేర్లను స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

★★★

క్రైం కథ

బహుమతి పొందిన క్రైం కథ



# భయం నీడ

ఆచంట సుధా కళ్యాణి



వణుకుతున్న ప్రభాకర్ చేతిలో కర్రకి అంటుకున్న రక్తం, బొట్లు బొట్లుగా అంచు వెంబడి కిందకి కారుతూ ఉంది!క్రింద అచేతనంగా పడి ఉన్న రాకేష్ లో చలనం లేదు!

కొద్దిగా వంగి,దగ్గరగా మొహం పెట్టి చూడసాగాడు ప్రభాకర్.

'కిర్ ర్ ' మంటూ... నిశి రేయిలో మంచు దుప్పటిని కప్పుకున్న నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ చప్పుడు.ఎవరిదో మనిషి నీడ కాస్త దూరంగా!

తనింటి తలుపు తెరుచుకుని బయటికొస్తున్నాడు టీ స్టాల్ రంగ స్వామి.అతన్ని చూడగానే భయంతో ప్రభాకర్ కి చెమటలు పట్టసాగాయి. ఇటే పట్టి, పట్టి చూస్తున్నాడు స్వామి.

అర్ధరాత్రి ఆ బస్తీలో వెలుగుతున్న వీధి దీపాలు మిణుకు మిణుకు మంటున్నాయి,అంతకంతకు ధైర్యం సన్నగిల్లుతున్న ప్రభాకర్ గుండెలా!

ఓ సారి క్రింద చలనం లేని రాకేష్ ని,మరో సారి పట్టి పట్టి తన వైపే చూస్తున్న స్వామిని చూసి, తన చొక్కాతో నుదుటికంటిన చెమట తుడుచుకుంటూ పరుగందుకున్నాడు. కనిపించిన ప్రతి మలుపూ తిరిగేస్తూ,ఎటు వెళ్ళాలో తెలియని గందరగోళంలో పరిగెడుతూ ఉన్నాడు.

10-15 నిముషాలు పరిగెత్తాడో లేదో...

చెత్తకుండీ పక్కన తింటున్న రెండు వీధి కుక్కలు,'భయ్యి మంటూ' అతని అడుగుల చప్పుడుకి బెదిరి వెంటపడసాగాయి! ముందు వెనుకా ఆలోచించకుండా చేసిన తప్పుకి,అది చూసిన మనిషికీ భయపడుతూ, పరుగెడుతున్న ప్రభాకర్ రెండింతల వేగం పెంచాడు.

అంతే...రెండే రెండు నిమిషాల్లో స్పృహ తప్పిపోతుండగా,తాను గుద్దుకున్న స్తంభాన్ని చూస్తూ క్రిందకి జారిపోయాడు!

★★★★★★★

"రేయ్, నిన్నే... పిలుస్తుంటే వినపడలేదా ?" గట్టిగా ఎవరో బయట అరుస్తుంటే, ఉలిక్కిపడి లేచాడు ! రాత్రి స్పృహ తప్పినా,ఆ మగతలో ఇంటికొచ్చిన విషయం గుర్తుకొచ్చింది.గాలికి అల్లాడుతున్న కిటికీ తెరల మాటునుండి సూరీడి బాణాలు కళ్ళల్లో గుచ్చుతుంటే కిటికీ దగ్గరికి వెళ్ళాడు ప్రభాకర్.

వీధి మలుపులో పోలీసు బండి.

# భయం నీడ

కథ

పక్కనే నలుగురైదుగురు మనుషులు. వాళ్ళని ఏదో అడుగుతున్న పోలీసు బండి డ్రైవరు! నిలుచున్న వాళ్ళల్లో, టీ స్టాల్ రంగ స్వామి కూడా ఉన్నాడు. 'అంతే...' చటుక్కున వెనక్కి అడుగేసాడు.నిన్న రాత్రి తలకి తగిలిన దెబ్బని రుద్దుకుంటూ వణుకుతున్నాడు!

'దబ్ బ్ ...' మంటూ కిటికీ మూసిన చప్పుడుకి, పక్కకి తిరిగి చూసాడు. నిద్ర లేక నీరసించిన కళ్ళతో, అతని భార్య దీప!

"ఇదంతా నా వల్లే జరిగింది. నీకసలు నేను ఏమీ చెప్పకుండా ఉండాల్సింది." అంటూ ఏడవటానికి కూడా సత్తువ లేక నేల మీద కూలబడింది.

'అసలు, ఎక్కడ నుండి ఎక్కడికి వెళ్ళింది విషయం!'

గత కొన్ని రోజులుగా తనకి ఫోన్ చేసి వేధించేది,వెనకింటి రాకేష్ అని దీప తెలుసుకుని చెప్తే, ముందు వెనుకా ఆలోచించకుండా అర్ధ రాత్రి రాకేష్ ని పట్టుకుని రోడ్డుమీద రక్తం కారేలా కొట్టడం...కొట్టడమేంటి? ఆ పళంగా చనిపోతే !!

మళ్ళీ పెద్దగా హారన్ మోగిస్తూ పోలీసు వెహికల్ వెళ్ళిపోతున్న చప్పుడు.ఉలిక్కిపడ్డారు భార్య భర్తలిద్దరూ!!

"నే ముందే చెప్పాను కదా..షీ టీంకి చెప్దామని...ఇప్పుడు చూడు." అంది దీప కిటికీ నుంచి ఓరగా బయటికి చూస్తూ .

ఏదో గుర్తుకొచ్చి, ఇంటివెనక్కి వెళ్ళి రాకేష్ ఇంటి వైపు చూసాడు ప్రభాకర్.

'రాత్రి లాగే తలుపులు మూసి ఉన్నాయి !'

ఆ ఇంటి చుట్టుపక్కల రేకుల షెడ్లు. వాటిల్లో వెల్డింగ్ పని చేసుకునే వాళ్ళు రెండు రోజులుగా రావట్లేదు.

"మరి రాకేష్ శవం ఏమైనట్టు..." తనలో తానే అనుకుంటున్నట్టుగా బయటికే అంటున్న భర్త నోటిని మూసేస్తూ,ఇంట్లోకి తీసుకొచ్చింది దీప.

ఇంతలో పోలీసు వెహికల్ హారన్ మళ్ళీ వినపడుతుంటే,

" ఒక వేళ,ఏ పెట్రోలింగ్ చేసే పోలీసులకో కనపడిదంటావా?"

ఆందోళనతో వణికిపోతున్న భర్త మాటలు వింటూనే

"హుష్.. ఇంక ఆగు.ఇప్పుడైనా నే చెప్పేది విను. కోపం రాగానే ముందు వెనుకా చూడకుండా కొట్టడం ,ఇప్పుడిలా భయంతో బేజారైపోవడం చాలు. ముందు మనూరెళ్లిపోదాం.నాలుగు రోజులాగి అప్పుడు ఏమి చేయాలో,పోలీసులనే సాయమడగాలో చూద్దాం." అలుపు తీర్చుకోడానికన్నట్టు ఆగింది దీప.

ఓ అరగంటకల్లా జూబ్లీ బస్టాండులో ఉన్నారిద్దరూ.

"అపరిచిత మొబైల్ నంబర్స్ నుంచి వచ్చిన సందేశాలలో లింక్స్ ఓపెన్ చేయకండి. మోసపోకండి."

బస్టాండులోని టీవీ యాడ్ ని తలెత్తి చూస్తున్న ప్రభాకర్ భుజంపై బరువుగా ఓ చెయ్యి పడింది.వెనక్కి తిరిగి చూసిన ప్రభాకర్ గుండె జల్లుమంది!

ఓ కాని స్టేబుల్, చిరాగ్గా మొహం పెట్టుకుని ఉన్నాడు. అక్కడే ఉండాలో,గబా గబా పరిగెత్తాలో తెలియని అయోమయంతో చూస్తుంటే..

"ఏయ్,ఏంటలా చూస్తున్నావ్? నీ బస్సు టికెట్ పడేసుకున్నావ్ చూసుకోకుండా.." అంటూ చేతిలో టికెట్ పెట్టేసి, ప్రభాకర్ సమాధానానికి ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు!

పోలీసు వెళ్ళిన వైపే చూస్తున్న తన చేయి పట్టుకుని, బస్టాండులో ఓ పక్కకి లాక్కెళ్ళింది భార్య దీప.

"ఎక్కడికెళ్ళావ్? అటు చూసావా.." పోలీసు వెళ్ళిన వైపు చూపిస్తున్న ప్రభాకర్ చెయ్యి వెనక్కి లాగి, అటు,ఇటు ఓ సారి చూసి తన మొబైల్ లో ఓ వీడియో చూపించసాగింది.

# భయం నీడ

కథ

'ఫ్లాష్...ఫ్లాష్, పలువురు ఆడవాళ్ళను వేధించి,ఒక్కో సారి బలవంతంగా డబ్బులని వసూలు చేస్తూ ఇబ్బందిపెడుతున్న రాకేష్ అనే ప్రబుద్ధుడు.తరచూ మకాం మార్చే ఇతను,నిన్న రాత్రి ఎవరో కొట్టిన దెబ్బలకు రోడ్డుపై స్పృహ తప్పగా...నాటకీయంగా పోలీసులకు చిక్కిన వైనం!'

అంటూ....దెబ్బలతో ఉన్న రాకేష్ మొహాన్ని,ఆ వెంటనే అతని మీద ఫిర్యాదు ఇచ్చిన కొంతమంది ఆడవారిని బ్లర్ చేసి చూపిస్తున్నారు,ప్రముఖ టీవీ ఛానల్ లో !!

ఒకే సారి వంద కేజీల బరువు దింపేసుకున్నట్టుగా ఉంది ప్రభాకర్ కి.

గత 20 గంటలుగా,తన చేతిలో మనిషి చచ్చిపోయాడని బేజారైపోతున్న భర్తని చూసి అనుభవిస్తున్న బాధంతా కరిగి కన్నీరై ముంచెత్తగా కిందే కూర్చుండిపోయింది దీప!!

కాసేపటికి, మెల్లిగా బయటికి వచ్చారిద్దరూ.

దారిలో వాళ్ళిద్దరికీ ఇష్టమైన పానీ పూరి తిని,గుడికి వెళ్ళి భారమంతా దించేసుకుని మెల్లగా రాత్రి పదింటికి ఇల్లు చేరారు.

పక్కలు సర్దుకుని,మెల్లగా నిద్రలోకి జారుతుండగా 'కిర్ ర్...' మన్న శబ్దం మళ్ళీ!!


ఉలికిపాటుతో కిటికీ దగ్గరకి వెళ్ళి,ఓరగా తొంగి చూస్తే ఎవరిదో మనిషి నీడ !ఇంకాస్త కళ్ళు చికిలించి చూసారు. టీ స్టాల్ రంగ స్వామి తనింటి బయట నిల్చుని దేన్నో పట్టి పట్టి చూస్తున్నాడు.

"నీకీ నిద్రలో నడిచే అలవాటు ఎప్పుడు పోతుందో? రోజూ ఇంట్లో కి తోసుకెళ్ళలేక,నా చేతులు పడిపోతున్నాయి." విసుక్కుంటూ తీసుకెళ్తోంది అతని భార్య!!

ఆశ్చర్యంగా ఒకరినొకరు చూసుకున్న ప్రభాకర్,దీప పెదాలపై కదలాడిన ఆ చిరునవ్వు,వెన్నెలకు పోటీగా మెరిసింది.

--- శుభం ---

# “అంటరానివారు ”
## untopuchable






ముల్క్ రాజ్ ఆనంద్ :ఆంగ్ల భాషలో మొట్ట మొదటి ఇండియన్ సాహిత్యకారుడు. ముగ్గురు త్రిమూర్తులు లలో మొదటి వాడు. ఇద్దరి గురించి గత పుస్తక పరిచయం లో తెలుసుకున్నాము. ఒకరు Rk నారాయణ్ , రెండు రాజా రావు.

ముల్క్ రాజ్ ఆనంద్ ప్రముఖ రచన untouchable.పద్మ భూషణ్ , ఇంటర్నేషనల్ పీస్ ప్రైజ్ , సాహిత్య అకాడెమీ అవార్డు ల గ్రహీత. 1935 లో రాసిన un-touchable నవల భారతీయ సమాజమున అంటరాని వారి కథ. (పేరయ/పాకీ వారు ). బాఖా అను అంటరాని వాని దినచర్యలో ఒక రోజు.

బాఖా ,తండ్రి కోపిష్టి లాఖా. లాఖా ఆజ్ఞ మీద పాకీ దొడ్లు కడుగుటకు చరత్ సింగ్ హాకీ ఆటగాని ఇంటికి వెళ్ళినప్పుడు హాకీ బ్యాట్ బహుమానం ఇస్తాను పని పూర్తి చేసుకుని తీరికగా రమ్మని ఆహ్వానిస్తాడు. బాఖా ఇంటికి తిరిగి వెళ్ళినప్పుడు చెల్లెలు సోహిని ఊరి బావివద్దకు నీళ్ల కోసం వెడుతుంది. కానీ అంటరాని వారు బావి నుండి నీళ్లు చేదుకోవడం, బావి లోని నీరు కలుషితం అవుతుందని, మరల నీటి శుద్ధికి ఖర్చు తో కూడిన పూజ చేయాలని అగ్ర కుల హిందువులు అనుమతించరు. కాలినాథ్ అనే పూజారి అక్కడకు వచ్చి సోహిని అందము చూసి, నీరు తాను తోడి పోయుదునని -గుడి ప్రాంగణం ను శుభ్ర పరచమని అడుగుతాడు.

బజారు వీధులను ఊడ్చుకుంటూ బాఖా పొరపాటున తన చీపురు బ్రాహ్మణ హిందూ కు తగులట -అతను అందరిని పోగుపరచి తనను అపవిత్రం చేసెనని, అవమానించి కొడతారు.



## చదవాల్సిన పుస్తకం

అవమాన భారముతో బఖా గుడి లోనికి అనుమతి లేకున్నా అడుగుపెడతాడు. అక్కడ సోహిణి ఏడుస్తూ కనిపిస్తుంది. మరుగు దొడ్డి శుభ్రం చేస్తుండగా పూజారి తన వృక్షోజాలను పట్టుకుని లైంగిక దాడి చేశాడని, తిరస్కరించగా పూజారి తనను ముట్టుకున్నదని ఎదురు దాడి చేస్తాడు.

బాఖా ఏమిచేయలేక, తాను అన్నం అడుక్కుని తెస్తాను అని, సోహిణి ను ఇంటికి వెళ్ళమని పంపిస్తాడు. అన్న యాచన చేస్తూ తిరుగుతూ, తాము అగ్ర వర్ణ హిందువుల చేత పడుతున్న అవమానములు , అనుచితములు , కసాయి తనం తలుచుకొని విరక్తి చెందుతాడు. తన ఆవేదన తండ్రి కి చెప్పినప్పుడు , అగ్రవర్ణ వైద్యుడు ఒకరు బఖా చిన్నతనములో జ్వరం వస్తే కాపాడేనని వారిలో మంచి ఉన్నదని చెపుతాడు.

బఖా తన స్నేహితుని చెల్లెలి పెళ్ళికి వెళ్ళినప్పుడు –తనను కొట్టిన వారిపై ప్రతీకారం చేద్దామని వారు చెప్పినప్పుడు తాము మరింత కష్టాల పాలు అగుదుమని ఆపుతాడు. అంటరాని వారికి న్యాయము పొందుటకు అవకాశం లేదంటాడు.

చరత్ సింగ్ ఇచ్చిన హాకీ బ్యాట్ తో ఆట ఆడుతుండగా బంతి ఒక పిల్లవాని తలకు తగులుతుంది. పిల్లవానిని ఎత్తుకుని తల్లి వద్దకు చేర్చినప్పుడు బాఖా ను గుర్తించి పిల్లవానిని ముట్టుకుని అపవిత్రం చేశాడని పిల్లవాని తల్లి తిడుతుంది. ఇంటికి చేరిన బాఖా ను తండ్రి రాఖ తిట్టి ఇంటినుండి గెంటుతాడు.

రైల్వే స్టేషన్ వైపు వెడుతుండగా, గాంధీ గారి ఆ ఊరిలో సభ కు ఉపన్యాసం కు వస్తున్నాడని తెలిసి అక్కడే ఉండి ఉపన్యాసం వింటాడు. కుల విసక్షణ కూడదని –అహింసా మార్గమును అనుసరించాలనే విషయం శ్రద్ధగా వింటాడు బాఖా.

సభ ముగిసిన పిమ్మట ఒక న్యాయవాది, ఒక కవి కలసి చర్చించు మాటలు ఆసక్తిగా వింటాడు. న్యాయవాది గాంధీ గారి ఆలోచన బాగులేదని –కుల సమస్య ప్రాచీన సంప్రదాయమని, కుల తిరుగుబాటు పోరాటములతో అంతం కాదని చెప్పగా , కవి మటుకు అంటరాని సమస్య ముఖ్యముగా మరుగుదొడ్డి flushing పద్దతి వచ్చి పాకీ పనివారు వేరు వేరు వృత్తులకు అవకాశం ఉంటుందని, సమాజం వారి పునరావాస ప్రక్రియ ఆలోచించాలి.

బాఖా కుటుంభ నేపధ్యం అంటరాని వారి ఆవేదన తో సాగిన రచన. తప్పక చదువ వలసిన పుస్తకం. ఈ నాటి పాఠకులకు మార్గ దర్శనం.



## చూడాల్సిన సినిమాలు ఆణిముత్యాలు



ఈదర శ్రీవిద్య




జీవితంలో అన్నీ చూస్తాం. ఎత్తుపల్లాల్ని, కలిమిలేములని, ఆనందం ఆవేదనల్ని ఇలా ప్రతిదీ అనుభవిస్తాం. అలానే లవకుశ దృశ్య కావ్యం !

'అజరామరం' అన్న పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలచిన కొన్ని కళాఖండాలు ఉన్నాయి. తెలుగు చిత్రసీమలో 'అజరామర చిత్రం' అంటే 1963లో రూపొందిన 'లవకుశ' తరువాతే ఏదైనా అనేవారు ఎందరో ఉన్నారు. తెలుగువారి తొలి రంగుల చిత్రంగా తెరకెక్కిన 'లవకుశ' 1963 మార్చి 29న విడుదలయింది. నభూతో నభవిష్యత్ అనదగ్గ విజయం సాధించింది. అరవై ఏళ్ళవుతూ ఉన్నా, ఆ సినిమాను అధిగమించిన మరో పౌరాణికం మనకు కానరాదు. అలాగే ఆ చిత్రం దక్షిణాదిన కోటి రూపాయలు వసూలు చేసిన తొలిచిత్రంగా చరిత్ర సృష్టించింది. అరవై ఏళ్ళ నాటి ఈ వసూళ్ళను ఇప్పటి లెక్కలతో సవరిస్తే కనీసం రెండు వేల కోట్ల రూపాయలు అని ట్రేడ్ పండిట్స్ అంటున్నారు. అంటే ఇప్పటి వెయ్యికోట్ల సినిమాల కంటే మిన్న అన్నమాట! పైగా ఈ చిత్రం వసూళ్ళు దక్షిణాదికే పరిమితం. ఇప్పటిలా ప్రపంచవ్యాప్తంగా దక్షిణాది సినిమాలు విడుదలయ్యే రోజులు కావవి! ఇక 'లవకుశ'లోని పాత్రల కోసమే ఆయా నటీనటులు జన్మించారా అనిపిస్తుంది. సంగీతసాహిత్యాలు జోడుగుర్రాల్లా సాగాయి. మరపురాని మరచిపోలేని పద్యాలు, పాటలతో తెలుగువారిని 'లవకుశ'అలరించింది. ప్రముఖ దర్శకులు సి.పుల్లయ్య, ఆయన తనయుడు సి.యస్.రావు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. లలితాశివజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఏ.శంకరరెడ్డి నిర్మించారు.

వాల్మీకి రామాయణం శ్రీరామపట్టాభిషేకంతో సంపూర్ణమవుతుంది. తదుపరి 'ఉత్తర రామాయణం'గా భవభూతి రాసిన నాటకం ప్రసిద్ధం కాగా, ఆ పై పలు గాథలు వెలుగు చూశాయి.'ఉత్తర రామాయణం'లోని సీతారాముల సంతానం లవకుశుల వీరగాథను పలు భాషల్లో పలు విధాలా శ్లాఘించారు. వాటిని ఆధారం చేసుకొని ఈ కథ రూపొందింది.

# చూడాల్సిన సినిమాలు ఆణిముత్యాలు

శ్రీరామపట్టాభిషేకం తరువాత రాముడు జనరంజకంగా పాలన చేస్తానని తన ప్రజలకు వాగ్దానం చేస్తాడు. తన పాలనలో ప్రజలు ఏలాంటి కష్టాల పాలు కారాదని నిర్ణయించి, రామచంద్రుడు వేగులను నియమిస్తాడు. తనపైనా, తన పాలనపైనా ప్రశంసలు కాదు, విమర్శలు ఉన్నా వినిపించాలనీ చెబుతాడు రాముడు.అది ఎంతటి కష్టతరమైనదైనా సరే తనకు విన్నవించాలనీ వేగులకు సూచిస్తాడు. సీతారాముల సంసారం సుఖంగా సాగుతూ ఉంటుంది. సీతమ్మ గర్భవతి. ఆ సమయంలో రామాయణగాథను వివరించే చిత్రపటాలను చూస్తుంది. మళ్ళీ వనాలకు ఏగి ఆ ప్రశాంతవాతావరణంలో సేదతీరాలని భావిస్తుంది. ఆ విషయాన్ని శ్రీరామునికీ చెబుతుంది సీత. రాజ్యంలో ఓ రజకుడు తన భార్యను అనుమానించి, ఆమెను విడనాడ నిర్ణయిస్తాడు. ఎందరు చెప్పినా వినని అతడు "ఆయన యెర్రి రామచంద్రుడు కనుక ఏడాది లంకలో ఉన్నసీతను తెచ్చి ఏలుకున్నాడు... ఊళ్ళోవాళ్ళందరినీ అలాగే ఏలుకోమంటాడా?" అంటూ ప్రశ్నిస్తాడు. ఈ విషయం విన్న ఓ వేగు వచ్చి, రామునికి విన్నవిస్తాడు. ఆ మాట విని చలించిపోతాడు శ్రీరాముడు. సీత మళ్ళీ వనాలకు వెళ్ళాలన్న అభిలాషను నెరవేరుస్తూ, లక్ష్మణుడిని ఆమెను వనాల్లో వదలి రమ్మంటాడు రాముడు. తమ్ముళ్ళు వారించినా, రాజారామునిగా అది తన శాసనం అని చెబుతాడు. వనంలో సీతను విడిచి, అసలు విషయం వివరిస్తాడు లక్ష్మణుడు. తన స్వామి ఆజ్ఞాపిస్తే అగ్నిలో దూకడానికి సందేహించని తాను, ఆయన శాసిస్తే దానిని పాటించనా, ఆ విషయం తనతో ఎందుకు చెప్పలేదని విలపిస్తుంది సీత. తరువాత ఆ వనాల్లో ఆమెను చూసిన వాల్మీకి తన ఆశ్రమానికి తీసుకుపోవడం,అక్కడే సీతమ్మ కవలపిల్లలను ప్రసవించడం జరుగుతాయి. ఆ కవలలకు లవకుశులని పేర్లు. వారిద్దరూ వాల్మీకి వద్ద రామాయణం నేర్చి పాడుతూ సాగుతుంటారు. అయోధ్యకు పోయి తమ పాటలతో రాముని సైతం మెప్పిస్తారు.అయితే అక్కడ సీతమ్మ లేదని తెలుసుకొని, రాముడే ఆమెను వనాలకు పంపాడని ద్వేషిస్తారు. రామరాజ్యంలో కాటకం వస్తుంది. నివారణగా కాంచనసీతాసమేతుడై అశ్వమేధయాగం ఆరంభిస్తాడు రాముడు. యాగాశ్వం కానలకు పోయి, వాల్మీకి ఆశ్రమ ప్రాంతం చేరుతుంది. అదే సమయంలో సీతాదేవి లలితాదేవి వ్రతం ఆరంభిస్తుంది. ఆమె పూజకోసం పూలకు కుశుడు వెళతాడు. అప్పుడు యాగాశ్వాన్ని బంధిస్తాడు లవుడు. శత్రుఘ్నుని బాణాలకు లవుడు మూర్ఛపోతాడు. ఇది తెలిసిన కుశుడు వచ్చి, యుద్ధం చేసి శత్రుఘ్నుని ఓడించి, యాగాశ్వాన్ని బంధిస్తాడు. లక్ష్మణుడు వచ్చి, అతనూ లవకుశుల చేతిలో ఓడిపోతాడు. దాంతో రఘురాముడే బయలుదేరతాడు. ఆయనతో ఆంజనేయుడు వెళతాడు. అక్కడ రామనామం జపం చేస్తూ హనుమంతుడు ఆశ్రమం ప్రవేశిస్తాడు. శ్రీరామలవకుశుల యుద్ధం సాగుతుంది. ఆశ్రమంలో పూజచేస్తున్న సీతమ్మను చూసి, హనుమ విషయం వివరిస్తాడు. సీతమ్మ పూజ ఆపి, పరుగున వచ్చి తండ్రిపై ఆయుధాలు ప్రయోగిస్తున్న బిడ్డలను వారిస్తుంది. చివరకు తమ కన్నతల్లే సీతమ్మ అని, శ్రీరాముడే తమ జనకుడనీ తెలుసుకుంటారు. లవకుశులను శ్రీరామునికి అప్పగించి, తల్లిభూదేవి గర్భంలోకి వెళుతుంది సీతమ్మ. లవకుశుల పట్టాభిషేకం చేసి, శ్రీరాముడు అవతారం చాలించి,వైకుంఠంలో శ్రీమహావిష్ణువులో లీనమవ్వడంతో కథ ముగుస్తుంది.

శ్రీరామపాత్రలో యన్. టి.రామారావు, సీతమ్మగా అంజలీదేవి జీవించిన ఈ చిత్రంలో లవునిగా నాగరాజు, కుశునిగా సుబ్రహ్మణ్యం, వాల్మీకిగా చిత్తూరు నాగయ్య, లక్ష్మణునిగా కాంతారావు నటించారు. మిగిలిన పాత్రల్లో శోభన్ బాబు, సత్యనారాయణ,

చూడాల్సిన సినిమాలు ఆణిముత్యాలు



ధూళిపాల, శివరామ్, రేలంగి, రమణారెడ్డి, కేవీయస్ శర్మ,శాండో కృష్ణ, కన్నాంబ, యస్.వరలక్ష్మి, సూర్యకాంతం, గిరిజ, సంధ్య, లక్ష్మీప్రభ, జయంతి, వాసంతి తదితరులు అభినయించారు. ఈ చిత్రానికి సదాశివబ్రహ్మం రచన చేశారు.

మరపురాని సంగీతసాహిత్యాలు!

"జయ జయ రామా...", "రామన్న రాముడు కోదండరాముడు...", "విరిసె చల్లని వెన్నెల...", "ముద్దుమోము...", "వల్లనోరి మామా నీ పిల్లని...", "ఏ నిమిషానికి ఏమి జరుగునో...", "జగదభిరాముడు...", "రామకథను వినరయ్యా...", "వినుడు వినుడు రామాయణగాథ...", "శ్రీరాముని చరితమును...", "ఎందుకే నామీద కోపం...", "ఊరకే కన్నీరు నింపిన కారణమేమమ్మా...", "శ్రీరామ సుగుణధామా...", "సందేహించకుమమ్మా...", "అశ్వమేధయాగానికి జయము...", "లేరు కుశలవుల సాటి...", "శ్రీరామ పరంధామా..." అంటూ సాగే మొత్తం 17 పాటలు, పద్యాలు, శ్లోకాలు కలిపి మరో 21 వెరసి 38 గానాలు ఈ చిత్రరాజంలో చోటు చేసుకున్నాయి. సముద్రాల సీనియర్, సదాశివబ్రహ్మం, కొసరాజు పాటలు పలికించగా, కొన్ని పద్యాలను సముద్రాల, మరికొన్నిటిని సదాశివబ్రహ్మం రాశారు. కంకంటి పాపరాజు, దువ్వూరి రామిరెడ్డి రాసిన బహుప్రాచుర్యం పొందిన పద్యాలను అనువుగా ఇందులో చొప్పించారు. ఘంటసాల స్వరకల్పన చేశారు. ఇందులోని అన్ని పద్యాలు, పాటలను కంఠస్థం చేసి అలరించిన వారెందరో ఉన్నారు. ఇప్పటికీ ఈ చిత్రంలోని పద్యాలు, పాటలను సాధన చేస్తూ భావి గాయనీగాయకులు సాగుతూ ఉండడం విశేషం!

★★★★

సామాజిక కథ

# పరివర్తన



బహుమతి పొందిన సామాజిక కథ

వీరేశ్వర రావు మూలా

అర్ధ రాత్రి పన్నెండు గంటలికి మెలకువ వచ్చింది రాఘవ రావు కి. పక్క కి చూసుకున్నాడు. భార్య లేదు. ఏడాది క్రితమే ఈ లోకాన్ని విడిచింది. కొడుకు, కోడలు వేరే గదిలో ఉన్నారు.

మంచినీళ్ళు తాగి పడుకున్నాడు. నిద్ర పట్టలేదు. ఈ రోజే కాదు గత వారం రోజుల నుండి ఇదే పరిస్థితి. ఏదో తెలియని వేదన!

ఏదో అపరాధ భావన! నిద్ర పట్టడం లేదు.

రాఘవ రావు పి. ఎఫ్ ఆఫీస్ లో ఆఫీసర్ గా పనిచేసి, రిటైరయ్యాడు. ఆర్థిక పరమైన సమస్యలు లేవు. కొడుకు ది కూడా గవర్నమెంట్ ఉద్యోగమే! వయస్సు వల్ల వచ్చే ఇబ్బందులు మామూలే! బిపికి, షుగర్ కి మందులు వాడుతున్నాడు. జీవితాంతం తోడు వచ్చేవి అవే కదా!

కొడుక్కి నిద్ర పట్టని సంగతి చెబితే “వయసు కదా! అలాగే ఉంటుంది” అని చెప్పి కొట్టి పారేశాడు.

రాఘవరావు సమస్య అలాగే ఉంది.

★★★★

రాఘవ రావు మార్నింగ్ వాక్ కి వెడతాడు. తన వయసు వాళ్ళని పలకరిస్తాడు. ఆన్ లైన్ ఎక్కువ వాడడు.

తనకి కావలసిన డబ్బులు ఎటిఎమ్ లో తీసుకుంటాడు. ఒక రోజు

రెండు చొక్కాలు కుట్టించుకోవాలని, ఆ విషయం కోడలి తో చెప్పాడు.

“ అమెజాన్ లో బుక్ చేస్తాను” అంది కోడలు.

“ఎందుకు లే అమ్మా, తాను లో గుడ్డ తీసుకుంటాను” అన్నాడు రాఘవరావు.

★★★★★

రాఘవ రావు ప్రణీతం సిల్క్స్ షాప్ కి వెళ్ళాడు.

“రండి” పిలిచాడు షాప్ లో పనిచేసే ఆయన. వయసు నలభై ఉండచ్చు. మనిషి లో జీవ కళ లేదు. మాసిన చొక్కా తో ఉన్నాడు.

“కొద్దిగా కాటన్, సిల్క్ మిక్స్ ఉన్నవి చూపించండి. కట్ పీస్ లు వద్దు. తానులో ముక్క కావాలి” తనకు ఏం కావాలో చెప్పాడు.

# పరివర్తన

కథ

రేమాండ్స్ క్లాత్ చూపించాడు. అది తీసుకున్నాడు రాఘవరావు.

“బాబూ నువ్వు శంకరం గారి అబ్బాయి కదూ” అని రేమాండ్స్ బట్టను మడతపెట్టే అతన్ని పలకరించాడు.

“అవునండి”

“ మీ నాన్న గారు రవీంద్ర కాన్వెంట్ లో చేసేవారు కదా “

“ అవునండి”

“ ఇప్పుడు చేస్తున్నారా?”

“లేరండి ఆయన పది ఏళ్ల క్రితమే యాక్సిడెంట్ లో పోయారు.”

“అయ్యో “

“ మరి పి. ఎఫ్ డబ్బు ఏమైనా వచ్చిందా? “

ఏం రాలేదు. రవీంద్ర యాజమాన్యం వారి భాగం చెల్లించలేదని చెప్పారు. ఆ కాన్వెంట్ కూడా ఎత్తేసారు. మా పరిస్థితి బాగు లేదు. అమ్మ చిన్న హోటల్ నడుపుతోంది.

నాకు ఉద్యోగం రాలేదు. బతకాలి కదా ఇలా బట్టల కొట్టు లో తెల్లవారి పోతోంది! “ అన్నాడు బాధ గా

“ మీకు ఇల్లు ఉండాలి కదా. “ సందేహం గా అడిగాడు రాఘవరావు.

“ కోర్టు గొడవల్లో పడీ, చివరికి చిన్న ఒంటిల్లు, ఒక గది దక్కాయి. “

“ నీకు పెళ్ళయ్యిందా? “

“ అయ్యింది . ఒక బాబు. కాలేజి లో చేర్చాలి”

“ సరే బాబూ, వస్తాను “

“ మీ ప్యాకెట్ తీసుకోండి. సంచిలో పెట్టాను. అలా రామాలయం వీధి చివరికి రండి. అక్కడున్న హొటల్ మాదే.

మా దోశ రుచి చూస్తే రోజూ వస్తారు”

“ నీ పేరు? “

“ శ్రీధర్”

“ మీ పేరు? “

“ రాఘవరావు “

“ నమస్కారం రాఘవ రావు గారు. మీ బట్టలను మా కొట్లో కొనండి.”

“అలాగే “

★★★★

రాఘవరావు ఇంటికి వచ్చాడు చొక్కా గుడ్డతో.

“ టైలర్ ని వెతకాలి కదా “ అంది కోడలు.

“ రెడీమేడ్ వచ్చాక టైలర్ల పరిస్థితి బాగులేదు. నా బోటి వాళ్ళు సాయం చెయ్య పోతే ఏలా?

యూత్ జీన్స్ అంటూ ఫ్యాషన్ చుట్టూ తిరుగుతున్నారు.”

“ మార్పు, వేగం తప్పవు మావయ్య గారూ “ లాప్ టాప్ ని చూస్తూ

“ ఉనికి ని మింగేసే మార్పు అవసరమా? ఐనా విలువలు మారవు కదా”

★★★★

రాత్రి పన్నెండయ్యింది. రాఘవరావు కి మెలకువ వచ్చింది. మళ్ళీ నిద్ర పట్టలేదు.

రాఘవరావు కి చెమటలు పట్టాయి. గతం అంతా ఒక్కసారి గిర్రున తిరిగింది.

పదేళ్ళ క్రితం పేపర్ లో వార్త వచ్చింది.

“ పి ఎఫ్ ఆఫీసులో వంద కోట్లు స్కాం. అంతర్గతం గా ఉద్యోగుల చేసారని ఆరోపణ”. రాఘవరావు కి అందులో భాగం ఉంది.

నగదు ఉపసంహరణ (విత్ డ్రా) హక్కుని వినియోగించుకోకుండా, పదేళ్ళ పాటు అలా ఉండిపోయిన

# పరివర్తన

కథ

ఖాతాలనుండి నిధులు మళ్ళించబడ్డాయి.

స్కాం మీద ప్రభుత్వం విచారణ ప్రారంభించింది.

పెద్ద అధికారులకు సస్పెన్షన్ వేటు పడింది. చిన్న స్థాయి అధికారులకు ఇంక్రిమెంట్ పోయింది.

రాఘవరావు కి వెనక్కి వెళ్ళగా,

శ్రీధర్ తండ్రి కి, పి ఎఫ్ లో (రవీంద్ర కాన్వెంట్ వల్ల) నాలుగు లక్షలు ఉన్న

ఉన్న విషయం గుర్తుకు వచ్చింది. అది స్కాం లో స్వాహా అయ్యింది.

ఆ డబ్బు ఉంటే, కొంచెం ఆ కుటుంబానికి సాయమయ్యేది.

రాఘవరావు గతం నుండి వర్తమానం లోకి వచ్చాడు.

ఏం చెయ్యాలి.?

ఏం చెయ్యాలి?

★★★

రాఘవరావు ప్రణితం సిల్క్స్ షాప్ కి వెళ్ళాడు. అప్పటికే ఓనర్ శ్రీధర్ ని ఏదో అంటున్నాడు.

" ఇది గవర్నమెంట్ ఆఫీసు కాదు. సెలవు పెడితే జీతం కట్.

అందరికీ ఇదే చెప్తున్నా" అని చెప్పి గోడౌన్ వైపు వెళ్ళాడు.

"రండి" పిలిచాడు శ్రీధర్.

"ఇక్కడ కాదు. బయటికి వెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు రాఘవరావు.

★★★★★

రాఘవరావు శ్రీధర్ కి పది లక్షల చెక్ ఇచ్చాడు.

" ఎందుకు సార్? "

" మీ నాన్న గారి దగ్గర ట్యూషన్ కుర్ర వాడిని. ఏదో నాకు తోచిన సాయం"

"మీరు ఈ సమయం లో నన్ను ఆదుకున్న దేవుడు సార్"

అని శ్రీధర్ కాళ్ల మీద పడ్డాడు.

" నిజానికి ఇది మీ డబ్బే" అని మనసు లో అనుకున్నాడు రాఘవరావు.

"ఒక షరతు"

"ఏమిటీ" అడిగాడు శ్రీధర్.

" నేను ఇచ్చినట్టు ఎవరికీ చెప్పవద్దు " అన్నాడు. రాఘవరావు.

వేడి వేడి మసాలా దోశ తెచ్చాడు శ్రీధర్ తన హొటల్ నుండి.

రాఘవరావు తృప్తి గా తిని ఇంటికి చేరాడు.

★★★★

ఆరోజు పది గంటలకే నిద్రపోయాడు రాఘవరావు. అతని

కలలో అతని భార్య విమల వచ్చింది.

" మంచి పని చేసాను విమలా " అని విమలకి చెప్పుకున్నాడు.

విమల నవ్వి అతని బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది. తరువాత గాఢ నిద్ర లోకి వెళ్లి పోయాడు. తరువాత ఎప్పుడూ అతనికీ

రాత్రి పన్నెండు గంటలకు మెలకువ రాలేదు.అప్పటినుండి ప్రశాంతం గా ఉదయం ఆరు గంటలకు నిద్ర లేస్తున్నాడు!

★★★




# ఒకే ఒక తప్పు




## బిగ్ బజార్ తప్పు

ఫ్యూచర్ గ్రూప్ లోని రిటైల్ బిజినెస్ను రూ.24,713 కోట్లకు అక్వైర్

చేస్తున్నట్లు రిలయెన్స్ గ్రూపు ప్రకటించడంతో మూడు దశాబ్దాల కిషోర్ బియానీ రిటైల్ సామ్రాజ్యానికి తెరపడింది. అయితే.. ఆ తెర వెనక ఏం జరిగింది?. అదే ఇవాళి మన స్పెషల్ స్టోరీ. కిషోర్ బియానీ తన రిటైల్ వ్యాపారాన్ని ప్రారంభించిన 20 ఏళ్లలోనే దేశం మొత్తం విస్తరింపజేశారు. ఆయన మొట్టమొదట 1997లో కోల్కతాలో పాంథలూన్స్ను ప్రారంభించారు. ఫ్రాంచైజ్లను విక్రయించటం ద్వారా బిజినెసన్ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత అదే నగరంలో డిపార్ట్మెంటల్ స్టోర్ను ఏర్పాటుచేసి బిగ్బజారు శ్రీకారం చుట్టారు. ఐదేళ్లలోనే దేశవ్యాప్తంగా వందకు పైగా స్టోర్లను అందుబాటులోకి తెచ్చారు. తదనంతరం వివిధ వ్యాపార రంగాల్లోకి ప్రవేశించారు. ఫ్యూచర్ గ్రూప్ పతనానికి అప్పుతే ప్రధాన కారణం. కిషోర్ బియానీ ఎన్నో వ్యాపార రంగాల్లోకి అడుగుపెట్టాలని అనుకునేవారు. దీంతో ఒక్కో వెంచర్ ఆయనకు తలకు మించిన భారంగా మారింది. అయినప్పటికీ 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం తలెత్తినా ఆయన దీటుగా నిలబడ్డారు. ఈ నేపథ్యంలో 2009లో కిషోర్ బియానీ ఫ్యూచర్ గ్రూపు నుంచి నాన్ రిటైల్ బిజినెస్ను వేరు చేస్తూ తన సంస్థను పునర్నిర్మించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ రుణాల భారం నుంచి తప్పించుకోలేకపోయారు.

ఇదిలాఉండగా.. బిజినెస్ గ్రోత్ కోసం ఆయన రీజనల్ రిటైల్ చైన్లను అక్వైర్ చేశారు. 2012లో పాంథలూన్స్ను ఆదిత్య బిర్లా గ్రూపుకి సుమారు 300 కోట్ల రూపాయలకు విక్రయించారు. అయినప్పటికీ ఫ్యూచర్ గ్రూప్కి నికరంగా రూ.7850 కోట్ల అప్పు ఉండిపోయింది. 2014లో నీల్గరీస్ అనే గ్రాసరీ స్టోర్ను రూ.300 కోట్లకు అక్వైర్ చేసుకున్నారు. అలాగే.. 2016లో స్మాల్ ఫార్మాట్ గ్రాసరీస్ స్టోర్ అయిన ఈజీ డే చెయిన్ను అక్వైర్ చేసుకున్నారు. అదే సంవత్సరంలో.. బెంగళూరుకు చెందిన రిటైల్ చెయిన్ హెరిటేజ్ ఫ్రెష్ను కూడా అక్వైర్ చేసుకున్నారు.

2017లో ఫ్యూచర్ రిటైల్ రూ.650 కోట్లు వెచ్చించి అప్పటికే




# ఒకే ఒక తప్పు

నష్టాల్లో ఉన్న హైపర్సిటీ చెయిన్ను మరియు ఇ-జోన్ ను బిగ్బజార్లో విలీనం చేసింది. దీంతో ఫ్యూచర్ గ్రూపు పూర్తిగా రుణాల ఊబిలో కూరుకుపోయింది. కిషోర్ బియానీ.. ఫుడ్ బిజినెస్ సెక్టార్ లోకి కూడా అడుగుపెట్టారు. వాళ్ల ఉత్పత్తులకు సొంత లేబులింగ్ ఇచ్చి మార్కెట్లోకి తీసుకొచ్చారు. ఈ బ్రాండ్లను వాళ్ల రిటైల్ స్టోర్లలోనే అమ్మాలనే ఆలోచన చేశారు. తద్వారా ఎక్కువ లాభాలు పొందొచ్చని అంచనా వేశారు. ఇవే బ్రాండ్లను ఇతర రిటైల్ చెయిన్లకు కూడా విక్రయించాలని భావించినప్పటికీ ఆ ప్రయత్నం ఫలించలేదు.

ఫ్యూచర్ గ్రూప్కి, అమేజానికి మధ్య వివాదం ఎలా మొదలైందో చూద్దాం. అమేజాన్.. ఫ్యూచర్ గ్రూపులోని కొంత భాగాన్ని కొనుగోలు చేసింది. ఫ్యూచర్ రిటైల్లో ఫ్యూచర్ కూపన్స్ అనేది ఒక భాగం. దీనికి 7.3 శాతం వాటా ఉంది. ఇందులోని 49 శాతాన్ని అమేజాన్ సంస్థ 2019లో కొనుగోలు చేసింది. తద్వారా ఫ్యూచర్ రిటైల్లో వీళ్లకు 3.5 శాతం వాటా ఉన్నట్లు చెప్పొచ్చు. అయితే ఈ అగ్రిమెంట్ ప్రకారం ఫ్యూచర్ రిటైలికి సంబంధించిన విక్రయాలను ముందుగా అమేజాన్ దృష్టికి తేవాలి. అప్పుడు ఆ కొనుగోలును అమేజాన్ వాళ్లు చేయొచ్చు లేదా థర్డ్ పార్టీకి ఇవ్వొచ్చు. కానీ అలా జరగలేదు.

రిలయెన్స్ రూ.24,713 కోట్లకు అక్వైర్ చేస్తున్నట్లు ప్రకటించటంతో ఈ డీల్ జరగకుండా అమేజాన్.. సింగపూర్లోని ఎమర్జెన్సీ ఆర్బిట్రేషన్ ను ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన ఆర్బిట్రేషన్ అమేజాన్కు అనుకూలంగా తీర్పిచ్చింది. కానీ ఈ తీర్పు ఇండియాలో చెల్లదంటూ ఫ్యూచర్ గ్రూప్ సుప్రీంకోర్టుకు వెళ్లగా డీల్ వాయిదా పడింది. ఈలోపే ఆస్తుల స్వాధీనంపై అమేజాన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీంతో రిలయెన్స్ ఈ డీల్ను వెనక్కి తీసుకోవాలనే ఆలోచన చేసింది. మొత్తానికి ఈ కేసు ఏ మలుపు తిరుగుతుందో తెలియట్లేదు.

ఏది ఎలా ఉన్నప్పటికీ రిటైల్ రంగంలో రారాజుగా నిలిచిన కిషోర్ బియానీ వ్యాపార సామ్రాజ్య పతనానికి ఆయనే ప్రత్యక్షంగా కారణమయ్యారో లేక రిలయెన్స్, అమేజాన్లు కారణమయ్యాయో తెలియని అయోమయ పరిస్థితి ఉంది.

★★★



# జీవన చిత్రాలు



## "పేదలే పెళ్లి పెద్దలు .."

పెళ్లికి బంధువులు, స్నేహితులను పిలవడం కొత్తేమీ కాదు. వచ్చిన వాళ్లకు వందరకాల పిండి వంటలతో భోజనాలు ఏర్పాటు చెయ్యటం కుడా కొతేమి కాదు .

అయితే ఉత్తరప్రదేశ్లోని ఘాజి పూర్కు చెందిన సిద్దార్థ్ తన సోదరి వివాహానికి యాచకులను స్పెషల్ గెస్ట్లుగా ఆహ్వానించాడు. ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేసిన ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

తన సోదరి వివాహనికి హాజరైన యాచకు లను సిద్దార్థ్ ఆత్మీయంగా ఆహ్వాస్తున్న దృశ్యం వీడియోలో కనిపిస్తుంది. వారు విందుభోజనాన్ని సంతోషంగా ఆస్వాదిస్తున్న దృశ్యాలు ఈ వీడియో క్లిప్లో కనిపిస్తాయి.

అలాంటి ఖరీదైన, రుచికరమైన భోజనాన్ని తినడం వారిలో చాలామందికి అదే మొదటిసారి.

కడుపు నిండా భోజనం చేసిన యాచకులలో కొందరు సంతోషంతో నృత్యం చేశారు!

వివాహానికి కొన్నిరోజుల ముందు సిదార్థ్ వివిధ ప్రాంతాలకు పనిగట్టుకుని వెళ్లి మరీ యాచకులను ఆహ్వానించాడు.

'ఈ యాచకులలో ఎంతమంది అర్థాకలితో ఉన్నారో, ఎంతమంది కొన్నిరోజుల పాటు భోజనానికి దూరమయ్యారో. ఇలాంటి దీనులకు వరంలాంటి పెళ్లివిందు ఇది'

'అంతులేని ఆడంబరాలతో, అనవసర ఖర్చుతో మన దేశంలో వివాహ వేడుకలు నిర్వహి స్తుంటారు. ఒక్క రోజైనా పెళ్లి విందు రూపంలో దీనుల కడుపు నింపడం అద్భుతమైన పని'

'విందు భోజనాల సమయంలో యాచకులు కనిపిస్తే విసుక్కుంటూ వారిని దూరంగా తరిమే దృశ్యాలను చాలా చూశాను. ఇలా మనసును కది లించే దృశ్యం చూడడం ఇదే తొలిసారి'

'మానవత్వానికి అద్దం పట్టే అరుదైన వీడి యో'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వెల్లువెత్తాయి.

★★★★★

# ఆంజనేయులు -అమెరికా రిటర్న్

ధారావాహిక



## ఎపిసోడ్ –10 :” సినిమా చూపిస్తా మామా “

ఆంజనేయులి కోసం అమెరికా పోలీసులు అదేపనిగా వెతకడం తో మన వాడు అడ్రస్ లేకుండా పోయాడు. ఎంత కాలమని దేశదిమ్మరిలా మారు వేషాల్లో తిరుగుతాడు , ఎదో ఒకరోజు పట్టుబడక తప్పదు . అమెరికా పోలీసులతో పెట్టుకుంటే అడ్రస్ లేకుండా చేయగలరని తెలిసిన ఆంజనేయులు పోలీసల ముందు లొంగి పోవాలని నిర్ణయించుకున్నాడు . దాని కోసం ఓ మంచి మూహుర్తం కూడా నిర్ణయించుకున్నాడు .

ఈ లోపే ట్రంపు’ గారు మరో ఆలోచన చెయ్యడంతో ఆంజనేయులి ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

ట్రంపు’ కూడా మన ఆంజనేయుడిలా తింగర మంసిహి , ఇవాళ వున్న ఆలోచన రేపు వుండదు. వాటిలో కొన్ని జనానికి మేలుచేస్తే మరి కొన్ని కీడు చేసేవి . నిజం చెప్పాలంటే మంచి చేసే వాటికన్నా కీడు చేసేవే ఎక్కువ. ఏంచేస్తారు మరి ఒకసారి ఎనుకున్నాక, భరించాలిగా మరో ఇదేళ్ళు.

ఇంతకి ఆంజనేయులి ఆనందానికి కారణం ఏమిటంటే, ఎవరైతే అనుమతులు లేకుండా

# ధారావాహిక

అమెరికాలో నివాసం వుంటున్నారో, వాళ్ళు తమంతట తామే లొంగి పోతే, ఓ మూడువేల డాలర్లు చేతిలో పెట్టి, రాచ మర్యాదలతో స్వదేశానికి తిప్పిపంపుతామని ట్రంప్ గారు ప్రకటిం చటమే

ఇంతకీ ట్రంపుగారికి ఇటువంటి మంచి ఆలోచన ఎందుకోచ్చింది అనుకుంటున్నా రా ?

ఎటువంటి అనుమతులు లేకుండా అమెరికా వచ్చిన ఆంజనేయులు లాంటి వారిని వెతకటానికే అమెరికా పోలీసుల సమయమ మొత్తం వృధా అయిపోతందట. దానితో అమెరికాలో నేరాల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతందట. పోలీసుల దృష్టి మొత్తం అటు మళ్ళడంతో .దొంగతనాలు , దోపిడిలు చేసేవాళ్ళు ఎక్కువయ్యారట .శాంతి బధ్రతలు క్షీణిస్తున్నాయని , పారితోషికాలిచ్చి మరి రాచ మర్యాదలతో సాగ సంపుతామని ప్రకటించారు.

“చచ్చిన వాడి పెళ్ళికి వచ్చిందే కట్నం” అన్నట్టు అంజనేయులు లాంటి వాళ్ళు చాలా మంది తేఇరిగి వెళ్ళేటప్పుడు ట్రంపు మహాశయుడు ఇచ్చిందే దో పుచ్చుకుని మెల్లగా ఇంటి దారి పట్టారు.

★★★

చెప్పపెట్టకుండా ఆంజనేయులు అమెరికానుంచి అమలాపురం లో అడుగుపెట్టటం తో , కోతి మూకకి ఎక్కడ లేని అనుమానాలొచ్చాయి. అదే విషయాన్ని ఆంజనేయుల్ని అడిగితే చెప్పిన జవాబు చెప్పకుండా, ఒక్కక్కడికి ఒక్కో జవాబు చెప్పి వాళ్ళను తికమక పెట్టాడు . ఇంకా ఎక్కువగా అబద్దాలు చెపితే నమ్మరని, ఆంజనేయులు సుదీర్ఘంగా, దీర్ఘాలు తీస్తూ ఆలోచించి చివరకి ఓ నిర్ణయానికి వచ్చాడు. ఇక నుంచి అమెరికా నుంచి ఎందుకు వచ్చావు అని ఎవరు అడిగినా, ‘సినిమా తియ్యటానికి’ అని జవాబు చెప్పటం మొదలు పెట్టాడు .

‘సినిమా” అనే మాట విన పడగానే, ఆంజనేయులు అప్పటి దాకా అమెరికా నుంచి ఎందుకొచ్చాడు అని ఆలోచించిన వాళ్ళు, ఇప్పుడు ఏ సినిమా తీయబోతున్నాడు. హీరో ఎవరు అంటూ ఆరా తీయటం మొదలుపెట్టారు. అంతా ‘సినిమా’ మహిమ మరి

కోతి మూక ఆనందానికైతే హద్దులేవు, అంజనే యులు సినిమా తీస్తే, తమఊళ్ళో

# ధారావాహిక

ఆ సినిమా ఆడే సినిమా హాళ్ళ దగ్గర బ్లాకులో టిక్కెట్లు అమ్మకోవచ్చని అప్పుడే వాటాలు కూడా వేసుకోవటం మొదలు పెట్టారు. వాళ్ళను చూస్తే జాలి పడటం తప్ప మనం చెయ్యగలిగింది. ఏమిలేదు. ఇటు వంటి వాళ్ళ ఆలోచనలే అంత. పూర్వం ఓబిచ్చగాడి భక్తికి మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమంటే, బంగారు బొచ్చ అడుక్కో వటానికి అడిగాడట, అలా వుంటుంది మన కోతి మూక వ్యవహారం.

“తినగ తినగ వేము తియ్యన ” అనే సామెత చెప్పినట్లుగా: అందరితో “నేను సినిమా తీస్తున్నాను” అని అంటుండటంతో, మన వాడికి “ఈ సినిమా నేనే ఎందుకు తీయకూడదు?” అనే ఆలోచన వచ్చింది. ఒకరోజు, తప్పకుండా సినిమా తీయాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. కానీ సినిమా అంటే చిన్న విషయం కాదు; ఖచ్చితంగా చెప్పాలంటే దీనికి కోట్లాది, రూపాయలు ఖర్చవుతాయి. ప్రస్తుతం చేతిలో ఒక్క పైసా కూడా లేదు, ఏమి చేయాలో అని లోతైన ఆలోచనలో పడ్డాడు. ఇదే విషయాన్ని అమెరికా లోనే తన స్నేహితులను కదిలించి చూసాడు. ప్రస్తుతం ఓ పేరున్న డైరెక్టరు, మంచి మాస్ ఫాలో యింగ్ వున్న హీరో డేట్స్ తీసుకుంటే సినిమాకు పెట్టుబడి పెడతామని చెప్పారు. వాళ్ళు ఆమాట అనగానే ఆంజనేయులకు వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయ్యింది . వెంటనే పేరున్న డైరెక్టరిని పట్టు కోవటం ఎలా అని కోతిమూకను అడిగాడు. ఏముందన్నా డైరెక్టుగా డైరెక్టరు ఇంటికెళ్ళి డేట్లు అడిగేద్దాము “అన్నదొక కొండముచ్చు “మనం వస్తామని గేట్లు బార్లో తెరుచుకుని కూర్చున్నారు డైరెక్టర్లందరూ ఎం మొఖం రా .. మనల్ని గేటు దగ్గరకు కూడా రానీయరు మనమొఖాలు ‘చూస్తే ‘ అంటూ వెక్కిరించింది ఇంకో కొండముచ్చు.

“అన్నా నాకో ఆలోచన వచ్చింది, మన ఊరి నుంచి హైదరాబాదు వెళ్లి సినిమా రైటరుగా స్థిరపడ్డ రైటరు ఒకడున్నాడు .. వాడ్ని పట్టుకుంటే మన పని అయిపోతుంది.. “అంటూ సలహాఇచ్చింది ఇంకో కోతి. ఆ సలహా ఏదో అంజనేయులికి నచ్చటంతో. (నచ్చటం కాదు వేరే దారి లేక) వాళ్ళ ఊరి సినిమా రైటరుని కలవటానికి అందరూ కలసి హైదరాబాదుకి ప్రయాణం కట్టారు...(ఇంకావుంది)

# వ్యక్తి నుంచి ..వ్యవస్థగా



## “కె.ఐ. వరప్రసాద్ రెడ్డి ”

కరోనా మహమ్మారి కల్లోల కాలంలో ప్రపంచమంతా టీకాల కోసం ఎదురుచూపులు చూసింది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ఎన్నో దేశాలకు టీకాల సరఫరాదారుగా భారత్ నిలిచింది. అయితే, పాతికేళ్ల క్రితమే దేశ టీకాల చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించింది శాంతా బయోటెక్ సంస్థ. సంకల్ప బలంతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో హెపటైటిస్–బి టీకాను ఆవిష్కరించింది. అది కూడా చవకగా అందజేసింది. దాన్ని సుసాధ్యం చేసింది... ఆ సంస్థ వ్యవస్థాపకులు, దీర్ఘదర్శి, రేపటితో 75వ వసంతంలోకి అడుగిడుతున్న ‘పద్మభూషణ్’ కె.ఐ. వరప్రసాద్ రెడ్డి. .

సుమారు 30 ఏళ్ళ క్రితం దేశంలో హెప టైటిస్–బి అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఎయిడ్స్ కంటే ప్రమాదకారిగా ప్రపంచాన్ని వణికిస్తోంది. జెనీవాలో జరుగుతున్న ఒక సమావేశానికి శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు వరప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఒక ప్రసంగకర్త మన దేశ సామర్థ్యంపై, మన ప్రభుత్వాల ఉదాసీనతపై, మనవారి ప్రతిభపై లోకువగా మాట్లాడారు. మనల్ని బిచ్చగాళ్ళ కింద జమకట్టారు. ఆ నిందను నిర్మూల్యం చేస్తూ అనేక దేశాలకు వ్యాక్సిన్లు పంపే మహోన్నత స్థితికి చేరుకున్నాం. హెపటైటిస్–బి వ్యాక్సిన్ స్ఫూర్తితో శాంతా బయోటెక్నిక్స్ 13 రకాల ఇతర అద్భుతమైన వ్యాక్సి న్లను సృష్టించే స్థాయికి చేరుకుంది.

లాభాపేక్ష లేకుండా అతి తక్కువ ధరలో పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ను అందించాలన్నది శాంతా బయోటెక్నిక్స్ పెట్టుకున్న నియమం. దానిని సాధించడం ఆషామాషీ కాదు. విదేశాల నుంచి సాంకేతికతను దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారం.

కె.ఐ. వరప్రసాద్ రెడ్డి నెల్లూరు జిల్లాలోని పాపిరెడ్డి పాలెం గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు . ఆయన తల్లిదండ్రులు వెంకట రమణ రెడ్డి మరియు శాంతమ్మ దంపతుల ఏకైక సంతానం. వరప్రసాదొడ్డి నాన్నగారు కొంత పొలం అమ్మి యిచ్చిన డబ్బుకు తోడు, బంధు వులు, ఆత్మబంధువులు మరి కొంత ఇచ్చారు. అయినా అది సరిపోదు. అదిగో! అప్పుడే యూసఫ్ బిన్ అలావీ అబ్దుల్లా రూపంలో అమృత హస్తం చేయి చాచింది. అది మాజీ ప్రధాని పీవీ నర సింహారావు చలువ. వరప్రసాద్ రెడ్డి పడుతున్న కష్టాలను గమనించిన పీవీ ఈ అబ్దుల్లాను పంపారు. అబ్దుల్లా ఒమన్ విదేశీ వ్యవహారాల మంత్రి. హెపటైటిస్–బి వ్యాక్సిన్ అవసరం తెలిసిన వ్యక్తి. తాను పెట్టుబడి పెట్టి, వ్యక్తిగత స్థాయిలో గ్యారంటీగా ఉంటూ బ్యాంక్ రుణాలు తెచ్చి, ఆ యజ్ఞంలో భాగస్వాములయ్యారు.

నిర్మాణం చేపట్టే నాటికి సుశిక్షితులైన శాస్త్ర వేత్తలు లేరు. నిపుణత, సమర్థత, నిబద్ధత కలిగిన గొప్ప బృందాన్ని సమీకరించుకొని రంగంలోకి దిగింది. అనుమతులకు, అమ్మకాలకు, పంపకాలకు అడుగడుగునా అడ్డంకులే

# వ్యక్తి నుంచి ..వ్యవస్థగా



ఎదురయ్యాయి. వ్యాక్సిన్ సామర్థ్యంపై విదేశీ కంపెనీ దుష్ప్రచారం చేసింది. సత్ సంకల్పం కాబట్టి కాలమేఘాలు తొలిగి పోయాయి. శాంతా బయోటెక్ రూపొందించిన వ్యాక్సిన్కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. హెపటైటిస్ ఎంతో భయంకరమైన వ్యాధి. వేగంగా మనుషులను నిర్వీర్యులను చేస్తుంది. లివర్ సిరోసిస్ వచ్చి ఆరోగ్యం దెబ్బతింటుంది. కొంత మందిని శవాలుగా మార్చింది, కొంతమందిని జీవ చ్ఛవాలు చేసింది. అందుకే అర్జెంటుగా వ్యాక్సిన్లు తయారు చేసి పుట్టిన ప్రతిబిడ్డకూ వాడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఘోషించింది. అత్యవసరమే అయినప్పటికీ నాణ్యత, సమర్థతపై అన్ని పరీక్షలూ జరిగి తీరాల్సిందేనన్నది శాంతా సంస్థ పట్టుదల. అన్ని పరీక్షల్లో గెలిచి, నూటికి నూరు శాతం సంపూ ర్ణమైన అర్హత సంపాయించుకున్న తర్వాతే వ్యాక్సి న్లను మార్కెట్లో ప్రవేశపెట్టింది. అలా వరప్రసాద్ రెడ్డి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.

ఈ ప్రయాణంలో, శాంతా సంస్థ అడుగడు గునా మానవత్వాన్ని చాటుకుంది. అది భారత్ నుంచి లాహోరు సుహృద్భావ యాత్రగా బస్సు వేసే చారిత్రక సందర్భం. ఆ బస్సు కంటే హెప టైటిస్ వ్యాక్సిన్లే మాకు ముఖ్యమని పాకిస్తాన్ వేడు కుంది. ఆ సందర్భంలో ప్రధానమంత్రి కార్యా లయం శాంతా బయోటెక్నిక్కు సంప్రదించింది. మానవీయ కోణంతో మిలియన్ వ్యాక్సిన్లను శాంతా సంస్థ ప్రధాన మంత్రి కార్యాలయం ద్వారా పాకి స్తాన్కు ఉచితంగా అందించి మానవత్వాన్ని చాటు కుంది. భారతీయ ఖ్యాతిని, ఆత్మను నిలబెట్టింది. యునిసెఫ్ విషయంలోనూ ఎంతో ఉదారాన్ని చూపించింది. యితఃపూర్వం ఒక్కొక్క వ్యాక్సిన్ 18 డాలర్లకు కొనుగోలు చేసే యునిసెఫ్కు కేవలం 23 సెంట్లకే అందజేసింది. 'శాంతా' చూపిన ఈ విత రణశీలత వల్ల యునిసెఫ్ ప్రపంచంలోని ఎన్నో పేద దేశాలకు ఉచితంగా హెపటైటిస్ వ్యాక్సిన్లు అందించి పుణ్యం మూట గట్టుకుంది.

శాంతా బయోటెక్నిక్స్ వేసిన తొలి అడుగు అతి పెద్దది, అతి గొప్పది. అతి తక్కువ ధరకే వ్యాకిన్ అందించిన ప్రభావంతో మార్కెట్లో వ్యాక్సిన్ ధరలు 40వ వంతుకు పడిపోయాయి. అనేక బహుళజాతి సంస్థలు శాంతా సంస్థవైపు చూడడం మొదలుపెట్టాయి. ఆ తర్వాత బయోటెక్ రంగంలో ఎన్నో కంపెనీలు పుట్టుకొచ్చాయి. వీటన్నిటికి స్ఫూర్తిగా నిలిచి తొలి గవాక్షం తెరిచింది మాత్రం శాంతా బయోటెక్నిక్స్ అన్నది మరువ రానిది.

★★★

## వ్యక్తిత వికాసం

# యువత తెలుసుకో నిన్ను నువ్వు మలుచుకో



## కోపాన్ని కోపగించుకోకండి..

చాలామంది కోపాన్ని ఓ ప్రతి కూల ఉద్వేగంగా భావిస్తారు. కానీ విజయం సాధించాలనే పట్టుదలకు కావాల్సిన వ్యూహాలను ఆలోచించేలా చేస్తుంది ఆగ్రహం. వివేచనతో కూడిన కోపం వ్యూహాలతో విజయాలందిస్తుందంటున్నారు మనస్తత్వ నిపుణులు.

తనలోకి తాను చూసుకునే సాధనం..

తనలోకి తాను తొంగి చూసుకుని, అంతర్మథనంతో, ఆత్మపరిశీలనకు తావిచ్చేది కూడా కోపమే అంటారు యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్ నుంచి డాక్టరేట్ పొందిన జెరెమీ డీన్ అనే సైకాలజీ స్కాలర్. 'మేకింగ్ హ్యాబిట్స్, బ్రేకింగ్ హ్యాబిట్స్' అనే పుస్తకం రాసిన ఆయన మానసిక అంశాలపై బ్లాగ్ కూడా నిర్వహిస్తుంటారు.

ఓ సంఘటన మనలో కోపానికి కారణమైందనుకోండి. అప్పుడు మన ఆగ్రహం సహేతుకమైనదేనా? మన చేతగానితనం వల్ల కోపం వచ్చిందా?.... ఇలా ఆత్మపరిశీలన చేసుకోవడం మానసిక ఔన్నత్యానికీ కారణమవుతుందంటారాయన.

మరి అంతా మంచేనా...

ఇలా చూసుకున్నప్పుడు ఆగ్రహం వల్ల అంతా మంచే జరుగుతుందా? చెడు జరగదా అంటే... కోపం వల్ల చెరుపు జరిగే అవకాశమూ ఉంది. అయితే అగ్రహంతో కూడిన ఉన్మాద స్థితిలో మంచికి, చెడుకూ మధ్య తేడా గుర్తించలేనంత వివేచన కోల్పోయినప్పుడు మాత్రమే ఆగ్రహం వల్ల అనర్థం జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు మానసిక వేత్తలు. అందువల్ల వివేచన కోల్పోనంత వరకు కోపం కూడా మిత్రుడే!

★★★★





# ఊడలమర్రి ఉపన్యాసాలు

## ఉత్తుత్తి సలహాదరులు



విక్రమార్కుడు ఊడల మరి ) చేరుకునే సరికి, అక్కడ భేతాళుడు చెట్టు కింద తన మహా మంత్రులతో సమావేశమై సుదీర్ఘంగా ఏదోవిషయమై ఆలోచిస్తున్నారు –

విక్రమార్కుడిని చూడగానే రామిత్రమా సమయానికి వచ్చావు. నువ్వు తప్పకుండా మా సమ్మకు పరిష్కారం చూపగలవు” అంటా ఆహ్వానించాడు.

“అంత పెద్ద సమస్య ఏమిటి భేలాళా” అంటూ పక్కనే వున్న ఓ బండ రాయి మీద కూర్చున్నాడు.

“ఏమిలేదు విక్రమార్కా, మా మహామంత్రులకు పని ఎక్కువై మాకు సరైన సలహాలు ఇవ్వటం లేదు,దాని వల్ల రాజ్యపాలనలో మేము సరైన నిర్ణయాలు తీసుకో లేకున్నాము . అందుకని కొంత మంది సలహా దారులను నియమించుకుందామని చూస్తున్నాను, నువ్వే మంటావు”అంటూ విక్రమార్కుడిని సలహా అడిగాడు భేతాళుడు

దానికి విక్రమార్కుడు నవ్వుతూ. “భేతాళా సలహదారులిచ్చే సలహాలతో మనం రాజయాలు ఏలితే “ఏడిసినట్టే వుంటుంది” అంటూ వెక్కి వెక్కిరించాడు. ‘అదేమిటి విక ) మార్కా మీ తెలుగు రాష్ట్రాల్లో ఇబ్బడి ముబ్బడిగా సలహాదారులను నియమించుకుంటు న్నారుగా ముఖ్యమంత్రులు.. మరి వాళ్ళ సంగతో “ అంటు అడిగాడు

దానికి విక్ర మార్కుడు నవ్వుతు “అదా..పార్టీ అధికారం లోకి వచ్చాక చాల మంది పదవులు ఆశిస్తారు . కొంత మంది వల్ల పార్టికి ఉపయోగం , అందుకని వాళ్లకు మంత్రి పడువులిస్తారు . మరికొంతమంది వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు అందుకని వాళ్ళకు సలహాదారుల పడువులిస్తారు . వాళ్ళు పేరుకి సలహాదారులే.. కాని ఎటు వంటి సలహాలు ఇవ్వరు. ఇచ్చినా ఎవ్వరూ తీసుకోరు.



# భేతాళ భారతం

ఈ మధ్య ఓ ముగ్గుర్ని సలహాదారులుగా తీసుకున్నారు. అసలు వాళ్ళు చేసే పనికి, వాళ్ళు ఇచ్చే సలహాలకు , పరిపాలనకు ఏ సంబంధం ఉండదు .మొన్న ఏమి జరిగిందో తెలుసా “అంటూ అడిగాడు విక్రమార్కుడు

“ నువ్వు చెప్పందే మాకేలా తెలుస్తుంది ..” అంటూ చెవులు రెండు దగ్గరకు చేర్చి విన సాగాడు భేతాలుడు

“ మొన్నా మధ్య ముఖ్యమంత్రి గారు సలహాదారులతో సమావేశం అయ్యారు . ఒకపక్క ఆధ్యాత్మిక దిగ్గజం వాగంటి సోమేశ్వరరావు, మరోపక్క ఆరోగ్య ప్రదాత వంతెన హరినారాయణ , ఇంకోపక్క కుంచె మాంత్రికుడు శ్రీకర్ కూర్చుని ఉన్నారు.
అందరూ రాజు (ముఖ్యమంత్రి )గారి రాక కోసం ఎదురుచూస్తున్నారు. “మనల్ని సలహాలు అడగడానికే పిలిచారు” అని వాళ్ళు అనుకుంటూ ఉండగానే..

చేతిలో ఐ-ప్యాడ్ పట్టుకుని రాజు గారు ఎంట్రీ ఇస్తారు.

ముందుగా వాగంటి వారు లేచి, “అయ్యా.. ధర్మం అంటే..” అని ఏదో చెప్పబోతుండగా రాజు గారు నవ్వుతూ మైక్ తీసుకుంటారు. “వాగంటి గారూ.. ఆపండి.. మీరు ఇప్పుడు చెబుతున్న ఈ ధర్మం గురించి నేను 1995లోనే చెప్పాను. అసలు మీరు చెప్పే ధర్మంలో ఇంపార్టెంట్ పాయింట్లు రాసింది నేనే.. ఆ రోజుల్లో వాల్మీకి, వ్యాసుడు నా దగ్గరకు వచ్చి ‘ స్క్రిప్ట్ ఎలా రాయాలి? క్యారెక్టరైజేషన్ ఎలా ఉండాలి?’ అని డౌట్స్ అడిగితే.. నేనే వాళ్ళని కూర్చోబెట్టి సలహాలు ఇచ్చాను. వాళ్లకు గైడెన్స్ ఇచ్చింది నేనే. అసలు ఈరోజు మీరు ఇంత బాగా మాట్లాడుతున్నారంటే కారణం.. ఆ రోజు నేను ఇచ్చిన ట్రెయినింగే కదా”
అని రాజు గారు సెలవిస్తారు. అది విన్న వాగంటి వారికి ఫ్యూజులు ఎగిరిపోవడం ఖాయం.

తర్వాత వంతెన గారు లేచి, “జనాలకు ఆరోగ్యం బాగుండాలంటే ఉప్పు, నూనె..” అని చెప్పబోతుంటే రాజు గారు మళ్ళీ అడ్డుకుని .
“రాజు గారూ.. మీరు ఇంకా ఆ పాత చిట్కాలే చెబుతున్నారు. అసలు మనిషికి తిండి అవసరం లేకుండా.. కేవలం నా ప్రసంగాలతోనే కడుపు నింపుకోవడం ఎలాగో నేను 1996లోనే కనిపెట్టాను.

అప్పట్లో ‘ప్రకృతి’ నా దగ్గరకు వచ్చి.. ‘. చెట్లు ఎలా పెరగాలి? కిరణజన్య సంయోగక్రియ ఎలా జరగాలి?’ అని డౌట్ అడిగితే.. పవర్ పాయింట్ వేసి మరీ ఎక్స్-ప్లేన్ చేశాను. నేను చెప్పిన ఆ టెక్నిక్ వల్లే ఈరోజు మీరు మొలకలు తినిపించగలుగుతున్నారు. రేపటి నుంచి పేషెంట్లకు మొలకలు ఆపేసి.. నా ఫోటోలు చూపించండి, అవే శక్తినిస్తాయి”
అని రాజు గారు క్లాస్ పీకుతుంటే, వంతెన గారు షాక్ అయి అక్కడే బీపీ చెక్ చేసుకుంటారు.

చివరగా శ్రీకర్ గారు ఒక కార్టూన్ గీసి చూపిస్తారు. బాబు గారు దాన్ని చూసి పెన్ లాక్కుంటారు.
“శ్రీకర్.. నీ కార్టూన్లలో పంచ్ ఉంది కానీ, నా విజన్ లేదు. అసలు బొమ్మ గీయడం అంటే పేపర్ మీద గీయడం కాదు.. గాలిలో గీయాలి. ఆ మధ్య పికాసో, రవివర్మ నా దగ్గరకు వచ్చి.. ‘బ్రష్ ఎలా పట్టుకోవాలి బాబూ?’ అని అడిగితే.. వాళ్లకు పెయింటింగ్ నేర్పించి పంపించా.

అసలు పెయింట్లు, బొమ్మలు ఎలా వెయ్యాలో అమరావతి మ్యాప్‌లు చూస్తే మీకు అర్థమవుతుంది..! నేను గీసిన ఆ మ్యాపులు చూసే కదా ఇప్పుడు ప్రపంచం మొత్తం డిజైనింగ్ నేర్చుకుంటోంది. నువ్వు కూడా రేపటి నుంచి నా దగ్గర ట్యూషన్ కి రా.. అసలు సిసలైన బొమ్మలు ఎలా గీయాలో నేర్పిస్తా!”
అని చెప్తారు. శ్రీకర్ గారు తన కుంచెను పక్కన పడేసి దణ్ణం పెడతారు.

“చూశారా తమ్ముళ్ళూ.. వీళ్ళందరూ వారి వారి రంగాల్లో తోపులే



# భేతాళ భారతం

కావచ్చు. కానీ వీళ్ళందరికీ గురువుని నేనే. వీళ్ళ టాలెంట్ వెనుక ఉన్న స్విచ్ నా చేతిలోనే ఉంది. వీళ్ళందరినీ నేను ఎందుకు నా టీమ్ లోకి తీసుకున్నానంటే.. నా దగ్గర ఇంకా ఎంత నేర్చుకోవాల్సి ఉందో వీళ్ళకు తెలియజెప్పడానికే" అని ముగిస్తారు.

బయటకు వచ్చిన ఆ ముగ్గురు దిగ్గజాలు.. "మనల్ని సలహాలు అడగడానికి పిలిచారనుకున్నాం.. కానీ ఆయనే మనకు పాఠాలు చెప్పి పంపించారు.. ఈ విజనరీ బిల్డప్ తట్టుకోవడం మా వల్ల కాదు సామీ" అని తల పట్టుకున్నారు "అంటూ వివరించాడు విక్రమార్కుడు

"అంటే మనం సలహాదారులని నియమించుకునేది సలహాల కోసం కాదన్న మాట ..మనం మహా మేధావులమని లోకానికి చుపించటానికేనా ఈ సలహాదారులు" అసలు విషయం పసిగట్టాడు భేతాలుడు


" మరి అంతేగా భేతాళ , వీళ్ళ వాళ్ళ వోరిగేది ఏమి ఉండదు , జీతం డబ్బులు దండగ . ఒక్కొక్కరికి ఐదు ఆరు లక్షలు నెలకి ..ఎవరి సొమ్మని " విక్రమార్కుడు బాధపడుతుడు అన్నాడు

" అంతే విక్రమార్కా , అందుకనే ఊరకనే అన్నారా రాజుల సొమ్ము రాళ్ళ పాలని "

అవును"జనాల సొమ్ము సలహాదారుల పాలు .." అంటూ అక్కడనుంచి విక్రమార్కుడు బయలు దేరాడు .

★★★

## మన "కధా"నాయికలు



# "అమీనా "

అమీనా' చలం రాసిన మూడో నవల. ఈ నవలని చలం 1924లో రాశాడు. అంటే ఇది కూడా వందేళ్ల క్రితం రాసిన నవలగానే భావించాలి. చలం 'ఉత్తమ పురుష'(ఫస్ట్ పర్సన్)లో రాసిన మరో నవల ఇది. చలం రాసిన అన్ని నవలల్లోకి ఇతివృత్తం రీత్యా, కథన శైలి రీత్యా 'అమీనా' అత్యంత ప్రత్యేకమైన నవల. 'అమీనా' చలం స్వానుభవం నుండి వచ్చిందని ఎక్కడా చెప్పక పోవచ్చు కానీ స్వీయానుభవ నీడలు,జాడలు కనిపిస్తాయి. నవలలోని పాత్రలు కూడా వాస్తవికమైనవేనని, చలం వారికి మారుపేర్లు ఇచ్చాడని అనిపిస్తుంది. సుబ్బారావు అనే కవి ఎంకి గీతాలు పాడుతుంటాడు. బహుశా అది 'ఎంకి గీతాలు ' సృష్టికర్త నండూరి సుబ్బారావు కావొచ్చు. ఒక నవలకి వుండాల్సిన ప్రత్యేకమైన ప్లాట్ ఏదీ ఇందులో వుండదు. తనని పెనవేసుకున్న మనుషుల వల్ల, తన చుట్టూ ఆవరించి వున్న పరిస్థితుల వల్ల రచయితలో ఏర్పడిన ఘర్షణాత్మక మనస్థితిని ప్రతిబింబించే ఆలోచనా స్రవంతి ప్రధానమై పోయిన రచన ఇది. జీవితంలో కొన్నాళ్ల పాటు జరిగిన సంఘటనల్ని ఒక డైరీలో రాసుకున్న చందాన నవల సాగుతుంది. డైరీలో ఆ రోజు జరిగిన ఏదైనా సంఘటన గురించి రాస్తే వ్యక్తుల గురించి ప్రత్యేకంగా వర్ణనలు చేయం కదా! ఇక్కడ కూడా అలానే సాగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది పూర్తిగా "చలం సొంత గొడవే" అనిపిస్తుంది.

ఈ నవలలో పెద్దగా సంఘటనలుండవు. పాత్రలు పెద్దగా ప్రవర్తించవు. సంభాషించవు. అసలు కథనానికి ఒక ఆర్డర్ అంటూ ఏమీ వుండదు. ఇది మొత్తం ఒక రచయిత హృదయానికి, అస్తిత్వానికి మధ్య జరిగిన అంతర్యుద్ధం నుంచి వచ్చిన కలవరింత, పలవరింత. కలల్లో తోసుకొచ్చినట్లు, పరిగెత్తినట్లు అలా రాసుకుపోతాడు. ఎక్కడా పాఠకుల్ని లక్షించడు. ఇది మొత్తం ఒక చిన్న గుంపు జీవితంలో ఓ రచయిత అంతరంగ దృశ్యం. ఆ గుంపులో మోసకారి, ఆశమోతులైన పురుషులుంటారు. వంచితులైన, అసూయాగ్రస్తులైన స్త్రీలూ వుంటారు. వీళ్లెవరూ ఎలాంటి విశ్లేషణల పరిధిలోకి రారు, ఒక్క శ్రీమన్నారాయణ అనే పాత్ర తప్పితే! చలం ఏ పాత్రనీ ఎస్టాబ్లిష్ చేయడు. నవల మొత్తం మనుషుల అనుబంధాల్లోని స్వార్ధ చింతన, అభిజాత్యం నిండి వుండగా వాటితో విసుగెత్తినా వదిలించుకోలేని అవసరమో, బలహీనతో చాపల్యమో రచయితది. (ఉత్తమ పురుషలో కథ చెప్పినందున, ఇది తన స్వంత జీవితమని చలం నిర్దిష్టంగా చెప్పనందున, ఆ పాత్రకి ఏ పేరు పెట్టనందున అతన్ని చలం అని కాక రచయిత అంటాను.) ఈ నవలలోని పాత్రలలో ఎవరితో, ఎప్పుడు, ఎందుకు, ఎలా బంధాలేర్పడ్డాయో రచయిత చెప్పడు.

# మన "కథా"నాయికలు

అదో బ్రహ్మచారుల నివాసం అనలేం. అలాగని బుద్ధిగా ఒక కుటుంబంగా బతికే వారూ కాని కొంతమంది ఒక మొండి గోడల ఇంట్లో బతుకుతుంటారు. రచయిత, రామ్మూర్తి, శర్మ, 'జీవం', తాత, శ్రీమన్నారాయణ, "భర్త వద్ద నుండి క్యాజువల్ లీవ్ అన్నా పెట్టకుండా శర్మ కోసం వచ్చిన" సత్య ఆ ఇంట్లో వుంటుంటారు. హోటల్ భోజనాన్ని క్యారియర్లలో తెప్పించుకుంటూ వారు రోజూ ఏటి ఒడ్డుకి, తోటకి షికార్లు తిరుగుతూ ఒక చిత్రమైన జీవన శైలితో రచయిత మాటల్లోనే చెప్పాలంటే ఒక 'అరాచకపు సంఘం'గా బతుకుతుంటారు. తమ అప్రాచ్యపు సంఘానికి సుబారావుని లీగల్ అడ్వైజర్ గా పేరు అచ్చు వేయిస్తానని రచయిత అతన్ని సరదాగా బెదిరిస్తుంటాడు. ఆ రోజుల్లో వారికి దినానికి ఇరవై నాలుగు గంటలు కూడా చాలవని రచయిత అంటాడు. రాత్రి పూట మొండి గోడల సందులో తడిక మంచం, మూడు కుర్చీలు వేసి కాలక్షేప సమవేశాలు నిర్వహిస్తూ వుంటారు. అలానే ఆ కుర్చీల్లో కూర్చొని నిద్ర పోయేవారు. వారిలో 'జీవం' చలం మంచి చెడులు చూస్తుంటుంది. "నేను స్కూలుకి వెళ్లగానే, సోమరినైన నా అజాగ్రత్తనూ, నిర్లక్ష్యాన్ని సరితీసి, నా గదిని మళ్లీ నివాస యోగ్యంగా చేసే 'జీవం' ప్రేమ ప్రతి ఉదయమూ, సాయంత్రమూ నన్ను బుజ్జగించేది" అని ఆమె గురించి చెబుతాడు రచయిత. ఆ ఇంటికి వేరే ప్రాంతాల నుండి వస్తుంటారు. మళ్లీ వెళ్లిపోతుంటారు. కానీ ఆ అతిథులు రావడం అందరికీ సంబరంగా వుంటుంది. ఆ ఇంటిలోని "మొండి గోడల్లో వింత అందం ఒకటుందని, అట్లాంటి ఇళ్లల్లో సంపాదింపగల అమూల్య అనుభవాలు మేడల దొంగ మెరుగులలో, ఐశ్వర్య గర్భంలో యెన్నడూ దొరకవనీ" రచయిత అభిప్రాయం.

వారిలో కొందరికి ప్రేమ వ్యవహారాలు, ఇతర స్త్రీలతో వివావేహేతర సంబంధాలూ కొనసాగుతుంటాయి. శర్మ కోసం వివాహిత ఐన సత్య వస్తుంటుంది. పక్కింటి రిజిస్ట్రారుగారి కార్యం కాని అరవ కన్యతో రామ్మూర్తి ఫ్లర్టింగ్! తాత అంటే నిజంగా తాత వయసు వాడు కాదు. అసలు పేరు కృష్ణమూర్తి. అతనికి రాజమండ్రి ప్లీడరు కూతురుతో స్నేహం. పైకి మామూలు స్నేహమని బుకాయిస్తూ విమల కోసం శారీరక తహతహలతో పరితపించే శ్రీమన్నారాయణ. ఇంక రచయిత కోసం జీవం, శ్యామల, శారద, సుబ్బులు వంటి వారు వచ్చి పోతుంటారు. అతనికి వారి పట్ల ఆకర్షణ, ఆదరణ వుంటాయి. ఎంతో కొంత అభ్యంతరమూ వుంటుంది. కానీ ఎవరినీ నియంత్రించడు. కానీ వారు అతన్ని నియంత్రించాలని చూస్తుంటారు. తన జీవితంలో ఇతరుల ప్రమేయాన్ని ఏ కారణం చేతనైనా నియంత్రించలేని వ్యక్తి స్వేచ్ఛకి దూరమౌతాడని, పరాయీకరణ చెందుతాడని రచయిత పాత్ర ద్వారా చలం చెప్పినట్లనిపిస్తుంది. మధ్యలో ఈ మిత్రులకి ఆప్తులైన డాక్టర్ గారు వంటి వారు వస్తుంటారు. పోతరాజు, పట్టాభిరామయ్య వంటి వారు వీళ్లని తమ ఇంటికి రాత్రిళ్లు విందు కోసం ఆహ్వానిస్తుంటారు.

ఈ నేపథ్యంలో అమీనా అనే ఓ నిరుపేద, పదమూడు పద్నాలుగేళ్ల ముసల్మాను పిల్ల రచయితకి తారసపడుతుంది. తన మిత్రులతో కలిసి వెళుతున్న రచయితని చూసి అతన్ని పరిచయం చేసుకొని అతని ఇంట్లో పని చేస్తానంటుంది. అతన్ని చూడగానే ఆ పిల్లకి మంచి అభిప్రాయమేర్పడుతుంది. ఆమె ఇంట్లో ఎప్పుడూ ఏదో ఘర్షణ, సంక్షోభం. ఆమె తల్లి వంటి స్త్రీ నిజానికి తన తల్లి కాదంటుంది అమీనా. ఆకలేస్తే బురదలోంచి ఏటిలోకెళ్లి చేపలు పట్టి, కాల్చుకు తిని కడుపు నింపుకునే అస్తిత్వ పోరాటం ఆమెది. అమీనాని పనిలోపెట్టుకుంటాడు రచయిత. అమీనా మంచి గాయకురాలు. ఆమె పాటకి అందరూ తన్మయులైపోతారు. మళ్లీ మళ్లీ అడిగి మరీ పాడించుకుంటారు. ఇంట్లో పోట్లాడి, అడవిలోకి

## మన "కథా"నాయికలు

పారిపోయినప్పుడు ఆ అడవిలో నెగళ్ల ముందు కూర్చొని పాటలు పాడే వారిని చూసి తానూ పాడటం నేర్చుకున్నానని చెబుతుంది. అమీనా ధైర్యవంతురాలని తెలుస్తుంది ఈ వివరణతో. ఆమెలోని నిర్భీతి, కళా కౌశలం బహుశా రచయితని అమితంగా కట్టిపడేసి వుండొచ్చు.

ఆ మొండి గోడల రచయిత ఇంట్లో అమీనా స్వతంత్రంగా వ్యవహరిస్తూ వుంటుంది. అందరికీ టీ కాచి పెట్టడంతో సహా అన్ని పనులు చేస్తుంటుంది. ఐతే ఆమె రాకతో రచయితకి తన స్నేహితురాళ్లతో గొడవలొస్తాయి. ఆమె పని పిల్లలా స్వతంత్రంగా వుండటం జీవం, సుబ్బులు వంటి వారికి నచ్చదు. పనిపిల్ల కుర్చీలో కూర్చోవడమేంటని, అదీ రిబ్బన్లు కట్టుకొని మరీ... అని వారి అభ్యంతరం. ఒకసారి సుబ్బులు కొడుతుంది కూడా ఆమెని. రచయిత మాత్రం ఆమెకి పూర్తి స్వేచ్ఛనిస్తాడు. ఆమెని ఎంతో మురిపెంగా చూసుకుంటుంటాడు. ఐనా ఎవరితో గొడవైనా అమీనా చెప్పకుండా వెళ్లిపోతుంది. మూడురోజులైనా తిరిగిరాదు. అలా వెళ్లిపోతుంటుంది. మళ్లీ రచయిత తెచ్చుకోవడమో, ఆమె స్వయంగా తిరిగి రావడమో చేస్తుంటుంది. అంతే కాదు రచయిత కూడా తన మిత్రుల ఊళ్లకి వెళ్లొస్తుంటాడు. అలా వెళ్లినప్పుడల్లా అమీనా ఇబ్బంది పడుతుంటుంది. అతను లేని ఇంట్లో వుండటానికి, పని చేయడానికి ఆమెకి మనస్కరించదు. తనని వదిలేసి ఎందుకు వెళ్లిపోయారని అడుగుతుంటుంది. ఆయన లేనప్పుడు మిగతా వారు ప్రవర్తించే విధానంపై అతనికి ఫిర్యాదులు చేస్తుంటుంది.

ఒక దశ వస్తుంది తాను అమీనాని నిలబెట్టుకోవాలంటే మిగతా స్నేహితురాళ్లని త్యాగం చేయాల్సి వస్తుంది. అమీనా డిమాండ్ అలానే వుంటుంది. బాల్యానికి, స్త్రీత్వానికి మధ్యనున్న ఆ వయసులో అప్పుడప్పుడే పొడుస్తున్న ఆడతనం వుంటుంది. అంతేకాదు అమీనాలో పెద్దరికం పొడసూపుతుంటుంది. తనకి చీర కట్టుకోవాలనిపిస్తుంది. అది సహజమే. చీర కొనుక్కోడానికి డబ్బులడుగుతుంది. ఆమె చీర కట్టుకొని పెద్దదైతే రచయిత ఆశించే స్వచ్ఛత నిజంగా నిలుస్తుందా? రచయిత జీతం లెక్కగట్టి జీతం ఇస్తాడు. అతను ఇచ్చిన డబ్బుతో చీర కొనుక్కోలేక పోతుంది కానీ ఒక వోణీ కొనుక్కుంటుంది. అతని జ్ఞాపకానికి ఆ వోణీ కొనుకున్నానని చెబుతుంది. ఇంట్లో తల్లి కాని తల్లితో గొడవపడి ఎక్కడికో తెలియకుండా వెళుతున్నానని రచయితకి చెప్పి మరీ వెళ్లిపోతుంది. లోక పరత్వానికి, తన బంధాలకు శిరసొగ్గిన రచయిత నిరుత్తరుడై చూస్తుండగా ఆఖరిసారిగా వెళ్లిపోతుంది. ఇంతే నవల మొత్తం. ఇలా చెబుతుంటే ఇంతే కదా సరళంగానే వుంది కదా అనిపించొచ్చు. కానీ ఎంతో ఓపికగానే చదవాల్సి వస్తుంది. నవల ఓ అరవై నాలుగు పేజీలుంటుంది. కానీ ఓ ఆరొందల పేజీల నవల చదివిన అనుభూతి కలుగుతుంది.

ఒక రకంగా చెప్పాలంటే స్త్రీ పురుష సంబంధంలోని మోహానికి, ఆకర్షణకి రచయిత స్త్రీ స్నేహితులు ప్రతీకలైతే అమీనాని స్త్రీ పురుష సంబంధంలో చలం కాంక్షించే ఒక స్వచ్ఛమైన, అనిర్వచనీయమైన స్వేచ్ఛకి ప్రతీక. కానీ చలంలో దాన్ని పొందలేక పోయానన్న నిరాశ, అమీనాని నిలుపుకోలేక పోయానన్న గిల్టీ ఫీలింగ్ వుంది. ఇందుకు సాక్ష్యంగా "ఏళ్లల్లో ఎదిగి వాకిట్లో నుంచొని, వొచ్చావంటే, చిన్నప్పటి నీ వొంటి బురదని కావలించుకున్నా. పెద్దైన నీ మనసు మీద లోకం చిమ్మిన మాలిన్యాన్ని అంగీకరించలేని చలం అవమానానికి. లోక పరత్వానికి పరిహారంగా నీకు, అమీనా, ఈ పుస్తకం" అంటూ ఈ నవలని అమీనాకి అంకితమివ్వడమే నిలుస్తుంది. అమీనా పాత్ర కల్పితం కాదని, వాస్తవికమైనదేనని నిర్ధారితమవుతుంది.

అమీనా పట్ల చలం ధోరణి "పెడోఫీలియా" కిందకి రాదు. ఎందుకంటే ఎక్కడా కాముకత వుండదు. మోహపు మైమరుపు వుండదు. జననం నుండి మరణం వరకున్న అన్ని దశలలో

# మన "కథా"నాయికలు

స్త్రీ కౌమార్య దశలోనే ఒక అమాయకపు, స్వచ్ఛమైన, ప్రకృతి బద్ధమైన ఔన్నత్యాన్ని కలిగి వుంటుందని ఆయన భావన కావచ్చు. అటువంటి పిల్లతో హృదయానుబంధానికి ఏ పేరూ పెట్టడం సాధ్యం కాదు. నిరంతరం స్త్రీ సౌందర్యంలో ఆధ్యాత్మికతని, ఆమెతో ప్రేమలో జీవన సాఫల్యాన్ని వెతుక్కునే చలానికి అమీనా అనుకోకుండానే ఎదురైన తాత్కాలిక గమ్యం. అందుకే ఆమె సుబ్బులు వుండగా తాను ఇంటికి తిరిగి రానని అన్నప్పుడు "నువ్వు నా నౌకరువి కాదు. నేస్తానివి కాదు. నువ్వు విధి వెయ్యి నాలికలలో ఒకదానివి. నవ్వుతో బలి కోరుతున్నావు. బలి కోరకపోతే హృదయ సామీప్యానికి ఎలా వస్తావు?" అనుకుంటాడు.

ఈ నవలకి 'అమీనా' అని పేరైతే పెట్టాడు కానీ నిజానికి ఇందులో అతి పెద్ద పాత్ర రచయితే. అమీనా గురించిన ఆయన ఆలోచనా స్రవంతి ఈ నవల. రచయిత ఏ ఊరెళ్లినా, ఎక్కడికెళ్లినా అతని ఆలోచనల్లో వదలని అమీనా! ఎవరిని కలిసినా, ఏ పరిస్తితులెదురైనా కలిగే అసంతృప్తికి, లోటుకి అమీనా గురించిన ఆలోచనల్లో వెదుక్కుంటాడు. ఎవరితో ఏ సంభాషణ చేసినా అమీనానే సగం నుండి ముగింపు మాట దాక వుంటుంది. వెర్రి అమీనా, పిల్ల అమీనా, పిచ్చి అమీనా, తురక అమీనా, చింపిరి అమీనా, ముసల్మాను రోషపు అమీనా అనుకుంటూనే ఆమెని అందలమెక్కించుకుంటాడు. అమీనా అతని లోలోపలి తడుములాటలో, వెతుకులాటలో ఓ గమనం! ఆమె అతనికి ఓ సంఘర్షణాత్మక సంభాషణ. ఓ వైయుక్తిక అస్తిత్వ వేదనకి నైరూప్య పరిష్కారం! ఇదంతా కౌమార్య ప్రాయపు లేలేత అమీనాకి తెలియవు. ఆమె అతనికి స్నేహితురాలి కంటే ఎక్కువ. బిడ్డని మించిన చనువు.


ఈ నవలలో చలం ఎంతో కొంత స్పష్టంగా చెప్పిన పాత్ర ఏదైనా వుందంటే అది శ్రీమన్నారాయణే. విమలతో శారీరిక సంబంధం కొనసాగిస్తూనే అలాంటిదేమీ తమ మధ్య లేదని బుకాయించాలని చూస్తుంటాడు. అతన్ని ఉద్దేశించి రచయిత "స్త్రీ విషయమై దొంగతనం బాగా అలవాటైంది. కామం, ప్రేమ అన్నీ తుచ్ఛమూ, సిగ్గూ, భయమూ పడ్డవలసిన విషయాలని బాగా అంతరాత్మలో నాటుకొని పోయినాయి ఈ తరము వారికి. ఎప్పటికో విముక్తి!" అనుకుంటాడు. శ్రీమన్నారాయణ ఇతరుల ప్రవర్తనల్ని నైతికంగా ఖండిస్తుంటాడు. శ్రీమన్నారాయణ పెళ్లి చేసుకోబోడని విమలని రచయిత హెచ్చరిస్తుంటాడు. చివరికి అదే జరుగుతుంది. అంతేకాదు ఆమె సంబంధం శ్రీమన్నారాయణతో కాకుండా రచయితతోనే అనేలా బైట ప్రచారం జరుగుతుంది. అందుకు ఆమె కూడా కారణమనేది రచయిత భావన. బహుశా శ్రీమన్నారాయణ మోసం చేయడం వల్ల తనకి జరిగిన ఆశాభంగంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది. అతని గురించి రచయిత ఇలా అనుకుంటాడు– "తిరిగి తిరిగి నాకు అనుభవంలో రూఢి అయింది. నీతిని గురించి ఉపన్యాసాలిచ్చేవాడూ, ఇతరులలో దుర్నీతిని ఖండించేవాడూ, తప్పదు– రహస్యంగా – అతి నీచపు పనులు జరుపుతో వుంటాడని." నిజమే కదా!

రచయిత ఈ నవలలో దాదాపుగా అన్ని స్త్రీ పాత్రల పట్ల గిల్టీ గానూ, ఎంతో కరుణతోనూ వుంటాడు. వారు అతని బలంగానూ, బలహీనతగానూ వుంటారు. దాదాపు ప్రతి ఒక్కరికీ క్షమాపణలు చెబుతుంటాడు. "ప్రతి క్షణమూ ఎడతెరపి లేక హృదయ కవాటాన్ని పెద్ద అరుపులతో తట్టే వివిధాకర్షణలతో నీ మృదు దృష్టుల్నీ, నీ మధుర గీతాల్నీ, నీవు నా పక్క మీద వదిలిపోయ్యే చామంతిరేకుల్నీ మరచాను. 'జీవం' నన్ను క్షమించు" అని జీవంకి క్షమాపణలు చెబుతాడు. అమీనా గురించి చెబుతూ "అమీనా! నువ్వు నిర్భాగ్యపు నా అదృష్టమే. నిన్ను జార విడిచింది నా అధైర్యమే. నా సందేహమే. నా లోక పరత్వమే. నా లాభ నష్ట గణితమే నిన్ను తరిమి మాయం చేసాయి" అంటాడు.

★★★★

## కార్టూన్ పేజి

# నవ్వండి ప్లీజ్





శ్రీనివాస్ కార్టూన్లు

**నవ్వటం ఒక యోగం ,**

**నవ్వలేక పోవటం ఒక రోగం ,**

**తరువాత మీ ఇష్టం**





మదర్ థెరిస్సా ఆకలి మీద యుద్ధం చేసింది అని chatGPT కి ఇస్తే వచ్చిన సమాధానం చిత్ర రూపం లో



## వార్తల్లో వ్యక్తి







# గ్రిగోరి పెరల్ మాన్

ప్రపంచం ఆయనను ప్రముఖుడిని చేయాలని ఆరాటపడింది, కానీ ఆయన నిశ్శబ్దంగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అంతర్జాతీయ సంస్థలు ఆయనను అపారమైన, అత్యున్నతమైన బిరుదులతో సత్కరించాలని ఆశపడ్డాయి. కానీ ఆయన మౌనంగా తల వంచుకొని వెళ్ళిపోయాడు. ఎక్కడో మారుమూల ఓ చిన్న గదిలో తల్లితో ఉంటున్నాడు. ఆయన పేరే గ్రిగోరి పెరల్ మాన్. వందేళ్లుగా ప్రపంచ మేధావులకు, గణిత శాస్త్రవేత్తలకు కొరకు రాని కొయ్యగా తయారైన పాయిన్ కేర్ కాంజెక్చర్ అనే గణిత సమస్యను పరిష్కరించిన మేధావి . ఆయన ఈ సమస్యను పరిష్కరించిన తర్వాత ఇది ఘనకార్యంగా ప్రపంచానికి సాటి చెప్పలేదు. ఏదో గొప్ప పని చేశానని చెప్పుకోలేదు . కేవలం ఇంటర్నెట్లో ఆ క్లిష్ట సమస్యకు పరిష్కారాన్ని పెట్టాడు. అంతే కాలక్రమంలో అది గణిత మేధావుల, శాస్త్రవేత్తల దృష్టికి వచ్చింది. దీంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇన్నేళ్లుగా ఇన్ని వందల ,వేలమంది గణిత మేధావులు పరిష్కరించలేని ఈ సమస్యను పెరల్మన్ పరిష్కరించాడని ఆనందపడ్డారు. అందుకోసం ఆయనకు ఫీల్డ్స్ మెడల్ ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇది నోబుల్ బహుమతితో సమానం. గణిత శాస్త్రంలో ఇది నోబెల్ బహుమతి. అయితే విచిత్రం ఏమిటంటే ఆయన చాలా సింపుల్ గా దాన్ని తిరస్కరించాడు. ఆ తర్వాత ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్లే మ్యాథమెటిక్స్ ఇన్స్టిట్యూట్ ఆయనకు ఒక మిలియన్ డాలర్ల బహుమతిని ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఆ విషయమే ఆయనకు చెప్తే తనకు అవసరం లేదని ఆ పేద గణిత మేధావి తిరస్కరించాడు. కారణమేమిటో తెలుసా..? ఈ సమస్యకు మూల కారణమైన రిచర్డ్ హేమేల్టన్ ఓ పెద్ద గణిత మేధావి. ఆయన సృష్టించిన ఒక గణిత ఈక్వేషన్కు తాను అర్థం చెప్పాను తప్ప అందులో తన ఘనత ఏమీ లేదని తెలిపారు . అసాధారణమైన ప్రతిభతో ఇలాంటి గణిత సూత్రాన్ని ప్రపంచా ప్రపంచానికి పరిచయం చేసిన రిచర్డ్ కు ఈ గౌరవం దక్కాలి తప్ప తనకు కాదన్నది ఆయన అభిప్రాయం. ఆయన రూపొందించిన సూత్రానికి తను పరిష్కారం చెప్పాను తప్ప దానికి తనకు గౌరవం వద్దన్నారు. అందువల్ల ఆయన తన ప్రతిభకు ఇస్తానన్న అన్ని అవార్డులు , రివార్డులు ,బిరుదులు, గౌరవాలు అన్నిటినీ తిరస్కరించేశాడు. గుర్తింపు అనేది అసలు వ్యక్తికి రావాలని, ఆ వ్యక్తి సృష్టించిన పజిల్ పరిష్కరించిన వ్యక్తికి కాదని

## వార్తల్లో వ్యక్తి

ఆ మేధావి సవినయంగా చెప్పాడంటే ఆయన ఎంత వినయసంపన్నుడో ,ఎంత నిరాడంబరుడో, ఎంత గొప్ప మేధావో ప్రపంచానికి తెలిసి వచ్చింది.. మేధస్సును డబ్బులకు ,బిరుదులకు, గౌరవాలకు అమ్ముకోలేనని ,అందువల్ల తనను ఎవరు బిరుదులు, డబ్బులుతో గౌరవించవద్దని, డబ్బులతో గుర్తింపు తీసుకురావద్దని కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన ప్రతిభకు గుర్తింపు ఎక్కువ కావడంతో చేస్తున్న గణిత శాస్త్ర అధ్యాపక వృత్తిని వదిలేసి తలచుకుని తన సొంత దేశమైన రష్యా లోని సెయింట్ పీటర్స్ బర్గ్ కు వెళ్ళిపోయాడు . అక్కడ చిన్న అపార్ట్మెంట్లో తల్లితో కలిసి జీవనం సాగిస్తున్నాడు .తన ఇంటర్వ్యూలు కోసం వచ్చే అంతర్జాతీయ మీడియాను లోపలికి అనుమతించడం లేదు .తను పనికి ప్రచారం అవసరం లేదని అది తన వ్యక్తిగత జీవితానికి ఇబ్బంది కావడం తనకి ఇష్టం లేదని చెబుతూ తన అపార్ట్మెంట్లో తల్లితో తన గదికే పరిమితమైపోయాడు . అయినా కొన్ని కొన్ని దేశాలు ఆయనను గుర్తించాలని ప్రతిపాదనలు పంపడంతో అసలు తాను గణిత శాస్త్ర అధ్యయనాన్ని గణిత శాస్త్రాన్ని వదిలేస్తున్నానని ఒక విరాగిలా, ఒక బైరాగిలా మారిపోయాడు. చూశారా ..? డబ్బుతో కొనకూడనిధి జ్ఞానం. మేధస్సును ప్రచారానికి వాడుకోకూడదు. నిజం ఎప్పుడూ నిజం గానే ఉండాలి. ప్రపంచానికి తెలియాలి. దీనికోసం బిరుదులు, సన్మానాలు అవసరం లేదని పెరెల్మాన్ అభిప్రాయం. అపారమైన మేధస్సు గౌరవాన్ని కోరుకోదు. ఇది పెరల్ మాన్ ప్రపంచానికి నేర్పిన పాఠం. బహుశా ప్రపంచంలో ఇలాంటి మేధావులు ఒక ఒకరో , ఇద్దరో ఉంటారు.. వారిలో పెరెల్మాన్ ఒకరు...



## కొత్త సీరియల్

చారిత్రాత్మక సీరియల్



# గడప దీపం

అవధానుల విజయ

వరంగల్ కోట గోడల మీద ఉదయసూర్యుడు బంగారు కిరణాలు వెదజల్లుతున్నాడు...

కోట ప్రాగణంలోని ప్రతి ఇటుక మీద, ప్రతి గోపురపు శిల్పంపై ఆ కాంతి పడుతుంటే, పండుగ సందడి కోటంతా నెలకొంది...

ఆ రోజు సాధారణ రోజు కాదు మరి! రాణి రుద్రమదేవి హనుమకొండ వెయ్యి స్తంభాల గుడికి పూజకు వెళ్తోంది....

★★★★★★★

# చారిత్రాత్మిక సీరియల్

కోటలో ఉదయాన్నే ఘంటారావాలు వినిపించాయి.

కోట ప్రాంగణంలో ప్రతి ఆలయంలో అర్చకులు ఉచ్చైశ్వరంతో మంత్రోచ్ఛారణ చేస్తుంటే, అవి రాజమహల్ గోడల మీద ప్రతిధ్వనించాయి..

కోటలోని మూలమూలలా పనివాళ్ల హడావుడి మొదలైంది. మహారాణి యాత్రకు అన్నీ సిద్ధం చేయాలని వారంతా ఒక ఉత్తుంగ తరంగాల్లో తేలిపోతున్నారు.

రాణిగారి చెలికత్తెలు ముత్యాల గాజులు, బంగారు బూటాలతో నేసిన పట్టు వస్త్రాలు సిద్ధం చేశారు.

ఎర్ర మందారాలు, తామరపూలతో, తులసి దళాలతో పెద్ద పూలమాలలు కట్టారు.

ఉదయపు సూర్యుని కాంతి వెండి పూత పూసిన రథచక్రాల మీద పడి తళుక్కున మెరిసింది...

★★★★★★

రాణి రుద్రమదేవి ఉదయస్నానం ముగించి, ఆలంకారానికి సిద్ధమయ్యింది.

ఆమె మృదువైన పట్టు వస్త్రము ధరించింది.

మెడలో ఒకే ఒక బంగారు హారం, చేతులకు వజ్రకంకణాలు, నుదుటి మీద కుంకుమ తిలకం.

కానీ ఆభరణాల కాంతి కంటే ఎక్కువగా మెరిసింది ఆమె కన్నుల్లో ధైర్యం, ముఖంలో వర్చస్సు!

ఆమె ఒక మౌన గంభీర మూర్తి!

వెయ్యి మంది సైనికులు కాపలా కాస్తున్నా, ఆమె హృదయం మాత్రం భక్తితో నిండిపోయి ఉంది.

★★★★★★

గోడల వెంబడి శంఖధ్వనులు వినిపించాయి.

అర్చకులు రాణి రాకకు వేదమంత్రాలు పఠించారు.

రాజమహల్ గుమ్మాల వద్ద వందలాది ప్రజలు చేరుకున్నారు.

ప్రజల ముఖాల్లో ఆనందం...

"ఈ రోజు రాణిని దగ్గరగా చూడగలుగుతున్నాం" అన్న సంతోషం.

"మన రాణి వెయ్యి స్తంభాల గుడికి వెళ్తుంది... ఆమెతో పాటు మన ఊరి గడపలకు సౌభాగ్యం కూడా వస్తుంది" అని ప్రజలు చెప్పుకుంటూ గుమికూడారు.

రాణి కోటలోని అంతర్గత ప్రాంగణంలో నడుచుకుంటూ వచ్చింది. ఆమె అడుగుల సవ్వడి నెమ్మదిగా, కానీ గంభీరంగా వినిపించింది... ప్రతి అడుగు వెనుక ఒక చరిత్ర మ్రోగినట్టే అనిపించింది.

వెండి రథం ముందు నిలిచినప్పుడు, సైనికులు గౌరవ వందనం చేశారు. బంతి, చామంతి పూలదండలతో అలంకరించిన రథం ఆ రోజు ఆకాశానికి ఎగిరే పుష్పక విమానంలా మెరిసింది.

రాణి రథంలోకెక్కే ముందు, కోటలోని చిన్న ఆలయంలో శివలింగానికి పూజ చేసింది.

"ఈ యాత్ర సాఫల్యం అవ్వాలి... నా ప్రజలు సుఖంగా ఉండాలి" అని గుండెల్లో నిశ్శబ్ద ప్రార్థన చేసింది.

★★★★★★

రాజమహల్ గుమ్మాల దగ్గర పెద్ద శంఖం ఊదారు.

అది రాణి బయలుదేరిన సంకేతం.

ఆ శంఖధ్వనితో ప్రజలు ఒకే స్వరంతో గర్జించారు...

"జయహో రుద్రమదేవి! జయహో కాకతీయ రాజ్యం!"

అప్పటికే రహదారుల మీద గుమ్మాల దగ్గర ప్రజల జనం నిలిచారు.

మహిళలు చేతుల్లో పసుపు, కుంకుమ, గంధం, పన్నీరు, తాంబూలం, పూల చెండ్లు పట్టుకుని నిలబడ్డారు.

పిల్లలు పూల రేకలను రాణి రథంపై వేయాలని పోటీ పడ్డారు.

# చారిత్రాత్మిక సీరియల్

పురుషులు గడ్డం ముడిచి, చేతులు ముడిచి గౌరవంగా నమస్కరించారు.

★★★★★★

ఆ ఉదయం వరంగల్ కోట కేవలం ఒక మహల్ కాదు.... అది ఒక ఆలయం. రాణి రుద్రమదేవి కేవలం రాణి కాదు, ఆమె ఆ రోజు భక్తురాలు, తన ప్రజలతో కలసి వెయ్యి స్తంభాల గుడికి వెళ్ళే యాత్రికురాలు.

ఆమె రథం కదిలింది.

కోట గుమ్మం దాటి బయటికి వెళ్ళింది.

రాజమహల్ గుమ్మం దాటగానే రథం చక్రాలు మెల్లగా గిరగిరా తిరగసాగాయి.

గుర్రాల కాళ్ల శబ్దం రహదారి మీద బలంగా వినిపిస్తూ, యాత్రకే ఒక లయను ఇచ్చింది.

★★★★★★★

వరంగల్ నుంచి హనుమకొండకు వెళ్ళే రహదారి ఒక అందమైన దృశ్యం.

రెండు వైపులా చెట్లు వంపులు తిరిగి వరుసగా నిలబడి ఉన్నాయి...

మామిడి, వేప, నేరేడు, జామ, రావి, మర్రి... ప్రతి చెట్టు కింద జనం కూర్చుని రాణి రథం చూడటానికి ఎదురు చూస్తున్నారు.

చెరువుల దగ్గర పిల్లలు నీళ్ళతో ఆడుతున్నారు...

రథం వారిని దాటుతున్నప్పుడు వారు "రాణి! రాణి!" అని గట్టిగా అరుస్తూ పూలను విసరసాగారు.

దారిపొడవున ఊరి గడపల దగ్గర మహిళలు మంగళహారతులు పట్టుకుని నిలబడ్డారు.

"మన రాణి మన గడప దాటుతోంది" అనుకుంటుంటే వాళ్ల కళ్ళలో ఆనందతో కన్నీళ్లు మెరిశాయి.

పిల్లలు పూలు రథంపై వేసేలోపు సైనికులు పక్కకు జరిపినా, రాణి చేతిని ఎత్తి వారిని ఆపింది.

"వారిని ఆపకండి. పిల్లల పూలే నా యాత్రకి నిజమైన మంగళం," అని చిరునవ్వుతో చెప్పింది.

ప్రజల గుండెల్లో గర్వం ఉప్పొంగింది.

"రాణి మన తల్లే" అని వారు ఒకరితో ఒకరు చెప్పుకొన్నారు.

★★★★★★

రాణి రథం బజారు వీధికి చేరింది. అక్కడ ప్రతీ దుకాణం నిండుగా కళకళలాడుతోంది..

ఒకవైపు నవనవలాడే కూరగాయలు...

మరోవైపు రంగు రంగుల చేనేత వస్త్రాలు..

ఇంకోవైపు దొంతులుగా పేర్చిన ఇత్తడి వస్తువుల తళతళలు...

రాశులు పోసిన మల్లెలు... విరజాజులు...మరువం, దవనం... విపణి వీధి అంతా సువాసనలు వెదజల్లుతూ...

వాణిజ్యకారులు దుకాణాల ముందర నిలబడి రాణి రథానికి నమస్కరించారు.

"మన రాణి వలననే ఈ విపణి వీధి కదులుతోంది. మన వ్యాపారం సురక్షితం" అని వారు ఒకరితో ఒకరు గర్వంగా చెప్పుకొన్నారు.

ఆ శబ్దంలో పల్లెటూరి గళం, పట్టణపు గోల, పిల్లల నవ్వు అన్నీ కలిసిపోయాయి. రథం ఆ శబ్దం గుండా వెళ్లేటప్పుడు, బజారు ఒక గీతంలా వినిపించింది.

★★★★★★

రథం నెమ్మదిగా హనుమకొండ వైపు కదులుతూ ఉంది. ప్రజల జయజయ ధ్వనులు, పిల్లల నవ్వులు, వేదమంత్రాలు అన్నీ కలసి ఒక మహోత్సవ శబ్దం సృష్టించాయి.

రథం వరంగల్ వీధులను దాటి

# చారిత్రాత్మిక సీరియల్

కొండచరియల మధ్యగా సాగింది.

కొన్ని క్షణాల తర్వాత రాణి రుద్రమదేవి చూపులో ఒక అద్భుత దృశ్యం మెరిసింది. హనుమకొండ వెయ్యి స్తంభాల గుడి గోపురం.

దూరం నుంచే గోపురం మేఘాల్ని తాకుతున్నట్లు కనిపించింది. సూర్యకాంతిలో రాతి శిల్పాలు బంగారు కాంతితో మెరిసాయి.ఆ దృశ్యం చూసిన ప్రతివాడి గుండెలో భక్తి ఉప్పొంగింది.రాణి కన్నుల్లో కూడా ఒక మృదువైన వెలుగు మెరిసింది.

★★★★★★★

ప్రాంగణం నిండా ప్రజలు గుమికూడారు. రాణి రథం దిగగానే ఒకేసారి గర్జన వినిపించింది. "జయహో రుద్రమదేవి! జయహో కాకతీయ రాజ్యం!"

ఆ గర్జనలో పురుషుల బలం, మహిళల ఆశీర్వాదం, పిల్లల అమాయకత్వం అన్నీ కలిసిపోయాయి. ఆ శబ్దం గుడి గోడల మీద ప్రతిధ్వనించి, రాళ్లే జయజయ ధ్వని పలికినట్టుగా అనిపించింది.

రాణి ఆ జనం వైపు చేయి ఎత్తి నమస్కరించింది. ఆమె కళ్ళల్లో గర్వం కాదు, కృతజ్ఞత.

"ఈ ప్రజలే నా శక్తి... వీళ్ళే నా రాజ్యం" అనుకోగానే ఆమె హృదయం ఉప్పొంగింది.

★★★★★★★

ఉత్తర ప్రాకార ద్వారం గుండా ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశించగానే నిలువెత్తు పానవట్టం లేని లింగాలపై కరవీర వృక్షం పుష్పార్చన చేస్తున్నట్టుగా గాలికి రాలే పూవులు సువాసనలు వెదజల్లుతూ లింగాలపై పడే దృశ్యం చూసిన రాణి హృదయం ఉప్పొంగింది..

రథం గుడి ద్వారం దగ్గర ఆగగానే, శంఖాలు ఘంటానాదాలతో కలిసిపోయాయి. ఆ శబ్దం చుట్టుపక్కల గగనమే కంపించినట్లు అనిపించింది. వేదపండితులు పూలమాలలు, కుంకుమ అక్షతాలతో రాణిని స్వాగతించారు.

ప్రధానాలయం నక్షత్రాకార మంటపంపై రుద్రేశ్వరుడు, విష్ణు, సూర్య భగవానులకు వరుసగా తూర్పు, దక్షిణ, పడమరలకు అభిముఖంగా మూడు ఆలయాలు ఏక పీఠంపై అద్భుతమైన శిల్పకళతో మలచబడినవి. సజీవంగా గోచరమయ్యే నందీశ్వరుడినికి ఎదురుగా ఉత్తర దిశగా ద్వార పాలకులుగా ఉన్నట్లుగా నిలచిన గజ శిల్పాలను దాటి సభామంటపంలోనికి వెళ్ళిన పిదప విఘ్నేశ్వరున్ని అర్చించి భక్తులు రుద్రేశ్వరున్ని దర్శిస్తారు.

ఆలయ ముఖమండపానికి ఉత్తరాభిముఖమైయున్న నందీశ్వని విగ్రహం నల్లరాతితో మలచబడినదై కళ్యాణ మంటపానికి, ప్రధానాలయాలకు మధ్యన ఠీవీగా దర్శనమిస్తోంది.

దేవాదాయాధికారులు నమస్కరించి, "మహారాణి, స్వాగతం. ఈ గుడి ఈ రోజు మీ కోసం కాంతులీనుతోంది" అన్నారు. మహిళలు ఊరంతా గడపల దగ్గర నిలబడి రాణికి హారతులు చూపారు. చిన్న పిల్లలు పూలు చల్లారు.

ప్రజల ముఖాల్లో ఆనందకన్నీళ్లు జారాయి. "మన రాణి దేవాలయానికి వచ్చింది... ఇది మనకు పుణ్యం" అని గుసగుసలాడారు.

★★★★★★★

ప్రాంగణం దాటుకుని రాణి గర్భగుడి వైపు నడవసాగింది.

ముందుగా వేదపండితులు మంత్రోచ్చారణ చేస్తూ, అర్చకులు దీపారాధన చేస్తూ నడిచారు. సైనికులు రెండు వైపులా కాపలా కాస్తూ నిలబడ్డారు. రాణి అడుగులు రాతి మంటపంపై ప్రతిధ్వనించాయి. ప్రతి అడుగూ ఒక ఘంటానాదంలా అనిపించింది.

## చారిత్రాత్మక సీరియల్

స్త్రీలు పూలకుండలు మోసుకుని వెనుకన నడిచారు. పిల్లలు చేతుల్లో దీపాలు పట్టుకుని గాలి వీచినా జ్యోతి ఆరిపోనీయలేదు.

ప్రజల గుండెల్లో ఒకే భావన…
"మన రాణి భక్తురాలిగా ఈ గర్భగుడిలో ప్రవేశిస్తుంది"

ఆ సమయంలో ఒక వృద్ధురాలు పక్కన నిలబడి, తన కళ్ళలో కన్నీళ్లు దాచుకోలేకపోయింది.

"ఇంత మంది రాజులు ఈ గుడి గడప దాటారు…కానీ ఈ రోజు ఒక స్త్రీ రాణి ఈ గుడిలోకి అడుగు పెడుతోంది. మన ఊరి అదృష్టం ఇది" అని ఆమె చెప్పగా, పక్కనే ఉన్నవారు తల ఊపారు.

రాణి వినకపోయినా, ఆ మాటలు గాలి మార్గంగా గుడి గోపురానికి చేరాయి. గోపురంలోని శిల్పాలే గర్వంతో మరింత కాంతులు వెదజల్లాయి.

★★★★★★

★★★★★★

రుద్రమదేవి ఇప్పుడు గర్భగుడి ద్వారం ముందు నిలబడింది. అర్చకులు ఘంటానాదం చేస్తూ ఆమెను ఆహ్వానించారు. శంఖధ్వనులు, మంగళవాయిద్యాలు, వేదఘోష అన్నీ కలిసి గాలి నింపాయి.

ఆ క్షణంలో రాణి గుండె లోతుల్లో ఒక మౌన ప్రార్థన మొదలైంది:

"ఈ దేవాలయం వెయ్యి స్తంభాల కాంతి నా రాజ్యపు వెయ్యి గడపల్లోనూ వెలగాలి. నా ప్రజలు సుఖంగా ఉండాలి. శత్రువులు మన గడపలకు తాకకూడదు."

★★★★★★

హనుమకొండ చేరిక ఒక సాధారణ దర్శనం కాదు. అది ఒక చరిత్రాత్మక ఘట్టం. ప్రజల గుండెల్లో రుద్రమదేవి ఒక రాణి కాదు, ఒక యాత్రికురాలు, ఒక భక్తురాలు, ఒక తల్లి.

హనుమకొండ వెయ్యి స్తంభాల గుడి ద్వారం దాటగానే, రాణి రుద్రమదేవి చూపులో ఒక అద్భుత దృశ్యం విప్పరితలైంది.

ఇది కేవలం దేవాలయం కాదు, రాతి శిల్పాలతో రాసిన కావ్యం, సంగీతంతో కట్టిన శిల్పగీతం.

★★★★★★★

గర్భగుడి వైపు నడుస్తున్న రాణి దృష్టిలో ఒక్కసారిగా వెయ్యి స్తంభాలు ప్రతిధ్వనించాయి. ప్రతి స్తంభం ఒక శిల్పకారుడి కల, ఒక కళాకారుడి హృదయం.

కొన్నింటిపై గజరాజులు బలంగా నిలబడ్డాయి, కొన్నింటిపై నర్తకులు నాట్యమాడుతున్నట్లు కనిపించాయి, కొన్నింటిపై యోధులు కత్తులు మెరిపిస్తూ ఉన్నారు.

ప్రతి స్తంభంపై చెక్కిన రేఖలు అతి సూక్ష్మంగా ఉన్నాయి, అవి శ్వాస తీసుకుంటున్నట్లే అనిపించింది. రాణి ఆ దృశ్యం చూసి నిశ్శబ్దంగా అద్భుతానికి నమస్కరించింద

(ఇంకా ఉంది )

కథ

# వాట్సప్ బ్రో



సదాశివమ్ నుంచి ఫోన్ రావడంతో ఫోన్ ఎత్తి మాట్లాడటం మొదలెట్టాడు రంగనాథ్. ఎలా ఉన్నావు? భార్యా పిల్లలు ఎలా ఉన్నారు?రీ యూనియన్ కోసం వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశారు.ఈ రీ  యూనియన్ పుణ్యమా అని మళ్ళీ కలుద్దాం అనుకున్నాను ఇదేమో వాయిదా పడేటట్టు ఉంది మరి.

అరే మన చిరంజీవి ఎలా ఉన్నాడురా అదేరా శివ శంకర వరప్రసాద్. వాడి పేరు అదే అయిన మనము చిరంజీవి అనే తమాషాగా పిలిచేవాళ్ళం.వాడు ఈరోజు పెట్టిన స్టేటస్ చూసావా? “తల్లికి మించిన దైవం లేదు “ అని స్టేటస్ పెట్టాడు. రేయ్ కానీ నిజానికి వాళ్ళ అమ్మ ఒక ఆశ్రమంలో ఉందట.ఆ విషయం తెలుసా? కానీ స్టేటస్ మాత్రం బలే ఘనంగా పెట్టాడు.ఈమధ్య మదర్స్ డే రోజు తన అమ్మ దగ్గరికి వెళ్లి కేకు కట్ చేయించి స్టేటస్ పెట్టాడట. మరీ అంత ప్రేమ ఉంటే ఇంట్లో పెట్టుకోవాలి గానీ బయట ఎక్కడో పెట్టి ఇలా చూపించడం ప్రేమ అంటావా రా?అంటూ సందేహం వెళ్లబుచ్చాడు రంగనాధం.

సదాశివమ్ స్పందిస్తూ “అరే రంగనాధం నీకు విషయం పూర్తిగా తెలియదు. తనకి తన తల్లి అంటే నిజం గానే ప్రాణం కూడా. వాళ్ళ అమ్మని సొంత ఊర్లోనే పెట్టి తన బాగోగుల కోసం ఖర్చులు తనే భరిస్తూ వారానికి ఒకసారి వెళ్లి వస్తూ ఉన్నాడు.తన భార్యని ఒప్పించలేక అమ్మను నొప్పించలేక సతమతమవుతున్నాడు రా శివ శంకర్ వరప్రసాద్. అది రా పాపం మన శివ శంకర వరప్రసాద్ పరిస్థితి. తొందరపడి మాట్లాడటం మారనే లేదు సుమా! అంటున్న సదాశివం తో మరో మాట మాట్లాడలేకపోయాడు రంగనాధం. సరే ఉంటారా మళ్ళీ ఫోన్ చేస్తాను. నాకు మరో కాల్ వస్తోంది” అంటూ మాట దాట వేసి ఫోన్ పెట్టేసాడు రంగనాథ్.

కొన్ని రోజుల తర్వాత..



కె.అమృత జ్యోత్స్న

రంగనాధం తన స్నేహితులలో శ్రీనివాసమూర్తికి ఫోన్ చేశాడు. మనకు రీ యూనియన్ ఆలోచన వచ్చింది కదా! అదేదో ఊరిలో అంట యూనియన్ జరిగాక పాత స్నేహితులలో ఓ అమ్మాయి అబ్బాయి చిన్ననాటి ప్రేమ గుర్తుకు తెచ్చుకొని తన భర్తని పిల్లల్ని వదిలేసి అతనితో వెళ్లిపోయిందట. అలా మన గ్రూపులో మనం చదువుకునే రోజులలో ఆ రాజు గాడు, సావిత్రి ప్రేమించుకునే వాళ్ళు కదా! వాళ్లు అలా చేయరు కదా!” అంటూ జోకులేసి నవ్వసాగాడు రంగనాథ్. రంగనాథ మాటలికి శ్రీనివాసు మూర్తి విసుక్కుంటూ” ఒరేయ్ అక్కడెక్కడో ఏదో జరిగిందని ఇక్కడ కూడా జరుగుతుంది అంటే ఎలా? రాజుగాడు ఇప్పుడు తన ఫ్యామిలీతో

# వాట్సప్ బ్రో

కథ

చాలా సంతోషంగా, సావిత్రి కూడా హైదరాబాదులో చక్కగా స్థిరపడిపోయింది.వాళ్లకు లేని ఆలోచనలు నీకు వస్తున్నట్టు వుంది. కనుకే ఇలా మాట్లాడుతున్నావు అంటున్న శ్రీనివాసమూర్తి మాటలు చురుగ్గ తగిలేసరికి రంగనాథం ఆ టాపిక్ అంతటితో ఆపేసి సరే సరే నేను బండిలో వెళ్తున్నాను తర్వాత ఫోన్ చేస్తాను అంటూ టపీమని పెట్టేశాడు రంగనాథ్.

కొన్ని రోజుల తర్వాత..
హలో చక్రవర్తి నువ్వు గ్రూపులో ఉన్నావే కానీ, రీ యూనియన్ గురించి మాట్లాడవేంటి? అంటూ తన సందేహం వెళ్లబుచ్చాడు రంగనాథం.
"అదేరా ఇప్పుడు చెప్పబోతున్నాను. మా ఆఫీస్ లో ఏం జరిగిందో తెలుసా? మా ఆఫీస్ లో రమేష్ అని ఒకతను కొత్తగా జాయిన్ అయ్యాడు. అతని భార్య అతనిని వదిలేసి తన ప్రియుడుతో వెళ్లిపోయింది.వెళ్ళిపోయిన అమ్మాయి ఊరికే ఉండక తన లవర్తో హోటల్లో ఉంటున్నాను అంటూ సెల్ఫీలు తీసుకుని మరీ స్టేటస్ పెట్టింది. ఆ రమేష్ కి కోపం వచ్చి ఆ అడ్రస్ ఎక్కడో కనుక్కొని, లీవ్ పెట్టి మరీ వెళ్లి అమ్మాయిని అక్కడే రెడ్ హ్యాండెడ్గా పట్టుకొని అక్కడే చంపి తన భార్య శవంతోనే సెల్ఫీ దిగి స్టేటస్ పెట్టాడు. ఏందిరా కాలం ఇలా అయిపోతుంది.
మా ఆఫీస్ లో వ్యక్తి గనుక తరచూ పోలీసులు వచ్చి విచారించి వెళ్లడం ఇలా జరుగుతూ ఉంది. ఆ టెన్షన్ లో ఉన్నాను.అంతే తప్ప మరేమిలేదు. అందుకే మొదటనుంచి నేను ఈ వాట్సప్ గ్రూపులో స్పందించలేకపోయాను. కొంత ఈ సంఘటన జరగడం మూలంగా నా మనసు ఎంతో వేదనకు గురైంది. నిజానికి రమేష్ ఎవరితో ఎక్కువగా మాట్లాడడు. అంటే ఆ మౌనం వెనుక ఎంత వేదన ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఇలా చేయడం తప్పే కదా!ఈ ఆలోచనలతో నా మనసు ఈ రీ యూనియన్ గురించి ఆలోచించ లేకపోయింది అంటూ చెప్పుకొస్తున్న చక్రవర్తి మాటలను వింటూ ఒకరి ప్రాణం తీయడానికి పెద్ద కారణమే అవసరం లేదు. వాట్సప్ స్టేటస్ కూడా ప్రాణం తీస్తుందా? అంటూ మనసులో అనుకుంటూ విస్తు పోయాడు రంగనాదం.

మరుసటి రోజు...
అరె మన సుందరం ఏందిరా?ఎప్పుడు ఏదో ఎమోషనల్ మెసేజ్లు స్టేటస్ పెడుతూ ఉంటాడు. అది గమనించావా? అంటూ అడిగాడు రంగనాథం.
దానికి శ్రీనివాసులు సమాధానం చెబుతూ "వాడితో ఎక్కువ మాట్లాడకురా, ఈమధ్య వాడిది గృహప్రవేశం జరిగింది.దానికి వాడి బంధువులు ఎటువంటి డబ్బు సహాయం చేయలేదనో లేక అతను గొప్పగా కట్టుకున్నందుకో అదే గృహప్రవేశం రోజున స్టేటస్ ఏమని పెట్టాడో తెలుసా? "మనకు రాబంధువులు,మహానటులు ఎక్కడో లేరు, మన చుట్టూ పక్కల మన బంధువుల రూపంలోనే తిరుగుతూ ఉంటారు". "తస్మాత్ జాగ్రత్త" అంటూ వాళ్ళందరికీ కనిపించేలా స్టేటస్ పెట్టాడంట. వాడే నాకు ఈ విషయం చెప్పాడు. అది మంచి పద్ధతి కాదన్నాని నాకు మాత్రమే కనిపించేలా "నా మాటలు నచ్చకపోతే మౌనం మంచిది. నేను నచ్చకపోతే నాతో దూరం మంచిది" అంటూ స్టేటస్ పెట్టాడురా.అది ఈ రోజే నాకు మాత్రమే కనిపించేలా పెట్టాడు.నాకు సందేహం వచ్చి మన శ్రీను ఫోన్ లో చూసా. కనబడలేదు. వాడికి కోపం వచ్చినప్పుడు వాడిని బాధ పడేటట్లు మాట్లాడిన స్టేటస్ తో సమాధానం చెబుతుంటాడంట. ఒక సారి నేను వాళ్ళింటికి వెళితే వాడి భార్య నాకు చెప్పి బాధ పడింది. తనపై అలిగిన కూడా ఇలాగే స్టేటస్ లో కొటేషన్ లతో సమాధానపరుస్తూ ఉంటాడంట. అని శ్రీనివాసులు చెబుతూ ఉంటే వాట్సాప్ ఇలా కూడా వాడుతున్నారా? అని మనసులో అనుకుంటూ విస్తు పోయాడు రంగనాథం.

మరుసటి రోజు..
హలో సుబ్రహ్మణ్యం బాగుండావా? నేను రంగనాథం మాట్లాడుతున్నా. మన క్లాస్మేట్ సుమలత తన కూతురికి ఇంటర్లో 980 మార్కులు



# వాట్సప్ బ్రో

కథ

వచ్చాయని గ్రూప్లో పోస్ట్ చేసింది. నిజంగా అన్ని మార్కులు తెచ్చుకున్నదా? అంటూ సందేహం వెళ్ళబుచ్చాడు రంగనాథం. దానికి సుబ్రహ్మణ్యం పకపకా నవ్వి నువ్వు ఏమాత్రం మారలేదు రా, తను చదువుకోకపోతేనేమి తన కూతురు కూడా చదువులేనిమొద్దు అవ్వాలంటావా? తనను ఎంతో కష్టపడి చదివించింది కదా అది గమనించలేదు. తనకు రాని చదువు తన బిడ్డకు ఎట్టైనా రావాలని ఎంత కష్టపడిందో ఆ తల్లి కష్టాన్ని గుర్తించలేకపోతున్నావా? ఒకప్పుడు మనం చదువుకునే సమయంలో పాస్ అయితే చాలు అన్ని మార్కులు రావడం కోసం ఎంతో కష్టపడే వాళ్ళం ఇప్పుడు నేటి యువత మార్కులు 900 దాటితేనే దాటడం అనేది మామూలు అయిపోయింది.

కానీ మనం చదువుకునేటపుడు మార్కులు బలహీనంగా ఉన్నప్పటికీ విద్య విలువైనదిగా ఉండేది. కానీ, నేడు పిల్లల్లో మార్కులు బలంగా విద్యవిలువలు బలహీనంగా కనిపిస్తున్నాయి.ఈ మార్కుల పోటీలలో తట్టుకోలేక పిల్లలు ఈ మధ్య సూసైడ్ చేసుకోవడానికి కూడా సిద్ధపడుతున్నారు. మన ఆశలన్నీ పిల్లలపై మరీ రుద్దకూడదు కదా!రంగనాథం ఏమంటావు?అంటూ ఉంటే రంగనాథం ఆలోచనలో పడ్డాడు. తన కొడుకు విషయములో తను చేస్తున్న పొరపాటు ఏమిటో గ్రహించాడు.

అవును చక్రవర్తి నువ్వు చెప్పేది నూటికి నూరుపాళ్ళు నిజమే. దీర్ఘ ఆలోచనలో పడ్డాడు.తన కొడుకు చదువు ఇష్టప్రకారంగా ఉండాలి. మన ఆలోచనలు, మన ఇష్టాలని పిల్లల పై రుద్దకూడదన్న తన స్నేహితుడు మాటల్లో ఉన్న వాస్తవికతను గ్రహించాడు.తన కొడుకు తనకు నచ్చిన చదువు చదివించాలని నిర్ణయానికి వచ్చాకే తన మనసు కుదుటపడినట్టు అనిపించింది కూడా.

ఇంతలో తన టెన్త్ క్లాస్ గ్రూప్ లో నుంచి మహాలక్ష్మి అనే తన క్లాస్మేట్ నుంచి అర్జెంటుగా 45000 నాకు ఫోన్ పే చేయండి.ప్లీజ్ అర్జెంట్ అర్జంట్ అంటూ మెసేజ్ గ్రూపులో రావడంతోఅందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు. వరుస పెట్టి ఏమైంది? ఎందుకు అడుగుతున్నావ్?ఏం జరిగింది? అంటూ వరుసగా మెసేజ్లు పెడుతున్నారు.ఒకరిద్దరైతే 10000 పంపిస్తున్నాను అంటూ ఫోన్పే చేసి మరి స్క్రీన్ షాట్ పెడుతవున్నారు. ఓ గంట తర్వాత వెంటనే లక్ష్మిదేవి నుంచి గ్రూపులో మెసేజ్ వచ్చింది. "సారీ నాకెవరు ఫోన్ పే చేయకండి. నా ఫోన్ నెంబర్ హ్యాకింగ్ గురైంది. నేను పంపించిన దానిపైన ఎవరు క్లిక్ చేయకండి. ఎవరు మోసపోకండి." అంటూ ప్రతి ఒక్కరికీ మెసేజ్ పెట్టింది..
ఆల్రెడీ డబ్బులు పంపిన వారు మోసపోయారు అని అర్థం చేసుకున్నారు. అయ్యో ఇలా కూడా మోసం చేయవచ్చా? అంటూ ఆశ్చర్యపోయారు మరి కొందరు. ఇలా డబ్బు నష్టపోయారు అని తెలియంగానే నాకు అసలే వాట్సప్ వాడడం సరిగ్గా రాదు. ఏది నొక్కి ఏం పోగొట్టుకుంటాను అంటూ భయపడుతూ అసలు ఈ గ్రూపులో ఉండాలా? రిలీవ్ అయిపోయి వెళ్ళిపోదామా? అనే ఆలోచనలో పడ్డాడు రంగనాథం.

ఇంతలో తన స్నేహితురాలు రాజేశ్వరి నుంచి పర్సనల్ గా మెసేజ్ రావడంతో ఆ మెసేజ్ చదవడం మొదలెట్టాడు.తన భర్త కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడని, ఏదైనా కొంత డబ్బు సహాయం చేయమని దాని సంక్షిప్తసారాంశం. నిజానికి రాజేశ్వరి చిన్ననాటి స్నేహితురాలు. అతనే పెళ్లిపెద్దయి రాజేశ్వరి కి, జాకీర్ హుస్సేన్ కి మతాంతరవివాహం జరిపించాడు కూడా. ఇలా ఆ రోజుల్ని గుర్తుచేసుకున్నాడు. పెళ్లి చేసిన బాధ్యత తో అని అనుకోకుండా తన స్నేహితురాలు తన మీద పెట్టుకున్న నమ్మకం కోసమైనా ఏదైనా చెయ్యాలనే, తన ఫోన్ పే నెంబర్ కనుక్కొని వెంటనే లక్ష రూపాయలు వేసి,. తన వాట్సాప్

# వాట్సప్ బ్రో

కథ

గ్రూపులో కూడా ఈ విషయం పోస్ట్ చెయ్యడం తో విదేశాల్లో వుండే తన స్నేహితులు కూడా డబ్బు సర్దడంతో అనుకున్న రోజుకంటే ముందే డబ్బు సర్దడం వల్ల ఆపరేషన్ సక్రమంగా జరిగి తన స్నేహితురాలు జీవితాన్ని నిలబెట్టడం తో అందరూ ప్రశంసిస్తూ ఉండడంతో
ఆనందంలో తేలిపోసాగాడు రంగనాథం..అందరూ వరస పెట్టి గ్రీటింగ్స్ తెలుపుతుంటే వెంటనే రంగనాథం గ్రూపులో మెసేజ్ పెట్టాడు.దాన్ని సారాంశం ఏమిటంటే "నేను ఈరోజు మనం చదువుకున్న ఆ స్కూల్ కి వెళ్లాను. ఆ హెచ్ ఎం మేడం తో మాట్లాడాను. వచ్చే నెలలో మూడో ఆదివారం రీ యూనియన్ పెడుతున్నాను. కాబట్టి మన స్నేహితులంతా నాకు నిజంగా అభినందించాల్సినది ఏదైనా ఉందంటే అది 'రీ యూనియన్' హాజరు కావడమే.సెల్ఫీలు దిగి వాట్సాప్ స్టేటస్ పెడతాం. ఎంజాయ్ చేస్తాం. ఆ రోజులను మళ్లీ గుర్తు చేసుకుంటాము అందరు తప్పకుండా హాజరు కావాలని కోరుకుంటున్నాను.. ఇట్లు మీ రంగనాథం.

ఎందుకబ్బా ఈ వాట్సప్ గ్రూపు ఎందుకు చేరాను?అంటూ అనుకునే రంగనాథం కి ఈ వాట్సాప్ గ్రూప్ తనని హీరో చేసే సరికి, ఈ వాట్సప్ వల్ల సైబర్ క్రైమ్ కి ఎంత అవకాశం ఉందో, జాగ్రత్తగా వాడితే అంత అవసరం ఉందని తెలుసుకున్నాడు రంగనాథం.ఏ కొటేషన్ ఈ రోజుకి స్టేటస్ పెడతాం అనుకుంటూ ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు రంగనాథం

★★★

కథ



# దుష్ట శిక్షణ

సి.ఎన్.చంద్రశేఖర్,

"హలో! మేము హైదరాబాదులోని హోటల్ గ్రీన్‌పార్క్ నుంచి మాట్లాడుతున్నాము. మా హోటల్ వార్షికోత్సవం సందర్భంగా ప్రతిఏటా ముగ్గురు వ్యక్తులకు మా హోటల్‌లో రెండురోజులు ఉచిత వసతి, భోజనాలు, డ్రింక్స్ అందిస్తాం. అందుకోసం మాకు తోచిన నంబర్లు డయల్ చేసి ఆ కాల్ ఎవరికైతే వెళుతుందో వారికి ఈ సదుపాయం అందజేస్తాం. అలా డయల్ చేస్తే మీ నంబర్ వచ్చింది. మీరు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోదలిస్తే మీ అంగీకారసూచకంగా మీ ఆధార్ కార్డు ఈ నంబరుకు పంపితే మీ పేరుమీద గది బుక్ చేస్తాము. రానూ పోనూ ఖర్చులు కూడా మేమే భరిస్తాం"

ఫోనులో అవతలి వ్యక్తి చెప్పింది విన్న విశ్వనాథ్‌కి సంతోషం వేసింది. అయితే అతను ఆధార్ అడగడం వల్ల కొంత సంశయిస్తూ "ఆధార్ పంపి తీరాలా?" అని అడిగాడు.

"తప్పదు సార్. అన్ని బుకింగ్స్‌కీ ఆధార్ తప్పనిసరి కదా! మీకు అనుమానం ఉంటే వదిలెయ్యండి, ఇంకొకరికి ఈ అవకాశం ఇస్తాము"

"నాకు అంగీకారమే. నేను ఫ్యామిలీతో రావొచ్చా?"

"సారీ సార్! ఆఫర్ ఈ ఫోను నంబరు వాడుతున్న వ్యక్తికి మాత్రమే. నా పేరు నాగ్! మీకు ఏదైనా అవసరమైతే ఈ నంబరుకే కాల్ చెయ్యండి. మేనేజ్‌మెంట్ ఇచ్చే ఈ ఏనివర్సరీ ఆఫర్ గురించి కొంతమంది ఉద్యోగులకే తెలుసు"

"అలాగే!"

ప్రొద్దుటూరు నుంచి బస్సులో హైదరాబాదు చేరిన విశ్వనాథ్ క్యాబ్ బుక్ చేసుకుని హోటల్ చేరాడు. అతను క్యాబు దిగి చుట్టూ చూస్తూంటే ఓ యువకుడు వచ్చి "హలో! ఐ యామ్ నాగ్! మీరు విశ్వనాథ్ కదూ?" అని అడిగాడు. దాదాపు పాతికేళ్ళుంటాయి అతనికి. ముఖానికి మాస్క్ వేసుకుని వున్నాడు.

విశ్వనాథ్ తలూపి "ఏమిటి... ఇక్కడ కోవిడ్ ఉందా?" అని అడిగాడు విశ్వనాథ్.

"కోవిడ్ మళ్ళీ వ్యాపిస్తూందని వార్తలొస్తున్నాయి కదా సార్. ముందు జాగ్రత్త!" అంటూ నవ్వి ముందుకు కదిలాడు. రిసెప్షన్‌లో గది తాళాలు తీసుకుని "రండి. మీ గది చూపిస్తాను" అంటూ అతన్ని లిఫ్ట్‌లో పిలుచుకెళ్ళి సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న ఓ డబుల్

బెడ్‌రూమ్ చూపించి "మీరు విశ్రాంతి తీసుకోండి. లంచ్ ఫోన్ చేసి గదికే తెప్పించుకోండి. మీరు దేనికీ డబ్బులు చెల్లించకండి. మిగతా ఇద్దరూ వచ్చాక మనం సాయంత్రం బార్‌లో కలుసుకుందాం" అన్నాడు నాగ్.

తర్వాత అతను డోర్ వరకూ వెళ్ళి "మీకు మేము ఇస్తున్న ఈ ఆఫర్ గురించి మా స్టాఫ్‌తో కూడా మాట్లాడకండి, ఈ వార్త స్ప్రెడ్ అయితే మా రెగ్యులర్ కస్టమర్లు తమకూ ఇవ్వాలని డిమాండ్ చేస్తారు" అన్నాడు. విశ్వనాథ్ అలాగేనంటూ తలూపాడు.

# దుష్ట శిక్షణ

విశ్వనాథ్ తలుపు గడియవేసి గదిని పరిశీలించాడు. విశాలమైన గది, ఓ ప్రక్కన డబుల్ బెడ్, అట్టాచ్డ్ బాత్‌రూమ్ ఉన్నాయి. 'ఇన్ని ఇచ్చినవాళ్ళు ఓ అందమైన అమ్మాయిని కూడా అరేంజ్ చేస్తే బాగుంటుంది. నాగ్‌ని అడిగి చూడాలి. కుదరదంటే ఆ ఖర్చు తను భరిస్తాడని చెప్పాలి" అనుకున్నాడు మనసులో.

సాయంత్రం బార్ బయట ఉన్న లాన్‌లో మిగతా ఇద్దర్నీ విశ్వనాథ్‌కి పరిచయం చేశాడు నాగ్. పట్టాభి కడప నుంచి, నరసింహం నంద్యాల నుంచి వచ్చారని అతనికి తెలిసింది.

నాగ్ వారికి ఏ డ్రింక్స్ కావాలో కనుక్కొని వెళ్ళి బేరర్‌కి చెప్పి వచ్చాడు.

వారు డ్రింక్స్ తీసుకోవడం మొదలుపెట్టారు.

"నువ్వు తీసుకోవా?" అని అడిగాడు పట్టాభి - నాగ్ వైపు చూస్తూ.

"నేను కస్టమర్లతో ఉన్నప్పుడు తీసుకోకూడదు సార్. మావాళ్ళకి తెలిస్తే నా ఉద్యోగం పోతుంది" అన్నాడు నాగ్.

"నాగ్! మీ హోటల్‌వాళ్ళు చేసిన అన్ని ఏర్పాట్లూ బాగున్నాయి. కానీ ఒక్కటే లోటు" అన్నాడు విశ్వనాథ్.

"ఏమిటో చెప్పండి సార్...చిటికలో అరేంజ్ చేస్తాను" అన్నాడు నాగ్ ఆసక్తిగా అతనివైపు చూస్తూ.

"విందు, మందు ఉంది..మరి పొందు ఎక్కడ?"

"ఓహ్..అదెంతసేపు సార్. మీరు డ్రింక్స్ పూర్తిచేసేలోపు మీ గదుల్లో అప్సరసలాంటి అమ్మాయిలు ఉంటారు" అన్నాడు నాగ్.

తర్వాత దూరంగా వెళ్ళి ఎవరితోనో ఫోనులో మాట్లాడి వచ్చి "డన్" అన్నాడు. ఆ ముగ్గురి ముఖాలూ ఆనందంతో వెలిగిపోయాయి.

"నువ్వు మామూలోడివి కాదయ్యా బాబూ!" అన్నాడు విశ్వనాథ్ మెచ్చుకోలుగా చూస్తూ.

"ఈ ఉల్లాస సమయంలో మంచి హుషారునిచ్చే విషయాలు మాట్లాడుకుందాం ఫ్రెండ్స్" అన్నాడు నరసింహం.

"అవును. మీరు యవ్వనంలో ఉన్నప్పుడు కొన్ని తప్పులు చేసి ఉంటారు కదా సార్. వాటి గురించి చెప్పండి సార్. మందుకొట్టకపోయినా నాకు కిక్ వస్తుంది" అన్నాడు నాగ్ ఉత్సాహంగా.

"వయసులో ఉన్నప్పుడు చేసేవి తప్పుడు పనులు కావయ్యా.... చిలిపి పనులు" అన్నాడు విశ్వనాథ్ నవ్వుతూ.

"అవును...అవే చెప్పండి" అన్నాడు నాగ్.

"ముందు నేను ప్రారంభిస్తాను" అంటూ మొదలుపెట్టాడు నరసింహం.

"నేను కడపలో ఓ ఇంటి మేడపైన అద్దెకుండి బి.ఎ.చదువుకునేవాడిని. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓ తల్లి, ఇద్దరు కూతుర్లు, ఓ కొడుకు అద్దెకి ఉండేవారు. నా కన్ను పెద్దమ్మాయి కవితపై పడింది. ప్రేమపేరుతో ఆ అమ్మాయిని నావైపు ఆకర్షింపజేసుకున్నాను. పరీక్షలయ్యాక ఓ సారి వాళ్ళింట్లోవాళ్ళంతా ఊరికి వెళ్ళారు. కవితకి పరీక్షలు ఉండటంతో వాళ్ళమ్మ ఆ అమ్మాయిని ఇంట్లోనే వదిలి రాత్రిపూట పనిమనిషిని ఆమెకి తోడుగా పడుకోమంది. మా ఇద్దరి పరీక్షలయ్యాక ఆమెని గదికి రప్పించుకుని లోబరచుకున్నాను. నాలుగురోజులు స్వర్గంలో గడిపి తర్వాత గది ఖాళీ చేసి మా వూరు ప్రొద్దుటూరు వెళ్ళిపోయాను. తర్వాత ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. బట్ ఐ హేవ్ నో రిగ్రెట్స్. యవ్వనమన్నది అనుభవించడానికే అన్నది నా పాలసీ! తనూ జరిగింది మర్చిపోయి హాయిగా ఉండాల్సింది" అంటూ ముగించాడు.

"బాగుంది మీ గత చరిత్ర. మీరు చెప్పండి సార్" అంటూ నాగ్ కుతూహలంగా విశ్వనాథ్ వైపు

# దుష్ట శిక్షణ

చూశాడు.

"నంద్యాలలో నేను ఉద్యోగంలో చేరిన తొలిరోజుల్లో మా ప్రక్కింట్లో ఓ కుటుంబం

చేరారు. తల్లి, కూతురు, కొడుకు. ఆ తల్లి పేరు కమల. ఆమె చాలా అందంగా , అమాయకంగా ఉండేది. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు ఉండేది. వాళ్ళ అమ్మాయిని అడిగితే 'తన తల్లి మానసికంగా బాగా దెబ్బతిన్నదని, కోలుకోవడానికి మందులు ఇప్పిస్తున్నామని' చెప్పింది. ఓరోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధైర్యంచేసి ఆమెపైన చేయి వేశాను. ఆమె ప్రతిఘటించింది. నన్ను కొట్టింది. నేను నా ప్రయత్నం మానలేదు. చివరికి నేనే గెలిచాను. అయితే మరుసటిరోజే ఎవరికీ చెప్పకుండా వాళ్ళు వూరు వదిలి వెళ్ళిపోయారు" అన్నాడు విశ్వనాథ్.

"ఇద్దరూ ఒకరిని మించిన వారొకరు. మీరు చెప్పండి సార్ మీ అనుభవాలూ, అను 'బూతులూ'" అన్నాడు నాగ్ పట్టాభితో నవ్వుతూ.

"నేను మా కర్నూల్‌లో బ్యాంకులో పనిచేస్తున్నప్పుడు పల్లవి అనే ఓ అమ్మాయి నా దగ్గరికి వచ్చింది. 'తాము చాలా కష్టాల్లో ఉన్నామని, ఏదైనా లోన్ ఇవ్వమని' అడిగింది. అలాగే చూస్తానని చెప్పి కొంతకాలం లోను ఇవ్వకుండా తిప్పించాను. ఆ క్రమంలో పరిచయం పెంచుకుని ప్రేమ కబుర్లు చెప్పి వలలో వేసుకున్నాను. ఆ తర్వాత వశం చేసుకున్నాను. కొంతకాలం తర్వాత ఓరోజు నాకు ఇదివరకే పెళ్ళైందని, తనని మరో ఇంట్లో ఉంచి చూసుకుంటానని చెప్పాను. వెంటనే ఏడుస్తూ వెళ్ళిపోయింది. తర్వాత తను ఏమైందో నాకు తెలియదు. నాకు కనపళ్ళేదు" అన్నాడు పట్టాభి.

"కవిత తండ్రిగాని, కమల భర్త గాని, పల్లవి తండ్రిగాని మిమ్మల్ని ఏమీ అనకపోవడం, మీ మీద యుద్ధానికి రాకపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది. వాళ్ళు ముగ్గురూ పిరికివాళ్ళా?" అని అడిగాడు నాగ్.

"కవితకి తండ్రి లేదు. ఆమె చిన్నప్పుడే చనిపోయాడట" అన్నాడు నరసింహం.

"పల్లవికి కూడా తండ్రి లేదు" అన్నాడు పట్టాభి.

"కమలకు భర్త లేదు" అన్నాడు విశ్వనాథ్.

"మీ ముగ్గురి శృంగార గాథలు విన్నాక 'మీరు ముగ్గురూ ఒక కుటుంబంలోని వ్యక్తుల్నే మోసం చేశారా' అని నాకు అనుమానం కలుగుతూంది" అన్నాడు నాగ్.

"నాకూ అలాగే అనిపిస్తూంది. మన ఊర్లు కూడా దగ్గర దగ్గరే. ప్రొద్దుటూరు, నంద్యాల, కర్నూలు" అన్నాడు పట్టాభి.

"లక్కీ డిప్‌లో ముగ్గురూ తెలుగువాళ్ళే ఎన్నికవడం కూడా ఆశ్చర్యకరం" అన్నాడు విశ్వనాథ్.

"నా కళ్ళు తిరుగుతున్నాయి. ఒళ్ళు తూలిపోతూంది. నాకేదో అయిపోతోంది" అన్నాడు నరసింహం వెనక్కు వాలుతూ.

" డ్రింక్స్ ఎంత తీసుకున్నా స్టడీగా ఉండేవాణ్ణి. ఈరోజెందుకో తూలిపోతున్నాను" అన్నాడు విశ్వనాథ్.

"నాకొక్కడికే అలా ఉందేమో అనుకున్నాను. మీకూ అలాగే ఉందా? నాగ్... ఇది క్రొత్తగా వచ్చిన ఫారిన్ సరుకా?" అన్నాడు పట్టాభి.

" "ఛఛ..కాదు సార్. స్వదేశీ సరుకు. అందులో కలిపింది కూడా ఇండియన్ మేడ్ పాయిజన్!" అన్నాడు నాగ్ తన మాస్క్ తీసేస్తూ.

"నిన్నెక్కడో చూసినట్లుంది... ఎవరు నువ్వు?" భయంగా చూస్తూ అడిగాడు పట్టాభి.

"నాగ్...పూర్తిపేరు నాగేంద్ర!"

"నాగేంద్ర...ఎక్కడో విన్నట్లుంది ఆ పేరు. నువ్వు.. నువ్వు.. పల్లవి తమ్ముడివి కదూ?" అని అడిగాడు పట్టాభి.

" నాగేంద్ర అంటే ... కమల కొడుకు" అన్నాడు విశ్వనాథ్ తన కళ్ళు వెడల్పు చేసి చూస్తూ.

# దుష్ట శిక్షణ

"కవిత తమ్ముడి పేరు కూడా నాగేంద్ర" అన్నాడు నరసింహం భయంగా చూస్తూ.

"అవును. పల్లవి ఆత్మహత్య చేసుకుని కొన ప్రాణంతో ఉన్నప్పుడు నాతో తనను, మా అమ్మను, కవితక్కను ఎవరు వంచించారో చెప్పి చనిపోయింది. అప్పట్నుంచీ మిమ్మల్ని వెదకడం మొదలుపెట్టాను. మీ ముగ్గురి ఆచూకీ తెలుసుకున్నాక నాకు మిమ్మల్ని ఎలా ఒక చోటికి చేర్చి అంతమొందించాలా అని ఆలోచిస్తూంటే ఈ ఏనివర్సరీ ఆఫర్ ఆలోచన వచ్చింది. అన్ని విషయాల్లో కక్కుర్తిపడే మీరు ఈ ఆఫర్‌కి ఆశపడి ఘోరంగా మోసపోయారు.

నిజానికి మీరు మాకు చేసిన ద్రోహానికి మిమ్మల్ని చిత్రవధ చేసి చంపాలనుకున్నాను. అలాచేస్తే మళ్ళీ దేవుడి దగ్గర నేను శిక్ష అనుభవించాలి. నా శిక్ష తగ్గించుకోవాలంటే

మీకు నేను వేసే శిక్ష సింపుల్‌గా ఉండాలి. అందుకే మీకు విషం ఇచ్చి ప్రశాంతంగా చనిపోయే అవకాశం ఇచ్చాను. ఇది మీకు నేను ఇచ్చిన 'స్పెషల్ ఆఫర్'.

"మమ్మల్ని వెంటనే హాస్పిటల్‌లో చేర్చు. మేము నీ పేరు ఎక్కడా చెప్పము...ప్లీజ్" వేడుకోలుగా అన్నాడు విశ్వనాథ్.

"ఇక్కడ గదులు బుక్ చేయడానికి మీ ఆధార్ కార్డులే ఇచ్చాను. అడ్వాన్స్ క్యాష్ రూపంలో కట్టాను. ఇక్కడున్నంతసేపూ నేను మాస్క్‌లోనే ఉన్నాను. కాబట్టి పోలీసులు నన్ను పట్టుకోలేరు. మీరు ఎక్కువసేపు బ్రతకరు. మావాళ్ళకు ఆత్మశాంతి కలిగిందన్న తృప్తితో నేను వెళ్ళిపోతాను" అన్నాడు నాగేంద్ర తిరిగి మాస్క్ ధరిస్తూ.

వాళ్ళు ముగ్గురూ అరవడానికి ప్రయత్నించారు కాని వారి నోటినుంచి శబ్దం బయటికి రాలేదు.

నాగేంద్ర చూస్తూండగానే వారు టేబుల్‌పై తలపెట్టి వాలిపోయారు.

నాగేంద్ర లేచి మెయిన్ గేటు వైపు నడవసాగాడు, కళ్ళనుంచి ధారగా కారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ.

★ ★

గంటసేపటి తర్వాత కళ్ళు తెరచిన విశ్వనాథ్, నరసింహం, పట్టాభి- తాము పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు గమనించారు. తాము చనిపోలేదని, బ్రతికే ఉన్నామని తెలుసుకుని సంబరపడ్డారు.


"సార్! మాపై విషప్రయోగం చేసిన ఆ నాగ్‌గాడిని పట్టుకుని జైల్లో వేశారా?' అని పట్టాభి అడిగాడు తమ ఎదురుగా కూర్చుని ఉన్న ఎస్.ఐ.ని.

"నాగ్ ఎవరో మాకు తెలియదు. గ్రీన్‌పార్క్ హోటల్ బార్‌లో ముగ్గురు వ్యక్తులు మత్తుమందు త్రాగి పడిపోయి ఉన్నారని, వారు గంజాయి వ్యాపారం చేస్తున్నారని మాకు ఎవరో ఫోన్ చేశారు. మేము హోటల్‌కి వెళ్ళి చూస్తే ఒళ్ళు తెలియనిస్థితిలో మీరు కనిపించారు. మీ గదుల్లో గంజాయి పొట్లాలు మాకు దొరికాయి. మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాము" అన్నాడు ఎస్.ఐ.

నెత్తిన పిడుగుపడ్డట్లు చూశారు విశ్వనాథ్, నరసింహం, పట్టాభి.

★★★★★★★

# కబుర్లు... ఉత్తినే




'సామాను సర్దుకోండి' ఈ ఒక్క మాట 30 ఏళ్ల అనుభవం ఉన్న మనిషిని కోర్టు ముందు నిలబెట్టింది . అందుకే అన్నారు పదిమందిలో మాట్లాడే తప్పుడు ఆచి తూచి మాట్లాడాలి అని . ఇదీ మాటని ఏ సినిమాలోనో వాడితే (వాడారు కుడా ) అందరు హాయిగా నవ్వుకోవటమే కాక అడపా దడపా అదే మాటను ఊత పదంగా వాడేస్తూ ఉంటారు . ఇలా చాలా సిన్మాల్లో జరిగాయి . "వేదం" సినిమాలో వేశ్యగా వున్న అనూష్కను ఇన్స్పెక్టరుగా వేసిన పోసాని ఎగాదిగా చూస్తూ 'మేటరుంది' అంటాడు. అతనిది దుష్టపాత్ర, ఆమెది వేశ్య పాత్ర, ఆ డైలాగు చెల్లిపోయింది. " మాట్లాడినట్లు బయట మాట్లాడితే ఎలా... అంగాంగ ప్రదర్శన చేస్తే... ఎలా అంటూ సభ్యమైన భాష వాడకుండా పచ్చిగా మాట్లాడితే ఇలాగే అవుతుంది .మంచి చెప్పాలన్నప్పుడు మంచి మాటలతో చెప్పాలి కాని , మంచి చెప్పటానికి చెడ్డ మాటలు వాడితే మంచి కుడా చేదుగా మారి పోతుంది .ఇప్పుడు అదే అయ్యింది .

ఒకప్పుడు హీరోయిన్లు యాక్టింగ్ చేసేవారు. వ్యాంప్లు అంగప్రదర్శన చేసేవారు. సినిమా షడ్రసోపేతంగా వుండాలి కాబట్టి అన్ని రసాలతోనూ శృంగారమూ అవసరమే అని సంజాయిషీ యిచ్చేవారు. జ్యోతి లక్ష్మి , జయమాలిని అటువంటి వారిలో అగ్రగణ్యులు . వీళ్ళు ఇద్దరు అరకొర బట్టలతో అంగాంగ విన్యాసాలతో సినిమాల్లో అర్ధనగ్న నృత్యాలు చేసినా ఏనాడు వీళ్ళ మీద ఒక్క అసభ్య వార్త కాని , విమర్శ కాని రాలేదు .పైపెచ్చెఉ వీళ్ళు ఏనాడు పది మందిలోకి వచ్చి జనాన్ని రెచ్చగొట్టింది లేదు . కేవలం సినిమాలే కాదు నాటాకాలు ఆడే రోజుల నుంచి ఇదే వరస .చింతామణి నాటకమే ఇందుకు ఉదాహరణ అందులో ఎన్నో డైలాగులు బూతు అర్ధాలు వచ్చేవి ఉన్నాయి . నాటకం చూస్తున్నంత సేపు చూసి ఆస్వాదించారు తప్పా , వాటిని బయట ఎక్కడా వాడి కించపరచలేదు ."కొలతలు ", "సైజులు ", " జామకాయలు " ఇలా చాలా పదాలను ద్వందార్థాలు వచ్చేలా సినిమాల్లో నాటకాల్లో వాడుతూ ఉంటారు . అక్కడ దాక ఎందుకు జంధ్యాల గారు ఓ సినిమాలో (హై హై నాయకాలో ) ఎన్నో బూతు పదాలు వాడారు . కాని అవి ఏవి బుతుల్లా అనిపించవు

# కబుర్లు... ఉత్తినే



.అలాగే దర్శకేంద్రుడి గా పేరుబడ్డ ఓ దర్శకుడు ఆడవాళ్ళ బొడ్డు మీద ద్రాక్షపళ్ళు వెయ్యందే సినిమా తీయడు . అవన్నీ సినిమాకే అపరిమితం . బయట వీటిని అనుకరించినా మాట్లాడిన తప్పే అవుతుంది .అందుకనే ఆ రోజుల్లో ఎవరు బయట మాట్లాడేవాళ్ళు కాదు . దీనికి కారణం ఆ రోజుల్లో మనుషుల్లో ఉన్న సభ్యత సంస్కారం .సినిమాని సినిమాగానే చూసే మంచి గుణం. కాని సామాజిక మాధ్యమాల పుణ్యమా అని నేడు ఆ సంస్కారం మ్రుగ్యమౌతోంది .కాలం తో పాటు మార్పులు వచ్చినట్టే హీరోయిన్లే వ్యాంపులు డ్రెస్సులు వేసుకుని నటించటం తో వ్యాంపులు పోయారు .అయినా సినిమాలు ఆడటం లేదు. డోసు చాల్లేదనుకున్నారు. ఐటెమ్ డాన్సులని పెట్టారు. కొంతకాలానికి ఐటమ్ డాన్స్ మామూలు వాళ్లు చేస్తే చాలదనుకుని, పెద్ద హీరోయిన్ను పిలుచుకుని వచ్చి, ఓ పూర్తి సినిమా కిచ్చేటంత పారితోషికం యిచ్చి వాళ్ల చేత చేయించసాగారు. హీరో గారు ఎంత గొప్ప స్టారైనా, ఎన్ని వందల కోట్లతో సినిమా తీసినా, యీ ఐటమ్ డాన్సు లేకపోతే సినిమా ఆడదేమో అని భయపడే స్థితిలో వున్నారు హీరో, దర్శకుడు. ఆడదాని శరీరం మీదే వ్యాపారం చేసుకుంటూ మళ్లీ వాళ్లకి సుద్దులు చెప్పడం దేనికి – మీరు అందాలు దాచుకోవాలి అంటూ!

కాలం తో పటు ఆడవాళ్ల వేషధారణలో కూడా పెను మార్పు వచ్చింది. ఏటిట్యూడ్లో కూడా! మధ్య తరగతి వాళ్లలో కూడా బిడియం మాయమైంది. వినాయక నిమజ్జన వూరేగింపులలో స్వేచ్ఛగా డాన్సులు చేస్తున్నారు. పెళ్లి 'సంగీత్'లలో ఐతే ఎక్స్పోజర్లో పిన్న వయస్కులతో పోటీ పడుతూ, నెల్లాళ్లు రిహార్సల్స్ చేసి, అసభ్య సినీగీతాలకు నర్తిస్తున్నారు. ఇది మంచి, యిది చెడు, ఇంతవరకు ఫర్వాలేదు. యింతైతే ఫర్వా వుంది అని నేనేమీ తీర్పులు యివ్వటం లేదు. ప్రస్తుత సమాజపు పోకడ చెప్తున్నానంతే. ఈ



# కబుర్లు... ఉత్తినే

సోకాల్డ్ పురుషాధిక్య సమాజం దీన్ని అనుమతిస్తోంది కదా!

ఒకసారి జంధ్యాల 'గుండెల బట్టే తప్ప గుడ్డల బట్టి ఆడో, మగో తెలియకుండా పోతోంది' అని వ్యాఖ్యానిస్తే నిరసన తెలపడానికి కొందరు యువతులు ఆయన వద్దకు వెళ్లారు. ఆయన వాళ్లని చూసి 'మీరు వేసుకొచ్చినవి మగవాళ్ల డ్రస్సులే కదా' అన్నారు. ఇప్పుడూ ఆడవాళ్లు మగవాళ్ల లాగానే టీ షర్టులు, షార్ట్స్ వేసుకుని తిరుగుతున్నారు. కొద్దిపాటి తేడా వుంది. వాకింగ్లో ఏదైనా జంట ఎదురైతే కాస్త దూరం నుంచి చూస్తే ఎవరు ఆడో, ఎవరు మగో తెలియటం లేదు. తెలుసుకోవాలన్న కుతూహలం వుంటే చూపు క్రిందకు పోనివ్వాలి. లాగూ పైకి వుంటే స్త్రీ, క్రిందకు వుంటే పురుషుడు! వీళ్లకు తల్లో, అత్తగారో బుద్ధి చెప్పదా అనుకోకూడదు. 'మేం చిన్నప్పుడు వేసుకోలేక పోయాం. వాళ్లనైనా వాళ్ల కిష్టం వచ్చినట్లు వేసుకోనీ' అంటున్నారు వాళ్లు.

యాడ్స్లో స్త్రీ దేహాన్ని ప్రదర్శించే యాడ్ మేకర్స్ లో పురుషులు లేరా? స్త్రీలకు సంబంధించిన వస్తువులలో వాళ్లను ఉపయోగించుకుంటే ఓకేయే కానీ, అనేక వాటిల్లో వారి గ్లేమర్నే ఉపయోగిస్తున్నారు. గతంలో లైఫ్‌బోయ్ సబ్బు ఎంతటి మురికినైనా వదలగొడుతుంది అనే సందేశం యివ్వడానికి ట్రక్కు డ్రైవర్ స్నానం చేయడాన్ని చూపించేవారు. లిరిల్ సబ్బు కోసం జలపాతంలో డాన్సు చేసే అర్ధనగ్న యువతిని తెచ్చారు. ఇప్పుడు సబ్బు వంపులు పోల్చడానికి స్త్రీ శరీరపు వంపులు చూపిస్తున్నారు. సబ్బులు ఆడవాళ్లే వాడతారా? మిరప్పొడి అమ్మాలన్నా ఆడపిల్లలొచ్చి ఆడాల్సిందే! బాత్ టబ్ కానీయండి, మగవాళ్ల పెర్ఫ్యూమ్ కానీయండి, షేవింగ్ క్రీమ్ కానీయండి, కూల్ డ్రింకు కానీయండి – ఆడదాన్ని శరీరాన్ని చూపించకుండా పూట గడవటం లేదు వాళ్లకు.ముందు ఇటు వంటి వారిలో మార్పు తీసుకు వస్తే ఆడవాళ్ళవస్త్ర ధోరణిలో మార్పు అదే వస్తుంది .


బయటి సమాజమే యిలా వున్నప్పుడు సినీ తారామణులెలా వుండాలనుకుంటాం? బయటి వాళ్ల కంటె ఒక మెట్టు ఎక్కువగా, అనగా ఒక యించి తక్కువగా బట్టలేసుకోవాలి. ఫ్యాషన్ ఐకాన్స్ వుండడమనేది సినీరంగం ప్రారంభం నుంచీ వుంది. అంజలి గాజులు, సాధనా హెయిర్ కట్, వాణిశ్రీ చీరలు..యిలా మార్కెట్ చేసుకుంటూనే వచ్చారు. ఆ ఐకాన్ స్టేటస్ నిలుపుకోవడానికి వాళ్లు శరీరాన్ని ట్రిమ్గా వుంచుకోవడం మాత్రమే కాదు, వుంచుకున్నాం సుమా అని నిరూపించు కోవాల్సి వస్తోంది.

కొంత వరకు దీనికి మగావాడు కూడా బాధ్యుడే . స్త్రీని ఎలా చూడాలని కోరుకుంటున్నాడో అల్లే సినిమాల్లో చూపిస్తున్నారు . హీరోయిన్ అంటే యిలాగే వుండాలని తెర మీద ఫిక్స్ చేసిన ప్రేక్షకులు బయట కూడా వాళ్లు అలా కనబడకపోతే ఆదరిస్తారా? కన్నెత్తి చూస్తారా? చీర కట్టుకుని క్యాబరే డాన్సు చేస్తానంటే ఎవరు చూడరు ..అలాగే ఇదీను .కాబట్టి ఆడవాళ్ళకు నీతులు చెప్పే ముందు , దానికి కారణమైనా వాళ్ళకు కాస్తైన గడ్డి పెడితే బాగుంటుంది .

మరో పక్కా మా దుస్తులు మా ఇష్టం , స్త్రీ స్వేచ్ఛకు అడ్డుపడుతున్నారు అంటూ సమయం దొరికింది కదా అని అనలైన్ వేదికలెక్కి కొంత మంది అరుస్తున్నారు .స్త్రీ స్వేచ్ఛ అంటే దుస్తులు వేసుకోవటం లో కాదు , హక్కులు సాధించుకోవతం లో ఉండాలి .ఆర్ధిక , సామాజిక స్వేచ్ఛా నేటికి స్త్రీకి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది . వాటిని అణగదొక్కే వారిని ఎదిరించాలి .

ఏది ఏమైనా కాలం మారుతోంది , మా బతుకు మైస్తం అన్నట్టు ఉంది ఈ తరం .ఇవేళ పిల్లలే తల్లి దండ్రుల మాటలు వినటం లేదు , పరాయి వాళ్ళు చెబితే వింటారా . కాబట్టి ప్రవచానాలు చెప్పే కంటి ఉన్నంతలో మన పరిధిలో ఆచరించి చూపించటమే మంచిది , కొంత మేర అయినా ప్రభావం ఉంటుంది .

## మన పురాణాలు



# మరుత్తుడి చరిత్ర



ఆచార్య ఇరపని మాధవి

కృతయుగంలో మను చక్రవర్తికి ప్రజాని అనే కొడుకు పుట్టాడు. ప్రజాని కొడుకు క్షుతుడు. అతడి కొడుకు ఇక్ష్వాకుడు. ఇక్ష్వాకుడికి వందమంది కుమారులు, వారిలో పెద్దవాడు వింశుడు. అతడి కొడుకు వివింశుడు. అతడికి పదిహేనుమంది కొడుకులు, వారిలో పెద్దవాడు ఖనీనేత్రుడు. అతడు ఎక్కువ బలవంతుడు, దుర్మార్గుడు కావటంతో తన తమ్ముళ్లతో కలిసి అధర్మాలు చేసేవాడు. చివరకు తన తమ్ముళ్లు అందరినీ చంపి రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు. అతడు మంత్రులను ద్వేషిస్తూ, ప్రజలను హింసిస్తూ ఉండటంతో మంత్రులు రహస్య పన్నాగంతో అతడిని తొలగించి అతడి కుమారుడికి పట్టం కట్టారు. ఆ రాజకుమారుడు తన తండ్రివల్ల రాజ్యం పతనమవటం చూసినవాడు కనుక అందరి హృదయాలలో తన పట్ల ప్రేమాభిమానాలు కలిగేలా సత్యం, న్యాయం అనుసరిస్తూ నిత్యధర్మపరుడిగా ప్రవర్తించేవాడు.

నిత్యదానశీలుడై తన ఆస్తినంతా బ్రాహ్మణులకు దానమిచ్చి దారిద్ర్యంతో బాధపడ్డాడు. దానితో అతడి సైన్యం బలహీనపడింది. అది తెలిసి శత్రువులు రాజ్యాన్ని ఆక్రమించి ఆ రాజును ఓడించి తరిమివేశారు. ఆ రాజు తన ఆప్తులతో కలిసి అడవికి వెళ్లి మునులు కూడా ఆశ్చర్యపడే విధంగా నియమనిష్ఠలతో తపస్సు చేశాడు. నిర్మలమైన మనస్సుతో చేతిని దండంవలె చేసికొని గొప్ప తపశ్శక్తితో శరీరాన్ని దమింపచేశాడు. దానితో ఆశ్చర్య కరంగా పేకులు, గుర్రాలు, ఏనుగులు, రథాలు, శూరులైన సైనికులు, బంగారు రాసులు అక్కడ పుట్టాయి. ఆ రాజు వెంటనే శత్రువుల మీద దాడి చేసి విజయం సాధించాడు. చేతిని దమనం చేసిన కారణంగా అతడికి కరంధముడనే పేరు కలిగింది. ఆ విధంగా కరంధముడనే పేరు పొంది మనువంశ దీపకుడై ఆ రాజు ధర్మబద్ధంగా రాజ్యం చేస్తూ అంగిరసుడు తనకు ఉపద్రష్టగా చాలా అశ్వమేధ యాగాలు చేశాడు. ఆ యాగాల ప్రభావంతో రాజులందరూ తనను సేవిస్తుండగా రాజ్యాన్ని పరిపాలించి తాను కోరినప్పుడు శరీరంతో సహా స్వర్గానికి వెళ్లిపోయాడు. ఆ రాజు కొడుకు అవిక్షిత్తు. అతడు తండ్రిలాగానే సమర్థవంతంగా పాలన చేశాడు. అవిక్షిత్తుడి కుమారుడు మరుత్తుడు.

# మన పురాణాలు

మరుత్తుడు తండ్రిపోయాక రాజ్యపాలన చేపట్టి దయగలవాడని, పూజ్యుడని, దండనీతివిశారదుడని, దానగుణం కలవాడని పేరుపొంది సుస్థిరమైన పాలన అందించాడు. మరుత్తుడు తన గొప్పతనంతో, తన దీక్ష పైన ఉన్న విశ్వాసంతో ఇంద్రుడిని కూడా లెక్కచేయలేదు. ఇది చూచి ఇంద్రుడికి అసూయ చెంది ఈ రాజు తన పుణ్య కార్యాలతో తనను మించిపోకూడదని చింతలో మునిగిపోయి తన మంత్రి అయిన బృహస్పతి నివాసానికి వెళ్లాడు.

"పుణ్యాత్మా! మరుత్తుడు నిన్ను తాను చేయదలచిన యజ్ఞానికి ఉపద్రష్టగా ఉండటానికి నిన్ను వరించాలని అనుకుంటున్నాడు. స్వర్గాధిపతినైన నాకు ఉపద్రష్టగా ఉన్న మీరు ఒక మానవుడికి సహకరించటం మీ గొప్పతనానికి హానికరం కదా! నన్ను విడిచిపెట్టి అతడి యజ్ఞ కార్యాన్ని నడిపించండి, లేదా అతడిని వదిలిపెట్టి నాకు ఆప్తుడుగా ఉండండి" అని ఇంద్రుడు అనగా దానికి బృహస్పతి నవ్వి " ఓ ఇంద్రా! నువ్వు ఎవరో నాకు తెలియదా, నువ్వు నాకు ఇంతగా చెప్పాలా?అన్ని లోకాలకు అధిపతి అయిన నీకు గురువునైన నేను మరొకడిని ఆశించను, అగ్ని చల్లబడినా, సూర్యుడు మకిలిబట్టినా, భూమి క్రిందుమీదైనా, మేరుపర్వతం కదలాడినా, నా మాట అసత్యం కాదు, నమ్ము" అన్నాడు.

బృహస్పతి మాటలు విని ఇంద్రుడు సంతోషిస్తూ తన మందిరం చేరాడు.

ఇది తెలిసి మరుత్తుడు బృహస్పతి దగ్గరకు వెళ్లి " ఆచార్యా! నీకు తెలిపి, నీ అనుమతితోనే యజ్ఞ సామాగ్రి సిద్ధం చేసుకున్నాను. నీవు దయతో ఉపద్రష్టగా వ్యవహరించు" అనగా దానికి బృహస్పతి "రాజా! ఇంద్రుడు ఇంతకుముందే తాను చేయనున్న యాగానికి ఉపద్రష్టగా నన్ను వరించాడు. ఇప్పుడు రావటం ఎలా" అన్నాడు.

దానికి మరుత్తుడు " మహాత్మా! మీ అంగిరసమహర్షి మా తాతగారైన కరంధముడికి ఉపద్రష్టగా వ్యవహరించారు కదా! అలాగే నామీద మీరు దయచూపండి" అని కోరాడు. దానికి బృహస్పతి " రాజా! దేవతలకు నేర్పుతో వారి మనస్సులు సంతోషించేటట్లు యాగప్రక్రియలను నిర్వర్తించే నేను మానవుడు చేసే యాగానికి గురువుగా వ్యవహరించటం సముచితం కాదు. అందుచేత ఈ వేడికోలు ఇక మాని, మరొకరిని వెదకి ఉపద్రష్టగా స్వీకరించు,ఇక వెళ్లు" అన్నాడు.

బాధపడుతూ తిరిగి వెళ్తున్న మరుత్తుడికి నారదుడు ఎదురుపడి ఎందుకు చిన్నపోయి కనిపిస్తున్నావని అడుగగా జరిగినదంతా మరుత్తుడు చెప్పి " ఆ దేవగురుడు నన్ను తిట్టి వదిలిపెట్టాడు, ఇక నా బ్రతుకు వ్యర్థం" అని బావురుమన్నాడు. దానికి నారదుడు " రాజా! ఆ బృహస్పతి నిన్ను ఇష్టపడకపోతే ఏమిటి నష్టం? అంగిరసుడి చిన్న కొడుకు సంవర్తుడనే వాడు కూడా బృహస్పతి చేత తిరస్కరించబడి, సర్వం వదలి, వైరాగ్యం అవలంబించి, దిగంబరుడుగా తిరుగుతున్నాడు. నీవు అతడి దగ్గరకు వెళ్లు. ఆ మహాత్ముడు నీ యాగానికి ఉపద్రష్టగా ఉంటాడు" అని చెప్పగా ఆ రాజు ఎంతో సంతోషించాడు. " ఓ మునిశ్రేష్ఠా! బ్రతికాను, కాని ఆ సంవర్తుడు ఎక్కడ ఉంటాడు, అతడిని ఒప్పించాలంటే ఎలా మాట్లాడాలో చెప్పి పుణ్యం కట్టుకోండి" అని మరుత్తుడు ప్రార్థించగా నారదుడు" రాజా! ఆ సంవర్తుడు కాశీపురాన్ని ఎప్పుడూ వదలడు, పిచ్చివాడిలాగా ప్రవర్తిస్తుంటాడు. అతడిని గుర్తించటానికి ఒక ఉపాయం చెబుతాను, విను. ఊరు ముందటి ద్వారం దగ్గర ఒక శవాన్ని దగ్గర పెట్టుకొని ఉండు. వచ్చి చూచి వెంటనే ఎవరు తిరిగి వెళతారో వారే సంవర్తుడని గుర్తించు. అతడి వెనకే నీవు నిశ్చల భక్తితో వెళ్లు. ఎక్కడైనా అతను ఒంటరిగా ఉన్నప్పుడు అతడి శరణు వేడు. అతడి గుర్తు నేను చెప్పానని చెప్పు. ఇప్పుడు నారదుడెక్కడున్నాడని అడిగితే ఎలాంటి సంకోచం లేకుండా 'నాకు ఆయన మీ గురించి చెప్పి

# మన పురాణాలు

అగ్నిలో ప్రవేశించారని' చెప్పు" అని చెప్పాడు.

మరుత్తుడు కాశీపురానికి వెళ్ళి దిక్కులేని శవం ఒక దగ్గర పడి ఉండగా చూచి, దానిని మోయించుకొని నగర ద్వారం వద్దకు చేరుకొని ఆ శవాన్ని అక్కడ ఉంచుకొని, దాని సమీపంలో కాచుకొని ఉన్నాడు. అప్పుడు ఒక పిచ్చివాడు వచ్చి శవాన్ని చూచి, దెబ్బతిన్న పశువులాగా వెనక్కి తిరిగి పారిపోయాడు. అతడిని గుర్తించి మరుత్తుడు అతడి వెనుకే వెళ్లగా అతడు తిరిగి చూచి రాజుపై దుమ్ము చల్లి, ఉమిసి పిచ్చివాడిలాగా ప్రవర్తించాడు. రాజు వినయంగా చేతులు జోడించి నమస్కరిస్తూ అతడు ఎలా వెళితే అలా వెళ్లగా వెళ్లగా ఆ సంవర్తుడు ఒక ఏకాంతమైన ప్రదేశానికి వెళ్లి ఒక మర్రిచెట్టు క్రింద కూర్చున్నాడు.

మరుత్తుడు వెంటనే అతడిని సమీపించి నమస్కరించగా " నా గురించి చెప్పి నిన్ను పంపినదెవరో చెప్పు. నీవు చెప్పేది నిజమైతే నీ కోరిక నెరవేరుతుంది. అబద్ధమైతే తల ఏడు ముక్కలై చస్తావు" అని సంవర్తుడనగా నారదమహర్షి మీ గురించి చెప్పారని మరుత్తుడు సత్యమే పలికాడు. నారదుడు " అయితే అతడు ఇప్పుడెక్కడున్నాడు, ఏం చేస్తున్నాడు?" చెప్పమనగా మరుత్తుడు నారదుడు చెప్పమన్న విధంగానే "స్వామి! మీ గురించి నాకు చెప్పి నన్ను ఇక్కడికి పంపుతున్న సమయంలోనే ఆ మహర్షి చితి పేర్చి అందులో ప్రవేశించాడు" అన్నాడు. అప్పుడు



సంవర్తుడు " నన్ను చూడటానికి నీవు వచ్చిన పని ఏమిటి" అని అడిగాడు. తన గురించి చెప్పి తానెందుకు వచ్చింది కూడా మరుత్తుడు వివరించగా సంవర్తుడు అభిమానంగా " రాజా! నీ పని నువ్వు చెప్పావు. ఇక నా విషయం విను

. మా అన్న బృహస్పతి తన తపోబలంతోనన్ను అవమానించగా నా ఇంటిని, ధనాన్ని,అన్నీ వదిలి ఇలా తిరుగుతున్నాను. నావంటి నిరుపేద నీకు ఉపద్రష్టగా ఉంటే నీకుఒరిగే వైభవం ఏముంది? పెద్దవాడైనఆయననే కోరుకో. కాదు నేనేకావాలనుకుంటే నేను చెప్పినట్లు చెయ్యి.

మా అన్న నాకు గౌరవార్హుడు. అతడుఅనుమతి స్తేనే నేను నీ యాగానికి ఉపద్రష్టగా ఉండగలను . కనుక వెంటనేమా అన్నను దర్శించి అతడిని ప్రార్థించిఅనుమతి సంపాదించు " అన్నాడు. దానికిమరుత్తుడు తనకూ బృహస్పతికి మధ్యజరిగిన సంభాషణంతా చెప్పి " నాపైనఅసూయతో బృహస్పతిని ఇంద్రుడు ఆపివేయటం కారణంగా అతడు అలా మాట్లాడాడు. ఇక మళ్లీ అక్కడకు ఎలా వెళ్లను? మీ తపోశక్తితో ఇంద్రుడిని అతిక్రమించగలరని నమ్మకంతో నేనున్నాను. పుణ్యాత్మా! కరుణతో ఉపాధ్యాయత్వాన్ని తప్పక మీరు స్వీకరించాలి" అని ప్రార్థించగా అలాగే కానివ్వమంటూ సంవర్తుడు అంగీకరించాడు.

సంవర్తుడు ఇంకా "రాజా! ఇప్పటికి నువ్వు కోరినట్లే అవుతుంది. కానీ, నేను నీ యాగం నడిపిస్తుంటే ఇంద్రుడు, బృహస్పతి నా మీద కోపంతో నీ యజ్ఞానికి ఎన్నో ఆటంకాలు కలిగించవచ్చు. దానికి భయపడి యజ్ఞం విరమించుకుంటే నిన్ను శపిస్తాను. దాని వల్ల

## మన పురాణాలు

కీడు జరగవచ్చు. ఇదంతా ముందుగా ఆలోచించి సుస్థిరమైన నిశ్చయం కలిగి దీక్ష తీసుకో. బాగా ఆలోచించు" అన్నాడు. దానికి మరుత్తుడు "ఋషిశ్రేష్ఠుడా! నీ దయను పొందాక నాకు మరో ఆలోచన ఎందుకు? ఆ ఇంద్రబృహస్పతులే కాదు. సాక్షాత్తు ఆ పరమేశ్వరుడే కోపగించుకొని అడ్డుపెట్టినా భయపడతానా? మీతో స్నేహం పోగొట్టుకోవటం జరిగితే సూర్య, చంద్ర, తారక, కులపర్వతాలున్నంత కాలం నాకు పుణ్యగతులు కలుగుతాయా?" అని మనోనిశ్చయంతో పలికాడు.

దానికి సంవర్తుడు మెచ్చుకొని " రాజా! నిన్ను ఇంద్రుడి కంటే ధనవంతుడిగా చేసి యజ్ఞం నడిపిస్తాను. ఏవిధంగా నేను ధనవంతుడినికాగలనని నువ్వంటావేమో! అయితే విను. హిమాలయాలకు ఉత్తర భాగంలో ముంజవంతమనే పర్వతం ఉంది. అక్కడ శివుడు పార్వతితోకూడి దేవతలు, సిద్ధులు, గరుడులు, గంధర్వులు మొదలైన సమస్త భూతాల చేత సేవించబడుతూ విహరిస్తుంటాడు . ఆ కొండలో ఎక్కడా జరారోగమరణాలు లేవు. అన్ని ఋతువులలోనూ పొదలలో, తీగలలో, మొక్కలలో పూలు, పండ్లు సమృద్ధిగా కనిపిస్తాయి. ఆ కొండ పక్కల సూర్యకిరణాలను పోలిన బంగారు రాళ్లు, బంగారు ఇసుక ఆశ్చర్యకరంగా ప్రకాశిస్తూ ఉంటాయి. మనం ఆ ప్రాంతానికి వెళ్లి ఆ మహేశ్వరుడిని వివిధరీతులలో ప్రస్తుతించి, నమస్కారాలతో తృప్తి కలిగించి, ఆయన దయను సంపాదించి, అక్కడున్న బంగారును కోకొల్లలుగా పెద్ద పెద్ద మూటలు కట్టించి మోయించుకొని వద్దాము రమ్ము, బయలుదేరు, బరువులు మోసే వారిని దండిగా పిలుచుకొని రా" అని సంతోషంగా చెప్పాడు.

ఆ సంవర్తుడు తనను వెంట తీసికొని వెళ్లగా ఆ మరుత్తుడు ఆ పర్వతానికి వెళ్లి, శివుడిని స్తుతించి అతడి దయను పొంది బంగారు రాసులను కోకొల్లలుగా మూటలు కట్టించి, బంగారు శిలలను మోపులు కట్టించుకొని, పనివారి చేత మోయించుకొని హిమాలయాలు దాటి నగరం చేరుకొన్నాడు. ఈ విధంగా మహా ధనవంతుడై ఆ రాజు బంగారుతో యజ్ఞ వాటికను, కుండలు మొదలైన యాగ

(ఇంకా ఉంది )

## వాల్ పోస్టర్




### కొత్త సినిమా –కథా కమీషు

# “హోం బౌండ్ ”

‘భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన సత్తాను చాటింది. దర్శకుడు నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన ‘హోమ్‌బౌండ్’ చిత్రం ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) రేసులో చోటు సంపాదించటంతో దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ చిత్రాన్ని ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో అకాడమీ షార్ట్‌లిస్ట్ చేయడం విశేషం. ఇందులో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా ప్రధాన పాత్రల్లో నటించారు. హ్యూమన్ ఎమోషన్స్, రిలేషన్స్, వంటి అంశాలను సున్నితంగా ఆవిష్కరించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రశంసలు అందుకున్న ‘హోమ్‌బౌండ్’ ఇప్పుడు ఆస్కార్ షార్ట్‌లిస్ట్ కావటం ఇండియా సినిమాలో మరో మైలురాయిగా చెప్పొచ్చు.

మొహమ్మద్ షోయబ్ అలీ (ఇషాన్ కట్టర్), చందన్ కుమార్ (విశాల్ జెత్వా) స్నేహితులు. ముస్లిం కావడంతో ఒకరు, ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో మరొకరు… సమాజంలో అవమానాలకు, అణిచివేతకు గురి అవుతారు. పోలీస్ కానిస్టేబుల్ అయితే గౌరవం లభిస్తుందని రిక్రూట్మెంట్ ఎగ్జామ్ రాస్తారు. అయితే ఫలితాలు రావడం ఆలస్యం అవుతుంది.

కుటుంబ పరిస్థితుల కారణంగా ఓ కంపెనీలో ఉద్యోగానికి చేరతాడు షోయబ్ అలీ. సుధా (జాన్వీ కపూర్) కోసం కాలేజీలో చేరతాడు చందన్. ఆ తర్వాత స్నేహితులు ఇద్దరి మధ్య ఎందుకు గొడవలు వచ్చాయి? దూరం పెరిగింది? కాలేజీ మానేసిన చందన్, ఆఫీస్ బాయ్ ఉద్యోగం వదిలేసి షోయబ్ సూరత్ వెళ్లి ఫ్యాక్టరీలో పని చేయడానికి దారి పరిసితులు ఏమిటి? వాళ్ళిద్దరి జీవితాల్లో కరోనా ఎటువంటి మార్పులు తీసుకొచ్చింది? అనేది సినిమా.

కరోనా ఎంతో మంది జీవితాలను

# వాల్ పోస్టర్

తలకిందులు చేసింది. ఫ్యాక్టరీలు మూతపడటం వల్ల ఉపాధి కోల్పోయిన వలస కార్మికులు వందల కిలోమీటర్లు నడిచి సొంతూరు చేరుకోవడం కోసం పడిన కష్టాలు ప్రజల హృదయాలను కలచివేశాయి. పతాక సన్నివేశాల్లో దర్శకుడు నీరజ్ చూపించిన ఆ దృశ్యాలు మరోసారి కంటతడి పెట్టేలా చేశాయి. కరోనా కష్టాలు ఒక్కటే కాదు... కులం కారణంతో కొందరికి ఎదురయ్యే అవమానాలు, ఉద్యోగాల్లో ఎదురయ్యే అణిచివేత వంటివీ 'హోమ్ బౌండ్'లో స్పృశించారు దర్శకుడు నీరజ్.

'హోమ్ బౌండ్' కథలో ప్రజలకు తెలియని విషయాలు ఏమీ లేవు. కుల వివక్ష, ఉద్యోగ పరమైన అవమానాలు, ఆర్థిక అసమానతలు, కరోనా కష్టాలు... అటు వార్తల్లో, ఇటు కొన్ని సినిమాల్లో చూసినవి మళ్లీ తెరపై కనిపించాయి. అందరికీ తెలిసిన పాయింట్, రొటీన్ సీన్స్ తీసుకుని ఒక ప్యాకేజీగా ఇచ్చారు దర్శకుడు నీరజ్. ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా వంటి ట్యాలెంటెడ్ ఆర్టిస్టులు ఉండటంతో ఆల్రెడీ చూసిన సన్నివేశాలు మళ్ళీ తెరపై వచ్చినా పాత వాసనలు, ఛాయలు కనిపించకుండా చేశారు. ప్రతి సన్నివేశం వీలైనంత సహజంగా చిత్రీకరించారు సినిమాటోగ్రాఫర్ ప్రతీక్ షా. అమిత్ త్రివేది స్వరపరిచిన పాటలు కథలో భాగంగా సాగాయి. నరేన్ చంద్రవర్కర్, బెనెడిక్ట్ టైలర్ నేపథ్య సంగీతంలో శబ్దాల కంటే మౌనానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ఆర్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ స్థాయిలో నిర్మాణ విలువలు ఉన్నాయి. సహజత్వం ఉండేలా చూసుకున్నారు.

దర్శకుడు నీరజ్ ఎంచుకున్న కథలో కొత్తదనం లేనప్పటికీ.. ఆ కథలో చర్చించిన అంశాలు చాలా రిలేటబుల్ గా ఉన్నాయి. ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ.. సమాజంలోని బేధాలను వివరించిన తీరు కచ్చితంగా ఆకట్టుకుంటుంది. స్కూల్లో వంట మనిషి తక్కువ కులానికి చెందిన వ్యక్తి అని తెలిసినప్పుడు జనాలు రియాక్ట్ అయిన తీరును చాలా సహజంగా చూపించాడు. అలాగే.. కరోనా టైంలో కార్మికుల కష్టాలను గ్లోరిఫై చేయకుండా.. సహజంగా తెరకెక్కించిన విధానం ఆకట్టుకుంటుంది. కథకుడిగా, దర్శకుడిగా వీలైనంత సహజంగా సినిమాని తెరకెక్కించడానికి అతడు చేసిన ప్రయత్నాన్ని మాత్రం కచ్చితంగా మెచ్చుకోవాల్సిందే. అది మాత్రమే కాదు.. క్యారెక్టర్ బిహేవియర్ ను అతను సందర్భానుసారంగా ప్రేక్షకులకు అర్థమయ్యేలా చేసిన విధానం రచయితగా అతడి ప్రతిభకు తార్కాణం.

ప్రభుత్వం లేదా సమాజం చర్యలకు ఎక్కువగా ఎఫెక్ట్ అయ్యేది ఎప్పుడూ దిగువ మధ్యతరగతి కుటుంబాలే. అది డీమానిటైజేషన్ అవ్వొచ్చు, లాక్ డౌన్ అవ్వొచ్చు. అసలు సామాన్యులు ఎలా డీల్ చేయగలరు అనే బేసిక్ సెన్స్ లేకుండా ప్రభుత్వం చర్యలు ఉంటాయి. అలాగే.. సమాజంలో ఇప్పటికీ కుల, మత వివక్షలు ఎంత నీచంగా ఉన్నాయి అనేది వేలెత్తి చూపిన విధానం ఇలాంటి సమాజంలోనే మనమూ ఉన్నాము అని మనల్ని మనం ప్రశ్నించుకునేలా చేస్తుంది. ఇలా ఆలోచింపజేసే, ప్రశించేలా చేసే అంశాలు సినిమాలో చాలా ఉన్నాయి. అయితే.. ఇది డ్రామా అవ్వడం వల్ల రెండు గంటలపాటు ఈ చిత్రాన్ని ఓపిగ్గా చూడడం అనేది అందరి వల్లా అవ్వదు. అయితే.. ఆర్టిస్టిక్ గా చూస్తే మాత్రం ఎంతో లోతైన భావం ఉంది సినిమాలో.

★★★★

# వెబ్ పోస్టర్




అనంతం అనేది అనేక సంవత్సరాలుగా సృష్టించబడిన జ్ఞాపకాలతో నిండిన ఒక నిధి గృహం, ఇందులో ప్రేమ, దుఃఖం, ద్రోహం, విజయం, నవ్వు, భయానకం మరియు వివిధ సమయాల్లో అక్కడ నివసించిన వివిధ కుటుంబాల ధైర్యం గురించి కథల సమాహారం ఉంటుంది. ఈ ధారావాహిక ఇంటి నేపథ్య కథనాన్ని కలిగి ఉంది, ఇది దాని గోడలు వేర్వేరు కథలను పంచుకోగలవని మనకు చెబుతుంది.

ఆ ఇల్లు తనంతట తానుగా జీవించే పాత్ర – దానికి చాలా గదులు ఉన్నాయి, ప్రతి ఒక్కటి దాని స్వంత కథను చెబుతుంది. ఇది ఒక ఫ్లవర్ వాజ్ లో కలిసి అమర్చబడిన పుష్పగుచ్ఛం లాంటిది – అన్నీ రంగులు, ఆకారాలు, పరిమాణాలు మరియు వాసనల యొక్క విభిన్న షేడ్స్ – కానీ అవి కలిసి అందమైనదాన్ని ఏర్పరుస్తాయి.

మణిరత్నం దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన వి ప్రియ దర్శకత్వం వహించిన అనంతం ఏప్రిల్ 22 నుండి జీ5లో ప్రసారం అవుతోంది. ఈ తమిళ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్‌లను కలిగి ఉంది, ఒక్కొక్కటి దాదాపు గంట సేపు నడుస్తుంది మరియు ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో అందుబాటులో ఉంది. ఈ షోలో ప్రకాష్ రాజ్, సంపత్ రాజ్, జాన్ విజయ్, వివేక్ రాజ్‌గోపాల్, సంయుక్త, వినోద్ కిషన్, ఇంద్రజ, వివేక్ ప్రసన్న, వినోదిని, అంజలి రావు, మాధురి మరియు అరవింత్ సుందర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఇంటి యజమాని వెంకటేశన్ (ప్రకాష్ రాజ్) నుండి విడిపోయిన కుమారుడు అనంత్ (సంపత్ రాజ్) చాలా సంవత్సరాల తర్వాత తన కుటుంబ ఇంటికి తిరిగి వచ్చి ఇంట్లో దాగి ఉన్న రహస్యాలు మరియు జ్ఞాపకాలను విప్పుతాడు. ఒక ఉద్వేగభరితమైన రచయితగా, అతను ఇంటి చెప్పని కథలను అల్లుకునే పుస్తకం రాయాలనుకుంటున్నాడు, ఇది వేర్వేరు వ్యక్తులకు అదృష్టం మరియు విపత్తులను కలిగి ఉంటుంది. అతను ఇంట్లో తన వ్యక్తిగత బాధాకరమైన అనుభవాన్ని దాటి తన పుస్తకం రాయడంలో విజయం సాధించాడా? అదే మిగిలిన కథ.

ఈ సిరీస్ అద్భుతంగా నటించి, నిర్మించబడింది. భారతీయ సినిమాల్లో అరుదుగా కనిపించే సూక్ష్మత మరియు చక్కదనంతో కథలు చెప్పబడ్డాయి. సామాన్యులు లేదా మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొనే సమస్యలను అవి చర్చిస్తాయి కాబట్టి అవి చాలా హృదయ విదారకంగా ఉంటాయి.

సీరియల్

# పడిలేచిన కెరటం



**యశోదా కైలాష్**

నాకు నీ పాదాల మీద నా తలపెట్టుకుని నేను చేసిన పాపలకు క్షమార్పణ చెప్పాలని ఉంది. నా కన్నీటితో నీ పాదాలను కడగాలని ఉంది. ఇది అతిశయోక్తి కాదూ నిన్ను మభ్యపెట్టడమూ కాదు. నా కన్నీళ్లు ఆగడంలేదు తపస్వీ. కళ్లు మసకలైపోతున్నాయి. ఒట్టువేసి చెపుతున్నాను, భగవత్ సాక్షిగా.

మరో జన్మ అంటూ ఉంటే, నిన్ను అపురూపంగా, నా ప్రాణం కంటే ఎక్కువగా నిన్ను ప్రేమిస్తూ నా హృదయంలో పదిలంగా దాచుకుంటాను.

ఇంకేమీ చెప్పలేని అసహాయుడిని.

ఒకప్పటి నీ 'శ్రీ'!!

ఉత్తరం చదువుతోందేకానీ, కన్నీరు చెలియకట్ట దాటుతోంది. నియత్రించే శక్తిలేక వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. బాల్కనీలో కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్న మానస, సందీప్ శాంతమ్మగారు పిలిచే సరికి ఏమైందని అడిగారు. తపస్వి గారు ఎందుకో బాగా ఏడుస్తున్నారమ్మా అనేసరికి గభాలున వచ్చేసారు.. హాల్ లో సోఫాలో చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తూ తపస్వి. పక్కనే ఏదో ఉత్తరం. అక్కా, బావలని చూడగానే దుఖం రెట్టింపు అవుతుండగా తన గదిలోకి పోయి తలుపులేసుకుంది.

మానస, సందీప్ లు కూడా ఉత్తరాన్ని చదివారు. "ఏం పనిచేసావు శ్రీకాంత్!" ఇప్పుడు వచ్చిన బుద్ధి అప్పుడే వచ్చి ఉంటే నీ జీవితం ఎంతో బాగుండేది. ఎంతలా చెడిపోయావు? అంతా అయిపోయాకా ఇప్పుడు నీ తప్పులు తెలుసుకుని పశ్చాత్తాప పడుతున్నావు. డబ్బు కోసం అమాయకురాలైన బంగారం లాంటి మనసున్న తపస్విని

# పడిలేచిన కెరటం

ఎంతగానో బాధించావు. అప్పుడే నీ భార్య మాట విని ఉంటే ఇప్పుడు నీకీ దుస్తితి వచ్చేది కాదు. చేసిన తప్పులకు శిక్ష అనుభవించడం అన్నది మరో జన్మలో కాదు, ఈ జన్మలోనే భగవంతుడు అనుభవించేటట్లు చేస్తున్నాడు. మేము ఏమి చేయగలమయ్యా. నీలో పరివర్తన కలిగి ఒక మంచి మనస్సున్న మనిషిగా మారాలని భగవంతుడిని కోరుకోవడం కంటే మేమేమి చేయగలం అనుకున్నారు.

తపస్విని డిస్టర్బ్ చేయకూడదనుకున్నారు. ఏడవనీ, మనసులోని దుఖాన్ని పోయేవరకూ కరువుతీరా ఏడవనీ అనుకున్నారు.

మరో గంట తరువాత గదిలోనుండి బైటకు వచ్చింది. ఆమె కళ్లు ఎర్రగా వాచి ఉన్నాయి. అందరూ మౌనంగా కూర్చుని భోజనం చేసి, ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయారు.

మరో నాలుగురోజులు గడచిపోయాయి. సందీప్, మానసను కొన్నాళ్లు ఇక్కడే తపస్వి దగ్గర ఉండమని చెప్పి వెళ్లిపోయాడు. తపస్వి సడన్ గా మౌనంగా అయిపోయింది. సరిగా తిండి తినడం లేదు. ఒకరోజు ఆఫీస్ నుండి వస్తూనే జ్వరంతో పడుకుండిపోయింది. హై టెంపరేచర్. మానస కంగారు పడిపోయింది. డ్రైవర్ సాయంతో హాస్పటల్ కి తీసుకెళ్లింది. ఎందుకో మానసికంగా బాధపడుతున్నారని, బి.పి కూడా కాస్త ఎక్కువగా ఉందని జాగ్రత్తగా చూసుకోమ్మని చెపుతూ మందులు వ్రాసి ఇచ్చారు.

అప్పటికే శాంతమ్మ సరస్వతి కి కబురు అందించింది. తపస్వికి బాగోలేదని, మానస కంగారు పడుతోందని.

హరిణిని పంపుతున్నాను, కాస్త సహాయంగా ఉంటుందని సరస్వతి చెప్పేసరికి శాంతమ్మ సంతోషించింది.

హరిణి రాకతో మానసకు ధైర్యం వచ్చింది. మీరు రిలాక్స్ ఆంటీ అంటూ తపస్వి దగ్గర తనే ఉంటూ, వేళకు మందులు వేసేది. ఆరారా , పళ్లరసాలు ఇస్తూ రాత్రిళ్లు కూడా ఆమెను కనిపెట్టుకుని ఉంటోంది. తపస్వి గురించి చూచాయగా తెలుసుకున్న హరిణికి తపస్వి మీద ఏదో తంలియని జాలి, అభిమానం కలిగాయి. భర్త తననుండి దూరమైనా, ఎంతో ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో ఉద్యోగం చేసుకుంటూ, కూతుర్ని చక్కగా చదివించుకుంటోంది. మహిళాలోకానికే ఆదర్శం తపస్వి ఆంటీ అని ఎన్నోసార్లు అనుకుంది.

చక చకా తన ఇల్లే అనుకున్నట్లుగా తిరిగేస్తూ, తపస్వికి ఎంతో శ్రద్ధగా సపర్యలు చేస్తున్న హరిణి పట్ల ఏదో తెలియని అభిమానం కలుగుతోంది మానసకు. చదువుకుని ఉద్యోగం చేస్తున్న ఇంత చిన్న అమ్మాయికి ఇలా సపర్యలు చేయమని ఎవరు చెప్పారు? ఎంత మంచితనం, ఎంత చక్కటి సంస్కారం. ఇప్పటి తరం పిల్లలలో హరిణి లాంటి అమ్మాయిలు ఎక్కడో కోటికి ఒకరు ఉంటారేమో! ఇటువంటి పిల్లలు ఇంటికే శోభను తెస్తారని పదే పదే మనసులో అనుకుంది.

మరో వారం రోజుల్లో తపస్వి బాగా కోలుకుంది. ఇంకో వారం శెలవు పెట్టమని మానస గట్టిగా కేకలేసేసరికి సరేనంటూ తన శెలవను పొడిగించింది.

అప్పుడప్పుడు హరిణి రావడం, సరదాగా కూర్చుని కాసేపు కబుర్లు చెప్పడంతో ఇంట్లోని వాతావరణలో చైతన్యం వచ్చింది. అదివరకటి ఉదాసీనత పోయింది.

ఒకరోజు సరస్వతమ్మ తపస్విని చూడాలని వచ్చింది. ఈ మధ్య ఇరుకుటుంబాల మధ్య బంధం బలపడుతోంది. సరస్వతమ్మ కి హైద్రాబాద్ లో ఎవరో దూరపు బంధువులు తప్ప మరెవరూ లేరు. ఆ దూరపు బంధువుల మూలానే హరిణి హైద్రాబాద్ రావడం జరిగింది. హరిణి ఇక్కడకు వచ్చి ఉద్యోగం చేస్తూనే ఎమ్. బి.ఏ చేసిన మూలాన, మరో





# పడిలేచిన కెరటం

పెద్ద కంపెనీ లో హెచ్.ఆర్.డీ విభాగంలో మంచి పొజిషన్ లో జాబ్ వచ్చింది. శాంతమ్మతో కలిసి మొదటి సారిగా తపస్వి సరస్వతమ్మగారింటికి వెళ్లి పరిచయం చేసుకోవడంతో, ఆ పరిచయం అక్కడితో ఆగిపోకుండా ఒకరింటింకి మరొకరు రాకపోకలు సాగిస్తుండంతో స్నేహబంధం ఒక లాంటి ఆత్మీయతను పెంపొందించడమే కాకుండా హరిణి తరచుగా తపస్వి కి కావాల్సిన సహాయం చేసిపెడ్తోంది.

తల్లికి బాగాలేదని తెలిసి మహిమ ఢిల్లీ నుండి వచ్చింది. తల్లిని చూసి కన్నీళ్లు పెట్టుకుంది. ఎమ్.ఏ మొదటి సంవత్సరంలోకి వచ్చింది. క్లాసులు పోతున్నా ఒక వారం రోజులు తల్లి దగ్గరే ఉండిపోయింది. అప్పుడు తపస్వి హరిణి గురించి చెప్పింది. తనకు జ్వరం వచ్చినపుడు హరిణి తనకు ఎంత సేవ చేసిందో, ఆమె మూలానే తను కోలుకున్నానని చెప్పింది.

మహిమను చూడాలని హరిణి వచ్చినపుడు, మహీ హరిణిని కౌగలించుకుంటూ, థాంక్స్ హరిణీ, అమ్మను ఆ టైమ్ లో నేను చూసుకోవాలి. నా బదులు నీవు అమ్మకు ఎంతో సపోర్ట్ గా ఉంటూ ఎంతో సాయం చేసినందుకు నేను ఎంత థాంక్స్ చెప్పినా సరిపోదంటూ కళ్లనీళ్లు పెట్టుకుంటున్న మహీతో " అదేమంత గొప్ప విషయం మహీ!" నీవు ఇక్కడ ఉంటే నీవు చూసుకోవా?" ఒకరినొకరం సహాయం చేసుకోపోతే ఆ స్నేహానికి అర్థం ఏముంది? ఇవేమీ ఆలోచించకుండా, నీ ఆశయాన్ని నెరవేర్చడానికి ప్రయత్నించు. ఆంటీని మేము చూసుకుంటాంలే అని ధైర్యం చెప్పింది.

సరస్వతమ్మ తపస్విని చూస్తూ"ఏంమ్మా, ఆరోగ్యం బాగుందికదూ, ఆఫీస్ కు వెళ్లి వస్తున్నావని హరిణి చెప్పింది. మీ అక్క వెళ్లిపోయారని చెప్పింది. అక్క వెళ్లేటప్పుడు వద్దామనుకున్నాను. పిల్లలకు తెలుగు ట్యూషన్ చెపుతున్నాను కదా. వాళ్ల పరీక్షలు దగ్గర పడడంతో కాస్త హడావిడిగా ఉన్నాను. సరస్వతమ్మ వాళ్ల ఇంటి సమీపంలోనున్న పిల్లలకు తెలుగు ట్యూషన్లు తెపుతుంది సాయంకాలం పూట. స్కూల్ పిల్లలు వివిధ క్లాస్ ల వారు సరస్వతమ్మ దగ్గరకు ట్యూషన్ కు వస్తారు. బాగా చెపుతారు తెలుగు సబ్జక్ట్ అని పేరు వచ్చింది కూడా. ఏదో ఖాళీగా ఉండక, కాస్తో, కూస్తో వేణ్ణీలకు చన్నీళ్లు తోడుగా సంపాదిస్తోంది.

"ఫరవాలేదండీ, అక్కకూడా నాకు బాగుండంతో ధైర్యంగా వెళ్లింది. అక్కడ బావకి వంటరాదు. బైట ఫుడ్ పడక ఇబ్బంది పడతారని వెళ్లిపోయింది.

"నీతో ఒక మాట మాట్లాడడానికి వచ్చాను తల్లీ. మాకెవరూ సలహా చెప్పేవారు లేరు. మీరే మాకు ఆత్మీయులు. మామంచి చెడ్డలను మీతో పంచుకోవాలని వచ్చాను. మీకూ ఈ మధ్య ఆరోగ్యం బాగుండక పోవడంతే నేనే సంశయించాను. మీకు కుదుట పడ్డాక వచ్చి మాట్లాడదామని.

"అయ్యో చెప్పండమ్మా, నాకు తోచిన సలహా తప్పకుండా ఇవ్వగలను."

"ఏమీ లేదమ్మా, కాకినాడ లో మాకు సొంతిల్లు ఉంది. నూటేభై చదరపు గజాలలో కట్టుకున్నది. రెండుగదులు, వసారా, కిచెన్. బయట బాత్ రూమ్. పాతకాలపు ఇల్లు. అద్దెకు వచ్చినవాళ్లు ఎక్కువ రోజులు ఉండడం లేదు. పైగా అద్దెకూడా ఎగ్గొటుతున్నారు. ఈ పరిస్థితిలో ఆ ఇల్లు అమ్మేయాలన్న ఆలోచన వచ్చింది. దగ్గరగా ఏభై లక్షలు వచ్చేటట్లు ఉంది. ఆ ఇల్లు అమ్మేసి ఇక్కడ ఏదైనా టూ బెడ్ రూమ్ అపార్ట్ మెంట్ కొంటే అన్న ఆలోచన వచ్చింది. మా హరిణికి జీతం పెరిగింది. దానికి బేంక్ నుండి లోన్ వస్తుందట. మిమ్మలని సలహా అడుగుదామని వచ్చానమ్మా!"

"చూడండి మీ ప్రస్తుతపు ఇల్లు అమ్మేయడం మంచిదే. అరవై, డభై లక్షలు పెడితే గానీ కొత్త అపార్ట్ మెంట్ రాదు. ఇల్లు అమ్మగా వచ్చిన

# పడిలేచిన కెరటం

డబ్బు మొత్తం అపార్ట్ మెంట్ కొనుగోలులో పెట్టడం సరైన నిర్ణయం కాదు. రేపు మీ కంటూ కూడా ఆర్థిక సౌలభ్యం ఉండాలి కదా. రేపు మీ అమ్మాయికి పెళ్లి చేస్తారు. అల్లుడు మంచివాడైతే ఫరవాలేదు, మీకు సహకారం ఉంటుంది. లేని పక్షంలో, మీరు ఆర్థికంగా బాధపడకూడదు. ఒకరిని యాచించే పరిస్థితి రాకూడదు. హరిణి కి మీ మీద ప్రేమ ఉండచ్చు. కానీ అన్ని రోజులూ ఒకలా ఉండవు.

"హరిణికి పెళ్లి కూడా చేయాలికదా!"

దాని పెళ్లి ఖర్చులకు కూడబెట్టానమ్మా. కాస్తో, కూస్తో బంగారం కూడా అమర్చాను. ఆ విషయంలో జాగ్రత్తగానే ఉన్నాను.

అయితే ఇలా చేయండి. ఒక నాలుగైదు సంవత్సరాలక్రితం కొన్న అపార్ట్ మెంట్స్ కూడా అమ్మకాలు పెడుతున్నారు. కొనుక్కున్న వాళ్లు బదిలీల మీద వెళ్లిపోవడం ఒకటి, పెద్ద అపార్ట్ మెంట్ త్రీ బెడ్ రూమ్ అపార్ట్ మెంట్ కొనాలనే ఆలోచనతో అమ్మేవారు, ఇలా పలురకాల కారణాలతో అన్నమాట. అవయితే నలభై, నలభై అయిదు లక్షలకు వచ్చేస్తాయి ప్రయత్నిస్తే. ఇలాంటివి కొనేవారెందరో ఉద్యోగస్తులు మా బేంక్ కు రుణ సదుపాయం కోసం వస్తున్నారు కూడా. అపార్ట్ మెంట్లు కొత్తగానే ఉంటాయి. ఏవైనా చిన్నా చితకా కాస్త డబ్బు ఖర్చుపెట్టి రిపేర్స్, పెయింటింగ్స్ వేసుకుంటే కొత్తవిలాగే ఉంటాయి. డౌన్ పేమెంట్ కింద ఒక పది లక్షలు పేచేసి, మిగతా అమౌంట్ కి హరిణి హౌసింగ్ లోన్ తీసుకుంటే, ప్రతీనెల ముప్పై, నలభై వేలు కంటే ఇన్ స్టాల్ మెంట్ కట్టే పని ఉండదు. ఇప్పుడు ఎలాగూ పదిహేను వేలు వరకు అద్దె కడుతున్నారు. మీ అమ్మాయికి నెలకు లక్షరూపాయలు వస్తున్నాయి గా టేక్స్ పోయి. నలభై వేలు కటింగ్ లో పోయినా ఫరవాలేదు. మేక్జిమమ్ లోన్ తీసుకుని, మీరు ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుని మీ పేరుమీద బేంక్ లో ఫిక్స్ డ్ చేసుకోండి. ప్రతీనెల వడ్డీ వచ్చేటట్లు.

మా బేంక్ కు చాలా మంది బిల్డర్స్ వస్తూ ఉంటారు. సెకండ్ సేల్ లో ఒక మంచి అపార్ట్ మెంట్ చూడమని చెపుతాను. మీరు కాకినాడలో ఉన్న ఇల్లు అమ్మేయడం మంచి పనే. ఆస్తి పనికిరాకుండా అలా సంవత్సరాలతరబడి ఉండే కన్నా, దాన్ని మరోవిధంగా ఇలా ఉపయోగించుకోవడమే మంచిది.

సరస్వతమ్మకు చాలా సంతోషం వేసింది. తపస్వి సలహాకు ముచ్చట పడింది. ఆవిడే అంది, "మా ఇంటిని ఎవరో కొనుక్కోవాలని అడుగుతున్నారమ్మా, నేను కాకినాడ వెళ్లి ఆ పనేదో చూసుకుని వస్తాను. మీరీలోగా అపార్ట్ మెంట్ గురించి వాకబ్ చేయండి."

"తప్పకుండా చూస్తాను!" మీరు వెళ్లి రండి. మీరు వచ్చేవరకు హరిణిని మా ఇంట్లో ఉండమనండి."

"తప్పకుండానమ్మా, మీ ఇంట్లో ఉండడం దానికి చాలా ఇష్టం."

"ఇంక వెళ్లి వస్తానమ్మా!"

"అరె, కాఫీ తాగకుండానా?" శాంతమ్మగారూ, మీ ఫ్రెండ్ వచ్చారు, కాఫీ కూడా ఇవ్వకుండా ఎలాగండీ, కాస్త హాస్యాన్ని జోడించి పిలిచేసరికి సరస్వతమ్మతోబాటూ, శాంతమ్మ కూడా నవ్వేసుకున్నారు. "ఉండవే సరస్వతీ, కాఫీ తాగి వెడుదువుగాన్నంటూ ఆపేసింది.". వారిరువురి స్నేహ బాంధవ్యానికి విస్మయపడుతుంది తపస్వి. శాంతమ్మ నోట్లో ఎప్పుడూ సరస్వతీ నామ స్మరణే. దాని మూలానే నేను ఈ నాడు ఇలా చాలా హాయిగా ఉన్నానంటుంది.

సరస్వతమ్మ ఊరెళ్లడం, హరిణి రావడం జరిగాయి. హరిణిని కదిలిస్తే చాలు తన దగ్గర ఎన్నో కబుర్లు కుప్పతెప్పలుగా ఉంటాయి. హరిణి వస్తే చాలు, తపస్వి తనను తనతోటే పడుకోమంటుంది. హరిణి ఏవో కబుర్లు చెపుతుంటే, కొంత సేపటివరకు ఎంతో ఉత్సాహంగా సమాధానమిస్తూనే,

# పడిలేచిన కెరటం

ఎప్పుడో తనకు తెలియకుండానే నిద్రలోకి జారుకుంటుంది.
"అదేమిటాంటీ, నేనేమో నోరు నొప్పి పుట్టేటట్లు మీరు వింటున్నారు కదా అని మాట్లాడుతుంటే, మీరేమో చక్కగా గురకపెడుతూ నిద్రపోతారు, రేపటినుండి నేనస్సలు మీతో మాట్లాడనంటూ అలుగుతుంది."
"లేదులే హరిణీ, రేపటినుండి అలా చేయనంటుందే కానీ," మళ్ళీ మామూలే.

ఆరోజు కేబిన్ లో సీరియస్ గా పనిచేసుకుంటున్న తపస్వి దగ్గరకు సీనియర్ క్లర్క్ మాధవరావు వచ్చాడు. "ఎక్స్క్యూజిమీ మేడమ్ అంటూ!"

"రండి మాధవరావు గారూ, నాతో ఏదైనా పనుందా అంటూ అభిమానంగా అడిగింది."

"హా అవును మేడమ్, నేను ఉంటున్నది టూ బెడ్ రూమ్ అపార్ట్ మెంట్. ఆరు సంవత్సరాల క్రితం కొన్నాను. అప్పట్లో అది కొనడమే ఎక్కువ అనుకున్నాను. మా అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాం. మా అబ్బాయి కూడా ఇంజనీరింగ్ లోకి వచ్చాడు. ఇల్లు ఇరుకైపోయిందిప్పుడు. రేపు అమ్మాయి పెళ్లైతే వాళ్లకు ఇబ్బంది అవచ్చేమో కూడా. అందుకనే ఇప్పుడున్న నా ఫ్లాట్ అమ్మేసి త్రీ బెడ్ రూమ్ ఫ్లాట్ తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఈ ట్రాన్సేక్షన్ ఎలా చేయాలో కాస్త సలహా ఇవ్వగలరా? ఎవరైనా కొనుక్కునే పార్టీ కూడా దొరకాలి కదా?

మాధవరావు ఇదే బేంక్ నుండి లోన్ తీసుకున్నాడు. తపస్వి ఈ బ్రాంచ్ కు ట్రాన్స్ ఫర్ అయి వచ్చి నాలుగు సంవత్సరాలు అయింది. ఎంతో సిన్సియర్ గా నిజాయితీగా పనిచేసే మాధవరావు తనని ఒక బాస్ గా మాత్రమే కాకుండా ఒక సహోదరిగా అభిమానిస్తాడు. అదే గౌరవంతో అంది. మాధవరావుగారూ, ముందస్తుగా మీ ఫ్లాట్ ను చూడనివ్వండి. మాకు తెలిసిన ఒకరు సెకండ్ సేల్ లో టూ బెడ్ రూమ్ అపార్ట్ మెంట్ కొనే ఆలోచనలో ఉన్నారు. వాళ్లకు నచ్చితే మాట్లాడిస్తాను.

"చాలా సంతోషం మేడమ్, అప్పట్లో చాలా ఖర్చుపెట్టి మంచి ఇంటీరియర్స్ చేయించాను. నీట్ గా మెయిన్ టైన్ చేస్తున్నాం. గదులు, హాలు చాలా విశాలంగా ఉంటాయి. వాళ్లకు తప్పకుండా నచ్చుతుంది. వాళ్లు ఎప్పుడు వస్తారో చెప్పండి మేడమ్, నేను దగ్గరుండి తీసుకు వెడతాను."

"మీరంత శ్రమపడకండి మాధవరావు గారూ!" నేనే వాళ్లను దగ్గరుండి తీసుకు వస్తాను. నచ్చితే మిగతా వివరాలు మాట్లాడుకోవచ్చు."

"మీరా మేడమ్, తప్పకుండా రండి. థాంక్యూ మేడమ్ అంటూ నమస్కరించి అక్కడనుండి వెళ్లిపోయాడు."

ఆ ఆదివారం హరిణిని తీసుకుని వారింటికి వెళ్లింది. మంచి ఏరియాలో ఉంది ఆ కాంప్లెక్స్. హరిణి ఆఫీస్ కు జస్ట్ మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. కాంప్లెక్స్ చుట్టూ గార్డ న్, లిఫ్ట్ వగైరా సదుపాయాలున్నాయి. మాధవరావుగారు నిజమే చెప్పారు. లోపలంతా చాలా చక్కగా నీట్ గా ఉంది. విశాలమైన బాల్కనీలు, గాలి, వెలుతురు ధారాళంగా వస్తున్నాయి. ఇంటీరియర్స్ కూడా చాలా బాగున్నాయి. హరిణికి చాలా నచ్చేసింది. నాకు నచ్చితే అమ్మకు కూడా నచ్చినట్లే ఆంటీ అంటూ సంబరపడిపోయింది.

ఇరువైపుల పార్టీలకు న్యాయసమ్మతంగా డీల్ కుదిర్చి పెట్టింది. హరిణికి బర్డ న్ కాకుండా, అలాగే మాధవరావుకి నష్టం కలగకుండా బేరం కుదిర్చింది. ఆయన లోపల చాలా వర్క్ చేయించి బాగా మెయిన్ టైన్ చేసిన మూలాన ఒక్క పైసా ఆ ఇంటిమీద రిపైర్స్ కంటూ రంగులకంటూ ఖర్చు పెట్టనవసరంలేదు. నలభై ఎనిమిది లక్షలకు డీల్ కుదిర్చింది. ఒక మూడు లక్షలు తగ్గించమంది గానీ, ఆయన ఇంటీయర్స్ కు పెట్టిన ఖర్చే దాదాపు పదిలక్షలు

# పడిలేచిన కెరటం

అయిందని చెప్పేసరికి నలభై ఎనిమిదికి ఒప్పుకుంది. హారిణిని వాళ్ల అమ్మగారికి ఈ విషయం చెప్పమంది.

అదే రోజున సరస్వతమ్మ రాజమండ్రీ నుండి ఫోన్ చేసింది. ఏభై రెండు లక్షలకు ఇంటి బేరం కుదిరిందని. స్థలాల రేటు పెరిగిన మూలాన అనుకున్నదానికంటే కాస్త ఎక్కువే వచ్చిందని చెప్పింది. ఒక వారం రోజుల్లో పనులన్నీ ముగ్ఙించుకుని వస్తానని చెప్పింది. ఇలా ఇక్కడ ఫ్లాట్ కూడా కొనడానికి రెడీ గా ఉందని హారిణి చెప్పేసరికి తపస్వీ ఆంటీనే దగ్గరుండి డీల్ కుదిర్చారని చెప్పేసరికి ఆవిడ ఆనందం వర్ణనాతీతం. తపస్వి గారు బాగా ఆలోచిస్తారు, మనమేమీ సంశయం పడనవసరంలేదని ఆవిడ చెప్పింది. టోకన్ అడ్వాన్స్ కింద కొంత ఎమౌంట్ హారిణిచేత మాధవరావుకి ఇప్పించింది.

(ఇంకా ఉంది )

## వాస్తవ కథలు

కథ




# సద్యోగం

ఈ శ్రీనివాస రెడ్డి

"వెధవ ఉద్యోగం .... వెధవ ఉద్యోగం ..... ఓ ఎదుగు లేదు, బొదుగు లేదు. ' తను చేస్తున్న ఉద్యోగాన్ని రోజుకి ఓ వంద సార్లన్నా తిట్టుకోకుండా వుండడు రాఘవ

రాఘవ బ్యాంకులో క్యాషియర్గా పని చేస్తున్నాడు. తనకి ఆ ఉద్యోగం చెయ్యడం సుతరాము ఇష్టంలేదు. కాని ఏం చేస్తాడు, తను చదివిన చదువుకి అంతకన్నా మంచి ఉద్యోగం రాదు.ఒకరకంగా చెప్పాలంటే రాఘవ అదృష్ట వంతుడే .ఎందుకంటే నేడు రాఘవకన్నా ఎక్కువ చద్వుకున్నవాళ్ళు ఏ ఉద్యోగంలేకుండా ఖాళీగా ఉన్నవాళ్ళు లక్షల్లో ఉన్నారు .

రాఘవ మొదట నుంచి విదేశాల్లో ఏసాఫ్ట్ వేర్ ఇంజనీరు ఉద్యోగమో సంపాదించి , లక్షలకు లక్షలు కూడ బెట్టాలని కలలూ కనేవాడు. కాని కేవలం కలలు కంటే సరిపోదు కదా? దానికి తగ్గ కృషి కూడా చెయ్యాలికదా? కలలు కనే పనిలో పడి కృషి చెయ్యటం మర్చిపోయాడు. అందుకనే ఓ గ్రామీణ బ్యాంకులో క్యాషియర్గా మిగిలి పోయాడు

'సముద్రంలో ఎన్ని నీళ్ళు వున్నా తాగటానికి పనికి రావు అన్నట్టు .. చేతిలో డబ్బులు ఆడుతున్నా

ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టుకోవటానికి లేదు. వెధవ ఉద్యోగం... వెధవ ఉద్యోగం' చేతిలోని నోట్లు లెక్కపెడుతూ తిట్టుకుంటున్నాడు రాఘవు

"ఏమిటా) ఆ గొణుగుడు ... నోరు మూసుకుని ఒక్క రోజన్నా ఉద్యోగం చేసావా? "పక్క కాబిన్ లోని ప్రసాద్, రాఘవ వంక చూస్తూ అన్నాడు.

"ఇంతోటి ఉద్యోగానికి .. నోరు మూసుకుని పని చెయ్యాలా... నీకే ఎన్నైనా చేపుతావ్ "ప్రసాద్ వంక తల తిప్పకుండా విసుక్కున్నాడు రాఘవ

"మధ్యలో నేనేమి చేసారా .."భయపడుతూ అడిగాడు ప్రసాద్

" నువ్వేమి చెయ్యలేదురా ..చేసిందంతా మా నాన్నే ...ఇంజనీరుంగు చదువుతా



# సద్యోగం

కథ

అన్నా ..విన్నాడా “తండ్రి మీదకు మళ్ళించాడు తన కోపాన్ని

“ అదేమిటి ఇంజనీరింగు లో సీటు వస్తే ..వస్తే వద్దన్నాడా ..” అనుమానంగా అడిగాడు ప్రసాదు

“ సీటు ఎక్కడవచ్చిందిరా _ _ _.సీటు వస్తే నేను ఊరుకునేవాడినా.. సీటు రాక పోవటంతో డొనేషన్ కట్టమన్నా ..ఉహు ససేమీరా కాదన్నాడు ..పైపెచ్చు డబ్బులన్నీ నీకే తగలేస్తే ..చెల్లి పెళ్లి ఎవరు చేస్తారు అని ..వెధవ బి కాం లో చేర్చాడు ..ఇప్పుడు చూడు..ఇలా “ప్రసాద్ వంక చూస్తూ తండ్రిని నిందించాడు

“ ఒరేయ్ ..ఈ ఉద్యోగం కూడా లేనివాళ్ళు ఎంతమంది చెప్పు ...” రాఘవను ఊరడించ బోయాడు ప్రసాదు

“నీకేరా ...వెనకాల మీ బాబు సంపాదించింది ఉంది ..ఈ ఉద్యోగం చేస్తే ఎంత లేకపోతే ఎంత ...నాకు అలా కాదు గదా ...నేనొక్కడనే ఈదాలి ..”బాధ పడుతూ అన్నాడు రాఘవ

“ ఒరేయ్ మా నాన్న ఏమి కోట్లకు కోట్లు సంపాదించి నాకు ఇవ్వలేదు ...ఎదో ఒక ఇల్లు మాత్రం అమర్చాడు ....అందుకనే తిన్న తినకపోయ్నా గుట్టుగా వెళ్ళిపోతుంది ..బండి “రాఘవ బాధ చూడలేక వివరంగా చెప్పాడు

“ అది చాలదారా ...నెలకో పది పదిహేను వేలు మిగాలటానికి ..”ప్రసాద్ మీద అసూయపడ్డాడు రాఘవ

“ ఆ పది పదిహేను వేలు నువ్వు దాచ లేవా .....నాకన్నా నీకు జీతం ఎక్కువేగా ..”ప్రసాద్ కాస్త గట్టిగా మాట్లాడాడు

“ ఏమి ఎక్కువో.. ఏమో ...జీతం వచ్చి పది రోజులు కూడా కాలా ..పర్సు చూస్తే చిక్కి పోయి వుంది ..ఇంకా పాల వాడికి ,పచారి వాడికి ...గ్యాస్ బండకి ...తలచుకుంటేనే భయం వేస్తుంది ..”కాస్త వెనక్కి తగ్గాడు రాఘవ

“ వాయిదాల్లో ఇస్తున్నారు కదా అని అడ్డమైనవి కొంటావు ... జీతం మొత్తం ఇ ఎం ఐ లకే సరిపోతే ఇంక ఇంటి ఖర్చులకు ఏమి మిగులుతాయి ..”వాస్తవం తెలియపరచాడు ప్రసాదు

“ నేనేమి కొన్నానురా ...”రాఘవ నసిగాడు

“అయినా నీకు ఇప్పుడు ఐ ఫోన్ ఎందుకురా ....ఉన్న ఫోను బాగానే పనిచేస్తుంది గా ..” దుబార చేస్తున్నావని హెచ్చరించాడు ప్రసాద్

“ ఓస్ అదా ...నీ కన్ను దాని మీద పడింది చూసావా ...అందుకనే కొన్నా ..ఇఫోన్ వుండటం ఒక స్టేటస్ రా ..”గర్వంగా చెప్పాడు రాఘవ

“స్టేటస్ ...నిన్ను మార్చటం నా వల్ల కాదురా ..”తల కొట్టుకుంటూ అన్నాడు ప్రసాద్

“ నన్ను మార్చొద్దు కాని ..ప్రస్తుతానికి ఓ ఐదు వేలు ఉంటె సర్దు .” నెమ్మదిగా అడిగాడు ప్రసాద్ వంక చూడకుండా

“ఐదు వేలా ..ఒరేయ్ నేను నీ మేనేజర్ ని కాదు ...క్లర్కుని ..నీకన్నా నా జీతం తక్కువ అది మర్చిపోకు .ఓ ఐదు వందలు కావాలంటే ఇస్తా ...”

“ ఐదు వందలా ..దేనికి సరిపోవు ...పోనే ఓ వెయ్యి ఉంటె ఇవ్వు .... పిల్లలు సినిమాకి తీసుకెళ్ళమని ఒకటే గొడవ .”

”ఏ సినిమారా ...?”

“పుష్పా ...”

“ అది వచ్చింది ఇవాళే కదరా ......?”

“ అవును రా ... వచ్చిన రోజే చూస్తేనే ఉంటుంది మజా ..”

“ ఓ నాలుగు రోజులు ఆగి చూస్తే ఏమవుతుందిరా ..అంతంత రేట్లు పెట్టి సినిమా ఇప్పుడే చూడాలా? ..అయినా అటువంటి సినిమాలు పిల్లలకేందుకురా ..”

“ఇదేరా బాబు నీతో వచ్చిన చిక్కు .... ప్రతి దానికి క్లాసు పీకుతావ్ ..లైఫ్ ని ఎంజాయ్ చెయ్యటం రాదు నీకు ”

“మొదటి రోజు సినిమా కెళితే లైఫ్ ని ఎంజాయ్ చేసినట్లా ...నువ్వు మారవురా ..అయిన నీతో నాకెందుకు



# సద్యోగం

కథ

..ఇదిగో వెయ్యి .....మొత్తం దీనితో కలిపి 24 వేలయ్యింది ..'

" రాగానే ఇస్తారా ..కంగారు పడకు "అంటూ పైకి లేచాడు రాఘవ కాష్ కౌంటర్ మూసివేస్తూ

★★★

ఆ రోజు ఆఫీసు కెళ్ళే బస్సులన్నీ రద్దీగా వెళుతూ వుండటం తో ..కాలికి బుద్ధి చెప్పక తప్పలేదు రాఘవకి .నిజానికి రాఘవ ఆఫీసు ఇంటికి చాలా దగ్గర, పదినిమిషాల్లో నడిచి వెళ్ళొచ్చు .కాని మనవాడు ఆ పదినిమిషాలు కుడా నడవలేక బైక్ కొన్నాడు ఆఫీసుకి వెళ్ళటానికి .

నెలాఖరు రోజులు కావటం తో బైక్ లోకి పెట్రోల్ కొట్టించటానికి కూడా డబ్బులు లేకపోవటం తో ఆ రోజు నడవక తప్పలేదు .

నడక అలవాటు లేకపోవటం తో అడుగులో అడుగు వేస్తూ చిన్నగా నడుస్తున్నాడు .రోడ్డు మీద ఎదో రాయి లాంటిది అడ్డం వచ్చి ముందుకు పడబోయి, నిలదొక్కుకోటానికి ప్రయత్నించాడు . పడటం అయితే పడలేదు కాని , చెప్పు కాస్త తెగింది .

తెగిన చెప్పు వంక చూస్తూ ,"అసలే నెలాఖరు రోజులు ఇప్పుడు ఇదో ఖర్చు .." అని మనసులో అనుకంటూ చుట్టూ చూసాడు చెప్పులు కుట్టే వాడు ఎవరన్నా ఉన్నారేమోనని

ఓ పది అడుగుల దూరం లో ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర కనబడ్డాడు చెప్పులు కుట్టే అతను .

‘’హమ్మయ్యా ..”అని ఉపిరి పీల్చుకుని చిన్నగా కాళ్ళు ఈడ్చుకుంటూ ..అతని దగ్గరకు వెళ్ళాడు

" బాబు ..కాస్త చెప్పు కుట్టి పెట్టు అంటూ ..”తెగిన చెప్పుని అతని ముందు విడిచాడు రాఘవ

" ఒక్క నిమిషం సార్ కూర్చోండి .." అంటూ చేస్తున్న పని ఆపకుండా తల ఎత్తి రాఘవ వంక చూస్తూ అన్నాడు చెప్పులు కుట్టే అతను

అతని పక్కనే ఉన్న ప్లాస్టిక్ స్టూల్ మీద కూర్చుంటూ ..నిశితంగా అతన్ని,అతని కొట్టును పరిశీలించటం మొదలు పెట్టాడు రాఘవ

చూడటానికి ఇంచు మించు రాఘవ వయస్సే ఉంటుంది అతనికి . తెల్లటి ఫుల్ హాండ్స్ ఇస్త్రీ చొక్కా..ఎక్కడ మడత నలగలేదు ..చేతికి టైటాన్ వాచీ ..జేబులో పర్సు..బాగా బలిసిందేమో బయటకు రావాలని ప్రయత్నిస్తోంది .

ఎందుకోగాని అతన్ని చుసిన రాఘవ ,ఓ క్షణం తనవంక తేరిపార చూసుకున్నాడు .

"ఛ ...తనకన్నా అతనే బాగా బతుకుతున్నాడు "అని మనసులో అనుకుంటు ద్రుష్టి మళ్ళి అతని మీదకు మళ్ళించాడు

అతని వెనుక ఓ టేబుల్ ఫాన్ ...చల్లగా గాలి తగులుతూ ఉంది ,హుషారుగా పక్కనే ఉన్న ఎఫ్ ఎం రేడియో లో నుంచి వస్తున్న పాటను పాడుతూ చెప్పులు కుడుతున్నాడు .

అతని వెనుకే ఉన్న బడ్డీ కోట్లో ..ఓ మూల దేవుడి పటాలు ..వాటి ముందు అగరొత్తులు వెలుగుతూ మంచి వాసన వెదజల్లుతున్నాయి .

దేవుడి పటాల కింద ఓ ఐదారు కొత్త చెప్పుల జతలు వేలాడుతున్నాయి , బహుసా అమ్మకానికి పెట్టినట్టున్నాడు .ఇంకో పక్క న ఏవేవో ఫోటోలు వేల్లాడుతున్నాయి ..కొన్నిటి లో అతనికి సన్మానం చేస్తున్నారు ఎవరో .మరి కొన్నిటి లో అతను ఎవరికో సన్మానం చేస్తున్నాడు .వాటిలో ఓ ఫోటో రాఘవ ద్రుష్టిని ఆకర్షించింది

ఆ ఫోటోలు చుసిన రాఘవకు ఎదుకో అతనితో మాట కలపాలి అనిపించింది .

" నువ్వు చదువుకున్నవా ?..”ఉండబట్టలేక అడిగాడు



సాధారణ

# సద్యోగం

కథ

రాఘవ

"ఆ ఏమి చదువులే సార్ , పది వరకు చదివి ఆపేసా ...ఏం ..ఎందుకని అడిగారు .."

" ఆ ఫోటో ..."ఫోటో వంక చూపిస్తూ అడిగాడు

" ఓ అదా ..మా స్నేహితుడు ఒకడు డిగ్రీ చేసాడు ..వాడు ఫోటో దిగుతుంటే నేను వాడి డ్రెస్సు తీసుకుని ఓ ఫోటో లాగించా ..బాగున్నాయా సార్ "సంతోషంగా చెప్పాడు

" బాగుంది ..నువ్వు కూడా డిగ్రీ పూర్తి చెయ్యాల్సింది .."ఓ ఉచిత సలహా ఇచ్చాడు రాఘవ

" చెయ్యాల్సింది సార్ ..కానీ మా నాయన ఇంకా చదివించ లేను అన్నాడు ..ఆయనకు ఎందుకు భారం అని ..ఇదిగో ఆయన దగ్గరే పని నేర్చుకున్నా ...అయినా అందరు డిగ్రీ లు చేస్తే ఉద్యోగాలు దొరకాలి కదండీ "అంటూ నవ్వేసాడు

అతని మాటలు రాఘవకు ఎక్కడో గుచ్చుకున్నాయి " చాలా పాసిటివ్ గా ఆలోచిస్తున్నాడు "అని మనసులో అనుకుంటు

"ఎలా ఉంది వ్యాపారం .." అంటూ అతని సంతోషాన్ని తగ్గించటానికి అన్నట్టు అడిగాడు

" వ్యాపారానికే సార్ ..నెంబర్ వన్ ..కష్టపడ్డాడికి ..కష్టపడ్డంత.." అన్నాడు ఈసారి తల ఎత్తకుండా

" రోజుకి ఎంత సంపాదిస్తావు ..."అన్నాడు రాఘవ

" ఊ ..ఖర్చులు పోను ..ఓ ఐదారు వందలు మిగులుతాయి సార్ ..' జవాబిచ్చాడు హుషారుగా

" రోజుకి ఆరొందలు అంటే ..నెలకి 18వేలు ...." అంటూ మనసులో లెక్కలు వేసాడు

" మీరేమి చేస్తారు సార్ .." అంటూ అడిగాడు అతను రాఘవని

"నేను బ్యాంకు లో కాషియర్ ని ..అని చెప్పబోయి అహం అడ్డం వచ్చి ..మేనేజర్ని "అని చెప్పాడు

"అయితే జీతం ఓ లక్ష పైనే ఉంటుందా సార్" అన్నాడు

జవాబు చెపితే ఎక్కడ అప్పు అడుగుతాడో అని మాట మార్చాడు రాఘవ

"పెళ్ళయ్యిందా...." అంటూ అడిగాడు రాఘవ

"అయ్యింది సార్ ..ఇద్దరు పిల్లలు కూడా " చేస్తున్న పని అయిపోవటం తో ..తల ఎత్తి రాఘవ వంక చూస్తూ జావాబిచ్చాడు

"స్కూల్ కి వెళుతున్నారా ?.."

" అవును సార్ పెద్దోడు ..నాలుగు ,చిన్నది ...రెండు " రాఘవ చెప్పు చేతిలోకి తీసుకుంటూ చెప్పాడు

"అంటే ఇంచు మించు ...నా పిల్లల వయసే " అని మనసులో అనుకుంటూ "మరి పిల్లల చదువులకి ,ఇంటి ఖర్చులకి నీ సంపాదన సరిపోతుందా "మెల్లగా అతన్ని కిందకి లాగటానికి ప్రయత్నించాడు

" సరిపోతుందా అంటే ..సరిపెట్టుకోవాలి సార్...నేను చేస్తోంది ఏమి కలెక్టరు ఉద్యోగం కాదుగా ....అందుకనే చాలా వరకు ఖర్చులు తగ్గించుకున్నా .."అంటూ జవాబిచ్చాడు

ఆ జవాబు రాఘవ చెంప చెళ్ళు మని ఎవరో కొట్టినట్టు అనిపించింది

"కొంపదీసి ..అన్నం తినటం మానేశావా ఏమిటి ." అని నవ్వాడు రాఘవ

రాఘవ వేసిన కుళ్ళు జోక్ కి నవ్వు రాకపోయినా ..నవ్వుతున్నట్టు నటిస్తూ .."లేదు సార్ అన్నం ఎందుకు మానుకుంటాము ...పైఖర్చులు తగ్గించుకున్నాం ..సినిమాలు షికార్లు అన్నీ బంద్ .."అంటూ నవ్వుతు అన్నాడు

ఆ మాటలకు రాఘవ మోహం లో నవ్వు మాయం అయ్యింది

# సద్యోగం

కథ

“మరి పిల్లల స్కూల్ ఫీజులు .... పుస్తకాలు ..”అనుమానంగా అడిగాడు రాఘవ

“వాళ్ళు చదువుతోంది గవర్నమెంటు స్కూల్లో సార్ ..పైసా ఖర్చులేదు ...పుస్తకాలు , బట్టలు అన్నీ వాళ్ళే ఇస్తారు ....”అతని మాట పూర్తికాకుండానే

“గవర్నమెంటు స్కూలా ..అక్కడ బాగ్ చెపుతారా ..” తక్కువ చేసి మాట్లాడాడు రాఘవ

“ఎందుకు చెప్పారు సార్ అక్కడున్న వాళ్ళందరూ పరీక్షలు రాసి ఉద్యోగం సంపాదించిన వాళ్ళే కదా సార్ ..మీ పిల్లలు సార్ ?”

“ ఇంటర్నేషనల్ స్కూల్ ...” రాఘవ గర్వంగా చెప్పాడు

“ఫీజు ఓ లక్ష ఉంటదా సార్ ..”ఆశ్చర్య బోతూ అడిగాడు

“ పైనే ...” ఆ మాటలో అహంకారం తొంగి చూసింది

“ ఎందోలె సార్ ..అందరికి గవర్నమెంట్ ఉద్యోగాఉ కావలి కాని గవర్నమెంట్ స్కూళ్ళు ..కాలేజిలు మాత్రం వద్దు ..”అంటూ ఇదిగోండి సార్ మీ చెప్పు ..” అంటూ రాఘవ చెప్పును అతని కాళ్ళ దగ్గర పడేశాడు

అతని మాటలలో నిజం ఒప్పుకోలేక ,చెప్పు కాలికి తొడుక్కుంటూ ,

”అవును ఆ సన్మానాలేమిటి ..”ఫోటోల వంక చూస్తూ అడిగాడు రాఘవ

“ అవా.. సార్ మా యూనియన్ వాళ్ళు నాకు చేసిన సన్మానం ..”ఫోటో వంక చూస్తూ మురిసిపోయాడు

“ఎందుకు చేసారు ..ఉత్తమ చెప్పులు కుట్టేవాడివి అనా వెక్కిరింపుగా అడిగాడు

“ లేదు సార్ .. ఈ రోజుల్లో ఎంత చదువుకున్నా ..ఎంతమందికి ఉద్యోగాలు వస్తున్నాయి ..అందుకని ఎవరన్నా కుర్రాళ్ళు మా వృత్తిని స్వీకరించి వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడటానికి ముందుకు వస్తే ..అటువంటి వాళ్ళకు ఉచితంగా శిక్షణ , పనిముట్లు , స్టై ఫండు ఇస్తుంది మా యూనియన్ .అందుకు గాను నేను నా వంతుగా ఓ పాతిక వేలు ఇచ్చాను చందాకింద .. అందుకు చేసారు సన్మానం “

మళ్ళీ అతనే కొనసాగిస్తూ ,”ఇంక రెండో ఫోటో , శిక్షణ పూర్తి చేసుకున్న వాళ్ళకు సన్మానం చేసి, కొట్టు పెట్టుకోటానికి ఆర్థిక సాయం చేస్తాం ..ఆ ఫోటోలు అవి “ అంటూ చెప్పుకొచ్చాడు

“నువ్వు పాతిక వేలు ఇచ్చావా ?” సందేహంగా అడిగాడు

“అవును సార్ ..అనుమనమైతే మా యూనియన్ కి ఫోన్ చెయ్యండి “ అతని మాటల్లో నిజాయితి ధ్వనించింది

“ మరి అలాంటప్పుడు నీ పిల్లల్ని చదివించటం ఎందుకు ..నీ వృత్తి లోనే వాళ్ళకు కుడా శిక్షణ ఇవ్వచ్చుగా ..” అతన్ని ఇరకాటం లో పెట్టాలి అన్నట్టు అడిగాడు

“ ఇవ్వచ్చు సార్ ...నా కోరిక కుడా అదే ..కాని రేపు వాళ్ళ ఆలోచన ఎలా ఉంటుందో తెలియదు కదా ..నేనంటే ఈ వృత్తిని ఇష్టపడి వచ్చాను ...నా ఉపిరి ఉన్నంత వరకు నేను ఇదే చేస్తాను ..అలా అని వాళ్ళ మీద నా ఇష్టాన్ని రుద్ద కూడదుగా ...రేపు వాళ్ళు పెరిగి పెద్దయ్యి ..నాన్నా మేము కుడా నీతో పాటే పనిచేస్తాం అంటే సంతోషంగా నేర్పిస్తాను .”అంటూ పైకి లేచాడు

అతని జవాబుతో ఏమి మాట్లాడాలో తెలియని రాఘవ ..”ఎంతివ్వమంటావు ...”అన్నాడు

“ పది రూపాయలు ..ఇవ్వండి “అన్నాడు

పర్సు తీసి చూసాడు, పర్సు ఖాళీ గా వెక్కిరిస్తూ కనపడింది . “ డబ్బులు ఉన్నాయా లేదా అని ముందు చూసుకోవాల్సింది .అనవసరంగా ఇప్పుడు ..ఇతని ముందు తలదించు కోవాలి ” అని మనసులో అనుకుంటూ

“ఫోన్ పే ఉందా ..” అన్నాడు కాస్త

# సదోద్యోగం

కథ

దర్పంగా

" లేదు సార్ ...ఫర్లేదు ..ఈసారి వచ్చినప్పుడు ఇవ్వండి " అన్నాడు

ఆ మాటకు రాఘవ సిగ్గుతో కుంచించుకు పోయాడు

మౌనంగా అలాగే అంటూ తల ఆడిస్తూ అక్కడి నుండి ముందుకు కదిలాడు రాఘవ

★★★

" ఈ రోజు ఏమయ్యింది వీడికి, సైలెంటుగా తన పని తాను చేసుకు పోతున్నాడు. ఈ పాటికి ఓ వంద సార్లన్నా వెధవ ఉద్యోగం వెధవ ఉద్యోగం అని తిట్టుకుంటూ ఉండేవాడు "అని మనసులో అనుకుంటూ ప్రసాద్ రాఘవ వంక చూసాడు

రాఘవ లో మునుపటి విసుగు , చిరాకు ,నిర్లక్ష్యం లేవు .ఎదో కొత్త ఉత్సాహం అతని మొహం లో కనపడింది ప్రసాదుకు

" ఏమిరా ఏమిటి విషయం .."అంటూ అడిగాడు ప్రసాదు


" ఒక్క నిమిషం ...నన్ను డిస్టర్బ్ చేయకు పనిలో ఉన్నా " అంటూ తల తిప్పకుండా జవాబిచ్చాడు

" ఎరా అప్పు ఇవ్వలేదని కోపమా " మళ్ళి అడిగాడు ప్రసాదు

"లేదురా ...ఇంకా అప్పు అవసరం కుడా రాదు .తర్వాత మాట్లాడుకుందాం .బాగా బిజీ గా ఉన్న అంటూ " తల తిప్పకుండా పని చేసుకుపోతున్న రాఘవను కన్నార్పకుండా చూస్తుండిపోయాడు ప్రసాద్

సమాప్తం

+++







## మెదడుకు మేత

దిగువ ఇయ్యబడిన ఆంగ్ల పదములకు తెలుగు లో రాయాలి. ప్రతి పదం “” క “” తో మొదలవ్వాలి . సమయాన్ని సద్వినియోగం చేస్తూ, భాషా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోండి.

1. narration: 2. sea: 3. wealth: 4. fiction: 5. door: 6. lens: 7. crab: 8. cruel man: 9. farming: 10. reddish: 11. precious metal: 12. poetry: 13. blind man: 14. sugar candy: 15. anxiety: 16. kindness: 17. Hand: 18. Famine: 19. Skull: 20. Particle: 21. Pigeon: 22. Cunning: 23. Decoction: 24. Woman: 25. Plantain:

ఇక ప్రారంభించండి




సమాధానాలు వచ్చే సంచికలో ...

# చిత్ర కథ

ఈ క్రింది బొమ్మకు సరసమైన కథ రాసి పంపండి. ఉత్తమ మైన కథకు నగదు బహుమతి 116/-అందించ బడును.



# చిత్ర కవిత

ఈ క్రింది బొమ్మకు కవిత రాసి పంపండి.
ఉత్తమ మైన కవితకు 58/-నగదు
బహుమతి అందించ బడును.



పంపవలసిన చిరునామా :

sumathi.potilu@gmail.com

ఆఖరుతేది :15-01-2026





ఆధ్యాత్మికం

# ధర్మ సందేహాలు

మనం నిత్యం భోజనం చేసేటపుడు., కొన్ని అలవాట్లు మనకే తెలియక అలవాటుగా చేస్తూ వుంటాము. అవి అలవాట్లు కాదట. మన యొక్క నైజం అనగా మన గుణ గణాల ప్రతిబింబాలని పాక శాస్త్రం చెబుతూంది. చూద్దాము.

మనము, మన గుణాలు ఎంత వరకు సరిపోతాయో, మనకు మనమే గమనించు కోవాలి. అలాగే ఎదుటి వారిని మనము అంచనా వేసు కోవచ్చు. భోజనం చేసేటపుడు, మన ఆహారం ఎలా తీసు కొంతున్నామో చూడండి. ఇతరుల లో గమనించండి. వారి నడవడికను, గుణ గణాలు తెలుకోనండి.

★ఎవరైతే★ :-----

1. చేతి వ్రేళ్ళు కలపక, విడివిగా ఆహారం తింటూ వ్రేళ్ళ మధ్య జార విడుస్తుంటారో వారి వద్ద డబ్బు నిలవదట.

2. అన్నాన్ని పిసికి పిసికి తినే వారి భార్య అతని వల్ల జీవితాంతం భాధ పడుతుందట. అతని మనస్సు క్రూరము, దయా దాక్షిణ్యాలు లేనివాడట. అలాంటి వాడికి మన ఆడకూతురును ఇవ్వ కూడదట.

3. చేతి వ్రేళ్ళకు, తినేది విడి విడి గా అతుక్కుని వుంటే వాడు దరిద్రుడట.

4. ఎవరైతే వ్రేళ్ళు మొత్తం నోట్లో పెట్టుకొని జుర్రుకుంటూ తింటారో, వారి వద్ద డబ్బు నిలవదట. పైపెచ్చు బహు పిసినారులట.

5. తినునపుడు, ఎవరైతే అరచేతిని నాకుతూ తింటాడో, వాడు మిత్రద్రోహి, నమ్మక ద్రోహం చేసే గుణము కల వాడట.

6. తినునపుడు, ఎవరైతే ముట్టెను కూడా (అనగా అరచేయి వెనుక భాగం) నాకుతూ తింటాడో, వాడికి స్త్రీ వ్యామోహం అధిక మట.

7. అరచేయి ప్రక్కలు నాకు వాడు కూడా పరస్త్రీ వ్యామోహి ఆట.

8. నోటిలోనికి నాలుగు వ్రేళ్ళు పెట్టుకొని జుర్రుకుంటూ, తిను వాడు లోభి ఆట.

9. మొదట కారం కలుపుకొని తినువాడు లోభి, డబ్బే పరమావధి అని తలంచు వాడును, భాంధవ్యాలకు విలువ ఇవ్వని వాడు, ఛాందస్తుడట.

10. పదార్థములన్ని కలగూర గంపగా కలుపుకొని తిను వాడు, ఎల్లప్పుడు వివిధ రకాల ఆలోచనలు, అన్నింటా తల దూర్చి ఏదీ పూర్తి చేయని వాడును, అన్ని విషయాలను కొద్ది కొద్దిగా తెలుసుకొని, ఎందులోనూ ప్రావీణ్యత లేని వాడట.

11. ఎ పదార్థానికి ఏది కలుపుకొని తినాలో తెలియక, అన్నింటిని అటు ఇటు చేసుకొని, తీపు లో కారం , కారం లో తీపు, పులుపు ఇలా అర్థం లేకుండా లేకుండా తినువాడు జీవితంలో స్పష్టీకరణ లేనివాడు, ఎపుడు ఏమి కావాలో తెలియని వాడట.

12. ప్రక్క వాళ్ళు ఎలా తింటున్నారో గమనించి తేనే వాడు అనుకరణ చేయు వాడట.

★భోజనం చేయు వాడి, ఉత్తమ లక్షణాలు.★

1. ఎవరైతే తినునపుడు శబ్దం లేకుండా బోజనం చేస్తాడో వాడు సుగుణ వంతుడు మరియు ఐశ్వర్య వంతుడట.


2. అరచేతికి ఏమి అంటక తిను వాడు లక్ష్మి కటాక్షం కలవాడును, వాడి వద్ద లక్ష్మి స్థిరంగా వుండునట.

3. ఉచ్ఛ్వాస నిశ్వాస్వలకు అనుగుణంగా తింటూ వుండే వాడి వద్ద లక్ష్మి స్థిరంగా వుంటుందట.

4. శబ్దం లేకుండా తిను వాడు ఆరోగ్యవంతుడట.

5. మొట్ట మొదట ఎవరు తీపు పదార్థం తింటారో వారు ప్రేమ హృదయం కల వారట.

# పిల్లల సైన్స్ కథలు ..



## "ఆర్యభట్ట"

ఆర్యభట్టారకుడు మన దేశం గర్వించతగ్గ ఖగోళ శాస్త్ర వేత్త . ఆయన జన్మస్థలం పూర్వం పాటలీపుత్రంగా పిలవబడిన పాట్నాకు సమీపంలో ఉన్న కుసుమపురం. కొద్ది మంది ఆయన్ను విక్రమాదిత్యుని ఆస్థానంలో పనిచేసిన ప్రముఖ ఖగోళ శాస్త్రజ్ఞుడు, గణిత శాస్త్రవేత్త అయిన వరాహ మిహురుడికి సమకాలికుడిలా భావిస్తున్నారు. విక్రమాదిత్యుడు పండితులను బాగా ఆదరించేవాడు. ఆయన ఆస్థానంలో నవరత్నాలు అనబడే తొమ్మిది మంది కవులుండే వాళ్ళు. వాళ్ళలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కాళిదాసు కూడా ఒకడు. ఆర్యభట్టు ఈ తొమ్మిది మందిలో లేకుండా ఉన్నాడంటే ఆయన ఆలోచనలను ఆయన సమకాలికులు అంతగా పట్టించుకునే వారు కాదని తెలుస్తోంది. వరాహమిహిరుడి ఆలోచనలు కూడా కొన్ని ఆర్యభట్టు ఆలోచనలతో విరుద్ధంగా ఉన్నాయి. కానీ ఆయన ఈ నవరత్నాలు ప్రాచుర్యంలోకి రాకమునుపే జీవించి ఉంటాడనీ, లేకపోతే అతడు తక్కువ సమయంలో అంత ప్రాముఖ్యత సంపాదించుకొనే వాడు కాదనీ కొంత మంది భావన. ఈయన రాసిన గ్రంథాలు : ఆర్యభట్టీయం, ఆర్యభట్ట సిద్ధాంతం.

ఆర్యభట్ట సిద్ధాంతం: రోజువారీ ఖగోళ లెక్కలను గణించి, పూజా పునస్కారాలకు మంచి రోజులు నిర్ణయించడానికి ఒక గైడ్ లాంటిది. నేటి పంచాంగకర్తలకు ఇది ప్రముఖమైన గ్రంథం.

ఆర్యభట్టీయం : దీనిలో గణిత, ఖగోళ శాస్త్రాలకు సంబంధించిన అనేక లెక్కలున్నాయి. ఇది 4 భాగాలుగా విభజింపబడి 121 శ్లోకాలను కలిగి ఉంది. ఈ నాలుగు భాగాలు గీతికా పాదం, గణిత పాదం, గోళ పాదం, కాల పాదం.

దీనిలో భూమి గుండ్రంగా ఉందని, అది అక్షం చుట్టూ గుండ్రంగా తిరుగుతుందని దీని వల్ల పగలు, రాత్రి

# పిల్లల సైన్స్ కథలు ..

ఏర్పడుతున్నాయని వివరించాడు.

భూభ్రమణం వల్ల పగలు రాత్రి ఏర్పడుతున్నాయని, భూమిపై ఒక భాగంలో పగలు ఉంటే, మరో భాగంలో రాత్రి ఉంటుందని వివరించాడు.

చంద్రుడిపై చీకటిగా ఉంటుందని, సూర్యకాంతి పడటం వల్లనే చంద్రుడు ప్రకాశిస్తున్నట్లు వివరించాడు.

సూర్య, చంద్ర గ్రహణాలు, భూమి, చంద్రుని నీడ వల్ల ఏర్పడతాయని భూకేంద్రక సిద్ధాంతానికి ఊతం ఇచ్చాడు.

ఈ గ్రంథంలో వర్గ మూలాలను, ఘనమూలాలను కనుక్కునే పట్టికలను, త్రికోణమితీయ పట్టికలను, గ్రహమండల నమూనాకు దీర్ఘవృత్తాకార కక్ష్యలను సూచించాడు.

గామా విలువను 3.1416గా కచ్చితంగా కనుగొన్నాడు.

ఈ గ్రంథంలో దశాంశ పద్ధతి, దీర్ఘచతురస్ర, త్రిభుజ, వృత్త వైశాల్యాలను కనుగొనే పద్ధతులను వివరించాడు.

బీజ గణితం గురించి వివరించిన ఖ్యాతి, దాన్ని మొదటగా ఉపయోగించిన ఖ్యాతి ఆర్యభట్టదే.

సమీకరణాలను పల్వరైజర్ పద్ధతి ద్వారా సాధించే విధానం, అంక, గుణశ్రేఢులను, సైన్ పట్టికలను తెలియజేశాడు.

ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక శాస్త్రజ్ఞులంతా ఆర్యభట్టు ఖగోళ శాస్త్రానికి, గణిత శాస్త్రానికి చేసిన సేవలు ఎనలేనివని గుర్తించారు. గ్రీకులు ఆయన్ను ఆర్దువేరియస్ అనీ, అరబ్బులు అర్జావస్ అనీ వ్యవహరించే వారు. ఒకానొక కాలంలో ఆయన సిద్ధాంతాల గురించి భారతీయ పండితులు విరివిగా చర్చించుకొనే వారు. సుమారు వేయి సంవత్సరాల క్రితం భారత్ ను సందర్శించిన అల్-బెరూనీ అనే అరబ్బు పండితుడు ఆయన రచనల్లో ఆర్యభట్టు గురించి ప్రస్తావించాడు. ఆ రచనల్లో ఒక చోట "కుసుమపురానికి చెందిన ఆర్యభట్టు తన పుస్తకంలో మేరు పర్వతం హిమాలయాల్లో సుమారు యోజనం ఎత్తున ఉందని ప్రతిపాదించాడు" అని రాశాడు. దీన్ని బట్టి ఆర్యభట్ట అతను సూత్రీకరించిన కొన్ని సమీకరణాల సాయంతో పర్వతాల ఎత్తును కొలిచాడని అర్థమవుతుంది.

★★★



# "కష్టపడాలి"

గంటి ఆశ పద్మిని

రోహిత్ ఐదో తరగతి చదువుతున్నాడు. బడిలో మాస్టర్లు నేర్పే పాఠాలు నేర్చుకునేవాడు కాదు మరియు ఇచ్చిన వర్క్ లు చేసేవాడు కాదు. ఒక రోజు ఇచ్చిన హోమ్ వర్క్ లు చెయ్యకపోవడంతో మాస్టర్ గారు రోహిత్ ని ఎందుకు వర్క్ చేయలేదు? అని ప్రశ్నించారు. రోహిత్ మాస్టర్ గారు కొడతారు అని భయంతో మా ఇంట్లో నేను చదువుతుంటే చదవనివకుండా అదే పనిగా మార్కెట్ కి పంపుతూనే ఉన్నారు.. అందుకే నేను వర్క్ చెయ్యలేకపోయాను అని చెప్పాడు. మాస్టర్ గారు సరే ఇవాళ్టి నుంచి పనిని పక్కన పెట్టి చదువుపైన దృష్టి పెట్టు అని చెప్పారు. రోహిత్ అబద్ధం చెప్పడం వల్ల తను శిక్ష నుంచి తప్పించుకోవడంతో రోజు ఇలాగే ఏదో ఒక అబద్ధం చెప్పడం మొదలు పెట్టాడు. ఒక రోజు ప్రిన్సిపాల్ రోహిత్ ఇంటికి ఫోన్ చేసి బడిలో రోహిత్ చెప్పే మాటలు నిజమా లేక అబద్ధమా? అని అడిగారు. రోహిత్ చెప్పేవి అబద్ధాలు అని తెలిస్తే బడిలో రోహిత్ నిజం చెప్పిన నమ్మరు, అబ్ధాలు చెపుతున్నడు అని ఎగతాళి కూడా చేస్తారు అని ప్రిన్సిపాలగారికి వాళ్ళ అమ్మ రోహిత్ చెప్పేవి నిజమే అని బదులు ఇచ్చింది. పిల్లాడి చదువుపైన శ్రద్ధ వహించండి అని చెప్పి ప్రిన్సిపాల్ గారు ఫోన్ పెట్టేసారు.

రోహిత్ బడి అయిపోయాక ఇంటికి వస్తూనే హాల్ లో సోఫాలో కూర్చుని ఉన్న వాళ్ళ అమ్మని కౌగిలించుకున్నాడు. వచ్చావా నాన్న అని రోహిత్ ని పలకరించి వెళ్ళి ఫ్రెష్ అయి రా స్నాక్స్ రెడీ చేస్తా అని చెప్పింది వాళ్ళ అమ్మ. రోహిత్ సరే అని చెప్పి తన గదిలోపలకు వెళ్ళి ఫ్రెష్ అయి వచ్చాడు. రోహిత్ వాళ్ళ అమ్మ వేడి వేడి అరిటికాయ బజ్జీలు ప్లేట్లో తీసుకుని వచ్చి రోహిత్ ఇందా తిను అని ఇచ్చి.. ఇవాళ ఏమిటి హోమ్ వర్క్ ఇచ్చారు? బడిలో అని అడిగింది. హోమ్ వర్క్ ఉంది అంటే ఇప్పుడు చెయ్యి అని చెపుతుంది ఆటకు వెళ్లడానికి ఒప్పుకోదు అని తనలో తను అనుకుని ఇవ్వాళ అస్సలు వర్క్ ఇవ్వలేదు అమ్మ అని చెప్పాడు. అలాగా.. అయితే ఇవాళ నువ్వు ఫ్రీ అనమాట నేను ఒక కథ చెపుతా వింటావా అని అడిగింది రోహిత్ ని వాళ్ళ అమ్మ. "కథ" ఓ వింటాను చెప్పు అమ్మ అని చాలా శ్రద్ధగా అడిగాడు రోహిత్. కథ చెప్పడం మొదలు పెట్టింది..,

ఒక ఊరిలో ఒక టెడ్డీబేర్ ఉంది. అది ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రోజ పువ్వులు అమ్ముకుంటూ ఉండేది. ఒక రోజు తన బిడ్డకు జ్వరం వచ్చింది. డాక్టర్ గారు కొన్ని మందులు రాసి వెంటనే

తీసుకువచ్చి వెయ్యమన్నారు. టెడ్డీబేర్ దగ్గర మందులు కొనడానికి అస్సలు డబ్బులు లేవు.. దాంతో ఎలాగైనా ఇవ్వాళ ఈ రోజ పువ్వులు అమ్మి ఆ డబ్బులతో బాబుకి మందులు కొనాలి అని అనుకుని ఇంట్లోంచి బయలుదేరింది. ఆ రోజు టెడ్డీబేర్ దగ్గర ఒక్కరు కూడా పువ్వులు కొనలేదు. తాజా పువ్వులు తీసుకోండి అని సిగ్నల్ లో ఆగిన ప్రతి బండి దగ్గరకు వెళ్ళింది టెడ్డీబేర్ . ఎవ్వరూ కొనకపోవడంతో ఇంకో సిగ్నల్ దగ్గరకు వెళదాము అనుకుని నడుచుకుని, పరుగెత్తి , కింద పడిపోతున్న దెబ్బలు తగులుతున్న లెక్కచెయ్యకుండా వెళ్ళింది. ఆ సిగ్నల్ దగ్గర కూడా ఎవ్వరూ కొనకపోవడంతో చాలా దిగాలుగా ఫుట్పాథ్ పైన కూర్చున్న టెడ్డీబేర్ దగ్గరకు ఒక బాబు వచ్చి నువ్వు ఎందుకు ఇంత కష్టపడుతున్నావు? అని అడిగాడు. నా బాబు కి మందులు కొనడం కోసం డబ్బులు కావాలి అందుకే ఇంత కష్ట పడుతున్న అని చెప్పింది టెడ్డీబేర్. డబ్బులు కోసం ఇక్కడ ఇంత కష్ట పడాలా? ఏదైనా ఉద్యోగం చెయ్యచ్చు కదా? అని అడిగాడు ఆ బాబు. నేను పెద్దగా చదువుకోలేదు అందుకు ఇంత కష్టపడాల్సి వస్తోంది అని చెప్పింది టెడ్డీబేర్. నిన్ను మీ అమ్మ నాన్న చిన్నప్పుడు బడికి పంపలేదా?అని అడిగాడు బాబు. 'మా అమ్మ నా చిన్నప్పుడు నన్ను బడిలో చేర్పించి బాగా చదువుకో అని చెప్పింది.. కాని నేను ఇప్పుడు ఎవ్వరు కష్టపడతారు అని అనుకుని చదవకుండా అబద్ధాలు చెప్పి.. ఆ సమయానికి తప్పించుకున్న అని సంతోషపడ్డాను కాని ఆ సంతోషం పెద్ద అయ్యాక నా జీవితంలో కష్టాన్ని నింపింది' అని తను చేసిన తప్పులు గురించి చెప్పి చాలా బాధ పడింది టెడ్డీబేర్. టెడ్డీబేర్ మాటలు విన్న ఆ బాబు చిన్నప్పుడు కష్టపడి చదవకపోతే పెద్ద అయ్యాక ఇంత కష్టపడాలా అని అనుకుంటూ లేచి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. అని చెప్పింది వాళ్ళ అమ్మ. ఆ కథ విన్న రోహిత్ కు తను చేసే తప్పు తనకి తెలిసివచ్చి.. సోరీ అమ్మ నేను ఇప్పటినుంచి ఇష్టపడి చదువుకుంటాను మరియు అబద్ధాలు చెప్పను అని ప్రతిజ్ఞ చేసి.. రోజు బడిలో నేర్పే పాఠాలు నేర్చుకుంటూ, ఇచ్చే వర్కులు సమయానికి చేస్తూ, అబద్ధాలు చెప్పడం మానేసాడు. రోహిత్ లో వచ్చిన మార్పు చూసి ఎంతో సంతోషపడింది వాళ్ళ అమ్మ.

★★★


# సృజన










## దారి కనిపెట్టటానికి సహాయం



## బొమ్మకు రంగులు వెయ్యండి



## తప్పులు కనిపెట్టండి





# రాశి ఫలాలు ఈ నెల మీ అదృష్టం....




మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1) గురు, శుక్ర, బుధ, రాహువుల అనుకూలత వల్ల ఈ నెలంతా ఆదాయానికి ఏమాత్రం లోటుండకపోవచ్చు. ఆదాయం వృద్ధ చెందడమే తప్ప తగ్గడం ఉండదు. వృత్తి, వ్యాపారాల్లో అంచనాలకు మించి రాబడి పెరిగే అవకాశం ఉంది. ఉద్యోగంలో అధికార యోగానికి లేదా పదోన్నతికి వీలుంది. ఆరోగ్యం చాలావరకు మెరుగుపడుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు విజయవంతంగా పూర్తవు తాయి. ఒక్క శని తప్ప మిగిలిన గ్రహాలన్నీ అనుకూలంగా ఉన్నందువల్ల ఆశించిన పనులు పూర్తవుతాయి. ఏ ప్రయత్నం తలపెట్టినా సఫలం అవుతుంది. ఇతరులకు ఆర్థికంగా సహాయం చేయగల స్థితికి చేరుకుంటారు. పిల్లల నుంచి శుభ వార్తలు వింటారు. విదేశాల నుంచి ఆశించిన సమాచారం అందుతుంది. తల్లితండ్రుల నుంచి సహాయ సహకారాలు అందుతాయి. తోబుట్టువులతో ఆస్తి వివాదం ఒకటి పరిష్కారం అవుతుంది. వృత్తి, ఉద్యోగాల రీత్యా ప్రయాణాలకు అవకాశం ఉంది. కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయి. శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి.




. వృషభం (కృత్తిక 2,3,4, రోహిణి, మృగశిర 1,2)లాభ స్థానంలో శని, ధన స్థానంలో గురువు సంచారంతో పాటు భాగ్య స్థానంలోకి రాశ్యధిపతి శుక్రుడు ప్రవేశిస్తున్నందువల్ల ఈ నెలంతా ఆదాయం దిన దినాభివృద్ధి చెందుతుంది. ఆర్థిక సమస్యలు దాదాపు పూర్తిగా పరిష్కారమవుతాయి. కుటుంబ జీవితం సాఫీగా సాగిపోతుంది. పెళ్లి ప్రయత్నాల్లో శుభవార్తలు వింటారు. కొన్ని ముఖ్యమైన వ్యవహారాలు విజయవంతంగా, సంతృప్తి కరంగా పూర్తవుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఆదాయం నిలకడగా ఉంటుంది. ఆరోగ్యం పరవాలేదనిపిస్తుంది. ఉద్యోగ జీవితంలో కొద్దిగా ఒడిదుడుకులు తప్పకపోవచ్చు. అధికారులతో తలపడే పరిస్థితులు ఎదురవుతాయి. తండ్రితో కూడా వైరం ఏర్ప డవచ్చు. ఆచితూచి వ్యవహరించడం మంచిది. ప్రయాణాల్లో వీలైనంత జాగ్రత్తగా ఉండాలి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడడం, ప్రయత్నాలు సానుకూలపడడం, పలుకుబడి పెరగడం వంటివి జరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. మిత్రులకు ఆర్థికంగా అండగా నిలబడతారు.




మిథునం (మృగశిర 3,4, ఆర్ద్ర, పునర్వసు 1,2,3)శుక్ర, బుధ, గురువుల అనుకూలత వల్ల ఈ నెలంతా ప్రశాంతంగా, ఉత్సాహంగా సాగిపోతుంది. ఏ ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవుతుంది. ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా కొనసాగుతాయి. నిరుద్యోగులకు ఆశించిన శుభ సమాచారం అందుతుంది. సహాయ కార్యక్రమాల్లో, దైవ కార్యాల్లో పాల్గొంటారు. దశమ స్థానంలో ఉన్న శనీశ్వరుడి వల్ల ఆదాయ వృద్ధి, ఆశించిన పురోగతి తప్పకుండా ఉంటాయి. ప్రయాణాల వల్ల ప్రయోజనం ఉంటుంది. తోబుట్టువులతో సఖ్యత ఏర్పడుతుంది. సప్తమ స్థానంలో ఉన్న రాశ్యధిపతి బుధుడి వల్ల మీ ఆలోచనలకు, సలహాలు, సూచనలకు విలువ ఉంటుంది. వీటివల్ల అధికారులు లబ్ధి పొందుతారు. రాశ్యధిపతి బుధుడితో కుజ, రవి, శుక్రులు కలవడం వల్ల వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల పరంగా అనుకూలతలు కనిపించడంతో పాటు, శుభవార్తలు కూడా వింటారు. కుటుంబ జీవితం సుఖ సంతోషాలతో సాగిపోతుంది. ఉన్నత స్థాయి కుటుంబంతో పెళ్లి సంబంధం కుదురుతుంది. పిల్లలు బాగా వృద్ధిలోకి వస్తారు.



## రాశి ఫలాలు


# ఈ నెల మీ అదృష్టం....




కర్కాటకం (పునర్వసు 4, పుష్యమి, ఆశ్లేష)ఈ నెల 12 నుంచి శుక్రుడు, 14 నుంచి కుజుడు సప్తమ స్థానంలో ప్రవేశిస్తున్నందువల్ల జీవితం కొత్త పుంతలు తొక్కుతుంది. కీలకమైన శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఈ నెలంతా సంతృప్తికరంగా సాగిపోతుంది. ఆర్థిక, వ్యక్తిగత సమస్యల పరిష్కారంతో పాటు, మనసులోని కొన్ని కోరికలు అప్రయత్నంగా నెరవేరడం జరుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో ప్రాభవం పెరుగుతుంది. వ్యాపారాలు లాభాలపరంగా ఊపందుకుంటాయి. భాగ్య స్థానంలో ఉన్న శనీశ్వరుడి వల్ల ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుంది. ఆర్థిక ప్రయత్నాలు, ఆర్థిక లావాదేవీలు కలిసి వస్తాయి. కొందరు బంధు మిత్రులను ఆర్థికంగా ఆదుకోవడం కూడా జరుగుతుంది. వ్యయ స్థానంలో గురువు, అష్టమ స్థానంలో రాహువు సంచారం వల్ల స్వల్ప అనారోగ్యాలతో పాటు అనుకోని ఖర్చులకు అవకాశం ఉంది. కుటుంబ జీవితం హ్యాపీగా సాగిపోతుంది. వృత్తి, ఉద్యోగాలపరంగా బరువు బాధ్యతలు పెరగడం, ఒత్తిడి ఎక్కువ కావడం వంటివి జరుగుతాయి. ఆరోగ్యం అనుకూలంగా ఉంటుంది.




సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1)లాభ స్థానంలో ఉన్న గురువు వల్ల ఆదాయానికి లోటుండకపోవచ్చు. ముఖ్యమైన అవసరాలు తీరిపోతాయి. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు చాలావరకు పరిష్కారమవుతాయి. అష్టమ శని వల్ల వృత్తి, ఉద్యోగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. ఏ మాత్రం తీరిక లేని పరిస్థితి ఏర్పడుతుంది. విశ్రాంతి కరువవుతుంది. స్వల్ప అనారోగ్యానికి కూడా అవకాశం ఉంది. వ్యాపారాలు నిలకడగా సాగిపోతాయి. కొత్త ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలపడతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో శ్రమ, తిప్పట ఎక్కు వగా ఉంటాయి. రాశ్యధిపతి రవి పంచమ స్థానంలో ఉన్న కుజ, బుధులతో యుతి చెందడం వల్ల ఆదాయ వృద్ధి ఉంటుంది కానీ, అందుకు తగ్గట్టుగా వృథా ఖర్చులు కూడా ఉంటాయి. పెళ్లి ప్రయత్నాలు సఫలం అవుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. మాట చెల్లుబాటు అవుతుంది. కుటుంబ సభ్యుల నుంచి శుభవార్తలు వింటారు. జీవిత భాగస్వామికి సంబంధించి ఒకటి రెండు శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది.




కన్య (ఉత్తర 2,3,4, హస్త, చిత్త 1,2)దశమ స్థానంలో గురువు, చతుర్థ స్థానంలో రవి, కుజ, బుధుల వల్ల ఈ రాశివారికి ఈ నెలంతా అనుకూలంగా గడిచిపోతుంది. కుటుంబ జీవితం సుఖ సంతోషాలతో సాగిపోతుంది. మానసిక ప్రశాంతత కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాలపరంగా ప్రధానమైన సమస్యలు తగ్గుముఖం పడతాయి. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. ఆదాయ ప్రయత్నాలు చాలా వరకు సఫలం అవుతాయి. వ్యాపారాల్లో లాభాలు ఆశాజనకంగా ఉంటాయి. రాశినాథుడు బుధుడు చతుర్థ స్థానంలో ఉన్నందువల్ల ఆర్థికంగా, కుటుంబపరంగా పురోగతి ఉంటుంది. మాటకు, చేతకు విలువ పెరుగుతుంది. పిల్లలు వృద్ధిలోకి వస్తారు. వ్యాపార భాగస్వాములతో, జీవిత భాగస్వామితో ఇబ్బం దులు ఏర్పడవచ్చు. ఆచితూచి వ్యవహరించడం అన్నివిధాలా మంచిది. కొత్త ఆలోచనలు, నిర్ణ యాలను కార్యరూపంలో పెడితే సత్ఫలితాలనిస్తాయి. ఉద్యోగం మారడానికి చేస్తున్న ప్రయత్నా లకు సానుకూల స్పందన లభిస్తుంది. ఆరోగ్యానికి లోటుండదు. పెళ్లి ప్రయత్నాలు సఫలమవుబ తాయి.



# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....




తుల (చిత్త 3,4, స్వాతి, విశాఖ 1,2,3)భాగ్య స్థానంలో గురువు, షష్ట స్థానంలో శని, రాశ్యధిపతి శుక్రుడు తృతీయ స్థానంలో సంచారం చేయడం వల్ల ఉద్యోగంలో సానుకూలతలు పెరుగుతాయి. పదోన్నతికి బాగా అవకాశం ఉంది. మీ సమర్థతకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి, వ్యాపారాలు కూడా బిజీగా సాగిపోతాయి. శత్రు, రోగ, రుణ బాధలు తప్పకుండా తగ్గుముఖం పడతాయి. ఉద్యోగంలో ఒక మెట్టు పైకి ఎక్కడానికి అవకాశం ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు యథా ప్రకారం లాభదాయకంగా కొనసాగుతాయి. భాగ్య స్థానంలో ఉన్న గురువు వల్ల ఆదాయాన్ని పెరగడమే కాక, ఆర్థిక స్థిరత్వం కలిగే అవకాశం ఉంది. రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థానాలలో ఉన్న వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. దీర్ఘకా లిక అనారోగ్యాల నుంచి ఉపశమనం కలుగుతుంది. పంచమ స్థానంలో ఉన్న రాహువు వల్ల స్నేహితులు లేదా నమ్మినవారు మోసం చేయడం వంటివి జరిగే అవకాశం ఉంది. నిరుద్యోగులకు దూర ప్రాంతంలో ఉద్యోగం లభిస్తుంది. పెళ్లి ప్రయత్నాలు తప్పకుండా సఫలం అవుతాయి.




వృశ్చికం (విశాఖ 4, అనూరాధ, జ్యేష్ట)ఈ రాశికి ధన స్థానంలో రాశ్యధిపతి కుజుడితో పాటు బుధ, రవి, శుక్రులు కూడా సంచారం చేస్తు న్నందువల్ల ఆదాయానికి లోటుండని పరిస్థితి ఏర్పడుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో హోదా పెరగడంతో పాటు, సామాజికంగా పేరు ప్రతిష్ఠలు పెరిగే అవకాశం ఉంది. కుటుంబంలో శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. కుటుంబ జీవితం సుఖమయంగా సాగిపోతుంది. మీ సలహాలు, సూచ నలు, ఆలోచనలకు ప్రాధాన్యం పెరుగుతుంది. లాభాల పరంగా వ్యాపారాలు నిలకడగా ముందుకు సాగుతాయి. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. సొంత ఆలోచనలతో, స్వయం నిర్ణయాలతో అనేక విధాలుగా పురోగతి చెందుతారు. జీవితంలో యాక్టివిటీ పెరుగుతుంది. క్షణం కూడా తీరిక లేని పరిస్థితి ఏర్పడుతుంది. పంచమ స్థానంలో శనీశ్వరుడి సంచారం వల్ల ఉద్యో గంలో బరువు బాధ్యతలు పెరుగుతాయి. అష్టమ స్థానంలో ఉన్న గురువు వల్ల డబ్బు నీళ్లలా ఖర్చు కావడం జరుగుతుంది. నిరుద్యోగులకు దూర ప్రాంతంలో ఆశించిన ఆఫర్ అందుతుంది.





ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1)ఈ రాశిలో కుజ, బుధ, రవి, శుక్రుల సంచారం, సప్తమ స్థానంలో రాశ్యధిపతి గురువు ఉండడం వల్ల ఉద్యోగంలో ప్రాధాన్యం, ప్రాభవం పెరుగుతాయి. అన్ని రంగాల్లోనూ పురోగతి ఉంటుంది. విదేశాల నుంచి ఆశించిన సమాచారం అందుతుంది. విదేశాలకు సంబంధించిన సంస్థల్లోకి ఉద్యోగం మారడానికి అవకాశం ఉంటుంది. ఏ ప్రయత్నం చేసినా సఫలం అవుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే బాగా మెరుగ్గా ఉంటుంది. అనారోగ్యం నుంచి చాలావరకు కోలుకోవడం జరుగుతుంది. గురు, శుక్ర, బుధుల అనుకూలత కారణంగా అంచనాలను మించిన ఆదాయ వృద్ధి ఉంటుంది. ఆర్థిక ప్రయత్నాలు, ఆర్థిక లావాదేవీలు ఆశించిన ఫలితాలను ఇస్తాయి. కుటుంబం వృద్ధిలోకి వస్తుంది. పిల్లల నుంచి శుభవార్తలు వింటారు. రాదనుకున్న డబ్బు చేతికి అందుతుంది. మనసులోని కోరికలు నెరవేరుతాయి. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు సునాయాసంగా పరిష్కారం అవుతాయి. నిరుద్యోగులకు సొంత ఊర్లోనే ఉద్యోగం లభించే అవకాశం ఉంది. ఆశించిన శుభవార్తలు వింటారు.



# రాశి ఫలాలు ఈ నెల మీ అదృష్టం....




మకరం (ఉత్తరాషాఢ 2,3,4, శ్రవణం, ధనిష్ట 1,2)శని, శుక్ర, కుజ, రాహువుల అనుకూలత వల్ల ఈ నెల చాలావరకు ప్రశాంతంగా గడిచిపోతుంది. ఆశించిన విధంగా ఒకటి రెండు శుభవార్తలు వినే అవకాశం ఉంది. షష్ట స్థానంలో ఉన్న గురువు వల్ల వృత్తి, ఉద్యోగాలలో జీత భత్యాలు పెరగడం, స్థిరత్వం ఏర్పడడం, తగిన గుర్తింపు లభించడం వంటివి జరిగే అవకాశం ఉంది. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు చాలావరకు పరిష్కారం అవుతాయి. ధన స్థానంలో సంచరిస్తున్న రాహువు కారణంగా కుటుంబ ఖర్చులు బాగా పెరిగే అవకాశం ఉంది. ఉద్యోగంలో సహోద్యోగుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొనే సూచనలున్నాయి. స్వల్ప అనారోగ్య సూచనలున్నాయి. తిప్పట తప్పకపోవచ్చు. శుక్రుడి వల్ల అనవసర ఖర్చులకు, విలాసాలపై ఖర్చులకు అవకాశం ఉంది. ఆదాయానికి ఏమాత్రం లోటుండదు. మాట చెల్లుబాటు అవుతుంది. ఆర్థిక లావాదేవీలు కలిసి వస్తాయి. కుటుంబ జీవితం సాఫీగా, హ్యాపీగా సాగిపోతుంది. నిరుద్యోగులకు దూర ప్రాంతంలో ఉద్యోగం లభించే అవకాశం ఉంది. పెళ్లి ప్రయత్నాలు ఫలిస్తాయి.




కుంభం (ధనిష్ట 3,4, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3)లాభ స్థానంలో రవి, శుక్ర, కుజ, బుధులు, పంచమ స్థానంలో గురువు సంచారం వల్ల వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో అంచనాలకు మించిన పురోగతి ఉంటుంది. ఆదాయం బాగా వృద్ధి చెందే అవకాశం ఉంది. అవసరాలు తీరిపోవడంతో పాటు ముఖ్యమైన ఆర్థిక సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. ఆరోగ్యానికి లోటుండదు. పంచమ స్థానంలో ఉన్న గురువు వల్ల ఎటువంటి ప్రయత్నమైనా సఫలం అవుతుంది. విదేశీ ఉద్యోగాలకు లేదా చదువులకు అవకాశం ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి శుభ సమాచారం అందుకుంటారు. పిల్లలు చదువుల్లో పురోగతి సాధిస్తారు. ద్వితీయ స్థానంలో ఉన్న శనీశ్వరుడి వల్ల ఇంటా బయటా బాగా ఒత్తిడి ఉంటుంది. కొద్దిగా అనారోగ్య సమస్యలుంటాయి. లాభ స్థానంలో ఏర్పడిన బుధాదిత్య యోగం వల్ల వ్యక్తిగత, కుటుంబ సమస్యల నుంచి చాలావరకు విముక్తి లభిస్తుంది. తండ్రితో కొద్దిగా విభేదాలు తలెత్తవచ్చు. మాట తొందరపాటు వల్ల ఇబ్బందులు ఏర్పడవచ్చు. ఆహార, విహారాల్లో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.




మీనం (పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర, రేవతి )రాశ్యధిపతి గురువు చతుర్థ స్థానంలో బాగా అనుకూలంగా ఉండడంతో పాటు, దశమ స్థానంలో నాలుగు గ్రహాలు యుతి చెందడం వల్ల ఈ రాశివారికి అన్ని విషయాల్లోనూ అనుకూలతలు ఎక్కువగా ఉంటాయి. ఏలిన్నాటి శని ప్రభావం కూడా బాగా తగ్గిపోతుంది. వ్యక్తిగత సమస్యలు పరి ష్కారం కావడంతో పాటు, మనసులోని కోరికలు కూడా నెరవేరుతాయి. దూకుడుగా వ్యవహరిం చడం తగ్గించుకోవడం మంచిది. అధికారులతో కానీ, తండ్రితో కానీ ఘర్షణ వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. ఆరోగ్యం విషయంలోనూ, ప్రయాణాలలోనూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ రాశిలో సంచారం చేస్తున్న శని వల్ల కొద్ది శ్రమతో ఆదాయం పెరగడం, ఆర్థిక సమస్యలు తగ్గడం వంటివి జరుగుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. అష్టమ స్థానంలో వ్యయ స్థానంలో రాహువు సంచారం వల్ల జీవిత భాగస్వామికి స్వల్ప అనారోగ్యాలు తప్పకపోవచ్చు. ప్రయాణాలలో ప్రమాదాలు ఎదురు కావచ్చు. కొందరు ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com


**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక 2026 నుండి


ప్రతి వెల. **రూ. 50 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 500/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 2500/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక
రూ.200 విలువచేసే పుస్తకాలను
ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది
నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే
చెయ్యండి
7 8 9 3 1 1 1 9 8 5
చందా కట్టిన వారికి ప్రతి నెల
flip బుక్ పాస్ వర్డ్ తో
పంపబడును

